జ్ఞాన సిద్ధాంతం
రూ॥200/-
పేజీలు:210
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్), హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(ఆబిడ్స్),హిమాయత్‌నగర్, బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్ హన్మకొండ.



www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★★

సంపుటి 09, సంచిక: 249 | శనివారం | 08-08-2026 | ఖమ్మం

Published from: Khammam, Hyderabad, Karimnagar, Mahabubnagar

పేజీలు: 12+8 | వెల రూ. 5.00



చిన్న కాంట్రాక్టర్లపై మైనింగ్ పెనాల్టీల వేధింపులు ఆపాలి
పెట్టుబడులకు తెలంగాణే గమ్యస్థానం
భవన నిర్మాణ కార్మికుల హెల్త్ టెస్ట్‌లు వెంటనే రద్దుచేయాలి 03


## నీట్ ప్రశ్నాపత్రాల తయారీలో

# అన్నీ లోపాలే

ప్రత్యేక కోర్టులో సిబిఐ 94 పేజీల ఛార్జిషీట్ దాఖలు

- ఎన్‌టిఎ రహస్య విభాగానికి ప్రత్యేక గది లేదు
- పని విభజన లేదు–సిసి కెమెరా నిఘా అంతకన్నా లేదు
- ఫిజిక్స్, కెమిస్ట్రీ, బోటనీ, జువాలజీ ప్రశ్నలు స్వేచ్ఛగా బయటకు




**న్యూఢిల్లీ :** నీట్ (నేషనల్ ఎలిజిబిలిటీ అండ్ ఎంట్రన్స్ టెస్ట్) యుజి ప్రశ్నా పత్రాల తయారీలో తీవ్ర నిర్లక్ష్యం, భద్రతాపరమైన తప్పిదాలు, అనేక లోపాలు జరిగినట్లు సిబిఐ తన దర్యాప్తులో గుర్తించింది. సరైన గోప్యతా విధానం లేదు, సి.సి.కెమెరాల పర్యవేక్షణ,నిఘా లేదు. మొదటి నుండి చివరివరకూ ప్రశ్నాపత్రాల తయారీకి జరిగే వివిధ దశల ప్రక్రియలో శ్రమ విభజన లేకపోవడంవల్ల అన్ని దశలలోనూ కొందరు పూర్తి భాగస్వామ్యం వహించడంవల్ల ఎక్కడా రహస్యాలు లేకుండా మొత్తం సమాచారం వారి గుప్పెట్లోకి వెళ్ళింది. వివిధ సబ్జెక్టులకు సంబంధించిన నిపుణులు ఆయా ప్రశ్నలను చిన్న చిన్న కాగితం ముక్కలమీద రాసుకుని స్వేచ్ఛగా తమ హోటల్ గదులకు తీసుకుపోయారు, బయట అమ్ముకున్నారు.అన్నింటికంటే ముఖ్యంగా నేషనల్ టెస్టింగ్ ఏజన్సీ (ఎన్‌టిఎ) కార్యాలయ భవనంలో రహస్య విభాగానికి ప్రత్యేకమైన గది లేదు, నిఘా,పర్యవేక్షణలు చేపట్టేందుకు కూడా ప్రత్యేకమైన రక్షణలు,ప్రత్యేక గదులు లేవు. ఈ లోపాల కారణంగా ఎన్‌టిఎ కేవలం 25 రోజుల సి.సి.ఫుటేజీని మాత్రమే భద్రపరచగలిగింది. సిబిఐ క్షుణ్ణంగా తనిఖీలు చేసిన తర్వాత అనేక లోపాలు గుర్తించింది. ఈ లోపాలను వివరిస్తూ తయారు చేసిన తన 94 పేజీల ఛార్జిషీటును ప్రత్యేక కోర్టులో సిబిఐ దాఖలు చేసింది. ఈ ఏడాది మే మూడో తేదీన నీట్ యుజి–2026 పరీక్ష ప్రశ్నాపత్రాల లీకేజీ ఉదంతం జరిగింది. 23 లక్షలమంది విద్యార్థులు మెడికల్ సీట్లకోసం పోటీ పడ్డారు. ప్రశ్నాపత్రం లీకేజీ కారణంగా ఈ ఏకీకృత పరీక్షల విధానంపై విద్యార్థులకు నమ్మకం పోయింది. తర్వాత తీవ్ర రాజకీయ దుమారం,రగడ కొనసాగింది. జూన్ 21న తిరిగి నీట్ పరీక్ష నిర్వహించారు. జులై 25వ తేదీన కేంద్ర విద్యాశాఖామంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తన పదవికి రాజీనామా చేశారు.

**నాలుగు దశల్లో ప్రశ్నాపత్రాల తయారీ**

నీట్ ప్రశ్నాపత్రాల తయారీ విధానంలో లోపాల ప్రక్రియను, ఆ ఉదంతాన్ని సిబిఐ తన ఛార్జిషీటులో వివరంగా తెలియజేసింది. ఛార్జిషీటులో పేర్కొన్న సమాచారం ప్రకారం,వివిధ సబ్జెక్టులకు సంబంధించినవారు ఈ ప్రశ్నాపత్రాలను చిన్న చిన్న కాగితం ముక్కలపై రాసుకుని తీసుకుపోయారు. కానీ ఎవ్వరూ పట్టించుకోలేదు.వారిని ఎవ్వరూ తనిఖీలు చేయలేదు.ఇందతా యథేచ్ఛగా కొనసాగింది. వివిధ దశలలో పనులు చేసినాగానీ ఒక దశలో పనులు మరో దశలో వారికి తెలియకుండా గోప్యత పాటించకపోవడం అన్నింటికంటే అతిపెద్ద లోపం. ఐటెమ్ రైటింగ్,మోడరేషన్,వెట్టింగ్,ట్రాన్స్‌లేషన్ అనే నాలుగు ప్రధానమైన అన్ని దశలలోనూ కొందరు పాల్గొన్నారు. మొదట ఐటెమ్ రైటింగ్ దశలో కొందరు నిపుణులను ఎంపిక చేసి ప్రశ్నలు తయారు చేయడానికి వారిని తరువాయి 8లో




## ఫీ వివరాలు బహిర్గత పరచాలి

- పాఠశాల నోటీసు బోర్డులోనూ పెట్టాలి
- విద్యాశాఖ వెబ్‌సైట్‌లో పొందుపర్చాల్సిందే
- ప్రైవేట్, అన్ ఎయిడెడ్ పాఠశాలలకు విద్యాశాఖ ఆదేశం
- స్పందించని యాజమాన్యాలకు నోటీసులు ఇస్తామని హెచ్చరిక

ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్రంలోని ప్రైవేటు, అన్‌ఎయిడెడ్ స్కూల్స్ ఫీజుల వివరాలను తప్పనిసరిగా బహిర్గతం చేయాలని పాఠశాల విద్యాశాఖ ఆదేశించింది. తరగతుల వారీగా ఫీజు వివరాలు పాఠశాల ప్రాంగణంలోని నోటీసు బోర్డ్‌లో పెట్టాలి. అలాగే పాఠశాల విద్యాశాఖ అధికారిక వెబ్‌సైట్‌లో కూడా ఆ వివరాలను అప్‌లోడ్ చేయాలి. ఫీజులను బహిర్గతం చేయని పాఠశాలలకు నోటీసులు జారీ చేయాలని విద్యాశాఖ నిర్ణయించింది. ఈ మేరకు రాష్ట్రంలోని అన్ని ప్రైవేటు, అన్‌ఎయిడెడ్ పాఠశాలల యాజమాన్యాలు '2026–27 విద్యాసంవత్సరానికి' సంబంధించిన ఫీజుల వివరాలను తప్పనిసరిగా బహిర్గతం చేయాలని, ఆ వివరాలను తరువాయి 8లో

## జిఎస్‌టి వ్యవస్థలో లోపాలకు

# ఎఐతో అడ్డుకట్ట

- లీకేజీలను అరికట్టే విధంగా వివిధ ప్రభుత్వ శాఖల మధ్య మరింత సమన్వయం
- సిఎం రేవంత్ రెడ్డితో ప్రముఖ భారత ఆర్థికవేత్త అరవింద్ సుబ్రమణియన్ భేటీ



ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్ర ఆర్థిక పరిస్థితి మెరుగుపరుకునేందుకు ప్రణాళికాబద్ధంగా ముందుకు తీసుకెళ్లే దిశగా జిఎస్‌టి అధికారులకు ప్రత్యేక ఎఐ ఆధారిత సమాచారంతో ప్రక్రియను సులభతరం చేసే వ్యవస్థను తీసుకురానున్నట్లు తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ ప్రక్రియతో వ్యాపారాలకు ఎలాంటి ఆటంకాలు, ఇబ్బందులు కలగకుండా ఉండాలని సిఎం సూచించారు. రాష్ట్ర ఖజానాకు రాబడి పెంచుతూనే సులభతర వాణిజ్యం (ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్)ను మెరుగు పరిచేలా టెక్నాలజీ వాడకం ఉంటోందని ప్రముఖ భారత ఆర్థికవేత్త అరవింద్ సుబ్రమణియన్ వివరించారు. హైదరాబాద్ ఎంసిఆర్ హెచ్‌ఆర్‌డి బోధి పెవిలియన్‌లో శుక్రవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో ప్రముఖ ఆర్థికవేత్త అరవింద్ సుబ్రమణియన్ భేటీ అయ్యారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి మెరుగుపరచడంలో ప్రణాళికాబద్ధంగా ముందుకు వెళ్లడంపై ఈ సందర్భంగా చర్చ జరిగినట్లు ముఖ్యమంత్రి కార్యాలయం తెలియజేసింది. తెలంగాణ ఆర్థిక వ్యవస్థ వేగంగా విస్తరిస్తున్న నేపథ్యంలో రాష్ట్ర ఖజానాకు జిఎస్‌టి రాబడులను పెంచుకోవడంలో ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్(ఎఐ)ను వినియోగించడం, తద్వారా పటిష్టమైన ప్రణాళికను రూపొందించడంపై అరవింద్ సుబ్రమణియన్‌తో సిఎం రేవంత్ రెడ్డి విస్తృతంగా చర్చలు జరిపారు. ముఖ్యంగా జిఎస్‌టి, ఎక్సైజ్ శాఖల్లో చేపట్టాల్సిన సంస్కరణలపై అరవింద్ సుబ్రమణియన్‌తో చర్చించారు. ప్రధానంగా భవన, నిర్మాణ సామగ్రి విషయంలో లీకేజీలను అరికట్టే విధంగా తరువాయి 8లో

### 10న నాగార్జున సాగర్‌లో

## వరుణ యాగం

17 నుంచి ముఖ్యమంత్రి బృందం విదేశీ పర్యటన

ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్రంలో విస్తారంగా వర్షాలు కురవాలని ఆకాంక్షిస్తూ వరుణ యాగం నిర్వహించాలని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి నిర్ణయించారు. వరుణ యాగానికి ముహూర్తంగా ఆగస్టు 10వ తేదీని యాదగిరిగుట్ట దేవస్థానం అర్చకులు, వేద పండితులు, సిద్ధాంతులు నిర్ణయించారు. నాగార్జునసాగర్ డ్యామ్ తీరంలోని విజయవిహార్ ప్రాంగణంలో యాగం నిర్వహించాలని సిఎం సూచించారు. దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో యాదగిరిగుట్ట దేవస్థానం అర్చకులు, వేద పండితులు, నిర్ణయించిన ముహూర్తంలో యాగ క్రతువులను నిర్వహించనున్నారు. కృష్ణా, గోదావరి నదులు, చెరువులు జలకళ సంతరించుకోవాలని, పాడిపంటలు సమృద్ధిగా పండాలన్న సంకల్పంతో ప్రత్యేక పూజలు జరపనున్నారు. రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి తరువాయి 8లో

# యాది మరిస్తే పతనమే..

## కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు హామీలు నెరవేర్చాల్సిందే

- 'బద్లావ్ జరూరీ హై' పాదయాత్రల్లో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బాగం, బాలనర్సింహ్మ ఉద్ఘాటన
- యాత్రకు గ్రామగ్రామాన అపూర్వ స్పందన

ప్రజాపక్షం/ ఖమ్మం/నాగర్‌కర్నూలు




దేశంలో నరేంద్ర మోదీ ప్రభుత్వ వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకువెళ్లేందుకు, ప్రజలెదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించే దిశగా సిపిఐ చేపట్టిన పాదయాత్రలు కొనసాగుతున్నాయి. రెండో రోజు శుక్రవారం నిర్వహించిన యాత్రలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు చాడ వెంకట్‌రెడ్డి, భూపాలపల్లి జిల్లా ములకనూరులో, భాగం హేమంతరావు ఖమ్మం జిల్లాలోని ముదిగొండ,



నేలకొండపెల్లి, కూసుమంచి, తిరుమలాయపాలెం మండలాల్లో, ఎం.బాలనర్సింహ్మ నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండలంలో పాల్గొన్నారు. ఈ పాదయాత్రలకు ప్రజలు అడుగడుగునా బ్రహ్మరథం పడుతున్నారు. గ్రామాల్లో డప్పు, కోలాటాలతో స్వాగతం పలుకుతున్నారు. ప్రజాసమస్యలను వివరిస్తూ పార్టీ శ్రేణులు ముందుకు సాగుతున్నారు. దేశంలో ప్రజలు మార్పు కోరుకుంటున్నారని వివరిస్తున్నారు. పాలకులు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా యాది మరిస్తే ప్రజలు సహించబోరని సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు హెచ్చరించారు. ఇచ్చిన హామీలను అమలు తరువాయి 12లో

# రాంచీలో నేహాపై సిరా దాడి

- పెల్లెట్ గన్‌కాల్పులు, లాఠీచార్జీని ఎదుర్కొన్నా... సిరా దాడులకు భయపడ
- విద్యార్థులు, యువత ఆగ్రహాన్ని సిరాతో అణచివేయవచ్చని అనుకుంటున్నారా? ● ఆల్ ఇండియా స్టూడెంట్స్ అసోసియేషన్ అధ్యక్షురాలు నేహా బోరా నిలదీత ● అసెంబ్లీ ముట్టడికి ర్యాలీగా వెళ్లిన ఎఐఎస్‌ఎఫ్, ఎఐవైఎఫ్, ఎఐఎస్‌ఎ, ఎస్‌ఎఫ్‌ఐ








**రాంచీ :** జార్ఖండ్‌లో నియామక పరీక్షలలో జరిగిన అవకతవకలకు వ్యతిరేకంగా జరుగుతున్న నిరసన శుక్రవారం నాటికి 14వ రోజుకు చేరుకుంది. ఈ నిరసనలో భాగంగా ఆరుగురు నిరసనకారులు నిరాహార దీక్ష చేపట్టారు. 14వ జార్ఖండ్ పిఎస్‌సి సివిల్ సర్వీసెస్ పరీక్షను రద్దు చేయాలని, నియామక పరీక్షలో జరిగిన అవకతవకలపై సిబిఐతో గానీ లేదా రాష్ట్రం వెలుపలికి చెందిన విశ్రాంత హైకోర్టు న్యాయమూర్తుల బృందంతో గానీ స్వతంత్ర విచారణ జరిపించాలని నిరసనకారులు డిమాండ్ చేస్తున్నారు. జార్ఖండ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (జెపిఎస్‌సి), జార్ఖండ్ స్టాఫ్ సెలక్షన్ కమిషన్ (జెఎస్‌ఎస్‌సి)లలో సమగ్ర సంస్కరణలు తీసుకురావాలని కూడా డిమాండ్ చేస్తున్నారు. నిరసనకారుల డిమాండ్లను నెరవేర్చేందుకు ఆల్ ఇండియా స్టూడెంట్స్ ఫెడరేషన్ ఎఐఎస్‌ఎఫ్), ఆల్ ఇండియా స్టూడెంట్స్ అసోసియేషన్ (ఎఐఎస్‌ఎ) అసెంబ్లీ వరకు పాదయాత్ర నిర్వహించాయి. ఎఐఎస్‌ఎ కేంద్ర అధ్యక్షురాలు నేహా బోరా, జైపాల్ సింగ్ ముండా స్టేడియంలో నిరాహార దీక్ష చేస్తున్న విద్యార్థులను కలిసి వారికి తన మద్దతును తెలిపారు. ర్యాలీ సందర్భంగా ఆల్ ఇండియా స్టూడెంట్స్ అసోసియేషన్ అధ్యక్షురాలు నేహా బోరాను 'దేశద్రోహి' అని ఆరోపిస్తూ ఒక వ్యక్తి ఆమెపై సిరా చల్లాడు. అమర్‌నాథ్ పాండేగా గుర్తించిన ఆ వ్యక్తిని అదుపులోకి తీసుకుని ధుర్వా పోలీస్ స్టేషన్‌లో విచారిస్తున్నారని, అయితే ఇప్పటివరకూ అతనిపై ఎలాంటి ఎఫ్‌ఐఆర్ నమోదు కాలేదని ఒక పోలీసు అధికారి తెలిపారు. వామపక్ష విద్యార్థి సంఘాలైన తరువాయి 8లో

### సవాళ్లను అవకాశంగా

## మలుచుకుందాం

- ఆర్థిక, భౌగోళిక, రాజకీయ అనిశ్చితుల నేపథ్యంలో పారిశ్రామిక వేత్తలకు ఐటిశాఖ మంత్రి శ్రీధర్‌బాబు పిలుపు
- పాలిమర్ పరిశ్రమల అభివృద్ధికి ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ



ప్రజాపక్షం/హైదరాబాద్

ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న ఆర్థిక, భౌగోళిక రాజకీయ అనిశ్చితులను సవాళ్లుగా కాకుండా అవకాశాలుగా మలుచుకోవాలని రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పారిశ్రామికవేత్తలకు పిలుపునిచ్చారు. సంక్షోభ సమయంలోనే కొత్త సాంకేతికత, నాణ్యత, ఆవిష్కరణలపై పెట్టుబడులు పెట్టే పరిశ్రమలే భవిష్యత్తులో మార్కెట్‌ను శాసిస్తాయని తరువాయి 8లో



### 23 నుంచి ఆటో డ్రైవర్ల

## నిరవధిక సమ్మె

- రవాణా కమిషనర్‌కు జెఎసి వినతి
- 14 డిమాండ్లు పరిష్కరించాలని విజ్ఞప్తి

ప్రజాపక్షం/హైదరాబాద్

తెలంగాణ రాష్ట్రంలో ఆటో డ్రైవర్ల న్యాయమైన సమస్యలను వెంటనే పరిష్కరించాలని, లేనిపక్షంలో 23 నుంచి రాష్ట్రవ్యాప్తంగా ఆటో డ్రైవర్ల నిరవధిక సమ్మెకు దిగనున్నట్లు తెలంగాణ రాష్ట్ర ఆటో డ్రైవర్లు, యాప్ ఆధారిత సంఘాల జెఎసి ప్రకటించింది. ఈ మేరకు రాష్ట్ర రవాణా శాఖ కమిషనర్‌కు జెఎసి ప్రతినిధులు శుక్రవారం వినతిపత్రం సమర్పించారు. వినతిపత్రంలో ఆటో రంగం తరువాయి 8లో

## జిల్లాల్లో నీటిపారుదల సలహా మండళ్లు

- ఎల్‌నినో పరిస్థితుల్లో రైతు ప్రయోజనాల పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యం
- అధికారులకు నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ ఆదేశం



ప్రజాపక్షం/హైదరాబాద్

ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో రైతుల ప్రయోజనాల పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ 'జిల్లా నీటిపారుదల సలహా మండళ్ల'ను తక్షణమే పునరుద్ధరించాలని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో శనివారం నుంచే నీటిపారుదల సలహా మండళ్ల సమావేశాలు నిర్వహించాలని, సలహా మండళ్లు కేవలం నీటి విడుదలలపై నిర్ణయాలు తీసుకునే వేదికలుగా కాకుండా, రైతులు ఏ పంట వేస్తే భవిష్యత్తులో నష్టపోకుండా ఉంటారో ముందుగానే తరువాయి 8లో

# ఉచిత యుపిఐకి ధర కట్టే ప్రయత్నం!

ప్రపంచవ్యాప్తంగా అత్యంత విజయవంతమైన ఈ డిజిటల్ చెల్లింపు వ్యవస్థ యుపిఐను కూడా కేంద్ర ప్రభుత్వం తన ఆదాయ మార్గంగా మార్చేందుకు పావులు కదుపుతున్నది. సామాన్యుడి నడ్డి విరిచేందుకు మరోసారి సిద్ధమవుతున్నది. 'పన్నులు, ఇతర చట్టాల (సవరణ)బిల్లు–2026' ఈ పరిస్థితిని మార్చే దిశగా అడుగు వేసింది. ఇప్పటి వరకు యుపిఐ వంటి డిజిటల్ చెల్లింపులపై మర్చంట్ డిస్కౌంట్ రేట్ (ఎండిఆర్) లేదా ఇతర సేవా రుసుములు విధించకుండా అడ్డుకుంటున్న చట్టపరమైన నిబంధనను తొలగించింది. ఈ అవరోధం తొలగిపోవడంతో, ఏ క్షణమైనా ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేయవచ్చు. బ్యాంకులు, పేమెంట్ సర్వీస్ ప్రొవైడర్లు, డిజిటల్ చెల్లింపు సంస్థలు యుపిఐ లావాదేవీలపై రుసుములు వసూలు చేయవచ్చు. 'ప్రభుత్వం ఇప్పుడే ఛార్జీలు విధించడం లేదు' అనే ప్రభుత్వ ప్రకటన కేవలం ఊరటనిచ్చే వాదన మాత్రమే. ఎందుకంటే చట్టం మారింది. ఇప్పటి వరకు ప్రజలకు ఉన్న హక్కు ఇప్పుడు ప్రభుత్వ అనుమతిపై ఆధారపడే సౌకర్యంగా రూపాంతరం చెందింది. ఈ మార్పే ఆందోళన కలిగించే అంశం. యుపిఐ ప్రభావం నగరాలకు పరిమితం కాదు. గ్రామాల్లో కూడా చిన్న దుకాణాలు, పండ్ల బండ్లు, పాలు అమ్మేవారు, పూల వ్యాపారులు, కూలీలు, స్వయం ఉపాధి పొందుతున్న లక్షలాది మంది తమ ఆదాయంలో పెద్ద భాగాన్ని ఇప్పుడు యుపిఐ ద్వారానే స్వీకరిస్తున్నారు. నగదు చిల్లర సమస్య నుంచి బయటపడ్డారు. బ్యాంకుకు వెళ్లాల్సిన అవసరం తగ్గింది. లావాదేవీలకు రికార్డు ఏర్పడింది. ఈ సౌకర్యం వారికి ఎలాంటి అదనపు వ్యయం లేకుండా లభించింది. ఇప్పుడు ఒక్కో లావాదేవీపై చిన్న మొత్తంలోనైనా రుసుము చెల్లించాల్సి వచ్చినా, ఆ ప్రభావం మొదటగా ఈ వర్గంపైనే పడుతుంది. పెద్ద వ్యాపార సంస్థలు ఆ ఖర్చును తమ వ్యాపార వ్యయంగా చూపించగలవు. అవసరమైతే వస్తువుల ధరల్లో కలిపి వినియోగదారులపైకి నెట్టగలవు. కానీ చిన్న వ్యాపారికి ఆ అవకాశం ఉండదు. అతను తన లాభంలో నుంచి చెల్లించాలి. లేకపోతే వినియోగదారుడి నుంచి అదనంగా వసూలు చేయాలి. రెండు పరిస్థితుల్లోనూ నష్టపోయేది చివరకు సామాన్యుడే. సాధారణ వినియోగదారుడికి ప్రభుత్వ నిర్ణయం అనుకూలించదు. ఇప్పటి వరకు పది రూపాయలైనా, పది వేల రూపాయలైనా యుపిఐ ద్వారా ఎలాంటి భయం లేకుండా చెల్లించాడు. రేపు ఛార్జీలు చెల్లించాల్సివస్తే చిన్న మొత్తాల చెల్లింపులకే ప్రజలు నగదును ఆశ్రయించే అవకాశం ఉంది. డిజిటల్ చెల్లింపుల విస్తరణకు ఇది ఎదురుదెబ్బే. ప్రభుత్వం ఎన్నో సంవత్సరాలుగా 'డిజిటల్ ఇండియా' అని ప్రచారం చేసింది. ఇప్పుడు అదే ప్రభుత్వ విధానం ఆ లక్ష్యానికే విరుద్ధంగా కనిపిస్తోంది. బ్యాంకులు, పేమెంట్ సంస్థలు తమ వాదనగా నిర్వహణ వ్యయం పెరుగుతోందని చెబుతున్నాయి. అది కొంతవరకు నిజమే. సర్వర్లు, సైబర్ భద్రత, సాంకేతిక మౌలిక వసతులు, మోసాల నివారణకు ఖర్చు పెరుగుతోంది. కానీ ఈ ఖర్చును వసూలు చేయడానికి సామాన్యుడి జేబుపైనే చేయి వేయడం ఒక్కటే మార్గమా? అనే ప్రశ్నకు ప్రభుత్వమే సమాధానం చెప్పాలి. యుపిఐ ఒక ప్రైవేటు ఉత్పత్తి కాదు. ఇది దేశ ఆర్థిక మౌలిక వసతుల్లో భాగం. ప్రభుత్వం పన్నుల వసూళ్లు పెంచుకోవడానికి, సంక్షేమ పథకాల డబ్బును నేరుగా పంపించడానికి, ఆర్థిక వ్యవస్థను పారదర్శకంగా మార్చడానికి యుపిఐ విస్తరణే పెద్ద బలం. ఇంత లాభం ప్రభుత్వానికే దక్కుతున్నప్పుడు, దాని నిర్వహణ ఖర్చు మొత్తం ప్రజలపై వేయడం న్యాయబద్ధం కాదు. యుపిఐపై ప్రజలు విశ్వాసం పెంచుకున్నది అది ఉచిత సేవ కావడం వల్ల. ఇప్పుడు ఛార్జీలకు పచ్చజెండా ఊపితే, భవిష్యత్తులో ఎప్పుడు ఎంత రుసుము విధిస్తారో తెలియని అనిశ్చితి.


డిజిటల్ వ్యవస్థల విజయానికి విశ్వాసమే మూలధనం. ఆ విశ్వాసాన్ని దెబ్బతీసే నిర్ణయాలను ప్రజలు ప్రశ్నించాల్సిందే. ఒక కోటీశ్వరుడు చేసే లావాదేవీలపై పడే రుసుము అతనికి పెద్ద సమస్య కాదు. కానీ, సగటున రోజుకు వెయ్యి రూపాయల వ్యాపారం చేసే చిన్న వ్యాపారికి అదే రుసుము గణనీయమైన భారం. ఒకే విధానం అందరికీ సమానంగా కనిపించినా, దాని ప్రభావం అసమానంగా ఉంటుంది. అందుకే ఈ నిర్ణయం సామాజిక న్యాయ సూత్రానికీ విరుద్ధంగా మారుతుంది. వ్యాపారులపై కొత్త వ్యయం పడినప్పుడు అది చివరకు వస్తువుల ధరల్లో ప్రతిబింబిస్తుంది. అంటే ప్రభుత్వం ప్రత్యక్షంగా పన్ను వేయకపోయినా, డిజిటల్ లావాదేవీల ఖర్చు ధరల పెరుగుదల ద్వారా ప్రజలపైనే ప్రభావం చూపుతుంది. ఎన్నో సంవత్సరాలుగా డిజిటల్ చెల్లింపులను ప్రోత్సహిస్తూ ప్రజలను నగదు నుంచి యుపిఐ వైపు మళ్లించారు. ఇప్పుడు అదే వ్యవస్థపై ఛార్జీలకు అవకాశం కల్పించడం వ్యూహాత్మక దోపిడీకి చిహ్నం. విధానపరమైన అస్థిరతకు సంకేతం. ప్రభుత్వ ప్రోత్సాహకాలను నమ్మి డిజిటల్ వ్యవస్థలోకి వచ్చిన చిన్న వ్యాపారులు ఇప్పుడు మళ్లీ అనిశ్చితిని ఎదుర్కోవాల్సి వస్తుంది. భారీ విలువ కలిగిన వాణిజ్య లావాదేవీలపై మాత్రమే పరిమిత రుసుములు పరిశీలించవచ్చు. చిన్న వ్యాపారులు, సూక్ష్మ వ్యాపారులు, సాధారణ వినియోగదారులను పూర్తిగా మినహాయించవచ్చు. డిజిటల్ చెల్లింపుల వల్ల లాభపడుతున్న పెద్ద బ్యాంకులు, పెద్ద ఫిన్‌టెక్ సంస్థలు, భారీ వాణిజ్య సంస్థలు నిర్వహణ వ్యయంలో ఎక్కువ వాటా భరించే విధానాన్ని రూపొందించవచ్చు. లోక్‌సభ ఈ బిల్లును చర్చ లేకుండానే ఆమోదించడం కూడా మరో ఆందోళన కలిగించే అంశం. కోట్లాదిమంది ప్రజల రోజువారీ ఆర్థిక జీవితాన్ని ప్రభావితం చేసే మార్పుపై విస్తృత చర్చ జరగాలి. వినియోగదారుల సంఘాలు, చిన్న వ్యాపారుల ప్రతినిధులు, బ్యాంకింగ్ నిపుణుల అభిప్రాయాలు తెలుసుకోవాల్సింది. అలాంటి ప్రజా చర్చ లేకుండా తీసుకున్న నిర్ణయాలు తరువాత పెద్ద సామాజిక వ్యతిరేకతకు దారితీస్తుంది. ప్రజలకు ఉచితంగా, అందరికీ సమానంగా అందుబాటులో ఉన్న యుపిఐని ఆదాయ వనరుగా మార్చే ప్రతి ప్రయత్నాన్ని ప్రజలు అప్రమత్తంగా గమనించాలి. ఈ రోజు చిన్న రుసుముతో ప్రారంభమయ్యే మార్పు, రేపు ప్రతి డిజిటల్ లావాదేవీపై కొత్త భారంగా మారే ప్రమాదం ఉందని గ్రహించాలి. సాంకేతిక పురోగతి పేరుతో ప్రజలపై కొత్త ఆర్థిక భారం మోపడం అభివృద్ధి కాదు. డిజిటల్ ఆర్థిక వ్యవస్థ ప్రజలకు సేవ చేయాలి. ప్రజలు ఆ వ్యవస్థను పోషించడానికి అదనపు మూల్యం చెల్లించే పరిస్థితి రాకూడదు. అందుకే యుపిఐపై రుసుములు విధించే అవకాశాన్ని కల్పించిన ఈ చట్ట సవరణను ప్రభుత్వం పునఃపరిశీలించాలి. డిజిటల్ భారత్ విజయగాథను ఖర్చుతో కూడిన సేవగా మార్చకుండా కాపాడుకోవడం ఇప్పుడు ప్రజాస్వామ్య బాధ్యతగా మారింది.

## భాగవత్ ముందు హోంమంత్రికి చెప్పాలి




విద్యార్థులపై జరిగిన దారుణమైన దాడికి సంబంధించి అమిత్ షా రాజీనామాను డిమాండ్ చేయలేనప్పుడు, 'జెన్-జీ' తరానికి నిరసన తెలిపే హక్కు ఉందని మోహన్ భగవత్ చెప్పడంలో అర్థం ఏముంది? భాగవత్‌కు నిజాయితీ ఉంటే, హోం మంత్రిని కనీసం పార్లమెంటుకు హాజరై జులై 20న జరిగిన ఘటనపై సమాధానం చెప్పాలని సూచించాలి.

– కె.సి.వేణుగోపాల్,
ఎఐసిసి ప్రధాన కార్యదర్శి



## 'డూ ఆర్ డై' నినాదంతో క్విట్ ఇండియా ఉద్యమం

2వ ప్రపంచ యుద్ధం ఒకవైపు భారత స్వాతంత్ర్య పోరాటం మరో వైపు ఉన్నత స్థాయిలో జరుగుతున్న రోజులవి. స్వాతంత్ర్య పోరాటంలో భాగంగా 08, ఆగష్టు 1942 రోజున బొంబాయిలో భారత జాతీయ కాంగ్రెస్ తీసుకున్న తీర్మానం ప్రకారం క్విట్ ఇండియా ఉద్యమం ఉవ్వెత్తున ఎగిసి పడింది. ఆగష్టు ఉద్యమం లేదా ఆగష్టు క్రాంతి లేదా 'భారత్ ఛోడో ఆందోళన్' అనే పేర్లతో కూడా క్విట్ ఇండియా ఉద్యమాన్ని నినాదాలుగా పిలిచారు. క్విట్ ఇండియా అంటూ మహాత్మాగాంధీ బ్రిటీష్ పాలకుల గుండెలు అదిరే విధంగా గళమెత్తడమే కాకుండా స్వాతంత్ర్య సాధనకు డూ ఆర్ డై (సాధించు లేదా మరణించు) అంటూ సామాన్య



ప్రజల్లో స్వాతంత్ర్య జ్వాలలు రగల్చగలిగారు. పట్టణాలు, పల్లె ప్రజలు కూడా క్విట్ ఇండి యా అంటూ అహింసాయుత బాటలో ముక్త కంఠంతో గొంతులు ఎత్తడంతో వలస పాలకుల గుండెల్లో రైళ్లు పరుగెత్తడం ప్రారంభమైంది. క్రిప్స్ మిషన్ వైఫల్యం, భారతీయుల్ని అమానవీయంగా చూడడం, ఈస్ట్ బెంగాల్ ప్రాంతంలో తీవ్ర అస్థిరత, దేశవ్యాప్తంగా ఆకలి పోరాటాలు, వలస పాలకులు పాలనపై అపనమ్మకం లాంటి పలు కారణాలు కూడా క్విట్ ఇండియా ఉద్యమానికి ఆజ్యం పోశాయి.

క్విట్ ఇండియా ఉద్యమానికి ప్రధాన నినాదంగా డూ ఆర్ డై అనే స్వాతంత్ర్య రెండు పదాల మంత్రం భారతదేశవ్యాప్తంగా వ్యాపించిన వేళ స్వాతంత్ర్య సమర యోధులతో పాటు ఇతర పెద్దలు, విద్యార్థులు, యువత, మహిళలు సహితం పోరాటానికి గళం కలిపి దేశ ఐక్యతను చాటడంతో తెల్ల తోలు పాలకులు భయ కంపితులు కావడం జరిగింది. ఈ పోరాటాన్ని అణచి వేయడానికి పోలీస్ బలగాలు రంగ ప్రవేశం చేసి పలువురు ప్రముఖ నాయకులను అరెస్టు చేయడం జరిగింది. పౌర సహాయనిరాకరణ, పోరుల్లో ధైర్యం, ప్రజల త్యాగం, దేశ స్వాతంత్ర్య భావనలు, జాతీయ అంతర్జాతీయ గుర్తింపు పౌర సమాజ భాగస్వామ్యం ప్రజాస్వామ్య పరిరక్షణ, దేశ సార్వభౌమాధికారం, దేశభక్తి, రేపటి యువతరం ప్రేరణ, పెద్ద ఎత్తున నిరసనలు జరగడానికి క్విట్ ఇండియా స్ఫూర్తి పనిచేసింది. 1947లో స్వాతంత్ర్యం రావడానికి క్విట్ ఇండియా ఉద్యమ ఘట్టం ప్రధాన కారణంగా నిలిచింది.

08 ఆగస్టు రోజున పాటిస్తున్న క్విట్ ఇండియా ఉద్యమ దినంలో భాగంగా విద్యాలయాల్లో అవగాహనలు, రేపటి తరానికి ప్రేరణాత్మక కార్యక్రమాలు, క్విజ్ పోస్టర్ ఉపన్యాస పోటీలు, పోరాటానికి సంబంధించిన సినిమాల ప్రదర్శనలు, చర్చలు, పోరులో అమరత్వ పొందిన వారికి నివాళులు అర్పించడం, సాంస్కృతిక పోటీలు, సామాజిక మాధ్యమ ప్రచారాలు, ప్రభుత్వ సంస్థల కార్యక్రమాలు లాంటివి నిర్వహించవచ్చు. వీర మరణమో లేదా స్వాతంత్ర్య సాధనో జరిగే వరకు ఈ పోరాటం ఆగదని బ్రిటీష్ పాలకులకు స్పష్టం చేయగలిగిన క్విట్ ఇండియా ఉద్యమం భారత దేశ స్వేచ్ఛా పోరులో ఒక ప్రధాన ఘట్టంగా నిలవడం జరిగింది.

*(08 ఆగస్టు 'క్విట్ ఇండియా ఉద్యమ' దినం సందర్భంగా)*


# ప్రైవేట్ విశ్వవిద్యాలయాల్లో రిజర్వేషన్లు అవసరం



ఎం.రాంబల్ నాయక్
ఎల్‌హెచ్‌పిఎస్ రాష్ట్ర అధ్యక్షుడు

విద్య వ్యక్తిగత పురోగతికే కాదు, సామాజిక న్యాయాన్ని సాధించే అత్యంత ప్రభావవంతమైన సాధనం. డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విద్యను సామాజిక విముక్తికి ఆయుధంగా భావించారు. స్వాతంత్ర్యం వచ్చి దాదా పు ఎనిమిది దశాబ్దాలు గడిచినా ఉన్నత విద్యలో సమాన అవకాశాల లక్ష్యం ఇంకా పూర్తిగా సాకారం కాలేదు. ప్రభుత్వ విద్యాసంస్థల్లో ఎస్‌సి, ఎస్‌టి, బిసి, ఇబిసి వర్గాలకు రిజర్వేషన్లు అమలవుతున్నప్పటికీ, ఉన్నత విద్యలో పెరుగుతున్న ప్రైవేట్ రంగం మాత్రం ఈ బాధ్యత నుంచి దాదాపు మినహాయింపును పొందుతోంది. ఫలితంగా సామాజిక న్యాయం అసంపూర్ణంగా మిగులుతోంది. రాజ్యాంగం కల్పించిన సమానత్వం అంటే అందరికీ ఒకే అవకాశాన్ని ప్రకటించడం కాదు... చారిత్రకంగా వెనుకబడిన వర్గాలకు ప్రత్యేక అవకాశాలు కల్పించి వారిని సమాన స్థాయికి తీసుకురావడం కూడా. అందుకే రిజర్వేషన్లు దయాదాక్షిణ్యాల ఫలితం కాదు. రాజ్యాంగబద్ధమైన హక్కు. అయితే అవి ప్రభుత్వ విద్యాసంస్థలకే పరిమితమైతే, ప్రైవేట్ విశ్వవిద్యాలయాలు అధికంగా ఉన్న ప్రస్తుత పరిస్థితుల్లో వాటి అసలు లక్ష్యం నెరవేరదు. ఇంజినీరింగ్, వైద్యం, మేనేజ్‌మెంట్, న్యాయశాస్త్రం వంటి అనేక రంగాల్లో ప్రభుత్వ సీట్ల కంటే ప్రైవేట్ సీట్లే ఎక్కువగా ఉన్నాయి. ప్రభుత్వ కళాశాలల్లో ప్రవేశం లభించని విద్యార్థులకు ప్రైవేట్ విశ్వవిద్యాలయాలే ప్రత్యామ్నాయంగా మారాయి. అలాంటి పరిస్థితిలో రిజర్వేషన్లు ప్రభుత్వ రంగానికే పరిమితం కావడం వల్ల వెనుకబడిన వర్గాల విద్యార్థులకు ఉన్నత విద్య మరింత దూరమవుతోంది. ప్రైవేట్ విశ్వవిద్యాలయాలు పూర్తిగా ప్రైవేట్ వ్యవస్థలుగా చెప్పలేం. ప్రభుత్వ గుర్తింపు, చట్టబద్ధ అనుమతులు, భూముల కేటాయింపు, పన్ను రాయితీలు వంటి అనేక ప్రజావనరుల ఆధారంగానే అవి అభివృద్ధి చెందుతున్నా యి. ప్రజా ప్రయోజనాలతో నడిచే సంస్థలు సామాజిక బాధ్యతను కూడా నిర్వర్తించాలి. విద్యను కేవలం వ్యాపారంగా కాకుండా ప్రజా సేవగా చూడాల్సిన బాధ్యత వాటిపైనా ఉంటుంది. రిజర్వేషన్లను వ్యతిరేకించే వారు తరచు గా 'మెరిట్ దెబ్బతింటుంది' అనే వాదనను ముందుకు తెస్తారు. కానీ మెరిట్‌ను కేవలం పరీక్ష మార్కులతో కొలవడం సరైన ప్రమాణం కాదు. అత్యుత్తమ పాఠశాలలు, ఖరీదైన కోచింగ్, సమృద్ధిగా విద్యా వనరులు అందుబాటులో ఉన్న విద్యార్థి సాధించిన మార్కులను, కనీస సౌకర్యాలు కూడా లేని గ్రామీణ నేపథ్యం నుంచి వచ్చిన విద్యార్థి మార్కులతో పోల్చలేం. అవకాశాల్లో ఉన్న అసమానతను విస్మరించి మెరిట్ గురించి మాట్లాడటం వాస్తవాన్ని నిరాకరించడమే. రిజర్వేషన్లు ప్రతిభకు అడ్డంకి కావు. అవకాశాల లోటును భర్తీ చేసే సాధనం. ప్రభుత్వ విశ్వవిద్యాలయాలు, ఐఐటిలు, ఐఐఎంలు, కేంద్ర విద్యాసంస్థ ల్లో దశాబ్దాలుగా రిజర్వేషన్లు అమలవుతున్నాయి. అక్కడి నుంచి వేలాది మంది వైద్యులు, ఇంజినీర్లు, శాస్త్రవేత్తలు, పరిపాలనాధికారులు దేశ నిర్మాణంలో కీలక పాత్ర పోషిస్తున్నారు. కాబట్టి రిజర్వేషన్లు నాణ్యతను దెబ్బతీస్తాయనే వాదనకు బలమైన ఆధారాలు లేవు. అయితే రిజర్వేషన్ల తో మాత్రమే సమస్య పరిష్కారం కాదు. ముఖ్యంగా ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు అధిక ఫీజులు పెద్ద అడ్డంకిగా మారుతున్నాయి. అందువల్ల ఫీజు రాయితీలు, స్కాలర్‌షిప్‌లు, హాస్టల్ సదుపాయాలు, విద్యా రుణాల భరోసా వంటి సహాయక చర్యలు కూడా సమాంతరంగా అమలు కావాలి. ప్రవేశం కల్పించడం ఎంత ముఖ్యమో, చదువు పూర్తిచేసే పరిస్థితులు కల్పించడం కూడా అంతే అవసరం. భిన్న సామాజిక నేపథ్యాల విద్యార్థులు కలిసి చదివే విద్యాసంస్థలు సమాజంలో పరస్పర అవగాహనను పెంచుతాయి. కుల, వర్గ, ప్రాంత, ఆర్థిక విభేదాలను తగ్గించి సమ్మిళిత సమాజ నిర్మాణానికి దోహదపడతాయి. అదే సమయంలో దేశ అభివృద్ధికి అవసరమైన మానవ వనరులను కూడా విస్తృతంగా తీర్చిదిద్దుతాయి. ఉన్నత విద్యలో ప్రైవేట్ రంగం ఆధిపత్యం పెరుగుతున్న ఈ దశలో, రిజర్వేషన్లను ప్రభుత్వ విద్యాసంస్థలకే పరిమితం చేయడం సామాజిక న్యాయ స్ఫూర్తికి విరుద్ధం. విద్యాసంస్థల స్వయం ప్రతిపత్తిని గౌరవిస్తూనే, పారదర్శక విధానాల ద్వారా ప్రైవేట్ విశ్వవిద్యాలయాల్లో ఎస్‌సి, ఎస్‌టి, బిసి, ఇబిసి రిజర్వేషన్లను అమలు చేసే చట్టపరమైన వ్యవస్థను రూపొందించడం ప్రభుత్వాల బాధ్యత. విద్య కొద్దిమందికి మాత్రమే పరిమితమయ్యే ప్రత్యేక హక్కు కాకుండా, ప్రతి ప్రతిభావంతుడికి అందుబాటులో ఉండే అవకాశం కావాలంటే ఈ సంస్కరణ ఇక ఆలస్యం చేయలేని అవసరం.

ప్రైవేటు విశ్వవిద్యాలయాల్లో ఎస్‌సి, ఎస్‌టి, బిసి, ఇబిసి రిజర్వేషన్ల అమలుపై ప్రభుత్వానికి ఎలాంటి ఇబ్బందులు లేదు. ఎందుకంటే, రాజ్యాంగం ఇప్పటికే ఈ అవకాశాన్ని కల్పించింది. అయితే, రాజకీయ సంకల్పం లేకపోవడం వల్ల అది ఇప్పటికీ ఆచరణలోకి రాలేదు. 2005



లో తీసుకొచ్చిన 93వ రాజ్యాంగ సవరణ ద్వారా సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడిన వర్గాలు, ఎస్‌సిలు, ఎస్‌టిలకు ప్రైవేట్ విద్యాసంస్థల్లో కూడా ప్రత్యేక అవకాశాలు కల్పించే అధికారాన్ని రాజ్యాంగం ఇచ్చింది. అయితే మైనారిటీలు నిర్వహించే విద్యాసంస్థలకు ఈ నిబంధన వర్తించదు. అనంతరం 2008లో అశోక కుమార్ ఠాకూర్ కేసులో సుప్రీంకోర్టు ఈ నిబంధన రాజ్యాంగబద్ధమేనని స్పష్టం చేసింది. 2011, 2013 తీర్పుల్లో కూడా ఎయిడెడ్, అన్‌ఎయిడెడ్ ప్రైవేట్ విద్యాసంస్థల్లో రిజర్వేషన్లకు చట్టపరమైన అడ్డంకి లేదని న్యాయస్థానం స్పష్టం చేసింది. అంటే చట్టపరంగా మార్గం సిద్ధంగా ఉన్నప్పటికీ, ప్రభుత్వాలు ఆ దిశగా అడుగులు వేయలేదు.

ప్రస్తుతం ప్రభుత్వ విశ్వవిద్యాలయాలు, కళాశాలలు రిజర్వేషన్ విధానాన్ని అమలు చేస్తున్నాయి. కానీ ప్రైవేట్ విశ్వవిద్యాలయాలు, డీమ్డ్ విశ్వవిద్యాలయాలు ఈ పరిధికి దాదాపు బయటే ఉన్నాయి. దీంతో ఉన్నత విద్యా వ్యవస్థలో రెండు వేర్వేరు ప్రపంచాలు ఏర్పడ్డాయి. ఒక వైపు పరిమిత నిధులతో, సామాజిక ప్రాతినిధ్యాన్ని కల్పించే ప్రభుత్వ విద్యాసంస్థలు ఉండగా, మరోవైపు అధిక ఫీజులు, మెరుగైన మౌలిక వసతులతో, ప్రధానంగా ఆర్థికంగా, సామాజికంగా బలమైన వర్గాల ఆధిపత్యం ఉన్న ప్రైవేట్ విద్యాసంస్థలు ఉన్నాయి. ఫలితంగా విద్యలో అవకాశాల అసమానత మరింత పెరుగుతోంది. మనదేశంలో ఉన్నత విద్యకు డిమాండ్ గత కొన్ని దశాబ్దాల్లో విపరీతంగా పెరిగింది. 1960–61తో పోలిస్తే 2018–19 నాటికి విశ్వవిద్యాలయాల సంఖ్య దాదాపు పదిరెట్లు, అదే విధంగా స్థూల నమోదు నిష్పత్తి రెండున్నర రెట్లకు పైగా పెరిగింది. ముఖ్యంగా ఎస్‌సిలు, ఎస్‌టిలు, బిసిలు, ముస్లింలు, మహిళల్లో ఉన్నత విద్యపై ఆసక్తి గణనీయంగా పెరిగింది. సామాజికంగా వెనుకబడిన వర్గాలు విద్య ద్వారానే ఆర్థిక, సామాజిక పురోగతి సాధించవచ్చనే అవగాహన ఏర్పడడమే ఇందుకు ప్రధాన కారణం. అయితే ఈ పెరుగుతున్న డిమాండ్‌ను ప్రధానంగా ప్రైవేట్ రంగమే తీర్చడం ప్రారంభించింది. 2015 నుంచి 2024 మధ్య ప్రైవేట్, డీమ్డ్ విశ్వవిద్యాలయాల సంఖ్య 276 నుంచి 523కు పెరిగింది. 2021–22 నాటికి దేశంలోని మొత్తం విశ్వవిద్యాలయాల్లో సుమారు నాలుగో వంతు ప్రైవేట్ రంగానికి చెందినవే. డిగ్రీ స్థాయిలో చదువుతున్న విద్యార్థుల్లో దాదాపు 45 శాతం మంది ప్రైవేట్ అన్‌ఎయిడెడ్ కళాశాలల్లోనే చేరుతున్నారు. అంటే ఉన్నత విద్యలో ప్రైవేట్ రంగం ప్రభావం నిరంతరం పెరుగుతోంది. ఈ నేపథ్యం లో రిజర్వేషన్లు ప్రభుత్వ విద్యాసంస్థలకే పరిమితం కావడం వల్ల రాజ్యాంగం లక్ష్యంగా పెట్టుకున్న సామాజిక న్యాయం బలహీనపడుతోంది. ఆల్ ఇండియా సర్వే ఆన్ హయ్యర్ ఎడ్యుకేషన్ (ఎఐఎస్‌హెచ్‌ఇ) 2021–22 గణాంకాలు ఈ అసమానతను స్పష్టంగా చూపిస్తున్నా యి. దేశ జనాభాలో సుమారు 20 శాతం ఉన్న అగ్రవర్ణ హిందువులు ప్రైవేట్ విశ్వవిద్యాలయాల్లో 60 శాతానికి పైగా ఉన్నారని స్పష్టమవుతున్నది. మరోవైపు జనాభాలో దాదాపు 17 శాతం ఉన్న ఎస్‌సిల ప్రాతినిధ్యం కేవలం 6.8 శాతం మాత్రమే. 9 శాతానికిపైగా జనాభా ఉన్న ఎస్‌టిలు కేవలం 3.6 శాతంతో పరిమితమయ్యారు. జనాభాలో దాదాపు సగం ఉన్న బిసిలు 24.9 శాతం మాత్రమే. ముస్లింల ప్రాతినిధ్యం కూడా వారి జనాభా నిష్పత్తితో పోలిస్తే చాలా తక్కువగా ఉంది. అదే ప్రభుత్వ విశ్వవిద్యాలయాల్లో ఎస్‌సిలు, ఎస్‌టిలు, బిసిల ప్రాతినిధ్యం గణనీయంగా ఎక్కువగా కనిపించడం రిజర్వేషన్ విధానం ప్రభావాన్ని సూచిస్తోంది. ఈ పరిస్థితి విద్యలో అసమానతను సృష్టిస్తున్నది. సమాజంలో అవకాశాల పంపిణీని ప్రభావి తం చేస్తోంది. మెరుగైన విద్యా వనరులు, పరిశోధనా సదుపాయాలు, ఉపాధి అవకాశాలు ఎక్కువగా ఉన్న ప్రైవేట్ విశ్వవిద్యాలయాల్లో వెనుకబడిన వర్గాల ప్రాతినిధ్యం తగ్గడం వల్ల సామాజిక చలనం కూడా పరిమితమవుతోంది. మరోవైపు ప్రభుత్వ విద్యాసంస్థలపై విద్యార్థుల ఒత్తిడి పెరుగుతుండగా, వాటికి తగిన నిధులు అందకపోవడం సమస్యను మరింత తీవ్రం చేస్తోంది. ఈ అంశంలో జాతీయ విద్యా విధానం–2020 కూడా మౌనం పాటించిం ది. విద్యా సంస్కరణల గురించి విస్తృతంగా ప్రస్తావించినప్పటికీ, ప్రైవేట్ విద్యాసంస్థల్లో రిజర్వేషన్ల అంశాన్ని ఎక్కడా ప్రస్తావించలేదు. వివిధ రాజకీయ పార్టీల నుంచి సానుకూల స్పందన ఉన్నప్పటికీ, ఇప్పటివరకు కేంద్రం ఎలాంటి చర్యలు ప్రారంభం కాలేదు. చట్టపరమైన అవకాశం ఉన్నా, రాజకీయ సంకల్పం లేకపోతే రాజ్యాంగ హామీలు కాగితాలకే పరిమితమవుతాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రైవేట్ ఉన్నత విద్యలో రిజర్వేషన్లు అమలు చేయడం ఒక రాజకీయ నిర్ణయమనే పరిధి కి పరిమితం చేయడం న్యాయం కాదు. రాజ్యాంగం నిర్దేశించిన సామాజిక న్యాయ లక్ష్యాన్ని ఆచరణలోకి తీసుకురావడానికి అవసరమైన సంస్కరణగా దీనిని చూడాలి. ఉన్నత విద్యలో ప్రైవేట్ రంగం వేగంగా విస్తరిస్తున్న సమయంలో, సామాజిక న్యాయాన్ని ప్రభుత్వ విద్యాసంస్థలకే పరిమితం చేస్తే రాజ్యాంగం ఉద్దేశించిన సమాన అవకాశాలు నెరవేరవు. అందువల్ల చట్టపరమైన మద్దతును కార్యాచరణగా మార్చి, నాణ్యమైన ఉన్నత విద్య ప్రతి సామాజిక వర్గానికీ అందుబాటులో ఉండేలా చేయడం కేంద్ర ప్రభుత్వ కీలక బాధ్యత.

# వ్యవసాయరంగంపై కార్పొరేట్ సంస్థల స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలను రద్దు చేయాలి

కేంద్ర ప్రభుత్వం స్వదేశీ, విదేశీ కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా రైతు కార్మిక ప్రజలకు వ్యతిరేకంగా, సూక్ష్మ, చిన్న, మధ్య తరహా వ్యాపార సంస్థలకు(MSMEs) వ్యతిరేకంగా కొనసాగిస్తున్న విధానాలవల్ల దేశంలో పేదరికం అసమానతలు దారుణంగా పెరుగుతున్నాయి. నాడు స్వాతంత్ర్య సమరంలో 1942 క్విట్ ఇండియా ఉద్యమ నినాదం బ్రిటీష్ పాలకులారా దేశాన్ని వదిలి వెళ్లిపోవాలని పోరాడి దేశ స్వాతంత్ర్యాన్ని సాధించినట్లుగా కార్పొరేట్ సంస్థలన్ని భారత వ్యవసాయరంగం నుండి వైదొలగాలని, రైతులను, వ్యవసాయరంగాన్ని పూర్తిగా దెబ్బతీసే స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ క్విట్ ఇండియా ఉద్యమ 84వ సంవత్సరాన్ని పురస్కరించుకుని 'జైలు భరో' కార్యక్రమాన్ని నిర్వహించాలని సంయుక్త కిసాన్ మోర్చా పిలుపునిచ్చింది.

అమెరికా బ్రిటన్ న్యూజిలాండ్ యూరోపియన్ యూనియన్‌లతో కేంద్ర ప్రభుత్వం స్వేచ్ఛ వాణిజ్య ఒప్పందాలు చేసుకున్నది. భారత వ్యవసాయరంగంలోకి 32 దేశాల నుండి దిగుమతులకు అవకాశం కల్పించింది. బాగా అభివృద్ధి చెందిన అమెరికా ఇతర దేశాల నుండి పంటలు మన దేశానికి దిగుమతి అయితే సున్నా సుంకం. దీనివల్ల మన దేశ రైతాంగం పండించిన పంటలకు మార్కెట్లో ధరలు తగ్గిపోతాయి. 2014 ఎన్నికల మేనిఫెస్టోలో డాక్టర్ స్వామినాథన్ సిఫారసుల మేరకు సీ2+50% ఆధారంగా మద్దతు ధరలను అమలు చేస్తామని బిజెపి హామీ ఇచ్చింది. కానీ గత 12 ఏళ్ల పాలనలో మద్దతు ధరలను అమలు చేయకుండా మోసం చేసింది. ఖరీఫ్‌లో 2026–27 సంవత్సరానికి వరికి మద్దతు ధర క్వింటాకు రూ.2441గా నిర్ణయించారు. కానీ సీ2+50% ప్రకారం క్వింటాకు 3243 రూపాయలు ఉండాలి. రైతుల ప్రతి క్వింటాకు ఎనిమిది వందల రెండు రూపాయలు నష్టపోతున్నారు. జాతీయస్థాయిలో ఈ నష్టం వరి రైతులకు రూ.3,07,597లు.

సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో ఢిల్లీలో రైతాంగ ఉద్యమం నిరంతరంగా కొనసాగుతున్న సమయంలో పంటలకు మద్దతు ధరలను సీ2+ 50% ఆధారంగా నిర్ణయం చేస్తామని, రుణమాఫీ చేస్తామని, 11 హామీలను 2021 డిసెంబర్ 9వ తేదీన రాతపూర్వకం గా ప్రధాన మంత్రి మోదీ ఇచ్చారు. ఇచ్చిన హామీలను నెరవేర్చటానికి ఎలాంటి చర్యలు తీసుకోకపోగా స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు చేసుకొని కార్పొరేటు సంస్థలకు వారి ప్రయోజనాలకు ఊడిగం చేయటానికి కేంద్ర ప్రభుత్వం తలపడుతుంది. అందుకే ఈ ఒప్పందాలను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ జైలు భరో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాం. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాల్సిందిగా రైతులను, కార్మికులను, వ్యవసాయ ప్రజలను కోరుతున్నాం.




ఆగస్టు 10న జరిగే 'జైల్ భరో' పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎస్‌కెఎం నాయకులు

వామపక్ష పోరాటాల ఫలితంగా యుపిఎ ప్రభుత్వం 2005లో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి గ్యారెంటీ చట్టం చేసింది. దీని ప్రకారం వ్యవసాయ కార్మికులకు సంవత్సరంలో 100రోజులు పని కల్పించాలి. ఈ చట్టాన్ని సక్రమంగా అమలు చేయాలని, సంవత్సరానికి 200 రోజులు పని కల్పించాలని రోజుకు 700రూపాయల వేతనం ఇవ్వాలని, బడ్జెట్లో నిధులు పెంచాలని వ్యవసాయ కార్మికు లు పోరాడుతున్నారు. ఈ డిమాండ్లపై ఎలాంటి స్పందన లేకపోగా మహాత్మాగాంధీ పేరు తొలగించి వికసిత్ భారత్ గ్రామ్ జి గా మార్పు చేయటమే కాక రాష్ట్రాలు 40 శాతం నిధులను భరించాలని కేంద్ర ప్రభుత్వం తన బాధ్యతను, బరువు ను తగ్గించుకోవటానికి పూనుకుంది. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి గ్యారెంటీ చట్టం 2005 యథాతథంగా అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నాం. ఆహార భద్రత చట్టాన్ని సవరించి అంత్యోదయ పథకం ద్వారా నిరుపేదలకు ప్రతి కుటుంబానికి 35 కేజీల బియ్యం లేదా గోధుమలు ఇచ్చే అవకాశాన్ని తొలగించి కేవలం మనిషికి ఏడు కేజీలు మాత్రమే ఇవ్వాలని ప్రయత్నిస్తున్నారు. తెలంగాణ రాష్ట్రంలో 5.67 లక్షల కుటుంబాలు,15.29 లక్షల లబ్ధిదారులు ఉన్నారు. ఆహార భద్రత చట్టానికి సవరణలు తీసుకువస్తే నిరుపేదలందరూ తీవ్రమైన ఆకలి కొరతకు మంటలకు బలవుతారు. ఆహార భద్రత చట్టానికి సవరణలు ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తున్నాం. కార్మికులు సమ్మెచేసే హక్కును కాలరాసే, 8 గంటల పని విధానాన్ని రద్దు చేసే, సంఘాన్ని పెట్టుకునే అవకాశం తొలగిస్తూ కేంద్ర ప్రభుత్వం నాలుగు కోడ్లను ఏర్పాటు చేసి అమలు చేయటానికి 2026 మే 8, 9 తారీకులలో రూల్స్ ను ఏర్పాటు చేసింది. ఈ నిరంకుశమైన లేబర్ కోడ్లను రద్దు చేయాలని ఆరుసార్లు సార్వత్రిక సమ్మెలు, అనేకసార్లు ఉద్యమాలు పోరాటాలు నిర్వహించినా బరితెగించి కార్పొరేట్ కంపెనీల, పెట్టుబడిదారుల ప్రయోజనాలను కాపాడటానికే లేబర్ కోడ్ల అమలుకు, ఉదారవాద ఆర్థిక విధానాల అమలుకు కేంద్ర ప్రభుత్వం పాల్పడుతుంది.

ఈ దేశ సంపదను పెంచడానికి రెండు ప్రధాన ఉత్పత్తి రంగాల్లో ఆరుగాలం శ్రమిస్తున్న రైతుల, కార్మికుల వ్యవసాయ కార్మికుల జీవించే హక్కును కాపాడుకోవడానికి, రైతు రక్షణకు, వ్యవసాయ అభివృద్ధికి, పంటల మద్దతు ధరల గ్యారెంటీ చట్టం చేయాలని రుణమాఫీ చట్టం చేయాలని పంటల బీమాను అమలు చేయాలని, లేబర్ కోడ్లను రద్దు చేయాలని, స్వేచ్ఛ వాణిజ్య ఒప్పందాలను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఆగస్టు 10వ తేదీన జరిగే 'జైల్ భరో' కార్యక్రమంలో క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో విజయవంతం చేయటానికి వేల సంఖ్యలో పాల్గొనాల్సిందిగా అన్ని విభాగాలకు చెందిన ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నాం.

**సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కెఎం)**
**కార్మిక సంఘాల ఐక్యవేదిక, తెలంగాణ రాష్ట్రం**

# చిన్న కాంట్రాక్టర్లపై మైనింగ్ పెనాల్టీల వేధింపులు ఆపాలి

- రూ.5 కోట్ల పనికి రూ.54 కోట్ల జరిమానా విధించడం దుర్మార్గం: మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి
- హ్యామ్‌రోడ్ల నిర్మాణానికి 'గ్రీన్ చానల్' ఏర్పాటు చేయాలని ఆదేశం



**ప్రజాపక్షం/హైదరాబాద్:** మైనింగ్ నిబంధనల పేరుతో చిన్న కాంట్రాక్టర్లపై భారీ పెనాల్టీలు విధిస్తూ వేధించడం సరికాదని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి స్పష్టం చేశారు. రూ.5 కోట్ల విలువైన పనికి రూ.54 కోట్ల పెనాల్టీ విధించడం దుర్మార్గమని ఆయన తీవ్రంగా విమర్శించారు. అక్రమ మైనింగ్ చేసే వారిని వదిలేసి ప్రభుత్వ అభివృద్ధి పనులు చేపడుతున్న చిన్న కాంట్రాక్టర్లను లక్ష్యంగా చేసుకోవడం ఆమోదయోగ్యం కాదని హెచ్చరించారు. సచివాలయంలో మైనింగ్ శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామితో కలిసి మైనింగ్ సమస్యలు, రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న రోడ్ల నిర్మాణ పనులపై శుక్రవారం సమీక్ష నిర్వహించారు. సమావేశంలో ఎమ్మెల్సీ దామోదర్‌రెడ్డి, ఎమ్మెల్యే మేఘారెడ్డి, టిజిఎండిసి ఎండి అనుదీప్ దురిశెట్టి, ఆర్అండ్‌బీ అధికారులు, మైనింగ్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు. సమావేశంలో కాంట్రాక్టర్లు ఎదుర్కొంటున్న సమస్యలను మంత్రుల దృష్టికి తీసుకువచ్చారు. ముఖ్యంగా మెటల్ పర్మిషన్ల జాప్యం, నిర్మాణ సామగ్రి కొరత, భారీ పెనాల్టీల కారణంగా పనులు నిలిచిపోతున్నాయని వివరించారు. ఈ సందర్భంగా మంత్రి కోమటిరెడ్డి మాట్లాడుతూ, కాంట్రాక్టర్లు ప్రభుత్వంతో చేసుకున్న ఒప్పందాల మేరకు పనులు నిర్వహిస్తున్నారని, నిర్మాణ సామగ్రి విషయంలో వారిని అనవసరంగా ఇబ్బందులకు గురిచేయకూడదని అధికారులకు సూచించారు. మైనింగ్ అధికారుల వేధింపుల నేపథ్యంలో కాంట్రాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి ఆత్మహత్యకు కారణమైన అధికారిపై సమగ్ర విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ (హ్యామ్) రోడ్ల నిర్మాణ పనులు 2028 ఆగస్టు నాటికి పూర్తిచేయడమే లక్ష్యమని మంత్రి తెలిపారు. ఈ పనులకు అవసరమైన మెటల్, మట్టి, ఇసుక వంటి నిర్మాణ సామగ్రి కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని, మెటల్ పర్మిషన్ల మంజూరులో జాప్యం లేకుండా ప్రత్యేక 'గ్రీన్ చానల్' ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. మైనింగ్ శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ, రాష్ట్ర అభివృద్ధికి చేపడుతున్న మౌలిక వసతుల పనులకు మైనింగ్ శాఖ పూర్తి సహకారం అందిస్తుందని హామీ ఇచ్చారు. కాంట్రాక్టర్లు ఎదుర్కొంటున్న సమస్యలను పరిశీలించి నిబంధనల మేరకు పరిష్కరిస్తామని, రోడ్ల నిర్మాణానికి అవసరమైన నిర్మాణ సామగ్రి సకాలంలో అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. రాష్ట్ర అభివృద్ధిలో రహదారుల నిర్మాణం కీలకమని, ఈ పనులకు మైనింగ్ సంబంధిత సమస్యలు ఆటంకంగా మారకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఇరువురు మంత్రులు అధికారులను ఆదేశించారు.

# నరుడికి నాగరికత నేర్పింది నేతన్నే

- మంత్రి సీతక్క
- పీపుల్స్ ప్లాజాలో ఘనంగా జాతీయ చేనేత దినోత్సవ వేడుకలు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** చేనేత రంగానికి మరింత గౌరవం అందించడం, నేతన్నలకు నిరంతర ఉపాధి కల్పిస్తూ చేనేత ఉత్పత్తులకు విస్తృత మార్కెట్ సృష్టించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ దానసరి అనసూయ సీతక్క అన్నారు. వ్యవసాయం, చేనేత రంగాలు తమ ప్రభుత్వానికి రెండు కళ్లలాంటివన్నారు. జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా హైదరాబాద్ నెక్లెస్ రోడ్‌లోని పీపుల్స్ ప్లాజాలో రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన వేడుకలకు మంత్రి సీతక్క ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, చేనేత అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ దూడెం వెంకటరమణ, మాజీ ఎంపి గుండు సుధారాణిలతో కలిసి పీపుల్స్ ప్లాజాలో ఏర్పాటు చేసిన చేనేత ఎగ్జిబిషన్‌ను ప్రారంభించారు. ఎగ్జిబిషన్‌లోని వివిధ రకాల చేనేత వస్త్రాలను పరిశీలించిన మంత్రి సీతక్క, స్వయంగా మగ్గం నేసి నేతన్నల నైపుణ్యాన్ని అభినందించారు. అనంతరం చేనేత కళాకారులను, ప్రముఖులను శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ మనిషి వస్త్రాన్ని నేయడం, ధరించడం ప్రారంభించినప్పుడే నాగరిక సమాజానికి నాంది పడిందని, అందుకే నరుడికి నాగరికత నేర్పింది నేతన్నలేనని కొనియాడారు. చేనేత కేవలం ఒక వృత్తి కాదని, మన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అని అన్నారు. చేనేత రంగాన్ని కేవలం సంక్షేమ కోణంలోనే కాకుండా ఆర్థికాభివృద్ధి, సాంస్కృతిక పరిరక్షణ కోణంలో ప్రభుత్వం చూస్తోందన్నారు.

**ప్రభుత్వ మద్దతు రూ.1,300 కోట్ల నిధులు**

నేతన్నల సంక్షేమం కోసం ప్రభుత్వం ఇప్పటికే సుమారు రూ.1,300 కోట్ల నిధులను వెచ్చించిందని సీతక్క వెల్లడించారు. ఏడాది పొడవునా వేలాది కుటుంబాలకు ఉపాధి లభించేలా ప్రతి సంవత్సరం కోట్ల రూపాయల విలువైన ఇందిరమ్మ చీరల ఆర్డర్లను అందిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల యూనిఫామ్ వస్త్రాన్ని చేనేత కార్మికుల నుంచే కొనుగోలు చేస్తూ బలమైన మార్కెట్ కల్పిస్తున్నామని చెప్పారు. గతంలో పేరుకుపోయిన నేతన్నల బకాయిలను విడతలవారీగా చెల్లిస్తున్నామని మంత్రి చెప్పారు.

**వారంలో రెండు రోజులు చేనేత ధరించాలి**

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ప్రజలందరూ వారంలో కనీసం రెండు రోజులైనా చేనేత వస్త్రాలు ధరించాలని విజ్ఞప్తి చేశారు. పండుగలు, శుభకార్యాల్లో కనీసం ఒక చేనేత వస్త్రాన్ని కొనుగోలు చేసి నేతన్నల కుటుంబాలకు అండగా నిలవాలని కోరారు. ఒక చేనేత వస్త్రాన్ని కొనుగోలు చేయడం అంటే నేతన్న జీవితాల్లో వెలుగులు నింపడమేనని మంత్రి పిలుపునిచ్చారు.

# పెట్టుబడులకు తెలంగాణే గమ్యస్థానం

- బే ఏరియా పారిశ్రామికవేత్తలకు డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క పిలుపు
- కొత్త ఆలోచనలతో రండి.. ప్రభుత్వంతో కలిసి నడవండి
- డిప్యూటీ సిఎం గౌరవార్థం భారత కాన్సుల్ జనరల్ ప్రత్యేక విందు
- అమెరికా పర్యటనలో ప్రవాస భారతీయులతో సమావేశం



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** పెట్టుబడులు, వ్యాపార విస్తరణకు తెలంగాణ రాష్ట్రాన్ని తమ తొలి ప్రాధాన్యతగా ఎంచుకోవాలని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అమెరికాలోని పారిశ్రామికవేత్తలు, ప్రవాస భారతీయులకు పిలుపునిచ్చారు. అమెరికా పర్యటనలో ఉన్న ఆయన గౌరవార్థం శాన్ ఫ్రాన్సిస్కోలో భారత కాన్సుల్ జనరల్ కె.శ్రీకర్ రెడ్డి ప్రత్యేక విందు ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి బే ఏరియాలోని ప్రముఖ ప్రవాస భారతీయులతో పాటు ఐటి, వైద్య, మానవ వనరులు, ఇతర వ్యాపార రంగాలకు చెందిన విశిష్ట నాయకులు హాజరయ్యారు. సమావేశంలో భట్టి విక్రమార్క ప్రసంగిస్తూ తెలంగాణ ప్రభుత్వ భవిష్యత్ కార్యాచరణను, పెట్టుబడులకు ఉన్న అనుకూలతలను వివరించారు. ఐటి, ఆవిష్కరణల్లో హైదరాబాద్ అగ్రగామి టెక్నాలజీ, ఇన్నోవేషన్, లైఫ్ సైన్సెస్, గ్లోబల్ సర్వీసెస్ రంగాలలో భారతదేశపు ప్రముఖ కేంద్రాలలో ఒకటిగా హైదరాబాద్ ఎదుగుతోందని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఈ వృద్ధి వేగాన్ని ఇలాగే కొనసాగిస్తూనే, అభివృద్ధి చెందుతున్న సరికొత్త రంగాల్లో పెట్టుబడులు, ఉపాధి అవకాశాల కోసం కొత్త పునాదులు వేయడానికి తెలంగాణ ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. తమ ప్రభుత్వం పారదర్శకమైన, పెట్టుబడులకు అనుకూలమైన ప్రగతిశీల అభివృద్ధి నమూనాను అనుసరిస్తోందన్నారు.

నైపుణ్యం కలిగిన మానవ వనరులు, అత్యుత్తమ మౌలిక సదుపాయాలు, అభివృద్ధి చెందుతున్న పారిశ్రామిక పర్యావరణ వ్యవస్థ, జవాబుదారీతనం కలిగిన పరిపాలన తెలంగాణ సొంతమని ఆయన వివరించారు. కొత్త ఆలోచనలను సంస్థలుగా మార్చడంలో, నాణ్యమైన ఉపాధిని సృష్టించడంలో రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి అడుగులు వేయాలని పారిశ్రామికవేత్తలను ఆయన ఆహ్వానించారు.

**దేశ ప్రగతిలో భాగస్వాములు కావాలి**

సభికులకు కాన్సుల్ జనరల్ శ్రీకర్ రెడ్డి స్వాగతం పలుకుతూ ప్రవాస భారతీయులు, ప్రభుత్వాల మధ్య సంబంధాలను బలోపేతం చేసుకోవాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పారు. భారత దేశంలో సమ్మిళిత ఆర్థిక, సామాజిక అభివృద్ధికి దోహదపడుతూనే, ప్రవాసులకు సైతం ప్రయోజనం చేకూర్చేలా బలమైన భాగస్వామ్యాలను అన్వేషించాలని వ్యాపార వర్గాలను కోరారు. సమావేశం అనంతరం పెట్టుబడులు, సాంకేతిక సహకారం, నైపుణ్యాభివృద్ధి, ఆరోగ్య సంరక్షణ, ఆవిష్కరణలు తదితర అంశాలపై ఎన్ఆర్ఐ, బే ఏరియా ప్రతినిధులు తమ అభిప్రాయాలను పంచుకున్నారు. కార్యక్రమంలో సింగరేణి సిఎండి జ్యోతి బుద్ధ ప్రకాష్, డిప్యూటీ సిఎం స్పెషల్ సెక్రటరీ కృష్ణ భాస్కర్, ఐఓసి నాయకులు హనుమాండ్ల ఝాన్సీ రెడ్డి తదితరులు ఉన్నారు.

# సిపిఐ కార్యదర్శులతో క్యూబా రాయబారి భేటీ



**న్యూఢిల్లీ:** క్యూబాలో శుక్రవారం ప్రారంభం కానున్న 24వ అంతర్జాతీయ కమ్యూనిస్టు, వర్కర్స్ పార్టీల సమావేశంలో పాల్గొనేందుకు వెళ్తున్న సిపిఐ జాతీయ కార్యదర్శులు కె.రామకృష్ణ, రామకృష్ణ పాండాను ఢిల్లీలో క్యూబా రాయబారి జువాన్ కార్లోస్ అగ్యిలేరా, క్యూబా రాయబార కార్యాలయ ప్రథమ కార్యదర్శి లూపే ఫ్రోమెటా గురువారం మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా భారత్ క్యూబా మధ్య చిరకాలంగా కొనసాగుతున్న స్నేహ సంబంధాలు, పరస్పర సహకారం, ప్రస్తుత అంతర్జాతీయ పరిణామాలు, ప్రపంచ శాంతి, సంఘీభావ ఉద్యమాలు తదితర అంశాలపై వారు చర్చించారు. క్యూబా ప్రజలతో భారత ప్రజలకు, భారత కమ్యూనిస్టు ఉద్యమానికి ఉన్న చారిత్రక స్నేహబంధాన్ని పార్టీ జాతీయ కార్యదర్శులు గుర్తు చేసుకున్నారు. భారత్ క్యూబా ప్రజల మధ్య మైత్రి, సంఘీభావం మరింత బలోపేతం కావాలని ఆకాంక్షించారు. క్యూబా విప్లవ చారిత్రక నాయకుడు ఫిడెల్ క్యాస్ట్రో విప్లవ వారసత్వాన్ని పరిరక్షించడం, సోషలిస్టు క్యూబాకు అంతర్జాతీయ సంఘీభావాన్ని మరింత బలోపేతం చేయడం, ప్రపంచ శాంతి కోసం ఉమ్మడి కార్యాచరణను విస్తరించడం, సామ్రాజ్యవాద దాడులకు వ్యతిరేకంగా కమ్యూనిస్టు, వర్కర్స్ పార్టీల ఐక్యతను పటిష్టం చేయడం ప్రధాన లక్ష్యాలుగా ఈనెల 7,8 తేదీల్లో హవానాలో 24వ అంతర్జాతీయ కమ్యూనిస్టు, వర్కర్ల పార్టీల సమావేశం జరుగుతుందని క్యూబా నుంచి రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుత అంతర్జాతీయ పరిస్థితుల్లో దేశాల సార్వభౌమాధికారం, స్వాతంత్ర్యం, ప్రజల స్వయం నిర్ణయాధికారాన్ని పరిరక్షించేందుకు కమ్యూనిస్టు, వర్కర్ల పార్టీల మధ్య ఐక్యత, సంఘీభావం, పరస్పర సహకారం మరింత అవసరమని ఆయన పేర్కొన్నారు. ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న అసమానతలు, దోపిడీ, యుద్ధ ప్రమాదాలు, తీవ్ర మితవాదం, ఫాసిస్టు ధోరణులకు వ్యతిరేకంగా ఉమ్మడి పోరాటాలను బలోపేతం చేసేందుకు హవానా సమావేశం దోహదపడుతుందని తెలిపారు. ఫిడెల్ క్యాస్ట్రో ఆలోచనలు నేటికీ అత్యంత ప్రాసంగికమైనవని అభిప్రాయపడ్డారు. ఆయన సామ్రాజ్యవాద వ్యతిరేక, మానవతావాద, అంతర్జాతీయవాద దృక్పథం ప్రపంచ శాంతి, సామాజిక న్యాయం కోసం కొనసాగుతున్న పోరాటాలకు నేటికీ స్ఫూర్తిదాయకమని వివరించారు. క్యూబా కమ్యూనిస్టు పార్టీకి, క్యూబా ప్రజలకు ప్రపంచవ్యాప్తంగా ప్రజాస్వామ్య, ప్రగతిశీల శక్తులు సంపూర్ణ సంఘీభావం ప్రకటించాలని పిలుపునిచ్చారు. క్యూబాపై అమెరికా ప్రభుత్వం అమలు చేస్తున్న ఆర్థిక, వాణిజ్య, ఆర్థిక వ్యవహారాలు, ఇంధన రంగానికి సంబంధించిన ఆంక్షలపైనా ఈ అంతర్జాతీయ సమావేశంలో చర్చించి తగిన నిర్ణయాలు తీసుకుంటామని తెలిపారు. క్యూబాపై ఆంక్షలను ఎత్తివేయడంతో పాటు, ఉగ్రవాదాన్ని ప్రోత్సహించే దేశాల జాబితా నుంచి క్యూబాను తొలగించాలని డిమాండ్ చేశారు.

# అవినీతి నిర్మూలనే లక్ష్యం

- పారదర్శక పాలనకు ఉద్యోగులు కట్టుబడి ఉండాలి: జిఎం సంజయ్‌కుమార్
- సంస్థల్లో స్వీయ బలోపేతంపై దక్షిణ మధ్య రైల్వే విజిలెన్స్ అవగాహన




**ప్రజాపక్షం/హైదరాబాద్:** సంస్థల్లో అవినీతికి తావులేకుండా పారదర్శకమైన పనితీరు, నైతిక విలువలతో కూడిన వ్యవస్థను బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ పేర్కొన్నారు. అవినీతి నిరోధం అనేది కేవలం విజిలెన్స్ విభాగం బాధ్యత మాత్రమే కాదని, ప్రతి రైల్వే ఉద్యోగి తన విధుల్లో విజిలెన్స్ అధికారిగా వ్యవహరించాల్సిన బాధ్యత ఉందని ఆయన స్పష్టం చేశారు. దక్షిణ మధ్య రైల్వే విజిలెన్స్ బ్రాంచ్, సికింద్రాబాద్‌లోని ఇండియన్ రైల్వేస్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్ (ఇరిఫెమ్) సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం రైల్ నిలయం ఆడిటోరియంలో 'సంస్థల్లో అవినీతి నిర్మూలనే ధ్యేయంగా స్వీయ బలోపేతం' అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య వక్తగా దక్షిణ రైల్వే మాజీ ప్రిన్సిపల్ చీఫ్ కమర్షియల్ మేనేజర్, దక్షిణ మధ్య రైల్వే మాజీ చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ డాక్టర్ జె.విజయన్ పాల్గొని అవినీతి రూపాలు, వ్యక్తిగత, సంస్థాగత అవినీతి మధ్య తేడాలు, అవినీతి నివారణకు అవసరమైన చర్యలపై సమగ్రంగా వివరించారు. తన రచన 'ఎథిక్స్ అండ్ కరప్షన్ – యాన్ ఇంట్రడక్షన్'లో పొందుపరిచిన అంశాలను ప్రస్తావిస్తూ నైతిక విలువలను పెంపొందించాల్సిన అవసరాన్ని వివరించారు. సీనియర్ డిప్యూటీ జనరల్ మేనేజర్ ఆశిష్ మెహ్రోత్రా మాట్లాడుతూ, అవినీతి నిరోధం, నైతిక విలువల పరిరక్షణ కోసం దక్షిణ మధ్య రైల్వే విజిలెన్స్ శాఖ నిరంతరం అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తోందని తెలిపారు. ప్రస్తుత ఉపన్యాసం కూడా సంస్థాగత సామర్థ్యాన్ని పెంపొందించే దిశగా మరో కీలక అడుగుగా అభివర్ణించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యాలయం, సికింద్రాబాద్, హైదరాబాద్ డివిజన్లకు చెందిన ఉన్నతాధికారులు, శాఖాధిపతులు, డివిజనల్ రైల్వే మేనేజర్లు, అధికారులు, ఉద్యోగులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం నిర్వహించిన ముఖాముఖి చర్చలో పాల్గొన్న అధికారులు, ఉద్యోగులు పారదర్శక పనితీరు, నైతిక ప్రమాణాల పరిరక్షణ, ఉత్తమ పరిపాలనా విధానాలపై విలువైన సూచనలు, అవగాహన పొందారు.

## మళ్లీ సమీక్షించడం సరికాదు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్రంలోని ఏడు ప్రాజెక్టులకు కేంద్రం ఇప్పటికే చట్టబద్ధంగా అనుమతులను ఇచ్చినప్పటికీ, మళ్లీ వాటిని 'గోదావరి నదీ యాజమాన్య బోర్డు' (జిఆర్ఎంబి) సమీక్షించడం సరికాదని, దీనిని వెంటనే ఉపసంహరించుకోవాలని బిఆర్ఎస్ఎల్‌పి ఉప నాయకుడు తన్నీరు హరీశ్‌రావు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు కేంద్రజలశక్తి మంత్రి, కార్యదర్శికి హరీశ్‌రావు శుక్రవారం లేఖ రాశారు. జిఆర్ఎంబి సమావేశ ఏజెండాలో ఉన్న ఏడు ప్రాజెక్టుల సమీక్ష అంశాన్ని తొలగించే విధంగా జిఆర్ఎంబిని ఆదేశించాలని, పెండింగ్‌లో ఉన్న సమ్మక్క సాగర్ ప్రాజెక్ట్‌కు అనుమతులను తక్షణమే మంజూరు చేయాలని కేంద్ర మంత్రిని కోరారు. తెలంగాణ రాష్ట్ర న్యాయమైన నీటి హక్కులను కాపాడేందుకు ఎపి పునర్విభజన చట్టం 2014, సెక్షన్ 85 కింద తక్షణమే జోక్యం చేసుకోవాలని ఆ లేఖలో పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టులకు సంబంధించిన సాంకేతిక, హైడ్రోలాజికల్, ఇంజనీరింగ్, పర్యావరణ, చట్టపరమైన అంశాలను కేంద్ర జల సంఘం(సి డబ్ల్యు సి), జలశక్తి మంత్రిత్వ శాఖలు క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతే టెక్నికల్ అడ్వైజరీ కమిటీ(టిఎసి) ఆమోదం తెలిపిందని హరీశ్‌రావు గుర్తుచేశారు. కేంద్ర ప్రభుత్వ అత్యున్నత సంస్థలు చట్టబద్ధంగా అనుమతులు ఇచ్చిన తర్వాత, మళ్లీ ఆ నిర్ణయాలను సమీక్షించే, లేదా ఆ అనుమతులను రద్దు చేసే అధికారం గోదావరి బోర్డుకు ఏమాత్రం ఉండబోదని ఆయన స్పష్టం చేశారు. జలశక్తి మంత్రిత్వ శాఖ తీసుకున్న నిర్ణయాలను మళ్లీ సమీక్షించేందుకు జిఆర్ఎంబీకి అవకాశం కల్పిస్తే, అది కేంద్ర ప్రభుత్వ సంస్థల ప్రాధాన్యతను తగ్గించినట్లుగా ఉంటుందని ఆందోళన వ్యక్తం చేశారు. గతంలో కేంద్రప్రభుత్వం నిర్వహించిన రెండో అపెక్స్ కౌన్సిల్ సమావేశంలోనూ ఈ విషయాలు స్పష్టమయ్యాయని, బేసిన్ పరిధిలోని ప్రాజెక్టుల అవసరాలు తీరిన తర్వాతనే, ఇంటర్‌బేసిన్‌కు నీటి మళ్లింపు జరగాలని ఆ సమావేశంలో రికార్డు చేసినట్టు స్పష్టం చేశారు. కేంద్ర మంత్రి తక్షణమే స్పందించి ఎజెండాలోని వివాదాస్పద అంశాలను తొలగించాలని, జలశక్తి శాఖ,సీడబ్ల్యూసీ ఇచ్చిన అనుమతులను గోదావరి బోర్డు మళ్లీ సమీక్షించకుండా చూడాలని హరీశ్‌రావు విజ్ఞప్తి చేశారు.

# చేనేత రంగానికి తీవ్ర అన్యాయం

- సిఎం రేవంత్ రెడ్డికి కెటిఆర్ బహిరంగ లేఖ

**ప్రజాపక్షం/హైదరాబాద్:** కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం చేనేత రంగానికి తీవ్ర అన్యాయం చేస్తోందని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి.రామారావు ఆరోపించారు. ఆల్ ఇండియా హ్యాండ్లూమ్ బోర్డు, హ్యాండీక్రాఫ్ట్స్ బోర్డు, పవర్‌లూమ్ బోర్డులను రద్దు చేయడం, హౌస్ కమ్ వర్క్‌షెడ్ వంటి పథకాలను ఎత్తివేయడం, చేనేత ఉత్పత్తులపై 5 శాతం జిఎస్‌టి విధించడం వంటి నిర్ణయాలు చేనేతరంగాన్ని తీవ్రంగా దెబ్బతీశాయన్నారు. ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ చేనేత కార్మికులకు ఇచ్చిన హామీల్లో ఏ ఒక్కటీ కూడా అమలు కాలేదని, వెంటనే అన్ని పథకాలను పునరుద్ధరించి, నేతన్నలకు భరోసా కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు సిఎం రేవంత్‌రెడ్డికి కెటిఆర్ శుక్రవారం బహిరంగ లేఖ రాశారు.

తెలంగాణ సంస్కృతి, అస్తిత్వానికి వెన్నెముకగా నిలిచిన చేనేత కార్మికుల పరిస్థితి కాంగ్రెస్ పాలనలో తీవ్రంగా దిగజారిందన్నారు. బిఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో అమలైన 'నేతన్న బీమా' నేతన్నకు చేయూత' వంటి అనేక సంక్షేమ పథకాలను నిలిపివేసి, నేతన్నలను తీవ్ర ఇబ్బందుల్లోకి నెట్టారని ఆరోపించారు. చేనేత కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించే విధానాలు అమలు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందని పేర్కొన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం, రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం రెండూ కలిసి చేనేత రంగాన్ని సంక్షోభం వైపు నెడుతున్నాయన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కెసిఆర్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన చేనేత సంక్షేమ పథకాలను ఒక్కొక్కటిగా నిలిపివేసిందన్నారు.చేనేత సహకార సంఘాలకు ఇవ్వాల్సిన పావలా వడ్డీ రుణాలు, మార్కెటింగ్ రిబేట్లు నిలిచిపోయాయని, బతుకమ్మ చీరలు, ప్రభుత్వ యూనిఫారాల వంటి ప్రభుత్వ ఆర్డర్లలో నేతన్నలకు గతంలో ఇచ్చిన ప్రాధాన్యతను తగ్గించారని ఆరోపించారు. రాష్ట్రంలోని నేతన్నల తరపున ప్రభుత్వం తక్షణమే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. చేనేత కళాకారుల కోసం ప్రత్యేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను యుద్ధప్రాతిపదికన అమలు చేయాలని, గతంలో రద్దు చేసిన అన్ని పథకాలను పునరుద్ధరించాలని సిఎంకు రాసిన లేఖలో కోరారు.

# భవన నిర్మాణ కార్మికుల హెల్త్‌టెస్ట్‌లు వెంటనే రద్దు చేయాలి

- సహజ మరణానికి రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా, పెన్షన్ అమలు చేయాలని ఎఐటియుసి డిమాండ్




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** భవన నిర్మాణ కార్మికులకు ఎలాంటి ప్రయోజనం చేకూర్చని సిఎస్‌సి సంస్థ ద్వారా నిర్వహిస్తున్న హెల్త్ టెస్టులను ప్రభుత్వం తక్షణమే రద్దు చేయాలని ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.బాలరాజు డిమాండ్ చేశారు. కార్మికుల సంక్షేమానికి ఉపయోగపడే పథకాలను అమలు చేయకుండా అనవసర నిబంధనలతో ఇబ్బందులకు గురిచేయడం సరికాదని ఆయన అన్నారు. హైదరాబాద్‌లోని హిమాయత్‌నగర్‌లోని ఎఐటియుసి కార్యాలయంలో తెలంగాణ బిల్డింగ్, కన్స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కౌన్సిల్ సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎస్.బాలరాజు మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికులకు సహజ మరణం సంభవించినా రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, కార్మికులకు పెన్షన్ సౌకర్యాన్ని కల్పించాలని కోరారు. ప్రైవేట్ ఏజెన్సీల ద్వారా నిర్వహిస్తున్న క్లెయిమ్‌ల వ్యవస్థను పూర్తిగా రద్దు చేసి, సంక్షేమ బోర్డు ద్వారానే పారదర్శకంగా క్లెయిమ్‌ల పరిష్కారం చేపట్టాలని సూచించారు. ఎన్నో పోరాటాల ద్వారా సాధించుకున్న కార్మిక చట్టాలను బిజెపి ప్రభుత్వం పెట్టుబడిదారులకు అనుకూలంగా మార్చి కార్మికుల హక్కులను హరిస్తోందని ఆయన ఆరోపించారు. ఎఐటియుసి రాష్ట్ర డిప్యూటీ జనరల్ సెక్రటరీ ఎం. నరసింహ మాట్లాడుతూ సెప్టెంబర్ 6, 7, 8 తేదీల్లో కరీంనగర్‌లో జరిగే ఎఐటియుసి రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్మికుల హక్కుల పరిరక్షణ కోసం ఎఐటియుసి నిరంతరం పోరాడుతుందని స్పష్టం చేశారు. భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లా దేవేందర్ రెడ్డి మాట్లాడుతూ సంక్షేమ పథకాల అమలులో కార్మిక శాఖ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. సమావేశానికి భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎం.ప్రవీణ్ కుమార్ అధ్యక్షత వహించారు. ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి ఎండి ఇమ్రాన్, భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి కమతం యాదగిరితో పాటు జి.రాజు, ఎస్.మల్లేష్, కె.నరసింహారెడ్డి, కె.వెంకటేష్, పిట్టల సమ్మయ్య, ఎం.గోవర్ధన్, శివలింగం కృష్ణ, దుబ్బాస్ రాములు, ఎం.కృష్ణ, కె.రాఘవరెడ్డి, ఎం.శివశంకర్, కోరే కృష్ణ, బి.మల్లేష్, బి.సురేష్‌బాబు, ఆర్. కుమార్, డి.సర్దార్, సిహెచ్.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రంలో మోస్తరు వర్షాలు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలో రానున్న వారం రోజుల పాటు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం అధికారులు అధికారులు తెలిపారు. శనివారం నుంచి శుక్రవారం వరకు రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో వర్షాలు కొనసాగనున్నాయన్నారు. శనివారం ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. అదే సమయంలో ఆదిలాబాద్, కుమురంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, ములుగు, భద్రా ద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్లగొండ, సూర్యాపేట, జనగాం, సిద్ధిపేట, యాదా ద్రి భువనగిరి జిల్లాల్లో ఉరుములు, మెరుపులు,గంటకు 30–40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురిసే అవకాశముందన్నారు.

**యల్లంపేట్ మున్సిపాలిటీ కార్యాలయం, మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా.**
mcyellampet2025@gmail.com

క్ర.సం. 1, **NIT No.** E1/09/2026-27. **వివరణ:** MCY (02)లో కొంత పనిని చేపట్టడం జరిగింది, **అంచనా విలువ:** రూ.100.00 లక్షలు, **బిడ్స్ స్వీకరణకు ప్రారంభ తేదీ / ఆఖరి తేదీ & సమయం:** డౌన్‌లోడ్ ప్రారంభ తేది: 07.08.2026 సా.5.00గం.లకు, బిడ్ స్వీకరణకు ఆఖరి తేదీ & సమయం: 19.08.2026 సా.5.00గం.ల వరకు. మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండర్ ప్లాట్‌ఫారం అనగా https://tender.telangana.gov.inలో చూడవచ్చు లేదా యల్లంపేట్ మున్సిపల్ కార్యాలయంలో సంప్రదించవచ్చు.

సం/- కమిషనర్,
యల్లంపేట్ మున్సిపాలిటీ.

DIPR R.O. No. : 7590-PP/CL/ADVT/2026-27, Date: 07-08-2026

**GHMC గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్**
ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కార్యాలయం, జల్‌పల్లి సర్కిల్-17, జల్‌పల్లి, హైదరాబాద్.
ఇ-మెయిల్: eec17.jalpally@gmail.com

**కొటేషన్ నోటీసు**

కొటేషన్ నోటీసు నెం. EE/JLPY/GHMC/2026-2027/02 Dt. 06.08.2026

ప్రతిష్ఠాత్మక సంస్థల నుండి సీల్డ్ కొటేషన్లు ఆహ్వానించబడుతున్నాయి. వీటిని 11-08-2026 మధ్యాహ్నం 12:00 గంటలలోపు లేదా అంతకంటే ముందుగా దిగువ సంతకం చేసిన అధికారికి అందజేయాలి. కొటేషన్లు 11-08-2026 మధ్యాహ్నం 12:00 గంటల వరకు స్వీకరించబడతాయి మరియు అదే రోజు మధ్యాహ్నం 12:30 గంటలకు తెరవబడతాయి. ఇతర వివరాలను కార్యాలయ వేళల్లో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నుండి పొందవచ్చు.

| క్ర.సం. | అంశం వివరాలు | పరిమాణం | యూనిట్ | మొత్తం |
|---|---|---|---|---|
| 1. | పెద్ద టెంట్లు ఏర్పాటు (అద్దె ప్రాతిపదికన) | 1 | ఒక్కొక్కటి | |
| 2. | సైడ్ వాల్స్ ఏర్పాటు (అద్దె ప్రాతిపదికన) | 1 | ఒక్కొక్కటి | |
| 3. | ఫైబర్ కుర్చీల అద్దె ఛార్జీలు | 1 | ఒక్కొక్కటి | |
| 4. | చౌకీ అద్దె ఛార్జీలు | 1 | ఒక్కొక్కటి | |
| 5. | టేబుల్ అద్దె ఛార్జీలు | 1 | ఒక్కొక్కటి | |
| 6. | వాటర్ క్యాన్ల సరఫరా (అద్దె ప్రాతిపదికన) | 1 | ఒక్కొక్కటి | |
| 7. | మైక్ సెట్ ఏర్పాట్లు | 1 | ఒక్కొక్కటి | |
| 8. | డే లైట్స్ ఏర్పాటు (అద్దె ప్రాతిపదికన) | 1 | ఒక్కొక్కటి | |
| 9. | బారికేడింగ్ ఏర్పాటు | 1 | చదరపు అడుగు | |
| 10. | ఫ్లెక్సీలు మరియు బ్యానర్ల సరఫరా, డెలివరీ | 1 | చదరపు అడుగు | |
| 11. | జనరేటర్లు 10/30 KVA | 1 | రోజు | |
| 12. | పురుషులు & మహిళల కోసం మొబైల్ టాయిలెట్ (అవసరమైన అన్ని వస్తువులతో సహా) | 1 | యూనిట్ | |
| 13. | స్వీట్ల సరఫరా (ప్యాకింగ్‌తో సహా) | 1 | కిలో | |
| 14. | మిక్చర్ & పేపర్ ప్లేట్ల సరఫరా, డెలివరీ | 1 | కిలో | |
| 15. | ప్రత్యేక స్వీట్ల సరఫరా, డెలివరీ | 1 | కిలో | |
| 16. | పండ్ల సరఫరా, డెలివరీ (అరటిపండ్లు) | 1 | డజను | |
| 17. | జెండా బట్ట (ఖద్దరు), జెండా దారం, రంగులు (తెలుపు, కాషాయం, ఆకుపచ్చ), దోర్నాలు (జెండా), కొబ్బరికాయలు, పసుపు, కుంకుమ, అగ్గిపెట్టెసహా అగర్‌బత్తీలు, ముగ్గు, చెంకీ, థర్మాకోల్, బ్యాచెస్ (సాధారణ & VIP), సుతిలి, తెల్ల రంగు (సున్నం), పూలు, డోర్ అలంకరణ రిబ్బన్లు, జాజు, గమ్ లై, సర్ఫ్ & జెండా ఆవిష్కరణ వేదికకు రంగులు వేయడం వంటివి. | 1 | లంప్-సమ్ (మొత్తం ప్యాకేజీ) | |
| 18. | టీ ఏర్పాట్లు | 1 | ఒక్కొక్కటి | |

**నిబంధనలు:**
1. కొటేషన్లు 11-08-2026 మధ్యాహ్నం 12.00 గంటలలోపు అందాలి. వీటిని అదే రోజు మధ్యాహ్నం 12.30 గంటలకు జిహెచ్ఎంసి, జల్‌పల్లి సర్కిల్-17 కార్యాలయంలో తెరుస్తారు.
2. ఎటువంటి కారణం చూపకుండానే కొటేషన్లను రద్దు చేసే అధికారం జల్‌పల్లి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌కు ఉంటుంది.
3. ఐటమ్స్‌కు సంబంధించిన పూర్తి వివరాల కోసం, దయచేసి జిహెచ్ఎంసి జల్‌పల్లి సర్కిల్ కార్యాలయంలోని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌ను సంప్రదించండి.

టెండర్ నోటీసు ప్రచురణకు సంబంధించిన చెల్లింపును, జిహెచ్ఎంసి యొక్క ప్రస్తుత విధానం ప్రకారం జిహెచ్ఎంసి కమిషనర్ చేస్తారు.

**సంబంధిత అధికారి చిరునామా:**
ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (M)
జల్‌పల్లి సర్కిల్-17,
జిహెచ్ఎంసి, హైదరాబాద్.

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, జల్‌పల్లి సర్కిల్-17,
జిహెచ్ఎంసి.

DIPR R.O. No. : 7541-PP/CL/ADVT/2026-27, Date: 07-08-2026

## డ్రైనేజీ సమస్యలు పరిష్కరించాలి

### రోడ్డుపై నాట్లు వేసి వినూత్న నిరసన



**ప్రజాపక్షం/భూపాలపల్లి:** జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రం లోని ప్రధాన కూడలిలో డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేక నిత్యం నీరు నిలుస్తోందని ఆగ్రహించిన వ్యాపారులు, స్థానిక ప్రజలు శుక్రవారం బురద నీటిలో వరి నాట్లు వేసి వినూత్నంగా నిరసన తెలిపారు. అంబేద్కర్ విగ్రహం నుంచి పోలీస్ స్టేషన్‌కు వెళ్లే ప్రధాన రహదారిపై వర్షం పడిన ప్రతిసారి నీరు నిలిచి రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్య పరిష్కారం కోసం పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినాఎలాంటిచర్యలుతీసుకోలేదని ఆరోపించారు.వెంటనే శాశ్వత డ్రై నేజీ నిర్మించి ప్రజల ఇబ్బందులను తొలగించాలని వారు డిమాండ్ చేశా రు.

## అక్రమ కేసులు ఎత్తివేయాలి



**ప్రజాపక్షం/మహబూబాబాద్:** ఆర్టీసీ ఉద్యమంలో,నల్ల చట్టాలు రద్దు చేయాలని చేసిన ఉద్యమంలోనాడు ప్రభుత్వంపెట్టిన అక్రమ కేసులో భాగంగా నేడు వామపక్ష పార్టీల నేతలు కోర్టుకు హాజరయ్యారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి బి విజయ సారథి, సిపిఎం జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్, సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి గౌనిఐలయ్య మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా వామపక్ష పార్టీల నేతలపై పెట్టిన అక్రమ కేసులు ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆ వైపున కేసులు ఎత్తే సే చర్యలు తీసుకోవాలని, నాడు అధికారంలోకి వచ్చాక కేసులు ఎత్తివేస్తామన్న కాంగ్రెస్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేసులు ఎత్తివేసేందుకు కృషి చేయాలని వారు కోరారు. కోర్టుకు హాజరైన వారిలో వామపక్ష పార్టీల నేతలు బి అజయ్ సారధి రెడ్డి, నల్లు సుధాకర్ రెడ్డి, ఆకుల రాజు, గుణగంటి రాజన్న, హెచ్ లింగ్య నాయక్, సామ పాపయ్య, పెరుగు కుమార్, రేశ పల్లి నవీన్,మామిళ్ల సాంబలక్ష్మి , సమ్మెటరాజమౌళి, తదితరులు హాజరైనారు.

## నాణ్యతగా రోడ్డు పనులు : కలెక్టర్

**ప్రజాపక్షం/పాలకుర్తి:** అంచనాలకు అనుగుణంగా నాణ్యమైన పనులు చేపట్టాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అన్నారు. శుక్రవారం మండలంలోని గూడూరు గ్రామంలోని రెండు పడక గదుల లే అవుట్‌లో చేపట్టిన రోడ్ల నిర్మాణ పనులను ఆయన పరిశీలించి దెబ్బతిన్న రోడ్ల నిర్మాణ పనులను నాణ్యతతో పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా రోడ్డు కొలతలను ప్రత్యక్షంగా పరిశీలించిన కలెక్టర్ కొలతలను తనిఖీ చేశారు. రోడ్ల నిర్మాణానికి రూపొందించిన అంచనాల ప్రకారం పనులు చేపట్టాలని, ఎక్కడా నాణ్యతలో రాజీ పడొద్దని స్పష్టం చేశారు. ఈ పరిశీలనలో గృహ నిర్మాణ శాఖ పీడీ మాతృనాయక్, అధికారులు ప్రవీణ్, చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

**సమీకృత వ్యవసాయ విధానంతో రైతులు అధిక ఆదాయం**

వ్యవసాయంతోపాటు ఫౌల్ట్రీ ఉద్యానవనం, పశుసంవర్ధక వంటి అనుబంధ రంగాలను సమన్వయం చేసుకుంటూ సమీకృత వ్యవసాయ విధానం ఇంటిగ్రేటెడ్ ఫార్మింగ్ చేపడితే రైతులకు ఏడాది పొడవునా ఆదాయం లభిస్తుందని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అన్నారు. శుక్రవారం మండలంలోని గూడూరు గ్రామంలో రైతు సంపత్ నిర్వహిస్తున్న సమీకృత వ్యవసాయ క్షేత్రాన్ని కలెక్టర్ సందర్శించి పంటలు, ఫౌల్ట్రీ యూనిట్‌ను పరిశీలించారు. ఈ పరిశీలనలో డీఏవో అంబికా సోని, కేవీకే శాస్త్రవేత్త రమ్య, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

## సమస్యలు పరిష్కరించాలని ఉపాధ్యాయుల నిరసన




**ప్రజాపక్షం/గోవిందరావుపేట:** మండలంలో సమస్యలు పరిష్కరించాలని ఉపాధ్యాయులు భోజన విరాంత సమయంలో శుక్రవారం నిరసన తెలియజేశారు పి ఆర్ సి ని వెంటనే అమలు చేయాలని పెండింగ్ 6 డీఏలను వెంటనే మంజూరు చేయాలని సిపిఎస్ విధానం రద్దు చేయాలని ఎస్ఎస్ ఏ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని విద్యాశాఖలో పర్యవేక్షణ పోస్టులను భర్తీ చేయాలని రేషనలైజేషన్ జీవో 25 సవరించాని గురుకులాలు మోడల్ స్కూల్ ఉపాధ్యాయులకు 010 కింద వేతనాలు చెల్లించాలని పాఠశాలల కుదింపును మానుకోవాలనే తదితర డిమాండ్ల పరిష్కారం కోసం ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ యు ఎస్ పి సి రాష్ట్ర స్టీరింగ్ కమిటీ పిలుపు మేరకు నాలుగు దశల పోరాటలల్లో భాగంగా జెడ్ పి హెచ్ ఎస్ చల్వాయి ప్రాథమిక పాఠశాల చల్వాయి లో నల్ల బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరై భోజన విరామ సమయంలో నిరసన తెలిపారు ఈ కార్యక్రమంలో ములుగు జిల్లా యు ఎస్ పి సి స్టీరింగ్ కమిటీ సభ్యులు హాట్ కార్ సమ్మయ్య చాపబాబు దొర వాసుదేవ రెడ్డి ఇన్చార్జి ప్రధానోపాధ్యాయులు సోలిపురం చంద్రారెడ్డి సారయ్య సుధాకర్ శ్రీనివాస్ శంకరయ్య వెంకటేష్ అన్నపూర్ణ స్వాతి శ్రీదేవి రమాదేవి అవంతిక మాధవి లత సంజీవరాణి పావని సరితలు పాల్గొన్నారు.

## ప్రభుత్వ హోదాతో ప్రైవేట్ ప్రచారం?

**ప్రజాపక్షం/నెక్కొండ:** ప్రభుత్వ ఆసుపత్రుల్లో సేవలందిస్తున్న కొందరు వైద్యులు తమ ప్రయివేట్ క్లినిక్‌ల బోర్డులపై ప్రొఫెసర్ ఆఫ్ మెడిసిన్..ఎంజిఎంహెచ్/కెఎంసి, గవర్నమెంట్ ఫిజిషియన్ వంటి ప్రభుత్వ హోదాలను ప్రముఖంగా ప్రదర్శించడం ప్రజల్లో చర్చనీయాంశంగా మారింది. ప్రభుత్వ ఉద్యోగిగా ఉన్న విషయాన్ని ప్రయివేట్ క్లినిక్ ప్రచారానికి వినియోగించడం ఎంత వరకు సమంజసమనే ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి. ప్రజలు ప్రభుత్వ వైద్యులకు గౌరవం ఇవ్వడానికి ప్రధాన కారణం వారు ప్రభుత్వ ఆసుపత్రుల్లో అందించే సేవలే. అలాంటప్పుడు అదే హోదాను ప్రయివేట్ వైద్య సేవల ప్రచారానికి ఉపయోగించడం నైతికంగా సరైందేనా అనే సందేహాలు తలెత్తుతున్నాయి. ప్రభుత్వ వైద్యులు తమ విధులను సమర్థంగా నిర్వర్తించడమే కాకుండా ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే ప్రజలకు నాణ్యమైన, ఉచిత వైద్య సేవలు అందించడంపై పూర్తి దృష్టి పెట్టాలని ప్రజలు కోరుతున్నారు. అందువలన ప్రభుత్వ వైద్యులు ప్రజల విశ్వాసాన్ని మరింత బలోపేతం చేసేలా వ్యవహరించాలని, ప్రభుత్వం కూడా ఈ అంశంపై సమగ్ర సమీక్ష నిర్వహించి అవసరమైతే తగిన ఆదేశాలు జారీ చేయాలని ప్రజాభిప్రాయం వ్యక్తమవుతోంది

# చేనేత కార్మికుల సంక్షేమమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం

### వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి



**ప్రజాపక్షం/హనుమకొండ:** చేనేత కార్మికుల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం అని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు.శుక్రవారం జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా జిల్లా చేనేత, జౌళి శాఖ ఆధ్వర్యంలో హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో ఘనంగా నిర్వహించారు.ఈ వేడుకల్లో వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ చేనేత అనేది కేవలం ఒక వృత్తి మాత్రమే కాదని, భారతీయ సంస్కృతి, సంప్రదాయం, కళాత్మక నైపుణ్యానికి ప్రతీక అన్నారు. తెలంగాణలో చేనేత రంగానికి విశిష్టమైన చరిత్ర ఉందని, ముఖ్యంగా వరంగల్ ప్రాంతం దేశవ్యాప్తంగా చేనేత కళకు ప్రత్యేక గుర్తింపు తీసుకువచ్చిందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేనేత కార్మికుల సంక్షేమాన్ని అత్యంత ప్రాధాన్యంగా తీసుకుంటోందని, వారి జీవనోపాధి మెరుగుపడేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటోందని తెలిపారు. చేనేత ఉత్పత్తులకు మార్కెట్ విస్తరణ, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, వినూత్న డిజైన్లు, నైపుణ్యాభివృద్ధి శిక్షణలకు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. అలాగే ముడి సరుకు, రుణ సౌకర్యాలు, బీమా, సంక్షేమ పథకాలు మరింత సమర్థవంతంగా అందేలా ప్రభుత్వం కృషి చేస్తోందని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ చేనేత వస్త్రాలను కొనుగోలు చేసి చేనేత కార్మికులకు అండగా నిలవాలని పిలుపునిచ్చారు. చేనేత కార్మికుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ముఖ్యంగా హనుమకొండ జిల్లాలోని చేనేత కార్మికుల సమస్యలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కోసం కృషి చేస్తానని తెలిపారు. వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలోని చేనేత కార్మికుల అభ్యున్నతికి అవసరమైన మౌలిక సదుపాయాలు, సంక్షేమ కార్యక్రమాల కోసం నిరంతరం కృషి చేస్తానని స్పష్టం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా చేనేత రంగానికి చేయూతనిచ్చే విధంగా డిపిఆర్ తయారుచేసి ఇవ్వాలని, డిపిఆర్ ను సీఎం దృష్టికి తీసుకు వెళ్తానని పేర్కొన్నారు. చేనేత రంగాన్ని పరిరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. చేనేత కార్మికులందరికీ జాతీయ చేనేత దినోత్సవ శుభాకాంక్షలను ఎమ్మెల్యే తెలియజేశారు. ఈ సమావేశంలో జిల్లా ఇన్చార్జి కలెక్టర్ రవి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చేనేత రంగానికి ప్రోత్సాహాన్ని అందిస్తుందన్నారు. ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి సూచించిన విధంగా చేనేత సంఘం ప్రతినిధులు చేనేత సంక్షేమానికి డిపిఆర్ తయారుచేసి అందించాలని తెలియజేశారు. అనంతరం చేనేత కార్మికులను ఘనంగా సన్మానించడంతో పాటు చేనేత రంగంపై నిర్వహించిన వ్యాసరచన పోటీలలో ప్రతిభ కనబర్చిన వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేసి అభినందించి చేనేత వస్త్రాలతో సన్మానించారు.కలెక్టరేట్ ప్రాంగణంలో జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన చేనేత వస్త్రాల విక్రయ స్టాల్ ను సందర్శించి చేనేత చీరను ఎమ్మెల్యే కొనుగోలు చేశారు.ఈ కార్యక్రమంలో చేనేత జౌళి శాఖ రీజినల్ డిప్యూటీ డైరెక్టర్ జయ రాజ్, ఏడీ విజయలక్ష్మి , చేనేత సంఘాల ప్రతినిధులు, చేనేత కార్మికులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## 9న పరకాలలో సిపిఐ పాదయాత్ర



**ప్రజాపక్షం/పరకాల :** ఈ నెల 9న హనుమకొండ జిల్లా పరకాల నియోజకవర్గంలో సిపిఐ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పాదయాత్ర జరుగుతుందని సిపిఐ రాష్ట్ర సమితి సభ్యురాలు మండ సదాల క్ష్మి తెలిపారు. శుక్రవారం పరకాల మండల కేం ద్రంలో సిపిఐ పాదయాత్ర గోడ పత్రికలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మండ సదాలక్ష్మి మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక పాలనకు నిరసనగా చేపట్టిన ఈ పాదయాత్రను మండలంలో విజయవంతం చేయాలని కోరారు. సిపిఐ మండలకార్యదర్శిదుప్పటి సాంబయ్య,మహిళా సమాఖ్యనాయకులుపాల్గొన్నారు.

## ప్రజల మనిషి దుగ్గిరాల వెంకట్రావు: సిపిఐ నేత చాడ

**ప్రజాపక్షం/ఎల్కతుర్తి :** భారత స్వాతంత్ర ఉద్యమంలో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో కీలక పాత్ర పోషించిన మాజీ ఎమ్మెల్యే, మాజీ కర్షక పరిషత్ చైర్మన్, రాయికల్ పోలీస్ స్టేషన్ పై దాడి చేసి భారత స్వాతంత్ర్య ఉద్యమ సెగను చూపిన ప్రజల మనిషి దుగ్గిరాల వెంకట్రావు అని, ఆయన ఆశయ సాధన కోసం కృషి చేద్దామని సిపిఐ మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి అన్నారు.శుక్రవారం ఎల్కతుర్తి మండలంలోని గోపాల్ పూర్ గ్రామంలో దుగ్గిరాల వెంకట్రావు 36వ వర్ధంతి కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సిపిఐ మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి హాజరై దుగ్గిరాల వెంకట్రావు విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఒక విప్లవ యోధులుగా ఈ ప్రాంతంలో దొరల గడీలను కొల్ల గొట్టి అయ్యా నీ బాంచన్ కాల్మొక్త అన్న వెట్టి చాకిరికి వ్యతిరేకంగా ఉద్యమించిన మహానేత దుగ్గిరాల వెంకట్రావు అని చాడా వెంక రెడ్డి కొనియాడారు. వారి గుర్తింపు కోసం మండలాన్ని దుగ్గిరాల వెంకట్రావు గారి పేరు మీద చేస్తే బాగుంటుందని, ప్రజలలో ఉన్న ప్రగడ విశ్వాసాన్ని ఈ ప్రభుత్వం వారి పేరు మీద మండలం తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. హుజురాబాద్ ప్రాంత ప్రజలకు ఒక దిక్సూచి లాగా నిస్వార్థ సేవలు



అందించిన మహానేత దుగ్గిరాల ఆశయ సాధన కోసం కృషి చేయడమే వారికి మనమిచ్చే నివాళులని అన్నారు. సర్పంచ్ కర్రె లక్ష్మి , ఉపసర్పంచ్ మారుపాక సందీప్, దుగ్గిరాల ట్రస్ట్ కమిటీ సభ్యులు కర్రె ముండయ్య, వుట్కూరు సమ్మయ్య, చిదురాల రాజమౌళి, తక్కలపల్లి స్వామి రావు, గడ్డం శంకరయ్య, కంచర్ల వీరస్వామి, పర్ల పెల్లి పృథ్వీరాజ్, వి. భాస్కర్ రత్నాకర్ రావులతో పాటు సిపిఐ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నేదునూరి జ్యోతి, రాష్ట్ర సమితి సభ్యులు ఆదరి శ్రీనివాస్, సదాలక్ష్మి , సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శులు తోట బిక్షపతి, మద్దెల ఎల్లేష్, నాయకులు ఉట్కూరి రాములు, కర్రె లక్ష్మ ణ్, ఎన్ ఎ స్టాలిన్, శనగరపు రాజ్ కుమార్, నెట్టెం నారాయణ, రాయనర్సు, మనోహర్ పాల్గొన్నారు

## సమన్వయంతోనే సమస్యలు పరిష్కారం



**ప్రజాపక్షం/భూపాలపల్లి :** అధికారులు ఇటు ప్రజాప్రతినిధులు సమన్వయంతో పని చేస్తేనే మున్సిపల్ సమస్యలు పరిష్కారం అవుతాయని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. భూపాలపల్లి మున్సిపల్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో మున్సిపల్ చైర్మన్ బుర్ర కొమురయ్య అధ్యక్షతన శుక్రవారం నిర్వహించిన మున్సిపల్ కౌన్సిల్ సర్వసభ్య సమావేశానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యా రు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రజా సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం కట్టుబడి ఉందని, ప్రజా ప్రతినిధులు,అధికారులు ప్రజలకు జవాబు దారితనంగా వ్యవహరించాలని అన్నారు. మున్సిపాలిటీలో నెలకొన్న విద్యుత్ సమస్యలు, ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి, ప్రజారోగ్యం, అటవీ భూముల వివాదాల పరిష్కారంపై ఎమ్మెల్యే గండ్ర సంబంధిత శాఖల అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ప్రభుత్వ ఆసుపత్రిలో మౌలిక వసతుల లోపాలను మరో 15 రోజుల్లో పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. పల్లె దవాఖానల్లో మౌలిక వసతుల కల్పనకు అంచనాలు సిద్ధం చేసి కలెక్టర్‌కు, ఎమ్మెల్యేకు సమర్పించాలని అధికారులను ఆదేశించారు. అన్యాక్రాంతమవుతున్న చెరువు శిఖం భూములను సర్వే నిర్వహించి బౌండరీలు ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులకు ఎమ్మెల్యే ఆదేశించారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ ఉదయ్ కుమార్ వైస్ చైర్మన్ అంబాల శ్రీనివాస్, సింగరేణి జిఎం ఏ.రాజేశ్వర్ రెడ్డి, జిల్లా నాయకులు డిఎం అండ్ హెచ్ఓ మధుసూదన్, భూపాలపల్లి తహసిల్దార్ లక్ష్మీ రాజయ్య, అన్ని శాఖల జిల్లా అధికారులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

## ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యతనివ్వాలి

### డాక్టర్ సయ్యద్ వలి ఉల్లా ఖాద్రీ




**ప్రజాపక్షం/ వరంగల్ :** దేశాన్ని పాలించే ప్రభుత్వాల ప్రధాన బాధ్యత ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచడం, ప్రతి యువకుడికి ఉపాధి, ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్య, ప్రతి కుటుంబానికి అందుబాటు వైద్యం, రైతుకు గిట్టుబాటు ధర, కార్మికుడికి గౌరవప్రదమైన జీవనం, మహిళలకు భద్రత, ప్రజాస్వామ్య హక్కులకు రక్షణ కల్పించడమేనని అఖిల భా రత యువజన సమాఖ్య (ఎఐవైఎఫ్) తెలంగా ణ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ సయ్యద్ వలి ఉల్లా ఖాద్రీ అన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్టలో సెప్టెంబర్ 8, 9, 10 తేదీల్లో జరగనున్న ఎఐవైఎఫ్ తెలంగాణ రాష్ట్ర 3వ మహాసభల ప్రచారంలో భాగంగా వరంగల్ ఎల్‌బినగర్‌లో నిర్వహించిన గోడలపై పోస్టర్ (వాల్ పోస్టర్) ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ సయ్యద్ వలి ఉల్లా ఖాద్రీ మాట్లాడుతూ కమ్యూనిస్టు ఉద్యమం ఎప్పటి నుంచో చెబుతున్నట్లుగా దేశ అభివృద్ధి అంటే కొద్దిమంది సంపద పెరగడం కాదని, ప్రజలందరికీ సమాన అవకాశాలు, సామాజిక న్యాయం, లౌకికత, రాజ్యాంగ విలువలు, శాస్త్రీయ దృక్పథం బలపడటమే నిజమైన అభివృద్ధి అని అన్నారు. ప్రజల పన్నుల డబ్బుతో నిర్మించిన ప్రభుత్వరంగ సంస్థలను పరిరక్షించడం, ఖాళీగా ఉన్న ప్రభుత్వ ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయడం, విద్య, వైద్యాన్ని ప్రజల హక్కులుగా అమలు చేయడం, రైతు, కార్మిక, యువజన ప్రయోజనాలను కాపాడే ప్రజా విధానాలను అవలంబించడం ప్రతి ప్రభుత్వ రాజ్యాంగబద్ధమైన బాధ్యత అని పేర్కొన్నారు. రాష్ట్రంలోని యువత, విద్యార్థులు, ప్రజాస్వామ్యవాదులు మహాసభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎఐవైఎఫ్ వరంగల్ జిల్లా కార్యదర్శి మస్కా సుధీర్, జగదీష్, ఎండి అబ్బు, సునీల్, లక్ష్మి , విజయ తదితరులు పాల్గొన్నారు.

## ప్రత్యామ్నాయ పంటల సాగుతోనే రైతులకు మేలు

**ప్రజాపక్షం/జనగామ :** ప్రత్యామ్నాయ పంటల సాగుతోనే రైతులు మేలు జరుగుతుందని జిల్లా క లెక్టర్ సందీప్‌కుమార్ ఝా అన్నారు. వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని పంటల్ని ఎంపిక చేసుకోవాలన్నారు. శుక్రవారం జిల్లా కలెక్టరేట్‌లో రాష్ట్ర మంత్రులు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి వీ డియో కాన్ఫరెన్స్ నిర్వయించారు. అనంతరం జి ల్లా అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఈ స ందర్భంగా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా మాట్లాడుతూ వాతావరణ శాఖ అంచనాల ప్రకారం రా నున్న నెలల్లో వర్షాపాతం తగ్గే అవకాశాలు ఉన్నాయన్నారు. అందు వలన ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలన్నారు. ఆగస్టు 15 తరువాత వర్షా లు మరింత తగ్గే అవకాశాలు ఉన్నాయని, నీటి ల భ్యత ఆధారంగా ఆసగు ప్రణాళికను వ్యవసా య శాఖ అధికారులు రూపొందించాలన్నారు. విబిజిఆర్ఎఎంజి కార్యక్రమంలో భాగంగా ఈ వర్షాకాలంలో సాధ్యమైనంత ఎక్కువ సంఖ్యలు ఇంకుడు గుంతల నిర్మాణం జరగాలన్నారు. ప్రతి రైతు తమ వ్యవసాయ క్షేత్రంలో ఇంటిగ్రేటెడ్ ఫార్మ్‌ఫాండ్ ఏర్పాటు చేసుకునేలా అధికారులు విస్తృత అవగాహన కల్పించాలన్నారు.నీటి వినియోగంలో సామర్థ్యాన్ని పెంచేందుకు డ్రిప్, స్పింక్లర్స్, వంటి సూక్ష్మ సాగు పద్దతులను ప్రోత్సహించాలన్నారు. ప్రతి రైతు ఒకే పంటపై ఆధారేపడకుండా సమీకృత వ్యవసాయ విధానాలను అవలంభించి, స్థిరమైన ఆదాయాన్ని సాధించే దిశగా మందుగా సాగాలన్నారు. ఈ కార్యక్రమం అమలుకు సంబంధిత శాఖల అధికారులు, గ్రామ సభల ద్వారా ప్రజలకు విస్తృత ప్రచారం చేయాలని, అలాగే నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ




సమావేశంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అంబికా సోని, సిపిఒ చిన కోట్యానాయక్, డిఆర్‌డిఒ భాస్కర్, డిసిఎస్ఒ సురేష్ రెడ్డి, మెప్మా పిడి హర్షవర్ధన్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

**చేనేత కళాకారుల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట**

చేనేత కళాకారుల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా అన్నారు. శుక్రవారం జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా చేనేత, జౌళి శాఖ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని బస్టాండ్ చౌరస్తా వద్ద ఏర్పాటు చేసిన జాతీయ చేనేత దినోత్సవ ర్యాలీని జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం జిల్లా కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో జరిగిన సమావేశంలో మాట్లాడారు. చేనేత వృత్తి వేలాది కుటుంబాలకు జీవనాధారంగా నిలుస్తోందని, చేనేత కళాకారుల శ్రమ, నైపుణ్యాన్ని ప్రతి ఒక్కరు గౌరవించాలని సూచించారు. నేతన్న భీమా పథకం కింద మంజూరైన చెక్కులను కలెక్టర్ పంపిణీ చేశారుచేనేత జౌళి శాఖ ఎడి బాబు, చేనేత సహకార సంఘాల ప్రతినిధులు, చేనేత కార్మికులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

## పేదింటి ఆడబిడ్డలకు అండగా ప్రభుత్వం

### ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి

**ప్రజాపక్షం/పరకాల :** పార్టీలకు అతీతంగా కళ్యాణ లక్ష్మి – షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేస్తున్నామని,కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం పేదింటి ఆడబిడ్డలకు అండగా నిలుస్తోందని పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాష్ రెడ్డి అన్నారు. శుక్రవారం పరకాల పట్టణ కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నందు పరకాల టౌన్,పరకాల, నడి కూడ,దామెర, ఆత్మకూరు మండలాల పరిధిలోని 56 మంది లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి , షాది ముబారక్ చెక్కులనుటిపిసిసి మాజీ ఉపాధ్యక్షులు దొమ్మాటి సాంబయ్యతో కలిసి పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి చెక్కులను పంపిణీ చేస్తున్నామని అన్నారు. ప్రతి కుటుంబం ఆర్థికంగా ఎదగడమే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ లక్ష్యం అని అన్నారు. పేద ప్రజల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తుందని అన్నారు.

**16న సిఎం పర్యటన ఏర్పాట్ల సమీక్ష**

పరకాల నియోజకవర్గంలో ఆగస్టు 16వ తేదీన రాష్ట్ర ముఖ్య



మంత్రి రేవంత్ రెడ్డి పర్యటించనున్న సందర్భంగా చేపట్టిన ఏర్పాట్లను పరకాల శాసనసభ్యుడు రేవూరి ప్రకాశ్ రెడ్డి అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి పరిశీలించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పరకాల నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేయనున్నారని తెలిపారు. ఈ పర్యటనను విజయవంతం చేసేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి అవసరమైన ఏర్పాట్లను పూర్తి చేయాలని ఆదేశించారు.100 పడకల ప్రభుత్వ ఆసుపత్రి, నూతన డిగ్రీ కళాశాల, పరకాల ఇందిరా మహిళా డైరీ,ఎటిసిసెంటర్, తదితర పనులకు ప్రారంభోత్సవం,శంకుస్థాపన చేయనున్నారని అన్నారు.

## మహిళా సాధికారతకు పెద్దపీట

### ఇందిరమ్మ చీరలు పంపిణీ చేసిన ఎమ్మెల్యే కెఆర్ నాగరాజు

**ప్రజాపక్షం/హసన్ పర్తి :** కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా చేయడమే ప్రభుత్వ లక్ష్యమని వర్ధన్నపేట ఎమ్మెల్యే,విశ్రాంత ఐపీఎస్ అధికారి కెఆర్ నాగరాజు అన్నారు.శుక్రవారం ఎర్రగట్టు గుట్ట వెంకటేశ్వర కళ్యాణ మండలంలో 65,66వ డివిజన్లకు చెందిన మహిళలకు ఇందిరమ్మ చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం మహిళల అభ్యున్నతికి అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని.గ్రామీణ,పట్టణ ప్రాంతాల్లో మహిళల జీవిత స్థాయిని మెరుగుపరచడానికి ప్రభుత్వం ప్రత్యేక ప్రయత్నాలు చేస్తోందని ఆయన తెలిపారు.రాష్ట్రంలో మహిళా సాధికారత, స్వయం సహాయక సంఘాల అభివృద్ధి కోసం ఈ పథకాన్ని ప్రభుత్వం చేపట్టిందన్నారు.అర్హులైన పేద మహిళలకు, మహిళా సంఘాల సభ్యులకు ఈ చీరలను అందజేస్తామన్నారు. అర్హులైన ప్రతీ మహిళకు ఇందిరమ్మ చీరలు పంపిణీ అయ్యేలా పారదర్శకంగా, ప్రణాళికాబద్ధంగా కృషి చేయాలని అధికారులకు సూచించారు. కుటుంబ అభ్యున్నతిలో మహిళలే కీలకమని,భవిష్యత్ తరాల బాగు కోసం పిల్లలను చక్కగా చదివించాలని హితువు పలికారు.రేషన్ కార్డులు,ఇందిరమ్మ ఇండ్లు తదితర వాటిని ప్రభుత్వం మహిళల పేరుతోనే మంజూరు చేస్తోందని, మహిళల అభ్యున్నతికి పెద్దపీట వేస్తోందని అన్నారు.కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలనే సంకల్పంతో అనేక కార్యక్రమాలు అమలు చేస్తోందని తెలిపారు.66వ డివిజన్ అధ్యక్షులు కిరణ్,65వ డివిజన్ అధ్యక్షులు సునీల్,ఆత్మకూరు మార్కెట్ వైస్ చైర్మన్ తిరుపతి,మండల అధ్యక్షులు అశోక్ కుమార్,మహిళ అధ్యక్షురాలు జోరిక పూల, మ హిళ ఉప అధ్యక్షురాలు స్వాతి,మాజీ మండల అ ధ్యక్షుడుమహేందర్ రెడ్డి,సీనియర్ నాయకులు వీసం సురేందర్ రెడ్డి, వంగపహడ్ పిఏసిఎస్ చై ర్మన్ మెరుగు రాజేష్ గౌడ్,మండల,డివిజన్ స్థా యి నాయకులు, కార్యకర్తలు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు కాపాడుకోవాలి

### ఎమ్మెల్సీ, ప్రొఫెసర్ కోదండరామ్

**ప్రజాపక్షం/నర్సంపేట:** తెలంగాణ సాంస్కృతిక సాంప్రదాయాలను కాపాడుకోవాలని ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరామ్ అన్నారు. నర్సంపేట పట్టణంలోని బాలాజీ మహిళా డిగ్రీ కళాశాలలో ముందస్తుగా బోనాల పండుగ కార్యక్రమాని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తెలంగాణ ఉద్యమ నాయకుడు, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరామ్ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. తెలంగాణ ప్రాంతానికి ఒక ప్రత్యేకత ఉన్నదని ,ఐక్యతను చాటి చెప్పడంలో గాని, హక్కుల కో




సం పోరాడడంలో గాని ,ఈ ప్రాంత సాధికారత కోసం నిలబడడంలో కానీ, సంస్కృతి సాంప్రదాయాలను కాపాడడంలో గాని, ప్రజలంతా ఐక్యతతో ముందడుగు వేస్తారన్నారు.దేశ ఐక్యతను నిలపడంలోనూ భావి సమాజ నిర్మాణంలోనూ విద్యార్థులే కీలకం అవుతున్నారని కొనియాడారు. ఏది ఏమైనా బాలాజీ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినిలు ఇంత గొప్పగా బోనాల ఉత్సవాన్ని నిర్వహించి మన తెలంగాణ ప్రాంత సంస్కృతిని చాటి చెప్పడం సంతోషంగా ఉందన్నారు. ఇలాంటి కార్యక్రమాల వల్ల యువతలో విద్యార్థుల్లో ఐక్యమత్యంతో పాటు ఉత్సాహం వస్తుందని, భవిష్యత్తుపై నమ్మకం కుదురుతుందన్నారు. ఈ కార్యక్రమంలో విశిష్ట అతిథులుగా నర్సంపేట మున్సిపల్ చైర్ పర్సన్ పెండెం శ్రీ లక్ష్మీ, బాలాజీ విద్యాసంస్థల ట్రెజరర్ డాక్టర్ వనజలు పాల్గొని బోనాలతో విద్యార్థినీలకు ముందు బాగాన నడిచి అమ్మవారికి టెంకాయలు కొట్టి మొక్కులు సమర్పించారు ఈ కార్యక్రమంలో ప్రముఖ న్యాయవాది తెలంగాణ ఉద్యమ నాయకుడు అంబటి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## పెన్షనర్ల సమస్యలను సత్వరమే పరిష్కరించాలి :మేరీ ఏసుపాదం





**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** రాష్ట్ర ప్రభుత్వం పెన్షనర్ల పట్ల నిర్లక్ష్యం వీడి సమస్యలను సత్వరమే పరిష్కరించాలని రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం ఎస్‌జిపిఎటి రాష్ట్ర కార్యదర్శి వి. మేరీ ఏసుపాదం, జిల్లా అధ్యక్షులు పరిశ పుల్లయ్య డిమాండ్ చేశారు. పెన్షనర్ల సమస్యలను పిఆర్‌సిని వెంటనే ప్రకటించాలని, పెండింగ్ డిఆర్, ఉద్యోగ విరమణ బకాయిల చెల్లింపు, హెల్త్‌కార్డులను సత్వరమే అందజేసి నగదు రహిత వైద్యాన్ని అందించాలని కోరారు. హైదరాబాద్‌లో ఇందిరా పార్కు వద్ద జరిగిన పెన్షనర్ల మహాధర్నాలో ఖమ్మంజిల్లా నుంచి పెన్షనర్లు అధిక సంఖ్యలో పాల్గొన్నారని వారు తెలిపారు. ఇప్పటికైనా పెన్షనర్ల సమస్యలను పరిష్కరించాలని లేని పక్షంలో ఆందోళనను మరింత ఉధృతం చేస్తామన్నారు. ఖమ్మం జిల్లా నుంచి పాల్గొన్న పెన్షనర్లకు మేరీ ఏసుపాదం, పరిశ పుల్లయ్య, రాయల రవికుమార్ నాయకత్వం వహించారు. ఈ ధర్నాలో ఎస్‌జిపిఎటి నాయకులు కనపర్తి వెంకటేశ్వర్లు, భాస్కరాచారి, కన్నెకంటి కృష్ణమూర్తి, ఊడుగు వెంకటేశ్వర్లు, రాధాకృష్ణమూర్తి, మధుకర్‌రెడ్డి, సుధాకర్, ఎండి హుస్సేన్, పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ కేంద్రాల్లో అన్నప్రాసన



**ప్రజాపక్షం/రఘునాథపాలెం:** మండల పరిధిలోని గణేశ్వరం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో అన్నప్రాసన కార్యక్రమాన్ని నిర్వహించారు. శుక్రవారం అంగన్‌వాడీ కేంద్రంలో జరిగిన అన్నప్రాసన కార్యక్రమానికి పాఠశాల ప్రధానోపాధ్యాయులు రఫీక్‌పాషా, సర్పంచ్ భూక్యా నాగేశ్వరరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చిన్నారులందరిని అంగన్‌వాడీ కేంద్రానికి పంపించాలని తెలిపారు. ప్రీ స్కూల్‌లో చిన్నారులకు ఆటపాటలతో విద్యను అందిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందించే సదుపాయాలను తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ కౌసల్య, రాధ, ప్రీ స్కూల్ ఇన్‌స్ట్రక్టర్ జ్యోతి, ఆయా అరుణ, ప్రియాంక, సోమిలి పాల్గొన్నారు.

## కమిటీల ఏర్పాటుకు ఇన్‌చార్జిల నియామకం



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్:** కాంగ్రెస్ పార్టీ మండల, గ్రామ కమిటీల ఏర్పాటుకు ఇంచార్జిలను నియమించినట్లు కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ తెలిపారు. శుక్రవారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయం సంజీవరెడ్డి భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ మాట్లాడుతూ ఏఐసిసి సంఘటన్, సృజన్, అభియాన్ ప్రక్రియలో భాగంగా టిపిసిసి అధ్యక్షులు బొమ్మ మహేష్‌కుమార్ గౌడ్ ఆదేశానుసారం ఈనెల 15 నాటికి గ్రామ, మండల కమిటీల నిర్మాణం పూర్తి చేయాల్సి ఉందన్నారు. మండల అధ్యక్షులతో సమన్వయం చేసుకుని మండల, గ్రామ కమిటీలను పూర్తి చేసేందుకు జిల్లా కమిటీ కార్యవర్గ సభ్యులను ఇంచార్జిలుగా నియమించినట్లు తెలిపారు. ఇంచార్జిలకు సమావేశం ఏర్పాటు చేసి దిశా నిర్దేశం చేసినట్లు తెలిపారు. కమిటీల నిర్మాణం అత్యంత ప్రాధాన్యతగా తీసుకుని పూర్తి చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు పులిపాటి వెంకయ్య, బానోత్ బాలాజీ, గజ్జెల్లి వెంకన్న, తుములూరి లక్ష్మి నర్సింహారావు, కిలారు అనిల్ కుమార్, రేణుక, స్వరూప, కిలారు వెంకటరమణ, ఝాన్సీ, కొట్టే రాజశేఖర్, నాగరాజు, మద్దినేని రమేష్, రాజుగౌడ్ పాల్గొన్నారు.

## సిపిఐ సభ్యుడు ఎల్లయ్య మృతి



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఖమ్మం నగరంలోని 14వ డివిజన్ కొత్తగూడెం సిపిఐ సభ్యులు భూమా ఎల్లయ్య చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందాడు. భూమా ఎల్లయ్య నాలుగు నెలల క్రితం ఖమ్మం నగరంలో జరిగిన ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఎల్లయ్య మృతి వార్త తెలుసుకున్న సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పగడాల మల్లేష్ శుక్రవారం వారి స్వగృహంలో నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు సానుభూతి వ్యక్తం చేశారు. ఎల్లయ్య కుటుంబానికి పార్టీ ఎల్లప్పుడు అండగా ఉంటుందని తెలిపారు. శాఖ కార్యదర్శి రావుల హన్మంతరావు, సహాయ కార్యదర్శి మూకనబోయిన నాగేశ్వరరావు, 15వ డివిజన్ కార్యదర్శి జొన్నలగడ్డ వెంకటేశ్వర్లు, బుడిగె వెంకన్న, ముద్రబోయిన అప్పారావు తదితరులు ఎల్లయ్యకు నివాళులర్పించారు.

## సుస్థిర అభివృద్ధి లక్ష్యాలకు పంచాయతీ ప్రణాళికలే కీలకం




**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనలో జిల్లా, మండల పంచాయతీ అభివృద్ధి ప్రణాళికలు కీలకమని జిల్లా కలెక్టర్ అంకిత్ అన్నారు. 2026–27 జిల్లా, మండల పంచాయతీ అభివృద్ధి ప్రణాళికల రూపకల్పనపై ఐడిఒసిలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి మండలం 17 సుస్థిర అభివృద్ధి లక్ష్యాల్లో రెండు లక్ష్యాలను ప్రాధాన్యత అంశాలుగా ఎంపిక చేసి, వాటికి అనుగుణంగా కనీసం 25 శాతం ప్రాజెక్టు ఆధారిత కార్యక్రమాలను ప్రణాళికల్లో పొందుపరచాలని అధికారులను ఆదేశించారు. గ్రామాల అవసరాలకు అనుగుణంగా పేదరిక నిర్మూలన, ఆరోగ్యం, విద్య, తాగునీరు, పారిశుద్ధ్యం, మహిళా సాధికారిత, ఉపాధి కల్పన వంటి అంశాలకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు.

# ప్రభుత్వ అభిప్రాయాన్ని ప్రజలపై రుద్దం

- రూ.100కోట్ల నిధులు మంజూరు చేసిన సిఎం
- ఏదులాపురం మున్సిపాలిటీని రాష్ట్రంలోనే ఆదర్శ మున్సిపాలిటీగా చేస్తాం: మంత్రి పొంగులేటి



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** ప్రభుత్వ అభిప్రాయలను ప్రజలపై రుద్దమని వారు ఏమైతో కోరుకుంటున్నారో తమ ప్రజా ప్రభుత్వం అదే చేస్తుందని రాష్ట్ర రెవెన్యూ, గృహ, నిర్మాణం, సమాచారశాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శుక్రవారం వేకువజామున 6గంటలకు ఏదులాపురంమున్సిపాలిటీ పరిధిలోని 22,23 వార్డులలో జిల్లా కలెక్టర్ దివాకర్ టిఎస్‌తో కలిసి మార్నింగ్‌వాక్ చేశారు. ఈ సందర్భంగా కాలనీలోని ప్రజలతో మాట్లాడి స్వయంగా సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ...గ్రామ పంచాయతీలను విలీనం చేసి ఏర్పాటు చేసిన ఏదులాపురం మున్సిపాలిటీని రాష్ట్రంలోనే రోల్ మోడల్ మున్సిపాలిటీగా అభివృద్ధి చేయడమే ప్రభుత్వ లక్ష్యం అన్నారు. సిఎం రేవంత్‌రెడ్డి ఏదులాపురంమున్సిపాలిటీ సమగ్ర అభివృద్ధి కోసం రూ.100కోట్ల నిధులు మంజూరు చేశారని చెప్పారు. ప్రజలకు అవసరమైన మౌళిక వసతులను గుర్తించి, వాటిని ప్రాధాన్యత క్రమంలో పూర్తి చేసేందుకు క్షేత్రస్థాయిలో పర్యటిస్తున్నామని పేర్కొన్నారు. లోతట్టు ప్రాంతాల్లో తుమ్మ చెట్లు పెరగడం, రోడ్లపై వర్షపు నీరు నిల్వ ఉండటం వంటి సమస్యలు తమ దృష్టికి వచ్చాయని, వాటి శాశ్వత పరిష్కారం కోసం అవసరమైన డ్రైనేజీ నిర్మాణంతో పాటు ఇతర మౌళిక సదుపాయాల కల్పనకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు తెలిపారు. కొన్ని ప్రాంతాల్లో త్రాగునీటి సమస్య ఉందని స్థానికులు తమ దృష్టికి తీసుకువచ్చారని, దానిని త్వరలోనే పరిష్కరిస్తామన్నారు. విద్యుత్ తీగలకు సంబంధించిన సమస్యలను కూడా సంబంధిత శాఖల సమన్వయంతో పరిష్కరిస్తామని తెలిపారు. కొంతమంది ఇందిరమ్మ ఇళ్లు, ఇంటి స్థలాల కోసం వినతుల అందజేశారని, వాటిన ప్రభుత్వం సానుకూలంగా పరిశీలిస్తుందని పేర్కొన్నారు. మున్సిపాలిటీపరిధిలో పార్కుల అభివృద్ధి పనులు ఇప్పటికే ప్రారంభం అయ్యాయని, ఈ నెలాఖరులోగా వాటిని పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. మున్సిపాలిటీ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించామని, అధికారుల నిరంతరం పర్యవేక్షిస్తూ ప్రతి పనిని నీర్ణత గుడువులోగా నాణ్యతతో పూర్తి చేయాలని ఆదేశించారు. సాయిగణేష్‌నగర్‌లో రోడ్డు వెంట ఉన్న టీస్టాల్‌లో కూర్చుని టీ త్రాగి అనంతరం ఇందిరమ్మ కాలనీలో పర్యటించారు. వర్షం పడుతున్న కాలి నడకన గొడుగు చేత పట్టుకుని తిరిగి పరిసరాలను పరిశీలిస్తూ కాలనీవాసులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస్‌రెడ్డి, చైర్‌పర్సన్ పోకబత్తిని అనిత, వైస్ చైర్మన్ తమ్మినేని నవీన్, కమీషనర్ ఆళ్ల శ్రీనివాస్‌రెడ్డి, తహశీల్దార్ వినయేందర్‌రెడ్డి, ఆర్అండ్‌బీ ఎస్ఈ యుగంధర్, పంచాయతీరాజ్ ఎస్.ఈ వెంకట్‌రెడ్డి, విద్యుత్‌శాఖ ఎస్ఈ శ్రీనివాసచారి, హౌసింగ్ పీడీ శ్రీనివాస్, ఆర్డీఓ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

**అర్హులైన ప్రతీ కుటుంబానికి సంక్షేమఫలాలు అందించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం**

**తిరుమలాయపాలెం:** అర్హులైన ప్రతీ కుటుంబానికి సంక్షేమ ఫలాలు అందించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి వర్యులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. మండలంలో శుక్రవారం మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. తిప్పారెడ్డిగూడెం నుంచి రాకాసి తండా వరకు నిర్మించనున్న బీటీ రహదారి నిర్మాణ పనులకు, హైదర్‌సాయిపేట గ్రామంలో రూ.20లక్షలతో నిర్మించనున్న గ్రామపంచాయతీ కార్యాలయ భవన నిర్మాణానికి, పాతర్లపాడు గ్రామంలో రూ.20లక్షలతో నిర్మించనున్న గ్రామ పంచాయతీ కార్యాలయ భవన నిర్మాణానికి, రాజారాం గ్రామంలో రూ.4.50కోట్లుతో రాజారాం నుంచి తుమ్మగూడెం వరకు నిర్మించనున్న బీటీ రహదారి నిర్మాణ పనులకు శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ..ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధిని సమపాళ్లలో ముందుకు తీసుకెల్తోందని, గ్రామాల సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని, తిప్పారెడ్డిగూడెం గ్రామ అభివృద్ధికి ఇప్పటివరకు రూ.35.55కోట్లు, హైదర్‌సాయిపేట గ్రామానికి రూ.37కోట్లు, పాతర్లపాడు గ్రామానికి రూ.29.25కోట్లు, రాజారాం గ్రామానికి రూ.8.48కోట్లు మంజూరు చేసి అంతర్గత సీసీ రోడ్లు, బీటీ రోడ్లు, వంతెనలు, ఇతర మౌళిక వసతులకల్పనకు పనులు చేపట్టినట్లు తెలిపారు.



ప్రజాప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పేద ప్రజల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, పేద కుటుంబాలకు 200యూనిట్లు వరకు ఉచిత విద్యుత్ అందిస్తున్నామని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో ఒక్క కొత్త రేషన్‌కార్డు కూడా మంజూరు చేయలేదని, తమ ప్రభుత్వం కొత్త రేషన్‌కార్డులు ఇచ్చి సన్నబియ్యం పంపిణీ చేస్తోందన్నారు. మహిళలకు ఉచిత బస్సు, రైతుల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, సన్న రకం వరికి కనీస మద్దతు ధరతోపాటు క్వింటాకు రూ.500బోనస్ అందిస్తున్నామని తెలిపారు. ఆగస్టు15 నుంచి రాష్ట్ర ప్రభుత్వం ఆసరా పింఛన్ల మంజూరు ప్రక్రియను ప్రారంభిస్తుందని, అర్హులైన ప్రతీ లబ్ధిదారునికి కొత్త పింఛన్ అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పి.శ్రీనివాస్‌రెడ్డి, పంచాయతీరాజ్ ఎస్ఈ వెంకట్‌రెడ్డి, హౌసింగ్ పీడీ శ్రీనివాస్, డీపీఓ వినోద్‌కుమార్, ఆర్డీఓ శ్రీనివాస్, తహసీల్దార్ విల్సన్, డీటీ సుధీర్, ఎంపీడీఓ సిలార్‌సాహెబ్, ఆర్ఐ లక్ష్మణ్, కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు రామసహాయం, నరేశ్‌రెడ్డి, పాలేరు నియోజకవర్గ ఆత్మ కమిటీ ఛైర్మన్ చావా శివరామకృష్ణ, కాంగ్రెస్ మండల కమిటీ అధ్యక్షుడు, మాజీ ఎంపీపీ బోడా మంగీలాల్ నాయక్, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు దూదిమెట్ల వెంకట్, సర్పంచులు కర్నాటి రాజేంద్రప్రసాద్, బత్తుల స్వాతి సుమన్‌రెడ్డి, బానోత్ సిమ్లానాయక్, కుంభం మహేశ్, ఉప సర్పంచి పుసులూరి రమేశ్, పోట్ల కిరణ్, వనవాసం నరేందర్‌రెడ్డి, ఉపసర్పంచి బొల్లికొండ రాజశేఖర్, లంజపల్లి శ్రీనివాస్, నందిపాటి మల్లిఖార్జున్, అంగిరేకుల సతీశ్‌యాదవ్, మందుల అరుణ, ఉప్పునూతల నాగేశ్వరరావు, కట్కూరి శ్రీనివాసరెడ్డి, మోరపాక నాగయ్య, ఓర వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యం: ఎమ్మెల్యే జారే



**ప్రజాపక్షం/అశ్వారావుపేట:** ప్రజా సంక్షేమం, గ్రామీణాభివృద్ధి, ప్రభుత్వ విద్యాసంస్థల బలోపేతం, పేదలకు గృహ వసతి కల్పన, మౌలిక సదుపాయాల విస్తరణ లక్ష్యంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట నియోజకవర్గ ఎమ్మెల్యే జారే ఆదినారాయణ శుక్రవారం అశ్వారావుపేట, దమ్మపేట మండలాల్లో విస్తృతంగా పర్యటించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు కొనసాగిన ఈ పర్యటనలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టడంతో పాటు ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలను సందర్శించి అక్కడి పరిస్థితులను స్వయంగా పరిశీలించారు. ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుంటూ అధికారులు అక్కడికక్కడే పలు ఆదేశాలు జారీ చేశారు. దమ్మపేట మండలంలోనూతనంగా మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు ఎమ్మెల్యే జారే భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతి నిరుపేద కుటుంబానికి సొంతింటి కలను నెరవేర్చే లక్ష్యంతో ఇందిరమ్మ గృహ నిర్మాణ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తోందన్నారు. అర్హులైన ప్రతి కుటుంబానికి పారదర్శకంగా ఇళ్లు మంజూరు చేసి నిర్మాణాలు వేగంగా పూర్తయ్యేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. అనంతరం తహశీల్దార్ కార్యాలయ ప్రాంగణంలో సందర్శకుల కోసం నిర్మించిన టాయిలెట్స్ బ్లాక్‌కు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఆతర్వాత అశ్వారావుపేట మున్సిపాలిటీ పరిధిలో కొనసాగుతున్న అభివృద్ధి పనులను ఎమ్మెల్యే క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ప్రజల అవసరాలే అభివృద్ధి పనులకు ప్రాతిపదిక కవాలని, ప్రజాధనాన్ని వృధా చేయకుండా ప్రతిరూపాయి ప్రజల సంక్షేమానికి వినియోగించాలని స్థానిక ప్రజాప్రతినిధులకు, అధికారులకు సూచించారు. అనంతరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రూ.5లక్షలతో నిర్మించనున్న కళావేదిక అభివృద్ధి పనుకలు శంకుస్థాపన చేశారు. అనంతరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డాక్టర్ బిఆర్.అంబేద్కర్ స్టడీ సర్కిల్‌ను ప్రారంభించారు. అనంతరం కళాశాల క్రీడా మైదానాన్ని పరిశీలించి జరుగుతున్న అభివృద్ధి పనులపై ఆరా తీశారు. అనంతరం తెలంగాణ మైనారిటీ రెసిడెన్షియల్ స్కూల్, బిసి వెల్ఫేర్ స్కూల్‌లను ఆకస్మికంగా సందర్శించిన ఎమ్మెల్యే విద్యార్థులతో నేరుగా మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్, కౌన్సిలర్లు, తహశీల్దార్, మండల అధికారులు, మున్సిపల్ అధికారులు, కాంగ్రెస్ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## అర్హత ఉన్నా పదోన్నతులు లేవు

**జెఎంఇటిలకు ఎఐటియుసి అండ**




**ప్రజాపక్షం/చుంచుపల్లి :** 2016–17 బ్యాచ్‌కు చెందిన జూనియన్ మైనింగ్ ఇంజనీర్ ట్రైనీల (జెఎంఇటిల) పెండింగ్‌లో ఉన్న బ్యాక్‌డేటెడ్ ఓవర్‌మ్యాన్ పదోన్నతుల సమస్య పరిష్కారానికి ఎఐటియుసి అండగా ఉంటుందని ఆ సంఘం అదనపు ప్రధాన కార్యదర్శి మిర్యాల రంగయ్య స్పష్టం చేశారు. పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేస్తూ జెఎంఇటిలలు గత మూడు రోజులుగా రిలే నిరాహార దీక్షలు చేపట్టగా శుక్రవారం సాయంత్రం సింగరేణి ప్రధాన కార్యాలయం ఎదుట అర్ధనగ్న ప్రదర్శన నిర్వహించారు. ఈ ఆందోళనకు సంఘీభావంగా ఏఐటీయూసీ నాయకులు పాల్గొని మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా మిర్యాల రంగయ్య మాట్లాడుతూ ఈ నెల 13న ఆర్ఎంసీ సమక్షంలో సింగరేణి యాజమాన్యంతో జరగనున్న చర్చల్లో జెఎంఇటిలల పదోన్నతులు, సీనియారిటీ తదితర సమస్యలను ప్రధానంగా ప్రస్తావించి పరిష్కారం కోసం కృషి చేస్తామని తెలిపారు. క్యాడర్ స్కీమ్ ప్రకారం అర్హత సాధించినప్పటికీ 2016–17 బ్యాచ్‌కు చెందిన 400 మందికిపైగా జెఎంఇటిలలు ఏళ్లుగా ఓవర్‌మ్యాన్ పదోన్నతుల కోసం ఎదురుచూస్తున్నారని పేర్కొన్నారు. అదే ఉద్యోగులతో ఓవర్‌మ్యాన్ బాధ్యతలు నిర్వహింపజేస్తూ పదోన్నతులు ఇవ్వకపోవడం అన్యాయమని విమర్శించారు. ఉద్యోగుల అర్హత, సీనియారిటీ ఆధారంగా పెండింగ్‌లో ఉన్న బ్యాక్ డేటెడ్ పదోన్నతులను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమస్య పరిష్కారమయ్యే వరకు జెఎంఇటిలల పక్షాన ఎఐటియుసి పోరాటాన్ని కొనసాగిస్తుందని రంగయ్య స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ కేంద్ర కార్యదర్శి వంగ వెంకట్, బ్రాంచ్ కార్యదర్శి రమణమూర్తి, కేంద్ర ప్రచార కార్యదర్శి వీరస్వామి, సత్తుపల్లి నాయకులు సందబోయిన శ్రీనివాస్, హుమాయూన్, బండారి మల్లయ్యతోపాటు జెఎంఇటిలలు సుశీల్ కుమార్, వినయ్ గౌడ్, బైరి సాంబశివుడు, షహబాజ్ ఖాన్, విజయరాఘవ, తదితరులు పాల్గొన్నారు.

## ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని విజయవంతం చేద్దాం

సహాయ ప్రాజెక్టు అధికారి జనరల్ డేవిడ్ రాజ్

**ప్రజాపక్షం/భద్రాచలం:** ప్రపంచ ఆదివాసి దినోత్సవాన్ని సమన్వయంతో విజయవంతం చేద్దామని ఐటీడీఏ సహాయ ప్రాజెక్టు అధికారి జనరల్ డేవిడ్ రాజ్ అన్నారు. శుక్రవారం నాటు ఐటీడీఏ సమావేశ మందిరంలో ఊటీడీఏ పీఓ బి.రాహుల్ ఆదేశాల మేరకు గిరిజన ఆదివాసి ఐక్య కార్యాచరణ సమితి సభ్యులు మరియు అధికారులతో ఈ నెల 9న జరిగే ప్రపంచ ఆదివాసి దినోత్సవ కార్యక్రమం సందర్భంగా ఏర్పాట్లపై ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ ఆదివాసి దినోత్సవ కార్యక్రమానికి వచ్చే ప్రముఖులకు ఆదివాసి గిరిజనుల సాంప్రదాయ ప్రకారము ఆచార వ్యవహారాలు, సంస్కృతి సాంప్రదాయాలు, ఆదివాసి వంటకాలతో వారిని ఆనందింపచేసే విధంగా కార్యక్రమాలు ఏర్పాట్లు చేయాలని అన్నారు. ప్రపంచ ఆదివాసి దినోత్సవం నాడు వివిధ ఆదివాసి తెగల గిరిజనులతో ర్యాలీలు మరియు మహనీయులకు శ్రద్ధాంజలి ఘటించడం, జెండా ఆవిష్కరణ కార్యక్రమం అలాగే ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రదర్శనశాలలో ఏర్పాట్లు చేయాలని, ఈ కార్యక్రమానికి విచ్చేసే ప్రముఖులతో పాటు ప్రజలకు ఆదివాసి వంటకాలతో భోజన సౌకర్యం కల్పించాలని సంఘ సభ్యులకు తెలిపారు.

## అసంపూర్తిగా వెంగళరావు సాగర్ పనులు

**తగ్గిన వరి సాగు విస్తీర్ణం.. ఆందోళనలో ఆయకట్టు రైతులు**

**ప్రజాపక్షం/చంద్రుగొండ:** చంద్రుగొండ మండలం సీతాయిగూడెం గ్రామ శివారులోని వెంగళరావు సాగర్ ప్రాజెక్టు అలుగు నిర్మాణ పనులు మధ్యలోనే నిలిచిపోవడంతో ఆయకట్టు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సుమారు 3వేల ఎకరాల ఆయకట్టు ఉన్న ఈ ప్రాజెక్టు పరిధిలో గత పదేళ్ల క్రితం వరదల కారణంగా అలుగు దెబ్బతింది. గత బిఆర్ఎస్ ప్రభుత్వం నిర్మాణ పనులు చేపట్టకుండా మొఖం చాటేసింది. ప్రస్తుతం మరమ్మతుల కోసం ప్రభుత్వం రూ 33కోట్లు నిధులు మంజూరు చేసినప్పటికీ, కాంట్రాక్టర్ పనులు నాణ్యతగా చేపట్టలేదని రైతులు ఆరోపించారు. జూన్ నెలాఖరులోగా పనులు పూర్తి చేయాల్సి ఉండగా ఆలస్యం కావడంతో నీటిపారుదల శాఖ అధికారులు కాంట్రాక్టర్‌కు రద్దు నోటీసులు జారీ చేశారు. పనులు నిలిచిపోవడంతో ఈ ఏడాది వరి సాగు విస్తీర్ణం గణనీయంగా తగ్గింది. సాధారణంగా వేల ఎకరాల్లో సాగయ్యే వరి ప్రస్తుతం సుమారు 500 ఎకరాల లోపే రైతులు సిద్ధం చేసుకున్నారు. అధిక వర్షాలు కురిస్తే పొలాలు ముంపునకు గురయ్యే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. వెంగళరావు సాగర్ ఆయకట్టు పరిధిలోని సీతాయిగూడెం, దామరచర్ల, ఇమ్మడిరాయ, బంజర్, చంద్రుగొండ, తిప్పనపల్లి, మహమ్మద్‌నగర్, అయ్యన్నపాలెం గ్రామాల రైతులు అధికారులు స్పందించాలని కోరుతున్నారు.

**ఇరిగేషన్ శాఖ అధికారుల నిర్లక్ష్యం: బొర్రా కేశవులు**

ఇరిగేషన్ శాఖ అధికారుల నిర్లక్ష్యం, కాంట్రాక్టర్ నాసిరకం పనుల వల్ల రైతులు ఇబ్బందులు పడుతున్నారని రైతు, సిపిఐ మండల కార్యదర్శి బొర్రా కేశవులు ఆరోపించారు. తక్షణమే తాత్కాలిక మరమ్మతులు చేపట్టి ఆయకట్టుకు సాగునీరు అందించాలని డిమాండ్ చేశారు.

## మైనర్లు వాహనాలు నడిపితే కఠిన చర్యలు

**ప్రజాపక్షం/ఖమ్మం క్రైం :** నిబంధనలకు విరుద్ధంగా మైనర్లు వాహనాలు నడిపితే చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని ట్రాఫిక్ సిఐ బెల్లంకొండ సత్యనారాయణ తెలిపారు. శుక్రవారం ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. ట్రాఫిక్ నింబంధనలు ఉల్లంఘించిన నలుగురు మైనర్లను జువెనైల్ జస్టిస్ బోర్డు ముందు హాజరుపరిచగా న్యాయమూర్తి బి.రజని వారికి నెలరోజుల పాటు వారంలో ఒక రోజు అబ్జర్వేషన్ హోమ్‌లో హాజరుపరచాలని ఆదేశాలు జారీ చేసినట్లు సిఐ తెలిపారు. రెడ్డు ప్రమాదాలకు కారణమవుతున్న మైనర్ల డ్రైవింగ్‌ల విషయంలో జూవెనైల్ జస్టిస్‌బోర్డు శిక్షలు కఠినంగా అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని పిల్లల తల్లిదండ్రులు మైనర్లకు వాహనాలు ఇవ్వకుండా జాగ్రత్తవహించాలని ఆయన సూచించారు.

## 10న 'జైల్‌భరో'ను జయప్రదం చేయండి

సంయుక్త కిసాన్ మోర్చా పిలుపు




**ప్రజాపక్షం/ఖమ్మం:** మోడీ ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ దేశ వ్యాప్తంగా ఈనెల 10న జరిగే జైల్‌భరో కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఐక్య రైతు, కార్మిక సంఘాల నేతలు పిలుపునిచ్చారు. అఖిలపక్ష రైతు, వ్యవసాయ, కార్మిక సంఘాల సంయుక్త సమావేశం శుక్రవారం స్థానిక సిపిఐ కార్యాలయం గిరిప్రసాద్ భవన్‌లో జరిగింది. ఈ సమావేశంలో పాల్గొన్న వివిధ సంఘాల నేతలు మాట్లాడుతూ ఇప్పటికే సంక్షోభంలో ఉన్న వ్యవసాయ రంగాన్ని మరింత సంక్షోభం దిశగా నడిపేందుకు మోడీ ప్రభుత్వం ప్రయత్నిస్తుందని వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్లకు కట్టబెట్టేందుకు కుట్ర చేస్తుందన్నారు. నూతన సాగు చట్టాలకు వ్యతిరేకంగా జరిగిన చారిత్రిక పోరాట నేపథ్యంలో ఉపసంహరించుకున్నట్లు మోడీ ప్రభుత్వం ప్రకటించిన దొడ్డి దారిన వాటి అమలుకు పూనుకుంటుందని నేతలు ఆరోపించారు. సాగు చట్టాలను ఉపసంహరించుకోవడంతో పాటు మోడీ, ట్రంప్ కుదుర్చుకున్న ఒప్పందాన్ని తక్షణం రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు. వ్యవసాయ రంగంతో పాటు గ్రామీణ పేదలు ఆధారపడిన జాతీయ ఉపాధి హామీ పథకాన్ని రద్దు చేసి విబిజి రాం జీ పథకాన్ని అమలులోకి తీసుకువచ్చిందని దీని ద్వారా క్రమేపి జాతీయ ఉపాధి హామీ పథకాన్ని రద్దు చేసేందుకు ఈ ప్రభుత్వం ప్రయత్నిస్తుందని వారు ఆరోపించారు. కార్పొరేట్ కనుసన్నల్లో పనిచేస్తున్న మోడీ ప్రభుత్వం వారికి అనుగుణంగా పని గంటల పెంపు క్రమంలో 44 కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్స్‌ను అమల్లోకి తీసుకు వచ్చిందన్నారు. వీటిని రద్దు చేయాలని సంయుక్త కిసాన్ మోర్చా దేశ ప్రజల పక్షాన డిమాండ్ చేస్తుందన్నారు. మొత్తంగా మోడీ విధానాలను నిరసిస్తూ జరిగే ఈ జైల్‌భరో కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరై జయప్రదం చేయాలని వారు కోరారు. ఈ సమావేశంలో సిపిఐ, ప్రజా సంఘాల పక్షాన కొండపర్తి గోవిందరావు, దొండపాటి రమేష్, తాటి వెంకటేశ్వర్లు, తోట రామాంజనేయులు, కాంగ్రెస్ పక్షాన తుమ్మల యుగంధర్, యరగర్ల హన్మంతరావు, నరాల నరేష్, ఖాదర్‌బాబా, సిపిఎం ప్రజా సంఘాల పక్షాన పొన్నం వెంకటేశ్వరరావు, కళ్యాణం వెంకటేశ్వరరావు, మాదినేని రమేష్, బొంతు రాంబాబు, పాల్గొన్నారు.

## అప్రమత్తంగా విధుల నిర్వహణ

డ్రైవర్ శిక్షణా తరగతుల్లో ఆర్ఎం సరిరామ్

**ప్రజాపక్షం/ఖమ్మంఅర్బన్ :** డ్రైవింగ్ చేసేటప్పుడు అప్రమత్తంగా విధులు నిర్వహించాలని ఖమ్మం రీజినల్ మేనేజర్ ఎ. సరిరామ్ డ్రైవర్లకు సూచించారు. ప్రమాదాల నివారణపై ఖమ్మం రీజియన్ పరిధిలోని ఆర్టిసి డ్రైవర్లకు శుక్రవారం ఖమ్మం నూతన బస్టాండ్‌లోని సమావేశ మందిరంలో శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ శిక్షణా తరగతులకు ముఖ్య అతిథిగా హాజరైన ఆర్ఎం సరిరామ్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేసేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అప్రమత్తంగా విధులు నిర్వహించే తీరుపై డ్రైవర్లకు అవగాహన కల్పించారు. డ్రైవర్లు మంచి ఆహారపు అలవాట్లను అలవర్చుకోవాలని, విశ్రాంతి తీసుకుంటూ బాధ్యతలు నిర్వహించాలన్నారు. ఆర్టిసి యాజమాన్యం ఉద్యోగుల సంక్షేమం కోసం చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు. ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్ మాట్లాడుతూ ట్రాఫిక్ రూల్స్ పాటిస్తూ డ్రైవింగ్ చేయాలని తెలిపారు. రోడ్డు ప్రమాదాల నివారణలో డ్రైవర్ల పాత్ర చాలా కీలకమని ప్రమాదాలు జరగకుండా ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. అసిస్టెంట్ మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ మధు మాట్లాడుతూ టిజిఎస్ ఆర్టిసి నిర్వహిస్తున్న ఇలాంటి శిక్షణా తరగతుల వల్ల ప్రమాదాల నివారణలో మన ఆర్టిసి రాష్ట్రంలోనే కాకుండా దేశంలోనే నెంబర్‌వన్ స్థానంలో నిలిచిందని కొనియడారు. ఇందులో డ్రైవర్ల పాత్ర ఎంతో ప్రశంసనీయమన్నారు. రానున్న రోజుల్లో కూడా ఖమ్మం రీజియన్‌లో ప్రమాదాలు జరగకుండా డ్రైవర్లు మరిన్ని అవగాహన ప్రమాణాలు పెంపొందించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



## బిజెపి ప్రజా వ్యతిరేక పాలనపై ఉద్యమించాలి: తాండ్ర పిలుపు



**ప్రజాపక్షం/పెద్దపల్లి :** బిజెపి ప్రజా వ్యతిరేక పాలన పై ఉద్యమించాలని భారత కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో ఆగస్టు 10నుండి 13 వరకు పెద్దపల్లి జిల్లాలో తలపెట్టిన ప్రజా చైతన్య యాత్రను విజయవంతం చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం పిలుపునిచ్చారు.శుక్రవారం రోజున సిపిఐ జిల్లా కార్యాలయంలో ప్రజా చైతన్య యాత్ర వాల్ పోస్టర్లు ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వము అవలంబిస్తున్న నయా ఫాసిస్టు విధానాలను తిప్పికొట్టేందుకు ప్రజలంతా సంఘటితం కావాలని, ప్రధాని నరేంద్ర మోడీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వ తిరోగమన విధానాలతో దేశ సామాజిక రాజకీయ ఆర్థిక పరిస్థితులు నిత్యము దిగజారుతున్నాయని,భారతదేశ చరిత్రలోనే అత్యంత ప్రజా వ్యతిరేక కార్పొరేట్ సామ్రాజ్యవాద అనుకూల మతతత్వ నిరంకుశ అవినీతి బాహ్యమైన పరిపాలిస్తున్న కేంద్ర ప్రభుత్వం కొనసాగిస్తుందని, ధరల పెరుగులను అరికట్టడంలో, ద్రవ్యోల్బణం నియంత్రణలో ప్రభుత్వం దారుణంగా విఫలమైందని,బిజెపి అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై భారత కమ్యూనిస్టు పార్టీ పిలుపుమేరకు ఆగస్టు 6 నుండి 14 వరకు ప్రజా సమస్యలపై ప్రజా చైతన్య యాత్రలు నిర్వహిస్తున్నదని,అందులో భాగంగా పెద్దపల్లి జిల్లాలో ఆగస్టు 10న సుల్తానాబాద్ లో ప్రారంభం అయి 13 నా గోదావరిఖనిలో ముగుస్తుందని అన్నారు. సెప్టెంబర్ 1 న్యూఢిల్లీలోని రామ్ లీలా మైదానంలో నిర్వహించే బద్లావ్ జరూరి, హై చలో ఢిల్లీ ర్యాలీ విజయవంతం చేయాలని, సిపిఐ ఆధ్వర్యంలో పెద్దపల్లి జిల్లాలోని ప్రతీ మండల కేంద్రం మరియు ప్రతీ గ్రామం వరకు ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు గోసిక మోహన్, గౌతమ్ గోవర్ధన్, జిల్లా సమితి సభ్యులు ఆరెపల్లి మానస్ కుమార్, పూసాల రమేష్ లతో పాటు శివ, రవి, శంకర్, ఎల్లయ్య, పాల్గొన్నారు.

## నాణ్యతతో సమాచారం పక్కాగా సేకరించాలి: కలెక్టర్



**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** ఫీల్డ్ ఫంక్షనరీలు క్షేత్రస్థాయిలో నాణ్యతతో సమాచారం పక్కాగా సేకరించేలా చూడాలని రాష్ట్ర జనాభా లెక్కల సంచాలకులు భారతి హోళికేరి ఆదేశించారు. జనగణన–2027కు సంబంధించిన సన్నాహక కార్యక్రమాల్లో భాగంగా జిల్లా జనగణన హ్యాండ్‌బుక్ పై అన్ని జిల్లాల కలెక్టర్లతో హైదరాబాద్ నుంచి రాష్ట్ర జనాభా లెక్కల సంచాలకులు భారతి హోళికేరి శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించగా, జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం నుంచి జిల్లా ప్రిన్సిపల్ సెన్సస్ ఆఫీసర్, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, వివిధ శాఖల అధికారులతో కలిసి హాజరయ్యారు. జిల్లాల వారీగా డీసీహెచ్ బీ, హానరోరియం పంపిణీ తదితర అంశాలపై ఆరా తీశారు. రాష్ట్ర జనాభా లెక్కల సంచాలకులు భారతి హోళికేరి మాట్లాడుతూ.. ప్రతి జిల్లాలో జిల్లా జనగణన హ్యాండ్‌బుక్ రూపొందించేందుకు విద్యా, వైద్య సదుపాయాలు, తాగునీరు, పారిశుధ్యం, రవాణా , కమ్యూనికేషన్, బ్యాంకింగ్, రుణ సదుపాయాలు, విద్యుత్, ఇంధన వనరులు, భూమి, సాగునీటి వినియోగం, వ్యవసాయం, తయారీ చేతివృత్తులు, అలాగే గ్రామానికి సంబంధించిన ముఖ్యమైన ప్రత్యేక అంశాలు, పరిశీలనలు వంటి తొమ్మిది ప్రధాన అంశాలకు సంబంధించిన సమాచారాన్ని, టౌన్ డైరెక్టరీ షెడ్యూల్‌ను ఛార్జ్ ఆఫీసర్లు(మున్సిపల్ కమిషనర్) నియమించిన అధికారుల ద్వారా పట్టణ పౌర, పరిశ్రమలు, సామాజిక సదుపాయాలు, మురికివాడలకు సంబంధించిన సమాచారాన్ని నమోదు చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి జయశ్రీ, జిల్లా జనగణన అధికారి & ముఖ్య ప్రణాళిక అధికారి పీబీ శ్రీనివాసాచారి, ఆయా శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి ఒక్క లబ్ధిదారుడికి దుకాణం కేటాయించాలి: మార్కపూర్ సూర్య



**ప్రజాపక్షం/పెద్దపల్లి:** ప్రతి ఒక్క లబ్ధిదారుడికి దుకాణం కేటాయించాలని, ఎవరికైనా అన్యాయం చేస్తే సహించబోమని సిపిఐ ఫ్లోర్ లీడర్ 41 వ డివిజన్ కార్పొరేటర్ మార్కాపూర్ సూర్య హెచ్చరించారు.శుక్రవారం రోజున విలేకరులతో మాట్లాడుతూ రామగుండం కార్పొరేషన్ పరిధిలో ఎల్బీనగర్ టు ఫైవ్ ఇంక్లైన్ రోడ్డు వెడల్పు లో భాగంగా షాపులు కోల్పోయిన వారికి సెట్ బ్యాక్ చేసుకొని షాపుల నిర్మాణం చేసుకోవాలని ఎమ్మెల్యే మేయర్ చెప్పిన దాని ప్రకారం కోల్పోయిన లబ్ధిదారులందరూ తమ సొంత డబ్బులతో ఎల్బీనగర్లో దుకాణాలు నిర్మించుకుంటున్న క్రమంలో ఉదయం టౌన్ ప్లానింగ్ సిబ్బంది వచ్చి ఇక్కడి కాంప్లెక్స్ కు అనుమతి లేదంటూ కూల్చివేయడం అన్యాయమని అన్నారు.కాంప్లెక్స్ నిర్మాణం జరుగుతున్నది. 11వ డివిజన్లో అయినప్పటికీ దుకాణాలు కోల్పోయిన బాధితులంతా 41వ డివిజన్ కి సంబంధించిన వారని వారి కోసం ఎవరికీ అన్యాయం జరగకుండా ప్రతి ఒక్కరికి రూములు వచ్చే విధంగా 41 డివిజన్ కార్పొరేటర్ సూర్య అందరితో మాట్లాడానని పాలకులతో మాట్లాడిన తర్వాతే ఇక్కడ భూమి పూజ చేసి వాళ్ళు నిర్మాణాలు చేసుకుంటున్నారని ఈ క్రమంలో అనుమతి లేదంటూ మున్సిపల్ అధికారులు కూల్చివేయడంపై తీవ్రంగా ధ్వజమెత్తారు. ఎల్బీనగర్ ప్రజలకు సంబంధించి ఏ ఒక్క లబ్ధిదారుడికి అక్కడ రూము కేటాయించకుండా రాజకీయ కుట్రలు చేస్తే సహించబోనని కోల్పోయిన ప్రతి ఒక్కరికి దుకాణం వచ్చేవరకు పోరాటం చేస్తానని హెచ్చరించారు.

## నారాయణపూర్ చెరువు అభివృద్ధికి రూ.20 కోట్ల నిధులు విడుదల

ఫలించిన ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం కృషి

**ప్రజాపక్షం/గంగాధర :** చొప్పదండి నియోజకవర్గ రైతాంగానికి తెలంగాణ ప్రభుత్వం మరో శుభవార్త అందించింది. శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు పరిధిలోని నారాయణపూర్ చెరువు అభివృద్ధి, బండ్ విస్తరణ పనులకు కీలకమైన భూసేకరణ కోసం ప్రభుత్వం రూ.20 కోట్ల నిధులను విడుదల చేసింది. ఈ నిధుల విడుదలతో ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న నారాయణపూర్ చెరువు అభివృద్ధి పనులు మరింత వేగం కానున్నాయి. ముఖ్యంగా బండ్ విస్తరణ, గ్రావిటీ కాలువ నిర్మాణం, చెరువుల ఆధునీకరణ పనులకు వేగం చేకూరనుంది. ఈ నిధుల మంజూరుతో చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం చేసిన కృషి ఫలించింది. ఎస్ఆర్ఎస్పీ స్టేజ్2, ఫేజ్1 కింద అమలవుతున్న గంగాధర వేములవాడస్తంభంపల్లి సాగునీటి ప్రాజెక్టులో భాగంగా ఈ నిధులను వినియోగించనున్నారు. భూసేకరణ కోసం ప్రభుత్వం నిధులు విడుదల చేసింది. నారాయణపూర్ చెరువు బండ్ విస్తరణ, నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచే పనులు గ్రావిటీ కాలువ నిర్మాణం వర్షాకాలంలో వచ్చే నీటిని సమర్థంగా నిల్వ చేసి అవసరమైన సమయంలో రైతులకు సాగునీరు అందించే అవకాశం మరింత మెరుగుపడుతుంది. ఈ నిధుల విడుదలకు సహకరించిన సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డికి ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు.

# హుస్నాబాద్ నుండే హరిత విప్లవం రావాలి

మొక్కలు నాటి వాటి సంరక్షణ చూడాలి
చేనేత వస్త్రాలను వాడుదాం
నేతన్నలకు ఉపాధి కల్పిదాం
మంత్రి పొన్నం ప్రభాకర్ పిలుపు



**ప్రజాపక్షం/హుస్నాబాద్:** హుస్నాబాద్ నుండే హరిత విప్లం రావాలి మొక్కలు నాటడంలో తెలంగాణలోనే హుస్నాబాద్ ముందు ఉండాలని ప్రతి ఒక్కరు మొక్కలు నాటి వాటి సంరక్షణ తీసుకోవాలని తెలంగాణ బిసి రవాణశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడు పిలుపు నిచ్చారు. శుక్రవారం సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ నియోజకవర్గం కేంద్రంలో వనమహోత్సవం సందర్భంగా పట్టణంలో డిగ్రీ కళాశాల, మాడల్ స్కూల్ ప్రాంగణంలో విద్యార్థులతో కలిసి మొక్కలను నాటారు. ఈ సందర్భగా మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడు మాట్లాడుతూ చెట్లను పెంచడం వల్ల సకాలంలో వర్షాలు , ప్రకృతి వైఫల్యం చెందకుండ, ప్రతి ఒక్కరికి సంపూర్ణమైన ఆక్సిజన్ దొరకాలన్న మంచి గాలి పీల్చాలన్న చెట్లను పెంచడం ఎంతో అవసరం అన్నారు. నేడు మనం నాటే ప్రతి చెట్టు భావితరాలను గుర్తుగా నిలుస్తుందని తెలిపారు. ముందు ముందు చెట్లు లేక మానావాళికి ఆక్సిజన్ దొరక్క ఆక్సిజన్ గ్యాస్ బుడ్లను వెంట తీసుకుని పోవలసిన అవసరం ఏర్పాడుతుందని ఆలాంటి రాకుండ ఉండాలంటే చెట్ల పెంపకం చేపట్టాలని పిలుపు నిచ్చారు.

**చేనేత వస్త్రాలను వాడుదాం నేతన్నలను చేయుతనిద్దాం**
నేడు ప్రకృతి విరుద్దంగా వస్తున్న వస్త్రాలను వాడకుండ చేనేత వస్త్రాలను వాడి పకృతిని కాపాడి నేతన్నలకు చేయుత నిద్దామని తెలంగాణ బి సి రవాణశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడు పిలుపు నిచ్చారు. శక్రవారం హుస్నాబాద్ పట్టణంలో చేనేత దినోత్సవం సందర్భంగా మార్కెండేయా దేవాలయంలో మొక్కను నాటి చేనేత దినోత్సవం జరుపుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ చేనేత వస్త్రాలు వాడటం వల్ల వృత్తిని ప్రోత్సహించినట్లు గా కాకుండ వారిని ఆర్థికంగా బలోపేతం చేసేవారం అవుతామని పేర్కోన్నారు. మనం జరుపుకునే ప్రతి వేడుకల్లో పలువురికి ఇచ్చిపుచ్చుకునే కార్యక్రమాల్లో చేనేత వస్త్రాలను వాడాలని కొరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ దండి లక్ష్మి కొము రయ్యా, కమీషనర్ మల్లికార్జున్, మాజీ గ్రంధాలయ చైర్మెన్ కేడం లింగమూర్తి, సహకార సంఘం చైర్మెన్ బొల్లి శెట్టి శివయ్య, డీగ్రీ కళాశాల, మాడల్ స్కూల్ ప్రిన్సిపాల్ మున్సిపల్ కౌన్సిలర్లుల, మార్కెట్ కమీటి వైస్ చైర్మెన్ బంక చందు, రమణ తదితరులు పాల్గోన్నారు.

## 14న నర్మాల నుండి ముస్తాబాద్ వరకు పాదయాత్ర

సిపిఐ మాజీ జిల్లా కార్యదర్శి గుంటి వేణు



**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** ఈనెల 14వ తేదీన ఉదయం 11 కు నర్మాలలో ప్రాజెక్టును సందర్శించి పాద యాత్ర పాదయాత్ర చేపడుతారని అక్కడి నుండి ముస్తాబాద్ వరకు పాద యాత్ర కొనసాగిస్తారని సిపిఐ జిల్లా మాజీ కార్యదర్శి గుంటి వేణు పేర్కొన్నారు. ఈ పాదయాత్రకు సిపిఐ జాతీయ కార్యదర్శి వర్గ సభ్యులు చాడ వెంకట్ రెడ్డి పాల్గొంటారని ఈ పాదయాత్రకు కార్మికులు కర్షకులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. 12 సంవత్సరాల నుండి అధికారంలో ఉన్న మోడీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తుందని విమర్శించారు. దీనికి నిరసనగా దేశవ్యాప్తంగా ఆరో తారీకు నుంచి 14 వ తారీకు వరకు ప్రజా చైతన్య యాత్రలు సిపిఐ ఆధ్వర్యంలో చేపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మాజీ జిల్లా కార్యదర్శి గుంటి వేణు, డివిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మార్వాడి సుదర్శన్, మారేరు పరిరక్షణ సమితి నాయకులు బుస వేణు, చెన్నమనేని పురుషోత్తమరావు,దోశల వెంకటేశం,దోసల చంద్రం, ఇబ్రహీం, ఎర్ర మల్లయ్య,మనోజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యలపై సిపిఐ పాదయాత్రలు



**ప్రజాపక్షం/మెట్‌పల్లి:** కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న విధానాలకు వ్యతిరేకంగా ప్రజలంతా సంఘటితమై పోరాటాలకు సిద్ధం కావాలని సీపీఐ జగిత్యాల జిల్లా కార్యదర్శి చెన్న విశ్వనాథం పిలుపునిచ్చారు. శుక్రవారం మెట్‌పల్లిలోని బస్ డిపో నుంచి కొత్త బస్టాండ్ వరకు నిర్వహించిన ప్రచార పాదయాత్రలో ఆయన మాట్లాడారు. ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న విధానాల వల్ల దేశ సామాజిక, రాజకీయ, ఆర్థిక పరిస్థితులు రోజురోజుకూ దిగజారుతున్నాయని ఆయన విమర్శించారు. స్వాతంత్ర్యం అనంతరం భారతదేశ చరిత్రలోనే అత్యంత ప్రజా వ్యతిరేక, కార్పొరేట్ అనుకూల పాలన కొనసాగుతోందని ఆరోపించారు. ధరల పెరుగుదల నియంత్రణ, ద్రవ్యోల్బణాన్ని అరికట్టడం, రైతులకు కనీస మద్దతు ధరకు చట్టబద్ధ హామీ, నిరుద్యోగులకు ఉద్యోగాల కల్పన, కార్మిక హక్కుల పరిరక్షణ, మహిళా రిజర్వేషన్ చట్టం అమలు, ప్రభుత్వ విద్య–వైద్య వ్యవస్థల బలోపేతం, దళితులు, ఆదివాసీలకు సామాజిక న్యాయం వంటి డిమాండ్లతో సీపీఐ ఆధ్వర్యంలో ఆగస్టు 6 నుంచి 14 వరకు జగిత్యాల జిల్లా వ్యాప్తంగా గ్రామాలు, పట్టణాల్లో ప్రచార పాదయాత్రలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దేశవ్యాప్తంగా ప్రజలను ఏకతాటిపైకి తీసుకురావాలనే లక్ష్యంతో బద్లావ్ జరూరీహై నినాదంతో సెప్టెంబర్ 1న న్యూఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో భారీ ర్యాలీ, బహిరంగ సభ నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఏఐటీయూసీ నాయకులు సుతారి రాములు,మెట్‌పల్లి పట్టణ సీపీఐ కార్యదర్శి ఎం.డి. ఉస్మాన్,మహిళా నాయకులు కొక్కుల శాంత, ఎన్నం రాధ,ఈనా ఫిర్దోస్, అందే వంశీకృష్ణ, పోశెట్టి, మల్లాపూర్ రాజన్న, రమేష్, తదితర సీపీఐ నాయకులు, కార్యకర్తలు, కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## అథ్లెటిక్స్ పోటీలకు ఆల్ఫోర్స్ విద్యార్థులు




**ప్రజాపక్షం/సుల్తానాబాద్ :** రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు సుల్తానాబాద్ లోని ఆల్ఫోర్స్ విద్యార్థులు ఎంపికైనట్లు అధినేత నరేందర్ రెడ్డి తెలిపారు.జావలిన్ త్రో దే సందర్భంగా జిల్లాలోని ఎన్టిపిసి లో నిర్వహించిన అథ్లెటిక్స్ పోటీల్లో సుల్తానాబాద్ ఆల్ఫోర్స్ పాఠశాలకు చెందిన ఆదిత్య పథకం సాధించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాడని,ఈ సందర్భంగా విద్యార్థులను అభినందిస్తూ కేవలం చదువులకే పరిమితం కాకుండా క్రీడలకు అధిక ప్రాధాన్యతనిస్తున్నట్లు నరేందర్ రెడ్డి తెలిపారు. ప్రతిభ కనబరిచే క్రీడాకారులకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నట్లు నరేందర్ రెడ్డి పేర్కొన్నారు.నేటి నుంచి హన్మకొండలోని జవహర్లాల్ నెహ్రూ స్టేడియంలో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో ఆదిత్య పాల్గొంటారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ తో పాటు అధ్యాపక బృందం,తదితరులు ఉన్నారు.

# ఎఫ్ఎల్ఎన్‌తో విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలు పెరగాలి

కలెక్టర్ కోయ శ్రీహర్ష




**ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్:** ఎఫ్ఎల్ఎన్ కార్యక్రమాల సమర్థవంతమైన అమలు ద్వారానే విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలను పెంపొందించి,ప్రతి విద్యార్థి చదవడం,రాయడం,గణితంలో ప్రాథమిక నైపుణ్యాలు సాధించేలా చేయవచ్చని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు.శుక్రవారం జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో ఐడీఓసీ సమావేశ మందిరంలో జిల్లాలోని 180 ఎఫ్ఎల్ఎన్ కాంపిటెంట్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్, జిల్లాలో ఎఫ్ఎల్ఎన్ కార్యక్రమాల అమలు, విద్యార్థుల ప్రాథమిక అక్షరాస్యత, సంఖ్యా పరిజ్ఞాన అభివృద్ధి, పాఠశాల స్థాయిలో చేపట్టాల్సిన కార్యాచరణపై సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి విద్యార్థి కనీస అభ్యసన సామర్థ్యాలను సాధించేలా ప్రధానోపాధ్యాయులు,ఉపాధ్యాయులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. పాఠశాలల్లో ఎఫ్ఎల్ఎన్ కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయడంతో పాటు విద్యార్థుల అభ్యసన స్థాయిలను నిరంతరం అంచనా వేసి, అవసరాలకు అనుగుణంగా బోధనా వ్యూహాలను అమలు చేయాలని తెలిపారు.ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయుల పనితీరును క్రమం తప్పకుండా పర్యవేక్షిస్తూ,ప్రతి విద్యార్థి అభ్యసన పురోగతిపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ సూచించారు.చదవడం, రాయడం, గణితంలో ప్రాథమిక నైపుణ్యాలను ప్రతి విద్యార్థి తప్పనిసరిగా సాధించేలా కార్యాచరణ రూపొందించి అమలు చేయాలని ఆదేశించారు.ఎంఈఓలు, కాంప్లెక్స్ హెడ్‌మాస్టర్లు తరచూ పాఠశాలలను సందర్శించి ఎఫ్ఎల్ఎన్ కార్యక్రమాల అమలును పరిశీలించాలని, ఉపాధ్యాయులకు అవసరమైన మార్గదర్శకత్వం, సాంకేతిక సహకారం అందించాలని సూచించారు.విద్యార్థుల అభ్యసన ఫలితాలను నిరంతరం విశ్లేషించి, అవసరమైన చోట తక్షణ సవరణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు.జిల్లా విద్యాశాఖాధికారులు పాఠశాలల్లో ఎఫ్ఎల్ఎన్ కార్యక్రమాల పురోగతిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ నిర్దేశించిన లక్ష్యాలను సాధించేలా కార్యాచరణ కొనసాగించాలని కలెక్టర్ సూచించారు. ప్రతి విద్యార్థి చదవడం, రాయడం, గణితంలో ప్రాథమిక నైపుణ్యాలను సాధించేలా కృషి చేయడం ఉపాధ్యాయులందరి ప్రధాన బాధ్యత అని ఆయన పేర్కొన్నారు.ఈ సమావేశంలో జిల్లా విద్యాశాఖాధికారి జి. శారద, ఏఎంఓ డా.పి.ఎం. షేక్,డీఆర్పీలు,ఎంఈఓలు,కాంప్లెక్స్ హెడ్‌మాస్టర్లు,180 ఎఫ్ఎల్ఎన్ కాంపిటెంట్ పాఠశాలలప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

# నేతన్నలకు చేతినిండా పనే ప్రభుత్వ లక్ష్యం

ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్




**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** నేతన్నలకు చేతినిండా పని కల్పించి, వారి ఆర్థిక స్థితిగతులను మెరుగుపరచడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ తెలిపారు. జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా కోర్టు నుంచి పాత బస్ స్టాండ్ వద్ద ఉన్న నేతన్న విగ్రహం వరకు ఆది శ్రీనివాస్ జెండా ఊపి ర్యాలీని ప్రారంబించి ప్రభుత్వ విప్, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, చేనేత, వస్త్ర పరిశ్రమ కార్మికులతో కలిసి భారీ ర్యాలీ తీశారు. అనంతరం నేతన్న ఈ గ్రహానికి ప్రభుత్వ విప్, జిల్లా కలెక్టర్ నేతన్న విగ్రహానికి పూ లమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ ముఖ్యమం త్రి రేవంత్ రెడ్డి నాయకత్వం, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సిరిసిల్ల చేనేత, వస్త్ర పరిశ్రమకు ప్రభుత్వం అండగా నిలుస్తుందని తెలిపారు. సిరిసిల్లలోని నేతన్నలు, కార్మికులు, ఆసాములు, యజమానులకు సంవత్సరంలో సుమారు ఎనిమిది నెలల పాటు పని కల్పించే లక్ష్యంతో ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. 2025–26 సంవత్సరానికి సంబంధించిన చీరల బిల్లుల్లో 80 శాతం చెల్లించామని, మిగిలిన 20 శాతం కూడా త్వరలో చెల్లించేలా చర్యలు తీసుకుంటామని అన్నారు. భూదాన్ పోచంపల్లిలో వస్త్రాల బకాయిల చెల్లింపుపైనా ప్రభుత్వం దృష్టి సారించిందని పేర్కొన్నారు. నేతన్నల సంక్షేమం కోసం త్రిఫ్ట్ పథకం ద్వారా కార్మికుల పొదుపునకు ప్రభుత్వం సమానంగా చేయూతనిస్తోందన్నారు. నేతన్నల బీమా పథకం ద్వారా ఇప్పటివరకు సిరిసిల్లలో 129 మందికి రూ.5 లక్షల చొప్పున ఆర్థిక సహాయం అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ, సత్యనారాయణ గౌడ్, శ్రీధర్ బాబు, సంతోష్, తహసీల్దార్ మహేష్, మున్సిపల్ కమిషనర్ ఖదీర్ పాషా, సంగీతం శ్రీనివాస్, సుర దేవరాజు,చేనేత, వస్త్ర పరిశ్రమ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

## నిరవధిక దీక్షలు




**ప్రజాపక్షం/గోదావరిఖని :** మారుపేర్లు, విజిలెన్స్ పెండింగ్ కేసుల పరిష్కారం కోరుతూ సింగరేణి 11 ఏరియాల బాధితులు గోదావరిఖని ఆర్‌జి1 ఏరియా జీఎం కార్యాలయం ఎదుట నిరవధిక దీక్షను శుక్రవారం ప్రారంభించారు. అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పించి దీక్ష చేపట్టారు. విజిలెన్స్ కేసులు పరిష్కరించాలని, కమిటీల పేరుతో కాలయాపన చేయకుండా వెంటనే తమకు ఉద్యోగాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ దీక్షల్లో లక్కా శ్రావణ్‌గౌడ్, పార్తపల్లి హరీష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు. దీక్షా శిబిరాన్ని గోదావరిలోయ బొగ్గు గని కార్మిక సంఘం(ఇఫ్టూ) రాష్ట్ర వర్కింగ్ ప్రసిడెంట్ కామ్రేడ్ ఐ.కృష్ణ, పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు ఈ.నరేష్, రాష్ట్ర కార్యదర్శి బి.అశోక్, నాయకులు చిలుక శంకర్, ఐ.రాజయ్య, మల్లేష్, చింతల శేఖర్, కాజీపేట ధర్మేందర్, ఈదునూరి రామకృష్ణలు సందర్శించి ఆందోళనకారులకు తమ మద్ధతును తెలిపారు.

# ప్రారంభోత్సవానికి సిద్ధమైన నూతన కలెక్టరేట్

అన్ని వసతులతో
సర్వాంగ సుందరంగా ముస్తాబు
ఈనెల 16న ప్రారంభోత్సవానికి
ముహూర్తం ఖరారు

**ప్రజాపక్షం/కరీంనగర్:** పరిపాలనను మరింత చేరువ చేసేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మించిన సమీకృత కలెక్టరేట్ కాంప్లెక్స్ ను అన్ని వసతులతో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్ది ప్రారంభోత్సవానికి సిద్ధం చేస్తున్నారు. ఈనెల 16న రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించేందుకు ముహూర్తం ఖరారు చేసినట్లు సమాచారం. రాష్ట్రంలో ఏర్పడ్డ నూతన జిల్లాలకు అన్ని ప్రభుత్వ శాఖలు ఒకే దగ్గర ఉండే విధంగా సమీకృత కలెక్టరేట్ కాంప్లెక్స్‌లకు 2017, 2018లలో శంకుస్థాపన చేశారు. కరీంనగర్ జిల్లాకు మాత్రం 2022లో ప్రస్తుతం ఉన్న కలెక్టరేట్ వెనుక భాగంలో నూతన కలెక్టరేట్‌ను నిర్మించేందుకు శంకుస్థాపన చేశారు. రూ.51 కోట్ల వ్యయంతో జి ప్లస్ 2 అంతస్తుల నిర్మాణ పనులను ప్రారంభించారు. రెండేళ్లలో పనులు పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని అనుకున్నప్పటికీ అసెంబ్లీ ఎన్నికలు రావడం ప్రభుత్వం మారడంతో దాదాపు నాలుగేళ్లు ఆలస్యమైంది.



**అన్ని వసతులతో సిద్ధం:** కరీంనగర్ నగరానికి సరికొత్త ఐకాన్‌గా ఈ భవన సముదాయం జిల్లా ప్రతిష్టకు అభివృద్ధికి నిలువెత్తు సాక్ష్యంగా నిలవనుంది. ప్రజల కలలను సాకారం చేస్తూ పరిపాలనను మరింత చేరువ చేయనుంది. రూ.51 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్ ఈ భవనం ఆధునిక హంగులతో రూపుదిద్దుకుంటుంది. కార్యాలయాల్లో ఏసీలు, ఫర్నిచర్, కర్టెన్లు, విద్యుత్, తాగునీరు సదుపాయం, నీ ఫైబర్ నెట్‌వర్క్ తదితర అన్ని మౌళిక వసతులు ప్రారంభానికి సిద్ధమయ్యాయు. మీటింగ్ హాల్ తోపాటు వీవీఐపిల సమావేశాలకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నారు. కలెక్టరేట్ వచ్చే మహిళలు, వృద్ధులు, దివ్యాంగులు, ఇతర ప్రజలకు ఏలాంటి ఇబ్బంది లేకుండా సౌకర్యాలు చేస్తున్నారు. జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా ఎప్పటికప్పుడు నిర్మాణ పనులను పర్యవేక్షిస్తూ సూచనలు చేస్తున్నారు. అన్ని ప్రభుత్వ శాఖలు ఒకే సముదాయంలో ప్రస్తుతం జిల్లాలోని వివిధ ప్రభుత్వ శాఖలు నగరంలో వేర్వేరు ప్రాంతాల్లో చెల్లాచెదురుగా ఉన్నాయి. దీంతో సామాన్య ప్రజలు తమ పనుల నిమిత్తం ఒక ఆఫీసు నుంచి మరో ఆఫీసుకు కిలోమీటర్ల మేర తిరగాల్సి వస్తోంది. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతూ ప్రభుత్వం ఈ సమీకృత భవనాన్ని నిర్మించింది. దీంతో దాదాపు 38కి పైగా ప్రభుత్వ శాఖలు ఒకే సముదాయంలో కొలువుదీరనున్నాయి. ఫలితంగా ప్రజలకు శ్రమ, సమయం ఆదా అవ్వడమే కాకుండా శాఖల మధ్య సమన్వయం పెరిగి పరిపాలనలో వేగం, పారదర్శకత వస్తుందని అధికారులు భావిస్తున్నారు. ఈ నూతన కాంప్లెక్స్‌లో కలెక్టర్, అదనపు కలెక్టర్ ఛాంబర్లతో పాటు విశాలమైన వెయిటింగ్ హాళ్లు, డిజిటల్ సేవా కేంద్రాలు, అత్యంత ఆధునిక మీటింగ్ హాళ్లు ఏర్పాటు చేశారు. కలెక్టరేట్ ముందు తెలంగాణ తల్లి విగ్రహం ఈ కాంప్లెక్స్‌కు ప్రధాన ఆకరషణగా నిలవనుంది. వీటితోపాటు అంతర్గత సీసీ రోడ్లు, ఆకర్షణీయమైన విద్యుత్ దీపాలు, సువిశాల పార్కింగ్ స్థలం పచ్చదనంతో కూడిన హరిత వాతావరణం పనులు పూర్తయ్యాయి. రాత్రి వేళల్లో ఈ



భవన సముదాయం విద్యుత్ కాంతులతో ధగధగలాడేలా ప్రత్యేక అలంకరణలు చేస్తున్నారు. పీఎప్ కార్యాలయం పక్కన ఏర్పాటు చేసిన ప్రధాన గేట్ ను ఆకర్షణియంగా తీర్చిదిద్దుతున్నారు.

**ఈ నెల 16న ముహూర్తం ఖరారు:** అన్ని పనులు పూర్తి చేసుకున్న కలెక్టరేట్ ను ఈనెల 16న రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతులమీదుగా ప్రారంభించేందుకు ముహూర్తం ఖరారు చేసినట్లు సమాచారం. మొదట రాష్ట్ర అవతరణ దినోత్సవం జూన్ 2న ప్రారంభించాలని అనుకున్నా నిర్మాణ పనులు పూర్తి కాకపోవడంతో వాయిదా పడింది. ఎట్టకేలకు ఈనెల 16న సీఎం చేతుల మీదుగా ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. అయితే సీఎం రేవంత్ రెడ్డి హాజరవుతారా లేక వర్చువల్‌గా ప్రారంభిస్తారా అనేది స్పష్టత రావాల్సి ఉంది.

తెలంగాణా ప్రభుత్వము

ఫారం-6

(ప్రాథమిక ప్రకటన)

(చట్టం -30/2013 లోని 11(1) మరియు సబ్ రూల్-1, రూల్ 19 ప్రకారం)

| | |
|---|---|
| ప్రత్యేక ఉప కలెక్టర్ (భూ.సే) ఆర్&ఆర్ ఇరిగేషన్ ప్రాజెక్ట్స్, యస్.ఆర్.ఎల్.ఐ.పి. యూనిట్-I, పాల్వంచ ఆర్.సి.నెం. బి /334//2024 | తేది:23-07-2026 |
| జిల్లా కలెక్టర్, భద్రాద్రి కొత్తగూడెం గారి ఉత్తర్వులు నెం. జి/2194/2026 | తేది:24-07-2026 |
| భద్రాద్రి కొత్తగూడెం జిల్లా రాజ పత్రము నెం. బి3/46/2026 | తేది:28-07-2026 |

ఈ దిగువ నిర్దిష్ట పరచిన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ మండలం, సంగం గ్రామంలో ఉన్న భూమి విస్తీర్ణం ఎ.**24-15 1/2 గుంటలు** ప్రజా ప్రయోజనం నిమ్మిత్తం అనగా సీతారామ ఎత్తిపోతల ప్రాజెక్ట్ క్రింద డిస్ట్రిబ్యూటరి కెనాల్ 5L, 5L-LM-1, 5L మరియు 6L, ప్యాకేజి నెం.1, సంగం గ్రామము వద్ద ఈ దిగువ చూపిన భూమి అవసరమై ఉన్నదని భావించినందున భూసేకరణ, పుణరావాస, పునఃనిర్మాణం కల్పనకు పారదర్శకత మరియు హేతుబద్ధమైన పరిహారాన్ని పొందే హక్కుచట్టం 30/2013 లోని సెక్షన్ 11(1) అనుసరించి ప్రకటన జారిచేయనైనది.

భూసేకరణ వలన భూనిర్వాసితులయ్యే కుటుంబాలు ఏమియులేవు. నిర్వాసిత కుటుంబాల పుణరావాస, పునఃనిర్మాణం అంశాలకు అదనపు కలెక్టర్ (రెవిన్యూ) భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వారు ప్రాజెక్ట్ అడ్మినిస్ట్రేటర్ అధికారిగా నియమించబడినారు. కావున ఈ ప్రాజెక్ట్ క్రింద భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ మండలం, సంగం గ్రామంలోని విస్తీర్ణం ఎ. **24-15 1/2 గుంటలు** గల భూమి ఈ క్రింద చూపిన విధంగా భూసేకరణ నిమిత్తం ప్రాథమిక ప్రకటన జారీచయనైనది.

షెడ్యూల్

గ్రామం :: సంగం మండలం:: పాల్వంచ జిల్లా : భద్రాద్రి కొత్తగూడెం

| క్ర.సం. | సర్వే నెం. (సబ్ డివిజన్ ప్రకారం) | సర్వే నెం. (పహాణి ప్రకారం) | భూమి స్వభావం (యాజమాన్యం) | భూమి యొక్క రకం (మెట్ట/తరి) | సేకరించుటకు విస్తీర్ణం | ఆసక్తి గల వ్యక్తి పేర్లు మరియు చిరునామా: భూమి (యాజమాన్యం) | అనుభవదారుని పేరు | హద్దులు: చెట్లు రకం |
|---|---|---|---|---|---|---|---|---|
| 1 | 2 | 3 | 4 | 5 | 6 | 7 | 8 | 9 |
| 1 | 70/2 | 70 | ప్రభుత్వ భూమి | మెట్ట | 1.00 | ప్రభుత్వ భూమి | ఎంజరపు గోపయ్య, త: బుచ్చి రామయ్య | జామాయిల్ తోట, వేప చెట్లు-02, తాటి చెట్లు-03 |
| 2 | 70/2 | 70 | ప్రభుత్వ భూమి | మెట్ట | 0.17 1/2 | ప్రభుత్వ భూమి | మేకల దుర్గ ప్రసాద్ త: బాబు | తాటి చెట్లు-05 |
| 3 | 76/2 | 76 | పట్టా | మెట్ట | 0.21 | ముల్లంగి సుబ్బారెడ్డి త: వెంకట రెడ్డి | మేకల దుర్గ ప్రసాద్ త: బాబు | Nil |
| 4 | 76/2 | 76 | పట్టా | మెట్ట | 0.19 1/2 | ముల్లంగి సుబ్బారెడ్డి త: వెంకట రెడ్డి | ముల్లంగి సుబ్బారెడ్డి త: వెంకట రెడ్డి | Nil |
| 5 | 76/2 | 76 | పట్టా | మెట్ట | 0.15 | ముల్లంగి సుబ్బారెడ్డి త: వెంకట రెడ్డి | భూక్య లక్ష్మన్ త: భద్రు | జామాయిల్, |
| 6 | 76/2 | 76 | పట్టా | మెట్ట | 0.01 | ముల్లంగి సుబ్బారెడ్డి త: వెంకట రెడ్డి | శేషం యస్ వి ఆర్ కె చార్యులు త: గోపాలచారి | Nil |
| 7 | 75/2 | 75 | ప్రభుత్వ భూమి | మెట్ట | 0.09 1/2 | ప్రభుత్వ భూమి | మహమద్ మాగ్బుల్ త: ఇసాక్ (మరణం) | జామాయిల్ తోట వేపచెట్లు-02 సిందుగ చెట్లు-01 |
| 8 | 75/2 | 75 | ప్రభుత్వ భూమి | మెట్ట | 0.10 | ప్రభుత్వ భూమి | ముహమ్మద్ ముస్తాక్, త: ఐజాక్ | Nil |
| 9 | 75/2 | 75 | ప్రభుత్వ భూమి | మెట్ట | 0.03 1/2 | ప్రభుత్వ భూమి | శేషం యస్ వి ఆర్ కె చార్యులు త: గోపాల చారి | Nil |
| 10 | 71/2 | 71/1 | పట్టా | మెట్ట | 0.29 | యస్ వి ఆర్ కె ఆచార్యులు త: గోపాల చార్యులు | శేషం యస్ వి ఆర్ కె చార్యులు త: గోపాల చారి | జామాయిల్ వేపచెట్లు-01 |
| 11 | 71/2 | 71 | పట్టా | మెట్ట | 0.03 | శేషం వెంకట గోపాల చార్యులు త: శేషా చార్యులు | ధన్నూరు సత్యం, త: వీరయ్య | NIl |
| | | మొత్తం : | | | 4.09 | | | |

గ్రామం: సంగం మండలం: పాల్వంచ జిల్లా: భద్రాద్రి కొత్తగూడెం

జిల్లా కలెక్టర్, భద్రాద్రి కొత్తగూడెం గారి ఉత్తర్వులు నెం. జి/2195/2026 తేది:24-07-2026

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా రాజ పత్రము నెం. బి3/43/2026-(5L LM-1) తేది:28-07-2026

| క్ర.సం. | సర్వే నెం. (సబ్ డివిజన్ ప్రకారం) | సర్వే నెం. (పహాణి ప్రకారం) | భూమి స్వభావం (యాజమాన్యం) | భూమి యొక్క రకం (మెట్ట/తరి) | సేకరించుటకు విస్తీర్ణం | ఆసక్తి గల వ్యక్తి పేర్లు మరియు చిరునామా: భూమి (యాజమాన్యం) | అనుభవదారుని పేరు | హద్దులు: చెట్లు రకం |
|---|---|---|---|---|---|---|---|---|
| 1 | 2 | 3 | 4 | 5 | 6 | 7 | 8 | 9 |
| 1 | 76/4 | 76 | పట్టా | మెట్ట | 0.32 1/2 | ముల్లంగి సుబ్బారెడ్డి త: వెంకట్ రెడ్డి | ముల్లంగి సుబ్బారెడ్డి త: వెంకట్ రెడ్డి | వేపచెట్లు-05 |
| 2 | 77/2 | 77/A | పట్టా | మెట్ట | 1.05 | శేషం వెంకట గోపాల | ముల్లంగి సుబ్బారెడ్డి త: వెంకట్ రెడ్డి | Nil |
| 3 | 74/2 | 74 | ప్రభుత్వ భూమి | మెట్ట | 0.05 | చార్యులు తం.శేషా చార్యులు | ముల్లంగి సుబ్బారెడ్డి త: వెంకట్ రెడ్డి | Nil |
| 4 | 77/4 | 77 | పట్టా | మెట్ట | 0.30 1/2 | ప్రభుత్వ భూమి | పడవ వాసుదేవ రెడ్డి త: బుచ్చి రెడ్డి | పామాయిల్-52, ఫెన్సింగ్ స్తంభాల పైపైన్-45 |
| 5 | 79/2 | 79/1 | పట్టా | మెట్ట | 0.08 | పరవ వాసుదేవ రెడ్డి త: బుచ్చిరెడ్డి | గుర్రం సురేష్ త: చిన్న సాయిబు | Nil |
| 6 | 79/2 | 79/1 | పట్టా | మెట్ట | 0.04 | గుర్రం సురేష్ త: చిన్న సాయిలు | రోడ్ | NA |
| 7 | 79/2 | 79/3 | పట్టా | మెట్ట | 0.17 1/2 | గుర్రం సురేష్ త: చిన్న సాయిలు | గుర్రం వెంకటమ్మ భ: సత్యం | టేకుచెట్లు,-16 తాటి చెట్లు,-11 రావిచెట్లు-01 |
| 8 | 79/2 | 79/1 | పట్టా | మెట్ట | 0.01 | గుర్రం పెద్ద వెంకటమ్మ భ: సత్యం | పాకాల వెంకట్ రావు త: మోతి వీరయ్య | జామాయిల్,తోట |
| 9 | 79/2 | 79/2 | పట్టా | మెట్ట | 0.06 1/2 | గుర్రం సురేష్ త: చిన్న సాయిలు | గుర్రం రమేష్ బాబు త: భద్రయ్య | జామాయిల్,తోట తాటిచెట్లు-05 రావిచెట్లు-01 |
| 10 | 79/2 | 79/3 | పట్టా | మెట్ట | 0.03 | గుర్రం రమేష్ బాబు త: భద్రం | గుర్రం సత్యం త: స్వామి | తాటిచెట్లు-07 వేప-01 రవి చెట్లు-01 |
| 11 | 80/2 | 80 | పట్టా | మెట్ట | 0.00 1/2 | గుర్రం పెద్ద వెంకటమ్మ భ: సత్యం | గుర్రం రమేష్ బాబు త: భద్రయ్య | తాటిచెట్లు-07 వేప-01 రవి చెట్లు-01 |
| 12 | 80/2 | 80 | పట్టా | మెట్ట | 0.11 | శేషం వెంకట రామానుజమ్మ భ: శ్రీనివాస చార్యులు | గుర్రం సత్యం త: స్వామి | Nil |
| 13 | 80/2 | 80 | పట్టా | మెట్ట | 0.16 1/2 | శేషం వెంకట రామానుజమ్మ భ: శ్రీనివాస చార్యులు | గుర్రం భద్రం త: స్వామి | Nil |
| 14 | 82/2 | 82 | ప్రభుత్వ భూమి | మెట్ట | 0.02 1/2 | శేషం వెంకట రామానుజమ్మ భ: శ్రీనివాస చార్యులు | గుర్రం భద్రం తం: స్వామి | టేకుచెట్టు -01 |
| 15 | 82/2 | 82 | ప్రభుత్వ భూమి | మెట్ట | 0.01 1/2 | ప్రభుత్వ భూమి | డొంక | Nil |
| 16 | 82/2 | 82 | ప్రభుత్వ భూమి | మెట్ట | 0.04 | ప్రభుత్వ భూమి | పాకాల వెంకట్ రావు త: మోతి వీరయ్య | NA |
| 17 | 100/2 | 100 | పట్టా | మెట్ట | 0.08 1/2 | ప్రభుత్వ భూమి | పాకాల వెంకట్ రావు త: మోతి వీరయ్య | Nil |
| 18 | 100/2 | 100 | పట్టా | మెట్ట | 0.05 | శేషం శేషమ్మ భ: వెంకట నర్సింహా చార్యులు | ఇంగలపు వీరయ్య త: బాబు | పామాయిల్-22, ఫెన్సింగ్ స్తంభాల పైపైన్-38 |
| 19 | 100/2 | 100 | పట్టా | మెట్ట | 0.00 1/2 | శేషం శేషమ్మ భ: వెంకట నర్సింహా చార్యులు | ఇంగలపు వెంకట్ రావు త: బాబు | టేకు-01 |
| 20 | 100/2 | 100 | పట్టా | మెట్ట | 0.11 | శేషం శేషమ్మ భ: వెంకట నర్సింహా చార్యులు | సింధు అనసూర్య, భ. శ్రీను | Nil |
| 21 | 99/2 | 99 | పట్టా | మెట్ట | 0.04 1/2 | శేషం శేషమ్మ భ: వెంకట నర్సింహా చార్యులు | ముల్లంగి లక్ష్మీ నారాయణ రెడ్డి త: వెంకట్ రెడ్డి | జామాయిల్,తోట |
| 22 | 99/2 | 99 | పట్టా | మెట్ట | 0.01 | శేషం వెంకట రామానుజమ్మ భ: శ్రీనివాసా చార్యులు | దన్నురు బాబు, త: వీరయ్య | Nil |
| 23 | 99/2 | 99 | పట్టా | మెట్ట | 0.10 | శేషం వెంకట రామానుజమ్మ భ: శ్రీనివాసా చార్యులు | ముల్లంగి లక్ష్మీ నారాయణ రెడ్డి త: వెంకట్ రెడ్డి | Nil |
| 24 | 95/2 | 95/A | పట్టా | మెట్ట | 0.06 | శేషం వెంకట రామానుజమ్మ భ: శ్రీనివాసా చార్యులు | ముల్లంగి సీతా రామారెడ్డి త: వెంకట్ రెడ్డి | Nil |
| 25 | 96/2 | 96 | పట్టా | మెట్ట | 0.04 1/2 | శేషం వెంకట రాఘవాచార్యులు త: శేష చార్యులు | ఇంగలపు వీరయ్య త: బాబు రావు | టేకు చెట్లు-03 తాటి చెట్లు-02 |
| 26 | 96/2 | 96 | పట్టా | మెట్ట | 0.04 | శేషం వెంకట రాఘవాచార్యులు త: శేష చార్యులు | ఇంగలపు వెంకట్ రావు త: బాబు రావు | Nil |
| 27 | 15/2 | 15 | ప్రభుత్వ భూమి | మెట్ట | 0.01 | ప్రభుత్వ భూమి | ఇంగలపు వీరయ్య త: బాబు రావు, ఈంగాలపు వెంకట్ రావు త: బాబు రావు, | Nil |
| 28 | 15/2 | 15 | ప్రభుత్వ భూమి | మెట్ట | 0.01 | ప్రభుత్వ భూమి | డొంక | Nil |
| 29 | 15/2 | 15 | ప్రభుత్వ భూమి | మెట్ట | 0.03 | ప్రభుత్వ భూమి | కపర్తి వెంకట చారి త: అనంత రామ చారి | Nil |
| | | మొత్తం : | | | 6.09 | | | |

గ్రామం: నారాయణరావుపేట, మండలం: పాల్వంచ, జిల్లా: భద్రాద్రి కొత్తగూడెం

జిల్లా కలెక్టర్, భద్రాద్రి కొత్తగూడెం గారి ఉత్తర్వులు నెం. జి/2196/2026 తేది:24-07-2026

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా రాజ పత్రము నెం. బి3/41/2026-(5L) తేది:28-07-2026

| క్ర.సం. | సర్వే నెం. (సబ్ డివిజన్ ప్రకారం) | సర్వే నెం. (పహాణి ప్రకారం) | భూమి స్వభావం (యాజమాన్యం) | భూమి యొక్క రకం (మెట్ట/తరి) | సేకరించుటకు విస్తీర్ణం | ఆసక్తి గల వ్యక్తి పేర్లు మరియు చిరునామా: భూమి (యాజమాన్యం) | అనుభవదారుని పేరు | హద్దులు: చెట్లు రకం |
|---|---|---|---|---|---|---|---|---|
| 1 | 2 | 3 | 4 | 5 | 6 | 7 | 8 | 9 |
| 1 | 76/2 | 76 | ప్రభుత్వ భూమి | మెట్ట | 0.02 | ప్రభుత్వ భూమి | డొంకా ప్రభుత్వ భూమి | NA |
| 2 | 76/2 | 76 | ప్రభుత్వ భూమి | మెట్ట | 01.18 | ప్రభుత్వ భూమి | అటవీ శాఖకు చెందిన ప్రభుత్వ భూమి | NA |
| 3 | 76/4 | 76 | ప్రభుత్వ భూమి | మెట్ట | 0.11 | ప్రభుత్వ భూమి | అటవీ శాఖకు చెందిన ప్రభుత్వ భూమి | NA |
| 4 | 76/4 | 76 | ప్రభుత్వ భూమి | మెట్ట | 0.00 1/2 | ప్రభుత్వ భూమి | మేక రాణి, భ: శ్రీనివాస రావు | మామిడి చెట్లు-06 |
| 5 | 76/4 | 76 | ప్రభుత్వ భూమి | మెట్ట | 0.01 1/2 | ప్రభుత్వ భూమి | మేకా శ్రీరాములు త: పెద వీరయ్య | Nil |
| 6 | 76/4 | 76 | ప్రభుత్వ భూమి | మెట్ట | 0.11 | ప్రభుత్వ భూమి | కొల్లు ప్రసాద్ రెడ్డి త: చిన్న సుబ్బారెడ్డి | Nil |
| 7 | 76/4 | 76 | ప్రభుత్వ భూమి | మెట్ట | 0.15 | ప్రభుత్వ భూమి | మేకా నాగేశ్వరరావు త: కన్నయ్య | తాటి చెట్లు-06 |
| 8 | 76/4 | 76 | ప్రభుత్వ భూమి | మెట్ట | 0.07 1/2 | ప్రభుత్వ భూమి | తంపురి ఈదమ్మ భ: వెంకయ్య | NIl |
| 9 | 77/2 | 77 | ప్రభుత్వ భూమి | మెట్ట | 0.16 | కొల్లు సత్యనారాయణ రెడ్డి | తంపురి ఈదమ్మభ: వెంకయ్య | Nil |
| 10 | 77/2 | 77/E | ప్రభుత్వ భూమి | మెట్ట | 0.03 | కొల్లు సత్య నారాయణ రెడ్డి త: పుల్లా రెడ్డి | మేక పెద్ద వీరయ్య త: ముత్తయ్య | వేప చెట్లు-03, భూగర్భ నీటి పైపులైన్ |
| 11 | 76/5 | 76 | ప్రభుత్వ భూమి | మెట్ట | 0.00 1/2 | ప్రభుత్వ భూమి | మేక పెద్ద వీరయ్యత: ముత్తయ్య | భూగర్భ నీటి పైపులైన్ |
| 12 | 76/5 | 76 | ప్రభుత్వ భూమి | మెట్ట | 0.02 1/2 | ప్రభుత్వ భూమి | తంపురి ఈదమ్మ భ: వెంకయ్య | NIl |
| 13 | 76/5 | 76 | ప్రభుత్వ భూమి | మెట్ట | 0.05 | ప్రభుత్వ భూమి | తమ్మళ్ల శివ నాగబాబు త: జోగయ్య | Nil |
| 14 | 76/5 | 76 | ప్రభుత్వ భూమి | మెట్ట | 0.12 | ప్రభుత్వ భూమి | తమ్మళ్ల వెంకటేశ్వర్లు త: కన్నయ్య | water Pipe line in under Ground |
| 15 | 76/5 | 76 | ప్రభుత్వ భూమి | మెట్ట | 0.06 | ప్రభుత్వ భూమి | తోట వెంకటేశ్వర్లు త: రోశయ్య | Nil |
| 16 | 76/5 | 76 | ప్రభుత్వ భూమి | మెట్ట | 0.06 | ప్రభుత్వ భూమి | తోట శ్రీను, త:పోషయ్య | Nil |
| 17 | 76/5 | 76 | ప్రభుత్వ భూమి | మెట్ట | 0.13 | ప్రభుత్వ భూమి | ఎర్రపోతు పుల్లయ్య త:వెంకయ్య | మామిడి చెట్లు, -02, భూగర్భ నీటి పైపులైన్ |
| 18 | 76/5 | 76 | ప్రభుత్వ భూమి | మెట్ట | 0.13 | ప్రభుత్వ భూమి | మేక పెద్ద వీరయ్యత: ముత్తయ్య | మామిడి చెట్లు,-05 వేప చెట్లు-04, కొబ్బరి చెట్లు-06, భూగర్భ నీటి పైపులైన్ |
| 19 | 59/2 | 59 | ప్రభుత్వ భూమి | మెట్ట | 0.07 | ప్రభుత్వ భూమి | మేక పెద్ద వీరయ్య త: ముత్తయ్య | Nil |
| 20 | 59/2 | 59 | ప్రభుత్వ భూమి | మెట్ట | 0.09 | ప్రభుత్వ భూమి | గుర్రం భద్రయ్య, త: స్వామి | Nil |
| 21 | 59/2 | 59 | ప్రభుత్వ భూమి | మెట్ట | 0.07 | ప్రభుత్వ భూమి | గుర్రం సత్యం త: స్వామి | లేవు |
| 22 | 59/2 | 59 | ప్రభుత్వ భూమి | మెట్ట | 0.07 | ప్రభుత్వ భూమి | గుర్రం హుస్సేన్, త:పుల్లయ్య | Nil |
| 23 | 59/2 | 59 | ప్రభుత్వ భూమి | మెట్ట | 0.06 | ప్రభుత్వ భూమి | గుర్రం నాగలక్ష్మి భ: చిన్న సాయిబు | వేప చెట్లు-2 |
| 24 | 59/2 | 59 | ప్రభుత్వ భూమి | మెట్ట | 0.14 | ప్రభుత్వ భూమి | రేగలగడ్డ పెంటయ్య త: నరసయ్య | జామాయిల్ తోట టేకు చెట్లు-12 తాటి చెట్లు-06 |
| 25 | 57/2 | 57 | ప్రభుత్వ భూమి | మెట్ట | 0.21 | ప్రభుత్వ భూమి | పల్లె ప్రకృతి వనం ప్రభుత్వ భూమి | Nil |
| 26 | 57/2 | 57 | ప్రభుత్వ భూమి | మెట్ట | 0.01 1/2 | ప్రభుత్వ భూమి | డోంకా ప్రభుత్వ భూమి | Nil |
| 27 | 57/2 | 57 | ప్రభుత్వ భూమి | మెట్ట | 0.03 | ప్రభుత్వ భూమి | మేక ప్రసాద్, త: లక్ష్మ య్య | Nil |
| 28 | 57/2 | 57 | ప్రభుత్వ భూమి | మెట్ట | .11 | ప్రభుత్వ భూమి | మేక శ్రీను, త:లక్ష్మ య్య | Nil |
| 29 | 57/2 | 57 | ప్రభుత్వ భూమి | మెట్ట | 0.02 | ప్రభుత్వ భూమి | మేక భద్రయ్య, త: కన్నయ్య | Nil |
| 30 | 57/2 | 57 | ప్రభుత్వ భూమి | మెట్ట | 0.02 | ప్రభుత్వ భూమి | మేక చిన్న వీర స్వామి త:కన్నయ్య | NIl |
| 31 | 59/4 | 59 | ప్రభుత్వ భూమి | మెట్ట | 0.10 | ప్రభుత్వ భూమి | మేక భద్రయ్య, త: కన్నయ్య | జమెల్ తోట టేకు చెట్లు-15 |
| 32 | 59/4 | 59 | ప్రభుత్వ భూమి | మెట్ట | 0.13 | ప్రభుత్వ భూమి | మేక చిన్న వీర స్వామి త: కన్నయ్య | జమెల్ తోట టేకు చెట్లు-28 |
| 33 | 59/4 | 59 | ప్రభుత్వ భూమి | మెట్ట | 0.17 1/2 | ప్రభుత్వ భూమి | ఎంజరపు గోపయ్య త: బుచ్చి రామయ్య | జమై తోట, తాటి చెట్లు-12, టేకు చెట్లు-06 |
| | | మొత్తం : | | | 7.34 1/2 | | | |

గ్రామం: గంగదేవిగుప్ప, మండలం: పాల్వంచ, జిల్లా: భద్రాద్రి కొత్తగూడెం

జిల్లా కలెక్టర్, భద్రాద్రి కొత్తగూడెం గారి ఉత్తర్వులు నెం. జి/2164/2026 తేది:22-07-2026

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా రాజ పత్రము నెం. బి3/35/2026-(6L) తేది:27-07-2026

| క్ర.సం. | సర్వే నెం. (సబ్ డివిజన్ ప్రకారం) | సర్వే నెం. (పహాణి ప్రకారం) | భూమి స్వభావం (యాజమాన్యం) | భూమి యొక్క రకం (మెట్ట/తరి) | సేకరించుటకు విస్తీర్ణం | ఆసక్తి గల వ్యక్తి పేర్లు మరియు చిరునామా: భూమి (యాజమాన్యం) | అనుభవదారుని పేరు | చెట్లు& కట్టడములు: చెట్లు రకం |
|---|---|---|---|---|---|---|---|---|
| 1 | 2 | 3 | 4 | 5 | 6 | 7 | 8 | 9 |
| 1 | 91/2 | 91 | పట్టా | మెట్ట | 0-07 | జక్కం వీర భద్రయ్య త: సుబ్బయ్య | ఏలూరు భక్కయ్య త: బుచ్చయ్య | జామాయిల్, తాటి-14 |
| 2 | 91/2 | 91 | పట్టా | మెట్ట | 0-09 | జక్కం వీర భద్రయ్య త: సుబ్బయ్య | ఏలూరి నాగేశ్వర రావు త: సీతా రామయ్య | జామాయిల్, తాటి-03 |
| 3 | 91/2 | 91 | పట్టా | మెట్ట | 0-07 | జక్కం వీర భద్రయ్య త: సుబ్బయ్య | ఏలూరి భీమయ్య త: పిచ్చయ్య | జామాయిల్ |
| 4 | 90/2 | 90 | పట్టా | మెట్ట | 0-07 | జక్కం వీర భద్రయ్య త: సుబ్బయ్య | ఏలూరి నాగేశ్వర రావు త: సీతా రామయ్య | ,, |
| 5 | 90/2 | 90 | పట్టా | మెట్ట | 0-15 | జక్కం వీర భద్రయ్య త: సుబ్బయ్య | ఏలూరి భీమయ్య త: పిచ్చయ్య | ,, |
| 6 | 90/2 | 90 | పట్టా | మెట్ట | 0-04 | జక్కం వీర భద్రయ్య త: సుబ్బయ్య | నజల శ్రీదేవి భ: నాగేశ్వర రావు | జామాయిల్ తాటి-03 వేప-01 |
| 7 | 90/2 | 90 | పట్టా | మెట్ట | 0-00 1/2 | జక్కం వీర భద్రయ్య త: సుబ్బయ్య | కొండ్రు రాజమ్మ భ: రాజులు | జామాయిల్, |
| 8 | 90/2 | 90 | పట్టా | మెట్ట | 0-02 | జక్కం వీర భద్రయ్య త: సుబ్బయ్య | కాకా చిన్న జోగయ్య త: పాపయ్య | లేవు |
| 9 | 90/2 | 90 | పట్టా | మెట్ట | 0-01 1/2 | జక్కం వీర భద్రయ్య త: సుబ్బయ్య | కాకా ముత్తయ్య త: పెద్ద జోగయ్య | లేవు |
| 10 | 90/2 | 90 | పట్టా | మెట్ట | 0-12 1/2 | జక్కం వీర భద్రయ్య త: సుబ్బయ్య | ఏలూరి రామారావు త: సత్యనారాయణ (లేట్) | జామాయిల్ |
| 11 | 82/2 | 82/AA /2 | పట్టా | మెట్ట | 0-02 | కాకా చిన్న జోగయ్య త: పాపయ్య | కాకా చిన్న జోగయ్య త: పాపయ్య | లేవు |
| 12 | 82/2 | 82/AA /1 | పట్టా | మెట్ట | 0-09 1/2 | కాకా జోగయ్య త: పాపయ్య | కాకా ముత్తయ్య త: పెద్ద జోగయ్య | లేవు |
| 13 | 82/2 | 82/A/2 | పట్టా | మెట్ట | 0-08 | కాకా చిన్న వెంకటేశ్వర్లు త: రామయ్య | కాక చింపమ్మ భ: చిన్న వెంకటేశ్వర్లు | లేవు |
| 14 | 83/2 | 83/A/1 | పట్టా | మెట్ట | 0-08 | కాకా ధర్మయ్య త: రామయ్య | కాకా ధర్మయ్య త: రాముదు | జామాయిల్ |
| 15 | 83/2 | 85/11/A | అసైన్డ్ పట్టా | మెట్ట | 0-14 | కాక భద్రమ్మ భ: పెద్ద ధర్మయ్య | కాకా భద్రమ్మ భ: పెద్ద ధర్మయ్య | జామాయిల్ |
| 16 | 83/2 | 85/19/A | అసైన్డ్ పట్టా | మెట్ట | 0-08 | కాకా చిన్న రాములు త: నాగులు | కాక చిన్న రాములు త: నాగులు | లేవు |
| 17 | 84/1/2 | 85/19/A | అసైన్డ్ పట్టా | మెట్ట | 0-13 1/2 | కాకా చిన్న రాములు త: నాగులు | కాక చిన్న రాములు త: నాగులు | జామాయిల్, తాటి-05, వేప-01, విప్ప చెట్లు-01 |
| 18 | 84/1/2 | 85/1/2 2/AA | అసైన్డ్ పట్టా | మెట్ట | 0-00 1/2 | కాకా కృష్ణ త: గోపయ్య | కాకా కృష్ణ త: గోపయ్య | తాటి-09 రావి చెట్లు-01 |
| 19 | 84/1/3 | 85/1/1 | అసైన్డ్ పట్టా | మెట్ట | 0-25 | సోడే రాజమ్మ భ: కన్నయ్య | సోడే రాజమ్మ భ: కన్నయ్య | జామాయిల్ |
| 20 | 84/1/3 | 85/1/2 2/A | అసైన్డ్ పట్టా | మెట్ట | 0-12 | కాక వెంకట నారాయణ త: గోపయ్య | కాక వెంకట రమణ త: గోపయ్య | జామాయిల్ |
| 21 | 84/1/4 | 85/3/1/2 | అసైన్డ్ పట్టా | మెట్ట | 0-14 | వరస రాములు త: నర్సయ్య | వరస రాములు త: నర్సయ్య | జామాయిల్ తాటి-05 వేప-02 |
| 22 | 84/1/4 | 85/3/1/1 | అసైన్డ్ పట్టా | మెట్ట | 0.14 | వరస రాజులు త: నర్సయ్య | వరస రాజులు త: నర్సయ్య | జామాయిల్ తాటి-05, వేప-01 |
| 23 | 84/1/4 | 85/1/15 | అసైన్డ్ పట్టా | మెట్ట | 0-04 1/2 | సోయం పున్నయ్య త: వెంకప్ప | సోయం పున్నయ్య త: వెంకప్ప | జామాయిల్ తాటి-10 వేప-03 |
| 24 | 84/1/4 | 85/3 | అసైన్డ్ పట్టా | మెట్ట | 0-01 1/2 | వరస ముత్తమ్మ భ: నాగయ్య | వరస ముత్తమ్మ భ: నాగయ్య | జామాయిల్ |
| 25 | 84/1/4 | 85 | అసైన్డ్ పట్టా | మెట్ట | 0-03 | ప్రభుత్వ భూమి | వాగు (ప్రభుత్వ) | లేవు |
| 26 | 84/1/5 | 84/A | అసైన్డ్ పట్టా | మెట్ట | 0-19 | వర్స వెంకమ్మ భ: ముత్తయ్య | వర్స వెంకమ్మ భ: ముత్తయ్య | నార వేప-01 |
| 27 | 84/1/5 | 85 | అసైన్డ్ పట్టా | మెట్ట | 0-01 | ప్రభుత్వ భూమి | పల్లె ప్రకృతి వనం | లేవు |
| 28 | 84/1/5 | 85 | అసైన్డ్ పట్టా | మెట్ట | 0-02 | ప్రభుత్వ భూమి | రోడ్ (ప్రభుత్వ భూమి) | లేవు |
| 29 | 84/1/5 | 85 | అసైన్డ్ పట్టా | మెట్ట | 0-05 | ప్రభుత్వ భూమి | వాసం నాగేశ్వర రావు త: వీరస్వామి | జామాయిల్ |
| 30 | 84/1/5 | 84/AA | అసైన్డ్ పట్టా | మెట్ట | 0-00 1/2 | కాకా రాములమ్మ భ: రామారావు | కాకా రాములమ్మ భ: రామారావు | లేవు |
| | | మొత్తం : | | | 5.30 | | | |

గ్రామం: రేపల్లెవాడ, మండలం: పాల్వంచ, జిల్లా: భద్రాద్రి కొత్తగూడెం

జిల్లా కలెక్టర్, భద్రాద్రి కొత్తగూడెం గారి ఉత్తర్వులు నెం. జి/2193/2026 తేది:24-07-2026

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా రాజ పత్రము నెం. బి3/45/2026-(5L) తేది:28-07-2026

| క్ర.సం. | సర్వే నెం. (సబ్ డివిజన్ ప్రకారం) | సర్వే నెం. (పహాణి ప్రకారం) | భూమి స్వభావం (యాజమాన్యం) | భూమి యొక్క రకం (మెట్ట/తరి) | సేకరించుటకు విస్తీర్ణం | ఆసక్తి గల వ్యక్తి పేర్లు మరియు చిరునామా: భూమి (యాజమాన్యం) | అనుభవదారుని పేరు | చెట్లు& కట్టడములు: చెట్లు రకం |
|---|---|---|---|---|---|---|---|---|
| 1 | 2 | 3 | 4 | 5 | 6 | 7 | 8 | 9 |
| 1 | 72/1/2 | 72 | ప్రభుత్వ భూమి | మెట్ట | 0-12 1/2 | ప్రభుత్వ భూమి | సైల్ సాయిబాబ తం: పాపయ్య | లేవు |
| 2 | 72/1/2 | 72 | ప్రభుత్వ భూమి | మెట | 0-00 1/2 | ప్రభుత్వ భూమి | పోతుమర్తి ముతయ్య తం: బాలయ్య | లేవు |
| | | విస్తీర్ణం : | | | 0-13 | | | |
| | | మొత్తం విస్తీర్ణం : | | | 24.15 1/2 | | | |

ఇట్టి నోటిఫికేషన్ భూసేకరణ భూ నిర్వాశితులు పునరావాసం మరియు పునఃనిర్మాణం చట్టం, 2013 (నెం.30/2013 సెక్షన్ 11(1) ప్రకారం సంబదిత భూ యజమానులకు సరియైన భూ నష్టపరిహారం చెల్లించుటకు గాను నోటిఫికేషన్ జారిచేయనైనది. భూమీయొక్క ప్లాను మరియు వివరములు జిల్లా కలెక్టర్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మరియు భూసేకరణ అధికారి మరియు ప్రత్యేక ఉప కలెక్టర్ (భూ.సే) ఆర్ & ఆర్ ఇరిగేషన్ ప్రాజెక్ట్స్, యస్.ఆర్.ఎల్.ఐ.పి. యూనిట్.I, పాల్వంచ గారి కార్యాలయంలో ఉంచనైనది సంబధిత వ్యక్తులు ఏదైన పనిదినములలో కార్యాలయ వేళలలో తనిఖీ చేసుకోవచ్చును.

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం/జిల్లా కలెక్టర్, భద్రాద్రి కొత్తగూడెం గారు, ప్రత్యేక ఉప కలెక్టర్ (భూ.సే) ఆర్ & ఆర్ ఇరిగేషన్ ప్రాజెక్ట్స్, యస్.ఆర్.ఎల్.ఐ.పి.యూనిట్.I, పాల్వంచ గారిని మరియు వారి సిబ్బందిని ఇట్టి భూసేకరణ సంబంధిత సెక్షన్12 ప్రకారం పైతెలిపిన భూములలో ఏదైన ప్రదేశములో ప్రవేశించి సర్వే భూమి కొలతలు తీసుకొనుటకు మరియు ఇత్యాది పనులు చేపట్టాడానికి అనుమతించనైనది.

సెక్షన్ 11(4) ప్రకారం భూసేకరణకు ప్రతిపాదించబడిన భూమి విషయంలో జిల్లా కలెక్టర్, భద్రాద్రి కొత్తగూడెం గారి అనుమతి లేకుండా ప్రాథమిక ప్రకటన జారిచేసిన తేదినుండి ఆ ప్రకటనలో ఉదాహరింపబడిన భూమి హక్కు సంబంధించి ఎటువంటి కొనుగోలు, అమ్మకం, తనఖా మొదలగు చర్యలు చేపట్టారాదు.

భూసేకరణ విషయాలో సంబందించిన భూయజమానులు ఏదైన అభ్యంతరములున్న యెడల చట్టం 15వ విభాగం ప్రకారం జిల్లా కలెక్టర్, భద్రాద్రి కొత్తగూడెం /భూసేకరణ అధికారి ప్రత్యేక ఉప కలెక్టర్ (భూ.సే) ఆర్&ఆర్ ఇరిగేషన్ ప్రాజెక్ట్స్, యస్.ఆర్.ఎల్.ఐ.పి. యూనిట్.I, పాల్వంచ వారికి ఇట్టి ప్రకటన జారీచేసిన (60) దినములలోపల ఏమైనా అభ్యంతరములున్న / యెడల తమ అభ్యంతరములు లిఖిత పూర్వకముగా తెలియచేయవలసి ఉన్నది.

| | | |
|---|---|---|
| సం/- | సం/- | సం/- |
| యం.వి.రవింద్రనాథ్ | డి.వేణుగోపాల్ | అంకిత్ ఐ.ఏ.ఎస్., |
| ప్రత్యేక ఉప కలెక్టర్ (భూ.సే) ఆర్&ఆర్ ఇరిగేషన్ ప్రాజెక్ట్స్ సీతరామ ఎత్తిపోతల ప్రాజెక్ట్, యూనిట్-1, పాల్వంచ, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా | అదనపు కలెక్టర్ (రెవిన్యూ) భద్రాద్రి కొత్తగూడెం జిల్లా | కలెక్టర్ & జిల్లా మేజిస్ట్రేట్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా |

DIPR RO NO. 626/LA/PP/Advt/Pub/2026-27


# బిజెపికి భగవత్‌తో కొరవడిన సమన్వయం

- జెన్ జెడ్ యువతను దేశద్రోహులుగా ముద్ర వేయొద్దు వారి 'గాడ్‌ఫాదర్' సలహాను బిజెపి పాటించాలి
- కాక్రోచ్ జనతా పార్టీ (సిజెపి) కన్వీనర్ అభిజీత్ దీప్కే

**ఛత్రపతి సంభాజీనగర్ :** నిరసన చేస్తున్న జెన్ జెడ్ యువతను దేశద్రోహులుగా ముద్ర వేయవద్దని, తమ 'గాడ్‌ఫాదర్' అయిన ఆర్‌ఎస్‌ఎస్ అధిపతి మోహన్ భగవత్ ఇచ్చిన సలహాను పాటించాలని కాక్రోచ్ జనతా పార్టీ (సిజెపి) కన్వీనర్ అభిజీత్ దీప్కే బిజెపికి సూచించారు. అధికార పార్టీకి, దాని సైద్ధాంతిక గురువుకు మధ్య సమన్వయం కొరవడిందని ఆయన పేర్కొన్నారు. ముంబయిలో జెన్ జెడ్‌తో భగవత్ సంభాషించిన మరుసటి రోజు దీప్కే విలేకరులతో మాట్లాడుతూ, నీట్ పరీక్ష అవకతవకలపై జంతర్ మంతర్ వద్ద యువత చేస్తున్న ఆందోళన నిజమైన మనోవేదనల నుంచే పుట్టిందని ఆర్‌ఎస్‌ఎస్ అధిపతి అంగీకరించిన విషయంతో అధికార పార్టీ ఏకీభవించాలని దీప్కే డిమాండ్ చేశారు. గురువారం భగవత్ జెన్ జెడ్‌కు గట్టి మద్దతుగా నిలిచారు. వారి మనోవేదనలు నిజమైనవని, వారి నిజాయితీపై తనకు నమ్మకం ఉందని, యువత చేసే నిరసనలు వారిని 'దేశద్రోహులు'గా మార్చవని ఆయన నొక్కి చెప్పారు. గత నెలలో నీట్ పేపర్ లీక్‌పై సిజెపి నిరసనలు కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాకు దారితీసినప్పటి నుండి, జెన్ జెడ్ (సుమారుగా 1997–2012 మధ్య జన్మించినవారు), జెన్ ఆల్ఫా (2013–2025 మధ్య జన్మించినవారు) లను చేరుకోవడానికి రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ చేపట్టిన అత్యంత ముఖ్యమైన ప్రయత్నంగా ముంబయిలో ఆయన ప్రసంగాన్ని పరిగణిస్తున్నారు. సిజెపి పిలుపు మేరకు జులై 20న న్యూఢిల్లీలోని పార్లమెంటుకు జరిపిన మార్చ్ సందర్భంగా హింసాత్మకంగా మారిన ఈ నిరసనలను బిజెపి ప్రభుత్వం నిర్వహించిన తీరు వివిధ వర్గాల నుంచి విమర్శలను ఎదుర్కొంది. నిరసన చేస్తున్న యువతను దేశద్రోహులుగా పిలవకూడదని, వారి సమస్యలు నిజమైనవని మోహన్ భగవత్ చేసిన ప్రకటన అత్యంత ముఖ్యమైనదని దీప్కే అన్నారు. 'గతంలో బిజెపి అధ్యక్షుడు మమ్మల్ని వైరస్ అని, మాజీ విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ మమ్మల్ని ఉగ్రవాదుల బిటీమ్ అని పిలిచారు. ఇప్పుడు వారు మోహన్ భగవత్ మాట వినాలి, ఎందుకంటే ఆయన బిజెపికి గురువు, గాడ్‌ఫాదర్' అని దీప్కే వ్యాఖ్యానించారు. ఆర్‌ఎస్‌ఎస్ అధిపతిని విస్మరించడం ఆందోళనకర ధోరణి అని హెచ్చరిస్తూ, అధికార పార్టీ వ్యతిరేక పంథాను అనుసరిస్తున్నందున బిజెపి వైఖరికి, భగవత్ అభిప్రాయాలకు మధ్య ఏమాత్రం పొంతన లేదని సిజెపి నాయకుడు పేర్కొన్నారు. 'వారు తమ గురువు మాట వినకపోతే, ఇది ఆందోళన కలిగించే విషయం. ఇదే నిజమైతే, భగవత్ ఒక్కసారి బిజెపితో మాట్లాడాలి' అని ఆయన అన్నారు. జంతర్ మంతర్ నిరసనలకు సంబంధించి సోషల్ మీడియాలో వస్తున్న కథనాలపై స్పందిస్తూ, ప్రచారంలో ఉన్న క్లిప్‌లపై సమగ్ర విచారణ జరపాలని దీప్కే డిమాండ్ చేశారు. 'సోషల్ మీడియాలో వస్తున్న వీడియోలపై విచారణ జరగాలని నేను నమ్ముతున్నాను. విచారణ జరిపితే, (బిజెపి) ఐటీ సెల్ నుంచి వస్తున్న నకిలీ వీడియోలు బట్టబయలవుతాయి' అని ఆయన ఆరోపించారు. తూర్పు రాష్ట్రమైన జార్ఖండ్‌లో నియామక పరీక్షలలో జరిగిన అవకతవకలకు నిరసనగా ఆందోళన చేస్తున్న అభ్యర్థులకు సంఘీభావం తెలిపేందుకు సిజెపి బృందాలను పంపినట్లు దీప్కే తెలిపారు. విడివిడిగా జరుగుతున్న ఈ ఆందోళనలను విస్మరిస్తే, అవి త్వరలోనే దేశవ్యాప్త భారీ ఉద్యమంగా మారవచ్చని ఆయన హెచ్చరించారు. యువతకు సంబంధించిన సమస్యలపై ప్రజలను ఏకతాటిపైకి తీసుకురావడానికి తాము ప్రయత్నిస్తాము, రాజకీయ, సైద్ధాంతిక విభేదాలను పక్కనపెట్టి ప్రజలు ఏకమైతే, జంతర్ మంతర్ ఆందోళన సమయంలో మనం చూసిన విధంగానే ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురాగలరని దీప్కే విశ్వాసం వ్యక్తం చేశారు.

# సా...గని సభలు

- మూడవ వారంలోనూ పార్లమెంట్ ఉభయసభల్లో నిరసనలు, నినాదాలు
- నీట్ పేపర్‌లీక్, విద్యార్థులపై అమానుష చర్య, రామాలయం విరాళాల చోరీపై చర్చకు పట్టుబట్టిన ప్రతిపక్షాలు ● హోంమంత్రి సభకు వచ్చి ప్రకటన చేయాలని డిమాండ్
- లోక్‌సభ, రాజ్యసభల్లో కొనసాగిన వాయిదాల పర్వం



**న్యూఢిల్లీ :** నీట్ పేపర్ లీక్, విద్యార్థి నిరసనకారులపై పోలీసుల దురాగతాలు, అయోధ్యలోని రామ మందిరంలో విరాళాల చోరీ ఘటనలపై ప్రతిపక్ష సభ్యులు కొనసాగిస్తున్న నిరసనలతో వర్షాకాల సమావేశాల కార్యకలాపాలు ముందుకు సాగడం లేదు. శుక్రవారం కూడా సభా కార్యక్రమాలకు తీవ్ర అంతరాయం కలగడంతో ఉభయసభలు సోమవారానికి వాయిదా పడ్డాయి. రాజ్యసభలో ఉదయం 11 గంటలకు సమావేశమైన కొద్దిసేపటికే, కాంగ్రెస్ నేతృత్వంలోని ప్రతిపక్ష సభ్యులు కేంద్ర హోంమంత్రి అమిత్ షా హాజరు కావాలని డిమాండ్ చేయడంతో పాటు, నీట్ పేపర్ లీక్‌పై పార్లమెంటు వైపు కవాతు చేస్తున్న విద్యార్థులపై జులై 20న పోలీసులు జరిపిన చర్యపై ప్రకటన చేయాలని పట్టుబట్టడంతో సభను మొదట మధ్యాహ్నం వరకు వాయిదా వేశారు. మధ్యాహ్నం 12 గంటలకు సభ తిరిగి సమావేశమైనప్పుడు, నినాదాలు మళ్లీ ప్రారంభమయ్యాయి. ప్రతిపక్ష సభ్యులు అయోధ్య విరాళాల చోరీ అంశాన్ని లేవనెత్తారు. చైర్మన్ సి.పి. రాధాకృష్ణన్ పదేపదే విజ్ఞప్తి చేసినప్పటికీ, అంతరాయాలు కొనసాగడంతో సభను మరుసటి రోజుకు వాయిదా వేశారు. అమిత్ షా రాజ్యసభకు నిరంతరం గైర్హాజరు కావడాన్ని ప్రతిపక్ష నాయకుడు మల్లికార్జున్ ఖర్గే ప్రశ్నించారు. అయితే, పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు, హోం మంత్రి రోజంతా పార్లమెంటులోనే ఉన్నారని, మంత్రులు తమతమ మంత్రిత్వ శాఖలకు సంబంధించిన పనుల నిమిత్తం మాత్రమే సభా కార్యకలాపాలకు హాజరయ్యారని చెప్పుకొచ్చారు. ఏ మంత్రి సభకు హాజరు కావాలి, ఎప్పుడు హాజరు కావాలి అనే విషయాన్ని ప్రతిపక్షం నిర్ణయించలేదని ఆయన స్పష్టం చేశారు. అంతేకాకుండా, ప్రతిపక్ష పార్టీలు నినాదాలు చేస్తూ పార్లమెంటు నుండి వాకౌట్ చేశాయని ఆరోపించారు. ఈ గందరగోళం మధ్య, సభాధ్యక్షుడు పత్రాలను సమర్పించడం, కొందరు సభ్యులు జీరో అవర్ ప్రస్తావనలు చేయడం వంటి జాబితాలోని కార్యకలాపాలను కొనసాగించి, సభా కార్యకలాపాలను వాయిదా వేశారు.

**లోక్‌సభలోనూ పదే పదే అంతరాయం**

లోక్‌సభలో అవే సమస్యలపై పదేపదే అంతరాయాలు ఏర్పడ్డాయి. విద్యార్థులపై పోలీసుల అరాచకాలపై అమిత్ షా ప్రకటన ఇవ్వాలని డిమాండ్ చేస్తూ, రామమందిర విరాళాల దొంగతనం అంశాన్ని లేవనెత్తుతూ ప్రతిపక్ష సభ్యులు నినాదాలు కొనసాగించారు. నిరసనలు జరుగుతున్నప్పటికీ, సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల అభివృద్ధి (సవరణ) బిల్లు, 2026ను సభ ఎలాంటి చర్చ లేకుండానే ఆమోదించింది. సంబంధించిన పత్రాలు, వివిధ పార్లమెంటరీ కమిటీల నివేదికలను కూడా సభలో ప్రవేశపెట్టారు. ప్రభుత్వ వైఖరిని సమర్థిస్తూ, పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు మాట్లాడుతూ, షా ప్రతిరోజూ పార్లమెంటుకు హాజరై, రాత్రి పొద్దుపోయే వరకు అక్కడే ఉంటారన్నారు. సభలో ఏ మంత్రి సమాధానం చెప్పాలో నిర్దేశించే అధికారం ప్రతిపక్షానికి లేదని ఆయన స్పష్టం చేశారు. నిరసనలను విమర్శిస్తూ, సభా కార్యకలాపాలకు అంతరాయం కలిగించడం మానుకోవాలని ఆయన సభ్యులను కోరారు. సభ అధ్యక్షుడైన దిలీప్ సైకియా, ప్రతిపక్ష ఎంపిలు తమ తమ స్థానాలకు తిరిగి వెళ్లి, సభ సజావుగా పని చేసేందుకు వీలు కల్పించాలని పదేపదే విజ్ఞప్తి చేశారు. అయితే, నినాదాల హోరు కొనసాగడంతో 'జీరో అవర్' 16 నిమిషాల్లోనే వాయిదా పడింది, అలాగే లోక్‌సభ కూడా మరుసటి రోజుకు వాయిదా వేశారు. జులై 20న ప్రారంభమైన వర్షాకాల సమావేశాలు, నీట్ పేపర్ లీక్, విద్యార్థి నిరసనకారులపై పోలీసుల కఠిన చర్యలు, ఇతర అంశాలపై ప్రభుత్వం, ప్రతిపక్షాల మధ్య కొనసాగుతున్న విభేదాల కారణంగా పదే పదే అంతరాయాలకు గురయ్యాయి.

**ఓమ్ బిర్లాతో అమిత్ షా భేటీ**

నిరసన చేస్తున్న విద్యార్థులపై పోలీసుల అణచివేత, రామ మందిర విరాళాల అపహరణ ఆరోపణలపై ప్రభుత్వం, ప్రతిపక్షాల మధ్య కొనసాగుతున్న ప్రతిష్టంభన నేపథ్యంలో కేంద్ర హోం మంత్రి అమిత్ షా శుక్రవారం లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాను కలిశారు. జులై 20న పార్లమెంటుకు విద్యార్థులు చేసిన పాదయాత్రపై పోలీసులు బలప్రయోగం చేయడంపై షా నుంచి స్పందన కోరుతూ ప్రతిపక్షాలు లోక్‌సభ కార్యకలాపాలను అడ్డుకుంటున్నాయి. దీంతో అమిత్ షా, ఓమ్ బిర్లాతో ఆయన కార్యాలయంలో దాదాపు గంటసేపు సమావేశమయ్యారు. ఇదిలా ఉండగా, విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ పార్లమెంట్ హౌస్‌లోని షా కార్యాలయంలో ఆయనను కలిశారు.

# ఎంఎస్‌ఎంఇల అభివృద్ధి సవరణ బిల్లుకు లోక్‌సభ ఆమోదం

**న్యూఢిల్లీ :** ప్రతిపక్ష సభ్యుల నిరసనల మధ్య, సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు ఎదుర్కొంటున్న చెల్లింపుల జాప్య సమస్యను పరిష్కరించడానికి, వాటికి సాధికారత కల్పించడానికి ఉద్దేశించిన బిల్లును లోక్‌సభ శుక్రవారం ఎటువంటి చర్చ లేకుండానే ఆమోదించింది. 'సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల అభివృద్ధి (సవరణ) బిల్లు, 2026'కు ఇప్పుడు పార్లమెంటు ఆమోదం లభించింది. ఇది ఆగస్టు 3న రాజ్యసభలో ఆమోదం పొందింది. పరిపాలనా నిర్మాణాన్ని మెరుగుపరచడం, చెల్లింపు విధానాలను సులభతరం చేయడం ద్వారా ఎంఎస్‌ఎంఇ రంగం ఎదుర్కొంటున్న ప్రస్తుత సవాళ్లను పరిష్కరించడం ఈ బిల్లు లక్ష్యం. వివాదాల వేగవంతమైన పరిష్కారానికి కాలపరిమితులను నిర్దేశించడం, పరిష్కార ఒప్పందం ప్రకారం బకాయిల వసూలుకు వీలు కల్పించడం, నగదు లభ్యత (లిక్విడిటీ) సమస్యలను పరిష్కరించడం వంటి అంశాలు ఈ బిల్లులో ఉన్నాయి. కోర్టు ఉత్తర్వును రద్దు చేయాలని కోరుతూ దాఖలైన దరఖాస్తు ఆరు నెలల కంటే ఎక్కువ కాలం పెండింగ్‌లో ఉంటే, ఎంఎస్‌ఎంఇ సరఫరాదారులకు కోర్టు నిర్ణయించిన మొత్తంలో కనీసం 50 శాతాన్ని చెల్లించాలని ఆదేశించే అధికారాన్ని కూడా ఈ బిల్లు న్యాయస్థానాలకు కల్పిస్తుంది. భారతదేశ జిడిపిలో 31 శాతం, తయారీ రంగంలో 36 శాతం, ఎగుమతుల్లో 41 శాతం వాటాను ఎంఎస్‌ఎంఇలు కలిగి ఉన్నాయి. '2014–15లో రూ. 10 లక్షల కోట్లుగా ఉన్న ఎంఎస్‌ఎంఇల బకాయి రుణాల మొత్తం నేడు రూ. 38.35 లక్షల కోట్లకు పైగా పెరిగింది, ఇది ఎంఎస్‌ఎంఇలకు రుణ ప్రవాహం స్థిరంగా పెరుగుతోందని సూచిస్తోంది అని ఆగస్టు 3న రాజ్యసభలో బిల్లు ఆమోదం పొందే ముందు ఎంఎస్‌ఎంఇ శాఖ మంత్రి జితన్ రామ్ మాంఝీ పేర్కొన్నారు. శుక్రవారం నాడు వివిధ అంశాలపై ప్రతిపక్ష సభ్యులు లోక్‌సభలో తమ నిరసనలను కొనసాగించడంతో 'జీరో అవర్'కు అంతరాయం కలిగింది. సభ మొదటిసారి వాయిదా పడిన తర్వాత మధ్యాహ్నం 12 గంటలకు సమావేశమై, దాదాపు 16 నిమిషాల పాటు జరిగిన కార్యకలాపాల్లో ఈ బిల్లును ఆమోదించింది. ఆ తర్వాత, దిగువ సభ సోమవారం వరకు వాయిదా పడింది.

# కాంగ్రెస్ ఎంపీలకు విప్‌జారీ

**న్యూఢిల్లీ :** పార్లమెంట్‌లో అత్యంత కీలకమైన అంశాలపై ఈనెల 10, 11, 12 తేదీలలో చర్చ జరగనున్నందున, తమ ఎంపిలు సంబంధిత సభలకు తప్పనిసరిగా హాజరుకావాలని కోరుతూ కాంగ్రెస్ శుక్రవారం నాడు రాజ్యసభ, లోక్‌సభలోని తన సభ్యులకు విప్ జారీ చేసింది. ఆ మూడు రోజుల్లో తమ ఎంపిలు సభకు హాజరయ్యేలా చూడాలని 'ఇండియా' కూటమిలోని మిత్రపక్షాలకు కూడా కాంగ్రెస్ సూచించినట్లు సమాచారం. వచ్చే వారం పార్లమెంటులో వివాదాస్పద ఎఫ్‌సిఆర్‌ఎ సవరణ బిల్లుపై చర్చ, ఆమోదం కోసం చర్యలు చేపట్టనున్నారన్న వార్తల నేపథ్యంలో ఈ విప్ జారీ చేశారు. నియోజకవర్గాల పునర్విభజనకు సంబంధించిన రాజ్యాంగ సవరణ బిల్లును కూడా ప్రభుత్వం పరిశీలిస్తోందన్న చర్చ జరుగుతోంది. వచ్చే వారం జరగాల్సిన ప్రభుత్వ కార్యకలాపాల గురించి ప్రస్తావించినప్పుడు, పార్లమెంటరీ వ్యవహారాల శాఖ సహాయ మంత్రి ఎఫ్‌సిఆర్‌ఎ సవరణ బిల్లు లేదా నియోజకవర్గాల పునర్విభజనతో కూడిన మహిళా రిజర్వేషన్ బిల్లు గురించి ఎక్కడా ప్రస్తావించలేదు. రాజ్యసభలోని కాంగ్రెస్ చీఫ్ విప్ జారీ చేసిన 'త్రీలైన్ విప్'లో 'సోమవారం, మంగళవారం, బుధవారం రాజ్యసభలో అత్యంత కీలకమైన అంశాలపై చర్చ జరగనుంది. రాజ్యసభలోని కాంగ్రెస్ పార్టీ సభ్యులందరూ ఆ మూడు రోజుల్లో ఉదయం 11:00 గంటల నుండి సభ వాయిదా పడే వరకు తప్పనిసరిగా సభలో హాజరుగా ఉండి, పార్టీ వైఖరికి మద్దతు ఇవ్వాలని కోరడమైనది. దీనిని అత్యంత ముఖ్యమైన విషయంగా పరిగణించాలి' అని పార్టీ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేశ్ పేర్కొన్నారు. లోక్‌సభలోని కాంగ్రెస్ సభ్యులకు కూడా ఇదే తరహా విప్ జారీ చేశారు.

# హోర్ముజ్ తెరవాలంటే ఇరాన్‌తో ట్రంప్ రాజీ పడాల్సిందే

**వాషింగ్టన్:** హోర్ముజ్ జలసంధిని తెరవాలంటే అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఇరాన్‌తో రాజీ ఒప్పందానికి రావాల్సిందే. కానీ ఆయన పైకి మాత్రం లేనిపోని గాంభీర్యం ప్రదర్శిస్తున్నారు. ఒక ఒప్పందానికి చేరువలో ఉన్నామని అమెరికా–ఇరాన్‌కు చెందిన అధికారులు చెబుతున్నారు. హోర్ముజ్ జలసంధిని పూర్తిగా తెరవకపోవడం వల్ల ప్రపంచ వాణిజ్యం ఇప్పటికే చతికిలపడింది. ఒమన్ తీరానికి సమీపంలో ఉన్న మార్గం తెరిచే ఉందని సెంట్‌కామ్ చెబుతున్నది. సమస్య పరిష్కారమయ్యేవరకూ హోర్ముజ్ మూసే ఉంటుందని ఇరాన్ అంటున్నది. ఇరాన్ సుంకాలు వసూలు చేసే ఎలాంటి ఒప్పందాన్నైనా వ్యతిరేకిస్తామని ట్రంప్ చెబుతున్నారు. ఈ సమస్య నుండి బయటపడి తనపై పడిన అపఖ్యాతి తొలగించేకోవాలంటే తన స్వభావానికి విరుద్ధంగా రాజీపడాలి. లేకపోతే ఆయన చరిత్రహీనుడుగా మిగిలిపోతారు. ఈ మేరకు బెన్‌ఫిన్లీ, మాథ్యూ లీ రాసిన ఒక విశ్లేషణను పిటిఐ వార్తా సంస్థ ప్రచురించింది. రెండో ప్రపంచ యుద్ధం తర్వాత కనీవినీ ఎరుగనిస్థాయిలో భారీ దాడులు చేస్తామని ఒకవైపు ఇరాన్‌ను ట్రంప్ బెదిరిస్తుంటే, అమెరికా రక్షణమంత్రి పెట్ హెగ్సెత్,సెంట్‌కామ్ అధిపతి డాన్‌కైన్ వంటి వారు కీలక ఆయుధాలు తగినన్ని లేవని బాహాటంగా ప్రకటనలు చేయడం ద్వారా ట్రంప్ పరువు తీస్తున్నారు. వారిపై పూర్తిస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేసి దూరం చేసుకోలేక, దిగమింగుకోలేక ట్రంప్ మానసిక క్షోభ అనుభవిస్తున్నారు. పరువు కాపాడుకోవడానికి భారీ దాడి బెదిరింపులు ట్రంప్ చేస్తుంటే తాజాగా హెగ్సెత్ ఆయన పరువు తీశారు. ఆయనపై ట్రంప్ తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. మళ్ళీ ఆయనతో తన సంబంధాలు బాగా ఉన్నాయని చెప్పుకుంటూ నానా అవస్థా పడుతున్నారు. ఈ దశలో ఇరాన్‌కు నైతికంగా చాలా గొప్ప ధైర్యం లభించింది. ఇప్పటికే ఇరాన్‌కు ప్రపంచవ్యాప్తంగామద్దతు లభించడమే కాకుండా, అమెరికాను ఎదుర్కొని నిలబడిన దేశంగా కీర్తిప్రతిష్ఠలు కూడా లభించాయి. అవసరానికి మించినన్ని కీలక ఆ యుధాలు తమ వద్ద ఉన్నాయని ట్రంప్ ఇంకా ఇంకా బడాయి కబుర్లు చెబుతూనే ఉన్నారు. ఇలాంటి ప్రకటనలు చేసే ట్రంప్‌కు ఎలాంటి రాయితీలు ఇచ్చినా కష్టమే. ఓడిపోయిన వ్యక్తిగా ప్రపంచం ముందు నిలబడిపోవడం ట్రంప్‌కు భరించరాని విషయంగా ఉంటుందని, ఆయన దాని ని సహించలేరని విశ్లేషకులు అభిప్రాయపడ్డారు.



యుద్ధం చాలా తొందరలోనే ము గిసిపోతుందని ట్రంప్ మరోసారి తాజా ప్రకటన చేశారు. హోర్ముజ్ జలసంధిపైనే ఇప్పు డు ప్రధాన ప్రతిష్ఠంభన నెలకుంది. ట్రంప్ మొదటి నుండి చెబుతున్న ఇరాన్ అణ్వాయుధం వెనక్కు వెళ్ళిపోయింది.

ప్రపంచదేశాల చమురు రవాణాకు సంబంధించిన జలసంధి ప్రధానంగా తెరమీదకు వచ్చింది. యుద్ధానికి ముందునాటి పరిస్థితి ఇప్పుడు లేదని, ఇక ఇది బహిరంగ జలసంధిగా మారబోదని, ఈ జలసంధి తమ నియంత్రణలోనే ఉంటుందని ఇరాన్ ప్రకటించింది. పైగా ఒమన్,ఇరాన్ మధ్య ఒక ఒప్పందం కూడా ఇప్పుడు సాధ్యపడింది. ఈ ఒప్పందం ప్రకారం పర్షియన్ జలసంధిలోకి ప్రవేశించే అన్ని నౌకలూ ఇరాన్ ప్రాదేశిక జలాల్లోంచి వెళతాయి. ఒమన్ ప్రాదేశిక జలాల్లోంచి మహాసముద్రంలోకి ప్రవేశిస్తాయి. ఐదు నెలలుగా ఇరాన్‌పై 14,000కు పైగా దాడులు చేసింది.ఐనాగానీ ఇరాన్ గల్ఫ్‌దేశాలలో బలమైన క్షిపణులు,డ్రోన్లతో దాడులు కొనసాగిస్తోంది. ఐనాగానీ నిర్దిష్ట లక్ష్యాలు ట్రంప్‌కు లేవు. తాను స్వయంగా సృష్టించిన యుద్ధ సమస్య పరిష్కారానికి బిలియన్ల కొద్దీ డాలర్లు కావాలని పెంటగాన్ కోరుతోంది. ఈ అవసరాలు ఆయన పూర్తిగా తీర్చుస్థితిలో లేరు. మరోవైపు పెట్రోల్ ధర మండిపోతోంది. నవంబరులో అమెరికాలో ద్వైవార్షిక ఎన్నికలు జరుగుతాయి. ప్రత్యర్థులు పెద్ద సవాలు విసురుతున్నారు. దేశ ప్రజల్లో వ్యతిరేకత విపరీతంగా పెరిగిపోయిందని నెలవారీ సర్వేలు స్పష్టం చేస్తున్నాయి. ఈ దశలో ట్రంప్ లొంగిపోయేందుకు ఇష్టపడరు. కానీ లేని గాంభీర్యంతో మెలికలు పెట్టి రాజీపడేందుకు ఆయన ముందుకు రావొచ్చునని వాషింగ్టన్ ఇనిస్టిట్యూట్ నియర్ ఈస్ట్ పాలసీ ఫెలో షెంకర్ చెబుతున్నారు.

# సౌదీ, పాక్, టర్కీ రక్షణ ఒప్పందం



**రియాద్:** పశ్చిమాసియాలో తీవ్ర ఉద్రిక్తతలు ఎలాంటి పరిష్కారం లేకుండా కొనసాగుతున్న తరుణంలో సౌదీ అరేబియా, పాకిస్థాన్, టర్కీ దేశాల మధ్య రక్షణ ఒప్పందంపై సంతకాలు జరిగాయి. దాదాపు ఏడాదిపాటు జరిగిన చర్చల తర్వాత ఈ ఒప్పందంపై సంతకాలు జరిగాయి. ఈ ఒప్పందంతో ఈ మూడు దేశాలమధ్య భద్రతాసహకారం పెంపొందుతుంది. ఈ మూడు దేశాలు రక్షణ, భద్రత విషయంలో పరస్పర సహాయం చేసుకుంటాయి. ఈ మూడు దేశాలలో ఏ ఒక్కదేశంమీద దాడి జరిగినాగాని మిగతా దేశాలు తమ దేశంపై దాడి జరిగినట్లుగానే వా రు పరిగణించి స్పందిస్తారు. పాకిస్థాన్ విదేశీమంత్రిత్వశాఖ శుక్రవారం ఈ విషయం వెల్లడించింది. పాకిస్థాన్ ప్రధానమంత్రి షెహబాజ్ షరీఫ్, ఆయన సైన్యాధిపతి ఆసిఫ్ మునీర్ సౌదీఅరేబియాలో పర్యటించి మక్కాలో ఉమ్రా యాత్ర పూర్తిచేసిన మరునాడు ఈ ఒప్పందంపై సంతకాలు జరిగాయి. టర్కీ అ ధ్యక్షుడు రెసెప్ తయ్యప్ ఎర్డొగాన్ కూడా ఈ ఒప్పందంపై సంతకం చేశారు. సౌదీ దళాలకు పాకిస్థాన్ దశాబ్దాలుగా శిక్షణ,సైనిక సహాయం చేస్తున్నాయి. టర్కీ డ్రోన్లను కొనుగోలు చేసేందుకు సౌదీ అరేబియా 2023 లోనే అంగీకరించింది. హౌతీలు సౌదీఅరేబియాకు అతిపెద్ద బెడదగా మారారు. యెమెన్‌లో తమపై ఆంక్షలు ఎత్తివేసే రకూ సౌదీఅరేబియా నౌకలను ఎర్ర సముద్రంలో అనుమతించేదేలేదని హౌతీలు ప్రతిజ్ఞ చేశారు. వారిని ఎదుర్కొనేందుకు పెద్ద కూటమి తయారు చేయాలని సౌదీ అరేబియా ప్రయత్నాలు చేస్తోంది. పశ్చిమాసియా సంఘర్షణ సౌదీ అరేబియా చమురు ఎగుమతులను, ప్రతిష్ఠాత్మకమైన అభివృద్ధి ప్రణాళికను ప్రమాదంలో పడేసింది. అమెరికాను నమ్ముకున్న సౌదీఅరేబియాకు ఈ యుద్ధం వల్ల ఆశాభంగం ఎదురైంది.

## మలుచుకుందాం (మొదటి పేజీ తరువాయి)

పేర్కొన్నారు. పాలిమర్ పరిశ్రమ అభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని, పరిశ్రమలు ఎదుర్కొంటున్న సమస్యలపై సమగ్ర ప్రతిపాదనలు అందిస్తే సానుకూలంగా పరిశీలించి విధానపరమైన సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. హైదరాబాద్‌లోని హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో శుక్రవారం నిర్వహించిన హిప్లెక్స్–2026 అంతర్జాతీయ ప్లాస్టిక్స్, పాలిమర్స్, ప్రాసెసింగ్ టెక్నాలజీ, యంత్రాల ప్రదర్శనను ప్రారంభించిన అనంతరం మంత్రి మాట్లాడారు. పరిశ్రమల ప్రదర్శనల్లో తనకు యంత్రాలు మాత్రమే కనిపించవని, వాటి వెనుక వేలాది కుటుంబాల జీవనోపాధి, యువత భవిష్యత్తు, దేశాభివృద్ధికి కృషి చేస్తున్న పారిశ్రామికవేత్తల సంకల్పం కనిపిస్తుందని మంత్రి అన్నారు. ప్రతికూల పరిస్థితులు ఎదురైనా పెట్టుబడులు, విస్తరణ, ఆవిష్కరణలను కొనసాగించే పరిశ్రమల ఆత్మవిశ్వాసమే భారత ఆర్థిక వ్యవస్థకు బలమని చెప్పారు. దేశ తయారీ రంగంలో ప్లాస్టిక్స్, పాలిమర్ పరిశ్రమ కీలక పాత్ర పోషిస్తోందని శ్రీధర్ బాబు తెలిపారు. గృహనిర్మాణం, వ్యవసాయం, వైద్యరంగం, ఔషధ తయారీ, ఆటోమొబైల్, ఎలక్ట్రానిక్స్, ఆహార ప్రాసెసింగ్, మౌలిక వసతుల అభివృద్ధికి అవసరమైన ముడి పదార్థాలు ఈ రంగమే అందిస్తోందన్నారు. దేశవ్యాప్తంగా ఈ పరిశ్రమ ద్వారా 50 లక్షల మందికి ప్రత్యక్షంగా, కోటికి పైగా మందికి పరోక్షంగా ఉపాధి లభిస్తుందని, తెలంగాణలోనే రెండు లక్షల మందికి పైగా జీవనోపాధి ఈ రంగంపై ఆధారపడి ఉందని వివరించారు.ఎఐపిఎంఎ, టాప్మా, ఇండియన్ ప్లాస్టిక్స్ ఇన్‌స్టిట్యూట్ వంటి పరిశ్రమల సంఘాలు విధానపరమైన అంశాలు, మౌలిక వసతుల అవసరాలు, ఎదుర్కొంటున్న సమస్యలపై సమగ్ర ప్రతిపాదనలు అందిస్తే ప్రభుత్వం సానుకూలంగా పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటుందని మంత్రి స్పష్టం చేశారు. పరిశ్రమలతో నిరంతర సంప్రదింపులే తమ ప్రభుత్వ విధానమని అన్నారు. ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ పెట్టుబడులకు అనువైన రాష్ట్రంగా ఎదిగిందని పేర్కొన్న మంత్రి, ఐటి, ఫార్మా, ఎలక్ట్రానిక్స్ రంగాల్లో సాధించిన విజయాలను పాలిమర్ రంగంలోనూ పునరావృతం చేయడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ప్లాస్టిక్ ప్రాసెసింగ్, ఇంజినీరింగ్ ప్లాస్టిక్స్, మెడికల్ ప్లాస్టిక్స్, ప్యాకేజింగ్ టెక్నాలజీ, రీసైక్లింగ్, సర్క్యులర్ ఎకానమీ, ఈవీ విడిభాగాల తయారీ వంటి రంగాల్లో తెలంగాణకు విస్తృత అవకాశాలు ఉన్నాయని చెప్పారు.

**2030 నాటికి 20 లక్షల టన్నుల వినియోగ లక్ష్యం**

ప్రస్తుతం తెలంగాణ–ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో కలిపి సుమారు 13 లక్షల టన్నుల పాలిమర్ వినియోగం ఉందని, ప్రభుత్వం–పరిశ్రమల సమన్వయంతో 2030 నాటికి దీనిని 20 లక్షల టన్నులకు పెంచే లక్ష్యంతో ముందుకు సాగుతున్నట్లు మంత్రి వెల్లడించారు. పర్యావరణ పరిరక్షణకు అనుగుణంగా గ్రీన్ మాన్యుఫ్యాక్చరింగ్, రీసైక్లింగ్, సర్క్యులర్ ఎకానమీ విధానాలను అనుసరించే పరిశ్రమలకు ప్రభుత్వం ప్రత్యేక ప్రోత్సాహం అందిస్తుందని తెలిపారు. ఈ ప్రదర్శనలో భారత్‌తో పాటు విదేశాల నుంచి 550కు పైగా ఎగ్జిబిటర్లు, 50 వేలకుపైగా వ్యాపార సందర్శకులు పాల్గొంటున్నారు. ప్రారంభ కార్యక్రమంలో టాప్మా అధ్యక్షుడు నరేంద్ర బద్వా, హిప్లెక్స్ కన్వీనర్ మీలా జయదేవ్, ఎఐపిఎంఎ ఉపాధ్యక్షుడు వెన్నం అనిల్ రెడ్డి, సీనియర్ వైస్ ప్రెసిడెంట్ ఎన్. భాస్కర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## వరుణ యాగం (మొదటి పేజీ తరువాయి)

ఉత్తమ్‌కుమార్ రెడ్డి సారథ్యంలో వరుణ యాగం జరగనుంది. యాగం అనంతరం మహత్తర పూర్ణాహుతి కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొంటారని ముఖ్యమంత్రి కార్యాలయం తెలియజేసింది.

**17 నుంచి సిఎం రేవంత్ రెడ్డి బృందం విదేశీ పర్యటన**

తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల ఈ నెల 17వ తేదీ నుంచి విదేశీ పర్యటన చేయనున్నారు. ఈ నెల 17న నుంచి 22 రోజుల పాటు అమెరికా, లండన్, జర్మనీ, చైనా దేశాల్లో పర్యటించి సెప్టెంబర్ 10వ తేదీను రాష్ట్రానికి వస్తారు. ఈ పర్యటనకు ప్రభుత్వ సలహాదారు కె.మకృష్ణారావుతోపాటు అతి కొద్ది మంది ఉన్నతాధికారులతో కూడిన బృందం వెళ్లనుంది. సిఎం బృందం విదేశీ పర్యటనకు సంబంధించి ప్రభుత్వ అధికారుల ద్వారా తెలిసిన సమాచారం ప్రకారం సిఎం పర్యటనలో ఈ సారి పెట్టుబడులతోపాటు ప్రముఖ విదేశీ వర్సిటీల ఆఫ్ లైన్ క్యాంపస్‌లను తెలంగాణలో ఏర్పాటు చేయడం, లాంగ్, షార్ట్ టర్మ్ కోచింగ్ ఇవ్వడం వంటి అంశాలపై చర్చలు జరగనున్నాయి. రాష్ట్రంలో పెట్టుబడులకు సంబంధించి జర్మనీ, చైనా దేశాలకు చెందిన పలు ప్రముఖ కంపెనీల ప్రతినిధులతో సిఎం రేవంత్ బృందం చర్చించే అవకాశం ఉంది. రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్న రాయితీలు, ప్రోత్సాహకాలను వివరించి తెలంగాణలో పెట్టుబడులు పెటేందుకు ముందుకురావాలని సిఎం ఆ దేశాల పారిశ్రామిక, వ్యాపార వేత్తలకు విజ్ఞప్తి చేయనున్నారు. డిసెంబరులో నిర్వహించనున్న 'గ్లోబల్ సమ్మిట్2026'కు రావాలని ఆ దేశాల కంపెనీల ప్రతినిధులను ఆహ్వానించనున్నారు. ఆ దేశాల్లోని స్పోర్ట్స్, ఎడ్యుకేషన్ విధానాలను అధ్యయనం చేయనున్నారు.

## బహిర్గత పరచాలి (మొదటి పేజీ తరువాయి)

పాఠశాల విద్యాశాఖ schooledu.telangana.gov.in వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలని పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ ఇ.నవీన్ నికోలస్ శుక్రవారం ఆదేశాలు జారీ చేశారు. జిఒ ఎం.ఎస్. నం.1 (1 జనవరి, 1994) లోని రూల్ 16, 18 ప్రతిపాదనల ప్రకారం పాఠశాల గవర్నింగ్ బాడీ సభ్యుల సంతకాలతో కూడిన ఫీజుల నిర్ణయ పత్రాలను (సపోర్టింగ్ డాక్యుమెంట్లను) అధికారిక వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలి. ఫీజులను ఎలా నిర్ణయించారనే అంశాలకు సంబంధించి పాఠశాల గవర్నింగ్ బాడీ సభ్యుల సంతకాలతో కూడిన డాక్యుమెంట్లను కూడా పాఠశాల వెబ్‌సైట్ పోర్టల్‌లో పొందుపరచాలని విద్యాశాఖ స్పష్టం చేసింది.

ఫీజు వివరాలను బహిరంగ పర్చని పాఠశాలలకు షోకాజ్ నోటీసులు జారీ చేసి, జిఒలోని రూల్ 11 ప్రకారం తగిన చర్యలు తీసుకోవాలని రీజినల్ జాయింట్ డైరెక్టర్లకు,(ఆర్‌జెడి),జిల్లా విద్యాశాఖాధికారులను (డిఇఒ) విద్యాశాఖ ఆదేశించింది. అయితే రెండేళ్లకు ఒకసారి 8 శాతం ఫీజు పెంపును ప్రతిపాదిస్తూ ఏడాదిన్నర క్రితమే ముసాయిదా బిల్లును సిద్ధం చేసిన ప్రభుత్వం, దీనిపైన ప్రజల నుంచి సూచనలు, అభిప్రాయాలను స్వీకరించాలని భావించినప్పటికీ ఇప్పటి వరకు అమలుకు నోచుకోలేదు. ప్రభుత్వం నిర్ణయించిన ఫీజులపైన ప్రైవేటు యాజమాన్యాలు న్యాయస్థానాలను ఆశ్రయించగా, ప్రభుత్వం నిర్ణయించిన ఫీజుల ఉత్తర్వులు నిలిపివేశారు. దీంతో ప్రైవేట యాజమాన్యాలే ఫీజులను నిర్ణయిస్తోంది. ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజుల నియంత్రణ లేకపోవడంతో కొన్ని పాఠశాలల యాజమాన్యాలు అత్యధికంగా ఫీజులను నిర్ణయించారు. దీంతో ఫీజులను నియంత్రించాలని విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థి సంఘం నాయకులు రాష్ట్ర ప్రభుత్వాన్ని పదే పదే కోరుతున్న విషయం తెలిసిందే. తాజాగా పాఠశాల విద్యాశాఖ తీసుకున్న నిర్ణయంతో ఏ పాఠశాలలో ఎంత మేర ఫీజులను వసూలు చేస్తున్నారనే విషయమై స్పష్టత రానుంది. ఫీజుల వివరాల వెల్లడి విషయంలో పాఠశాల విద్యాశాఖ ఎటువంటి కాలపరిమితిని విధించకపోవడంతో ఇదే అదునుగా ప్రైవేటు పాఠశాలలు కాలయాపన చేసే అవకాశాలు లేకపోలేదనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.

# 'బర్త్ టూరిజం'పై ట్రంప్ కొత్త ఆంక్షలు

**సుప్రీంకోర్టు తీర్పుపై మండిపడిన ట్రంప్**

**వాషింగ్టన్:** జన్మహక్కులపై ఆంక్షలు విధించేందుకు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మళ్ళీ మరో ప్రయత్నం చేశారు. నూటయాభై ఏళ్లుగా అమెరికాలో అమలులో ఉన్న "పుట్టుకతో వచ్చే పౌరసత్వ హక్కులు"ను వేలాదిమంది దుర్వినియోగం చేస్తున్నారని, ఈ "బర్త్ టూరిజం"ను అడ్డుకునేందుకు కొత్త కార్యనిర్వాహక ఉత్తర్వు జారీ చే సినట్లు ప్రకటించారు. జన్మహక్కులను రద్దు చే సేందుకు ఇంతకుముందు ట్రంప్ ప్రయత్నం చేశారు. కానీ అమెరికా అత్యున్నత న్యాయస్థానం జూన్ 30వ ఆయనకు వ్యతిరేకంగా తీర్పు ఇచ్చి ఆ ప్రయత్నాలను వమ్ము చేసింది. ఆ తర్వాత కొద్ది వారాల తర్వాత ట్రంప్ ఈ రెండు కార్యనిర్వాహక ఉత్తర్వులపై సంతకాలు చేశారు. ఈ ఉత్తర్వుల ప్రకారం కొంతమంది దౌత్యాధికారుల కుటుంబాలలో పుట్టిన పిల్లలకు కూడా అమెరికాలో పౌరసత్వ హక్కులు లభించే అవకాశం లేదు. వేలాదిమంది గర్భవతులు అమెరి కా గడ్డమీద బిడ్డలను ప్రసవించడంకోసమే అమెరికాకు తరలి వస్తున్నారని ఈ ఉత్తర్వులో ట్రంప్ వాదిస్తున్నారు. ఆయన జారీ చేసిన మొదటి ఉత్తర్వు పౌరసత్వం పొందదానికి అర్హతలేని కుటుంబాలలో పుట్టే బిడ్డల జన్మహక్కుల నిర్వచనాన్ని విస్తరించేందుకు ఉద్దేశించినదికాగా, రెండో ఉత్తర్వు "బర్త్ టూరిజం"కు సంబంధించినది. 150 ఏళ్ళ క్రితం నాటి ఈ విధానాన్ని మా ర్పు చేయడానికి ఏనాడో చర్యలు తీసుకోవాల్సిందని, కానీ ఆ తప్పును తమ ప్రభుత్వం ఇప్పుడు సరిదిద్దుతోందని ట్రంప్ వ్యాఖ్యానించారు. అమెరికా సుప్రీంకోర్టు ఇచ్చిన ఉత్తర్వుపై తీవ్రస్థాయిలో ఆయన విమర్శలు చేశారు. స్వ ల్పతేడాతో కోర్టు మెజార్టీ తీర్పు ఇచ్చినప్పటికీ అది చాలా దురదృష్టకరమైనదని విమర్శించారు. 1868 జులై 9వ తేదీన అమెరికా రాజ్యాంగానికి చేసిన 14వ సవరణ అంతర్యుద్ధం తర్వాత సహజసిద్ధంగా పౌరసత్వం పొందినవారికి, బా నిసల పిల్లలకోసం ఉద్దేశించారని, కానీ ఈనా డు దానిని తీవ్రంగా దుర్వినియోగం చేస్తున్నారని విమర్శించారు. "అమెరికా దేశ ఔదార్యాన్ని అడ్డుగా పెట్టుకుని మన దేశాన్ని మోసం చేసేందుకు ప్రయత్నం చేస్తున్నారు, ఈ విధంగా మో సం చేసే విదేశీ శక్తుల నుండి అమెరికన్లకు తమ ప్రభుత్వం రక్షణ చర్యలు తీసుకుందని పేర్కొన్నారు.అమెరికా పౌరసత్వంలేని తల్లిదండ్రులకు పుట్టే బిడ్డలకు ఇంకమీదట ఎంతమాత్రం గ్రీన్ కార్డు దానంతట అదే స్వేచ్ఛగా లభించదు. ఇక మీదట పౌరసత్వంలేని తల్లిదండ్రులలో ఎవరైనా విదేశీ ఉద్యోగం చేస్తున్నా, ఉగ్రవాద సం స్థతో సంబంధాలు ఉన్నాగానీ, లేదా ఇతరత్రా తప్పుడు ఆరోపణలు వారిపై ఉన్నాగానీ వారి బిడ్డలకు గ్రీన్‌కార్డు లభించదు. ముఖ్యంగా రిపబ్లికన్‌పార్టీ ఎంపీలు ట్రంప్ వాదనలు ప్రచారం చేస్తున్నారు. శత్రుదేశాలైన చైనా,రష్యాలు ఈ ఉత్తర్వులను దుర్వినియోగం చేసి తమ దేశాన్ని మోసం చేస్తున్నారని వారు వాదిస్తున్నారు. ట్రం ప్ వలస వ్యతిరేక విధాన రూపకర్త మిల్లర్ మా ట్లాడుతూ, బిడ్డలను కనడంకోసమే చాలామంది అమెరికా వస్తున్నారని, దీనివల్ల నిజమైన అమెరికన్ల హక్కులు నాశనమవుతున్నాయని, వారికి సంక్షేమ పథకాలు లభించడంలేదని విమర్శించారు. ప్రతి సంవత్సరం బర్త్ టూరిజం ద్వారా అమెరికాలో 26000 మంది శిశుజననాలు జరుగుతున్నాయని మైగ్రేషన్ పాలసి ఇనిస్టిట్యూట్ తన నివేదికలో వెల్లడించింది. వీరిలో 10000 మంది తల్లులకు విదేశీ చిరునామాలున్నాయి.

## మండళ్లు (మొదటి పేజీ తరువాయి)

తెలియజేసే బాధ్యతాయుతమైన వ్యవస్థగా పనిచేయాలని జిల్లా కలెక్టర్లకు స్పష్టం చేశారు. హైదరాబాద్‌లోని సచివాలయంలో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజుతో కలిసి మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి జిల్లా కలెక్టర్లతో వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించి,సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి జిల్లా కలెక్టర్ అధ్యక్షతన నీటిపారుదల, వ్యవసాయ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, ఇతర సంబంధిత వర్గాలతో కూడిన జిల్లా నీటిపారుదల సలహా మండళ్లు ప్రతి పంట కాలానికి ముందు, పంట సీజన్లో తప్పనిసరిగా సమావేశమవ్వాలని సూచించారు. జలాశయాల నీటి నిల్వలు, ఆశించదగిన నీటి ప్రవాహాలు, స్థానిక వర్షపాతం, తాగునీటి అవసరాలు, కమాండ్ ఏరియాల్లోని సాగు పరిస్థితులను సమగ్రంగా సమీక్షించి రైతులకు శాస్త్రీయమైన, విశ్వసనీయమైన మార్గదర్శకాలు ఇవ్వాలని ఆదేశించారు. ప్రస్తుత జలాశయాల నీటి నిల్వలు, రుతుపవనాల మిగిలిన కాలంలో వర్షపాతం అంచనాలను పరిశీలిస్తే అత్యంత జాగ్రత్తతో పంటల ప్రణాళిక రూపొందించాల్సిన అవసరం ఉందన్నారు.

**ఆశించిన స్థాయిలో చేరని నీటి మట్టాలు..**

ముఖ్యంగా నాగార్జునసాగర్, శ్రీరాంసాగర్ ప్రాజెక్టుల్లో నీటి మట్టాలు ఇంకా ఆశించిన స్థాయికి చేరుకోలేదని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. నీటి లభ్యత తక్కువగా ఉన్న ప్రాజెక్టుల కింద రైతులు వరి వంటి అధిక నీటి అవసరమున్న పంటలను సాగు చేయవద్దని స్పష్టం చేశారు. ఆగస్టు తొలి వారంలో కురిసిన వర్షాలతో కొంత ఉపశమనం లభించినప్పటికీ, ఆ వర్షాల ఆధారంగా రైతులు వరి సాగుకు వెళ్లడం సముచితం కాదని సూచించారు. ప్రతి కమాండ్ ఏరియాలో ఎంత మేరకు సాగునీరు అందించగలమో, ఎక్కడ పరిమితులు ఉన్నాయో జిల్లా కలెక్టర్లు, నీటిపారుదల ఇంజినీర్లు, వ్యవసాయ అధికారులు రైతులకు అధికారికంగా తెలియజేయాలన్నారు.

**రాజకీయ ఒత్తిళ్లుక లొంగి.. విచక్షణరహితంగా నీటిని విడుదల చేయొద్దు..**

వచ్చే వేసవిలో రాష్ట్రంలో తాగునీటి సంక్షోభం తలెత్తకుండా ఇప్పటి నుంచే అవసరమైన నీటి నిల్వలను పరిరక్షించాలని గ్రామీణ నీటి సరఫరా శాఖ అధికారులను మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆదేశించారు. స్థానిక లేదా రాజకీయ ఒత్తిళ్లకు లోనై విచక్షణరహితంగా నీటిని విడుదల చేయరాదని హెచ్చరించారు. గ్రామీణ నీటి సరఫరా శాఖ ఇంజినీర్ఇన్‌చీఫ్, నీటిపారుదల శాఖ ఇంజినీర్ఇన్‌చీఫ్ ఓ.వి. రమేష్ బాబుతో సమన్వయం చే సుకుని భవిష్యత్తు తాగునీటి అవసరాలకు తప్పనిసరిగా ఎంత నీటిని నిల్వ ఉంచాలనే అంశాన్ని నిర్ణయించాలని ఆదేశించారు. ఇదిలా ఉండగా పౌర సరఫరాల శాఖ పనితీరుపైన కూడా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సమీక్షించారు. ఎన్నో సంవత్సరాల తర్వాత అర్హులైన కొత్త లబ్ధిదారులను ప్రజాపంపిణీ వ్యవస్థలో చేర్చి,వారికి రేష న్ కార్డుల జారీ ప్రక్రియను వేగవంతం చేస్తున్నామన్నారు.

## నిరవధిక సమ్మె (మొదటి పేజీ తరువాయి)

రాష్ట్రంలో ఆర్టీసీ తర్వాత అత్యధికంగా ప్రజలకు రవాణా సేవలు అందిస్తున్న రంగమని పేర్కొన్నారు. లక్షలాది మంది నిరుద్యోగులు అప్పులు చేసి ఆటోలు కొనుగోలు చేసి జీవనోపాధి పొందుతున్నారని, అలాంటి ఆటో డ్రైవర్ల సంక్షేమాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాకముందు ఆటో డ్రైవర్ల సమస్యలను పరిష్కరిస్తామని, ఏడాదికి రూ.12 వేల ఆర్థిక సాయం అందిస్తామని హామీ ఇచ్చిందని, అయితే ఇప్పటి వరకు ఆ హామీలు అమలు కాలేదని జేఏసీ ఆరోపించింది. ఆంధ్రప్రదేశ్‌లో ఆటో డ్రైవర్లకు ప్రభుత్వం ఆర్థిక సహాయం అందిస్తుండగా, తెలంగాణలో కూడా అదే తరహా సహాయం అందించాలని డిమాండ్ చేసింది. హైదరాబాద్‌లో ఆటో మీటర్ చార్జీలు చివరిసారిగా 2013లో సవరించారని, అనంతరం పెట్రోల్, డీజిల్, గ్యాస్, నిత్యావసర వస్తువుల ధరలు భారీగా పెరిగినా మీటర్ చార్జీలను సవరించలేదని పేర్కొంది. ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా వెంటనే మీటర్ చార్జీలు పెంచాలని కోరింది. ఓలా, ఊబర్, రాపిడో వంటి యాప్ సంస్థలు అధిక కమీషన్లు వసూలు చేస్తున్నాయని ఆరోపించిన జేఏసీ, వాటికి ప్రత్యామ్నాయంగా ప్రభుత్వమే సొంత యాప్‌ను తీసుకురావాలని కోరింది. అలాగే యాప్‌ల ద్వారా అక్రమంగా నడుస్తున్న ద్విచక్ర వాహన టాక్సీలను నిషేధించి ఆటో డ్రైవర్ల జీవనోపాధిని కాపాడాలని విజ్ఞప్తి చేసింది. జెఎసిలో ఎఐటియుసి, బిఎంఎస్, బిఆర్‌టియు, సిఐటియు, ఐఎన్‌టియుసి, టియుసిఐ, ఐఎఫ్‌టియు, టిఎన్‌టియుసి, టిఆర్‌టియు, టిఎడిఎస్, టిఎఎండియుతో పాటు పలు ఆటో సంఘాలు ఉన్నాయి.

## అడ్డుకట్ట (మొదటి పేజీ తరువాయి)

మున్సిపల్, రేరా, పంచాయతీరాజ్, విద్యుత్, ఆర్థిక, వాణిజ్య పన్నుల శాఖల మధ్య ఎఐ సాయంతో సమన్వయం చేసుకోవాలని ఈ సందర్భంగా సూచించారు. భారీ భవనాలు, కాంట్రాక్టు పనులకు సంబంధించిన అనుమతుల దరఖాస్తు దశలోనే నిర్మాణ సామాగ్రి అవసరాలను, దానికి అనుగుణంగా పన్నుల అంచనాలు వివరాలను నమోదు చేయాలన్నారు. ఈ డేటా తోపాటు మీసేవా, ఆరోగ్యశ్రీ, సిఎం రిలీఫ్ ఫండ్ వివరాలను సైతం సమీకృతం చేస్తే పరిపాలనలో ఉపయోగపడుతుందని సిఎం చెప్పారు. సమావేశంలో సిఎం సలహాదారు కె.రామకృష్ణా రావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, వాణిజ్య పన్నులు, ఎక్సైజ్ సెక్రటరీ రఘునందన్ రావు, ఎక్సైజ్ కమిషనర్ హరి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## నేహాపై సిరా దాడి (మొదటి పేజీ తరువాయి)

ఎఐఎస్‌ఎ, ఎఐఎస్‌ఎఫ్ మద్దతుదారులు, ఇతరులతో కూడిన నిరసనకారులు అసెంబ్లీ వైపుగా ప్రదర్శన చేస్తుండగా బిర్సా చౌక్ సమీపంలో ఈ ఘటన జరిగింది. 'ఆ వ్యక్తిని అమర్‌నాథ్ పాండేగా గుర్తించాం. అతడిని విచారిస్తున్నాం. మాకు ఎలాంటి అధికారిక ఫిర్యాదు అందనందున అతనిపై ఎఫ్‌ఐఆర్ నమోదు చేయలేదు' అని హతియా డిఎస్‌పి నీరజ్ కుమార్ పిటిఐకి తెలిపారు. ఈ ఘటనపై బోరా స్పందిస్తూ 'ఢిల్లీ నిరసన సందర్భంగా నేను పెల్లెట్‌గన్ కాల్పులు, లాఠీచార్జిని ఎదుర్కొన్నాను కాబట్టి, సిరా చల్లడం చూసి నేను భయపడబోను. దేశవ్యాప్తంగా ఉన్న విద్యార్థులు, యువత ఆగ్రహాన్ని సిరాతో అణచివేయవచ్చని వారు అనుకుంటున్నారా?' అని ప్రశ్నించారు. తాము శాంతియుత ప్రదర్శన నిర్వహిస్తుండగా, గుంపులోంచి అకస్మాత్తుగా ఒక వ్యక్తి బయటకు వచ్చి బోరాపై సిరా చల్లాడు అని ఐసా నాయకురాలు శివానీ అన్నారు.ఆ వ్యక్తి బిజెపి మద్దతు ఉన్న గూండా అని ఆమె ఆరోపించారు. సిరా దాడి అనంతరం బోరా మీడియాతో మాట్లాడుతూ విద్యార్థి ఉద్యమాన్ని బలహీనపరిచేందుకు బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ వర్గాలు ప్రయత్నిస్తున్నాయని ఆరోపించారు. 'నిరసన చేస్తున్న విద్యార్థులు లేవనెత్తిన అవే డిమాండ్లపై మేము ఇక్కడ శాంతియుత ప్రదర్శన నిర్వహిస్తుండగా, జైపాల్ సింగ్ స్టేడియం నుంచి విద్యార్థి ఉద్యమాన్ని తామే నిర్వహిస్తున్నామని చెప్పుకుంటున్న మితవాద, బిజెపి సభ్యులను నేను ఒక ప్రశ్న అడగాలనుకుంటున్నాను. అలాంటప్పుడు హింసకు పాల్పడాల్సిన అవసరం ఏముంది?' అని ఆమె అన్నారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాకు దారితీసిన ఢిల్లీ ఉద్యమంలో తాను భాగమైనందునే, ప్రతీకార చర్యగా బిజెపి ఈ ఘటనకు పాల్పడిందని బోరా ఆరోపించారు. 10న జైపాల్ సింగ్ ముండా స్టేడియంలో జరగనున్న నిరసన కార్యక్రమంలో ఐసా సభ్యులు పాల్గొంటారని ఆమె తెలిపారు. 'నియామకాలు సక్రమంగా, నిష్పక్షపాతంగా జరగాలనే ఉద్దేశ్యంతో నిరసనకారులు ఈ ప్రదర్శన చేస్తున్నారు. ఎఐఎస్‌ఎ తరఫున నేను వారికి నా మద్దతును తెలియజేస్తున్నాను. నిరాహార దీక్ష చేస్తున్న వారి ఆరోగ్య పరిస్థితులపై ప్రభుత్వం శ్రద్ధ వహించి, వారి డిమాండ్లను వీలైనంత త్వరగా పరిగణనలోకి తీసుకోవాలి. జార్ఖండ్‌లో కొనసాగుతున్న ఉద్యమానికి దేశవ్యాప్తంగా ఉన్న విద్యార్థులు తమ మద్దతును తెలియజేయాలి' అని బోరా విజ్ఞప్తి చేశారు. జంతర్ మంతర్ వద్ద జరిగిన ఉద్యమం స్ఫూర్తినిస్తే, ఇది కూడా స్ఫూర్తినిస్తున్నదన్నారు. విద్యార్థులు తమ న్యాయమైన డిమాండ్ల కోసం నిరాహార దీక్ష చేస్తున్నందుకే తాను ఇక్కడికి వచ్చానన్నారు.

**దీక్షచేస్తున్న వారిలో ఒకరి పరిస్థితి తీవ్రతరం**

ఇదిలా ఉండగా రాష్ట్రంలో నియామక పరీక్షలలో జరిగిన అవకతవకలకు వ్యతిరేకంగా జరుగుతున్న నిరసనలో భాగంగా నిరాహార దీక్ష చేస్తున్న ఆరుగురు నిరసనకారులలో ఒకరి ఆరోగ్యం శుక్రవారం ఉదయం విషమించడంతో, అతడిని ఆసుపత్రికి తరలించినట్లు ఒక అధికారి తెలిపారు. మంగళవారం రాత్రి నుంచి నిరాహార దీక్ష చేస్తున్న రాహుల్ క్రాంతి అనే విద్యార్థి నాయకుడిని చికిత్స కోసం అంబులెన్స్‌లో రాంచీ సదర్ ఆసుపత్రికి తరలించినట్లు ఆయన తెలిపారు. ఆరోగ్య పరీక్షల కోసం నిరసనకారులు అధికార యంత్రాంగాన్ని అభ్యర్థించారని, అయితే ఉదయం 8.30 గంటల వరకు ఏ వైద్యుడూ నిరసన ప్రదేశానికి చేరుకోలేదని క్రాంతి చెప్పారు. మంగళవారం రాత్రి, ఇద్దరు మహిళలతో సహా ఐదుగురు నిరసనకారులు జార్ఖండ లోక్‌తాంత్రిక్ క్రాంతికారి మోర్చా (జెఎల్‌కెఎం) నాయకుడు దేవేంద్ర నాథ్ మహతోతో కలిసి ఆయన నిరాహార దీక్షలో చేరారు. మహతో గత ఆరు రోజులుగా నిరాహార దీక్ష చేస్తున్నారు. ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ తమ ప్రభుత్వ ద్వారాలు చర్చలకు తెరిచే ఉన్నాయని చెప్పిన తర్వాత, ప్రతిష్టంభనను పరిష్కరించేందుకు ప్రభుత్వంతో చర్చలు జరిపేందుకు నిరసన చేస్తున్న విద్యార్థులు గురువారం 11 మంది సభ్యులతో కూడిన ప్రతినిధి బృందాన్ని ఏర్పాటు చేశారు. మంత్రులు దీపికా పాండే సింగ్, సుదివ్య కుమార్‌లతో కూడిన ఐదుగురు సభ్యుల ప్రభుత్వ కమిటీ నిరసనకారులతో మాట్లాడే అవకాశం ఉందని మరో అధికారి తెలిపారు. వర్షాకాల సమావేశాల రెండవ రోజైన శుక్రవారం నాడు, ప్రతిపక్ష ఎమ్మెల్యేలు జార్ఖండ్ అసెంబ్లీ ప్రాంగణంలో నినాదాలు చేయడంతో ఈ నిరసన ప్రకంపనలు అసెంబ్లీకి కూడా చేరాయి.

## అన్నీ లోపాలే (మొదటి పేజీ తరువాయి)

పిలిస్తారు. వారు ప్రశ్నలు ఎంపిక చేస్తారు. కానీ వారు ఎంపిక చేసిన ప్రశ్నలు పరీక్షల్లో విద్యార్థులకు ప్రింటింగ్ పేపర్స్‌లో ఇస్తారో లేదో వారికి పరీక్ష పూర్తయ్యే వరకూ తెలియదు. ఆ తర్వాత మోడరేషన్ విభాగంలో మళ్ళీ మరికొందరు నిపుణులను ఎంపికచేసి పిలుస్తారు. వారు ఈసారి నాలుగు రకాల ప్రశ్నాపత్రాలను తయారు చేస్తారు. ఆ ప్రశ్నాపత్రాలు కూడా చాలా కష్టంగా ఉంటాయి. ఒకేవిధమైన సంక్లిష్టత కలిగి ఉంటాయి. వారు రెండో దశలో ఈ విధంగా 45 ప్రశ్నలు ఎంపిక చేస్తారు. మొత్తం 180 ప్రశ్నలు ఉంటాయి. ఆ తర్వాత వెట్టింగ్ పేరుగల మూడో దశలో వివిధ పాఠ్యాంశాలకు సంబంధించిన నిపుణులు వస్తారు. మోడరేటర్లు అంతకు ముందు దశలో తయారు చేసి, ఖరారు చేసిన ప్రశ్నాపత్రాలను వారు సమాధానాలతో పరిష్కరిస్తారు. వెట్టర్స్ ప్రతిపాదించిన సమాధానాలు,మోడరేటర్స్ ఖరారు చేసిన సమాధానాలు సరిగ్గా సరిపోయాయో లేదో ఈ దశలో పరీక్షిస్తారు.ఒకవేళ వెటర్స్–మోడరేటర్స్ మధ్య భిన్నత్వంగానీ,విభేదంగానీ ఉంటే ఎన్‌టిఎ డైరెక్టర్లు మోడరేటర్లను, వెట్టర్స్‌ను పిలిచి వారితో సమావేశం జరుపుతారు. సమస్యను పరిష్కరిస్తారు. ఇక ఖరారు చేసిన ప్రశ్నల సెట్‌లను వివిధ రాష్ట్రాలలో చదువుకునే విద్యార్థుల మాతృభాషలలోకి పాఠ్యాంశాలకు సంబంధించిన నిపుణులు అనువదిస్తారు. వివిధ మాతృభాషలలో ఉన్న ఈ ప్రశ్నలను తిరిగి ఇంగ్లీషు భాషలోకి అనువదిస్తారు. అన్ని భాషలలోకి అనువదించిన ప్రశ్నలు,ఇంగ్లీషులో ఉన్న ప్రశ్నలు ఒకేవిధంగా ఖచ్చితత్వంతో ఉన్నాయా? లేదా? అనే విషయాన్ని ఖరారు చేస్తారు. వివిధ దశల్లో ఈ ప్రక్రియ అంతా చాలా ఆదర్శవంతంగా నిర్వహించాలి. ఒక దశలో ఉన్న నిపుణులకు,మరొక దశలో ఉన్న నిపుణులకు సంబంధం ఉండకూడదు. ఒకరు ఒక దశలోనే పాల్గొనాలి.

**తప్పు ఎక్కడ జరిగిందంటే...**

ఏ ఒక్కదశలోనూ మరొకరు రెండోసారి పాల్గొనకూడదు. ఏ ఒక్క నిపుణుడూ అన్ని దశలలోనూ పాల్గొన్ని మొత్తం వ్యవహారాన్ని పసిగట్టి ఆ వివరాలు తెలుసుకోకూడదు. ఎవరికీ ఎలాంటి అవకాశం లేకుండా గోప్యత పాటిస్తారు. ఇప్పుడు ఇక్కడే అసలు సమస్య మొదలైంది. 2026వ సంవత్సరంలో నీట్ యుజి పరీక్షకు ప్రశ్నాపత్రాలు తయారు చేసిన అనేకమంది నిపుణులు అనేక దశలలో పాల్గొన్నారు. మోడరేషన్ దశ నుండి చివరివరకూ నిపుణులు పాల్గొనడంవల్ల వారికి ముద్రణ దశలోకి ఏ ప్రశ్నలు వెళ్ళాయో పూర్తి సమాచారం తెలిసింది. ముఖ్యంగా వివిధ మాతృభాషల్లోకి ప్రశ్నా పత్రాలు తర్జుమా చేయడం, తిరిగి వాటిని ఖచ్చితత్వంకోసం ఇంగ్లీషులోకి అనువాదం చేయడంలో మొత్తం నాలుగు దశలను ఒకే నిపుణుడు పర్యవేక్షించారని సిబిఐ తన ఛార్జిషీటులో లోపాన్ని ఎత్తి చూపించింది. ఎన్‌టిఎ రహస్య విభాగం లేదా గోప్యతా విభాగం కార్యకలాపాలన్నీ ఓఖ్లాలోని ఎన్‌ఎస్‌ఐసి భవనం మొదటి అంతస్తు నుండే జరుగుతాయి. కానీ ఎన్‌టిఎ ఆచరణలో ఎలాంటి తనిఖీలు నిర్వహించలేదు. రహస్య విభాగంలో అసలు రహస్యాలు పాటించకుండా తలుపులు బార్లా తెరిచారు. రసాయనికశాస్త్రం విభాగానికి చెందిన నిపుణుడు పి.వి.కులకర్ణి ఈ లోపాలను ఆసరాగా చేసుకుని 135 ప్రశ్నలను చిన్న చిన్న కాగితం ముక్కలపైన రాసుకుని తన హోటల్ గదికి తీసుకువెళ్లిపోయారు. వాటిని అక్కడ నుండి గుర్తుతెలియనివారికి తరలించారు. మొత్తం మూడురోజులపాటు ఆయన హోటల్ గదిలోకి ఈ విధంగా అన్ని ప్రశ్నలను చిన్న చిన్న కాగితాల్లో రాసుకుని పట్టుకుపోయారని సిబి.ఐ తన ఛార్జిషీటులో స్పష్టం చేసింది. అదేవిధంగా జంతుశాస్త్రం, వృక్షశాస్త్రాల విభాగాలకు చెందిన నిపుణురాలు మనీషా గురునాత్ మంధరే,భౌతికశాస్త్ర విభాగానికి చెందిన మనీషా సంజయ్ హవల్దార్ ఎన్‌టిఎ కార్యాలయంలో ఉన్న లోపాలను దుర్వినియోగం చేశారు. అధ్యాపకవృత్తిలో పాటించాల్సిన నీతి,నిజాయతీలను పాటించకుండా తమ పనులు చక్కబెట్టుకున్నారు. ఖరారైన ప్రశ్నాపత్రాలను తమ తమ విద్యార్థి గ్రూపులకు పంపించారు. కులకర్ణి, మంధరేలు క్లాసులు చెబుతున్నప్పుడు బ్యూటీషియన్ మనీషా వాఘమర్ ఆ ప్రశ్నలను విద్యార్థుల నోట్ బుక్స్ నుండి సంపాదించి కొన్ని ఇతర ప్రశ్నలు కూడా కలిపి సొంత ప్రశ్నాపత్రాలు సృష్టించారు. వాటిని మధ్యవర్తులకు అమ్ముకున్నారు. ఈ పరీక్షలకు హాజరైన ఒక విద్యార్థికి ఈ ప్రశ్నాపత్రం లభ్యమైంది. అందులో కొన్ని ప్రశ్నలు పరీక్షల్లో రావడంతో ఆ విద్యార్థి లీకేజీ వ్యవహారం గురించి ఎన్‌టిఎ దృష్టికి తీసుకువచ్చాడని సిబిఐ సేకరించిన సమాచారాన్ని ఛార్జిషీటులో పేర్కొంది. వృక్షశాస్త్రం,జంతుశాస్త్రాలకు ఇంగ్లీషు నుండి మరాఠీ భాషలోకి ప్రశ్నాపత్రాన్ని తర్జుమా చేసిన మంధరే తర్జుమా పని పూర్తయ్యాక తన హోటల్ గదికి తిరిగి వచ్చిన్‌సిఆర్‌టి పుస్తకాల్లోంచి ఆ ప్రశ్నలకు సమాధానాలను ఎత్తి రాసుకునేవారు. అనేక దశాబ్దాలుగా ఆమె అనువాదంలో అనుభవజ్ఞురాలుగా ఉన్నందువల్ల తన అనుభవాన్ని రంగరించి అదే మెటీరియల్‌ను చాలా సులభమైన ప్రశ్నలుగా మార్చారు. మార్చి 9వ తేదీ నుండి ఏప్రిల్ 5వ తేదీ వరకూ ఆమె ఎన్‌టిఎలో ఈ తర్జుమా పని చేశారు. అదేవిధంగా హవల్దార్ కూడా ఢిల్లీలో ఎన్‌టిఎ కోసం పనిచేసిన సమయంలో ప్రశ్నలను చిన్న చిన్న కాగితాల్లో రాసుకుని తీసుకువెళ్ళారు. ఈ కదలికలను పసిగట్టగానికి రహస్య విభాగానికి మోనిటరింగ్ కంట్రోల్ రూము ప్రత్యేకంగా లేదు. వారికి గోప్యత లేదు. దానివల్ల వారు 25 రోజుల సిసి టీవీ ఫుటేజీని మాత్రమే భద్రపరచగలిగారు.

# వామప్ మ్యాచ్‌లో తేలిపోయిన భారత బౌలర్లు!



శ్రీలంకతో రెండు టెస్ట్‌ల సిరీస్‌కు సన్నాహకంగా సాగుతున్న వామప్ మ్యాచ్‌లో భారత బౌలర్లు తేలిపోయారు. బ్యాటింగ్‌కు అనుకూలంగా ఉన్న వికెట్పై శ్రీలంక ఎలెవన్ బ్యాటర్లు అద్భుతమైన బ్యాటింగ్ తో భారీ స్కోర్ నమోదు చేశారు. ముందుగా బ్యాటింగ్ చేసిన శ్రీలంక ఎలెవన్ తొలి రోజు ఆట ముగిసే సమయానికి తొలి ఇన్నింగ్స్‌లో 8 వికెట్లకు 363 పరుగులు చేసింది. నిషాన్ ఫెర్నాండో (65 బంతుల్లో 11 ఫోర్లు, సిక్స్‌తో 66), రావిందు రసంతా(143 బంతుల్లో 6 ఫోర్లు, సిక్స్‌త్తో 71), కెప్టెన్ సోనాల్ దినుషా(72 బంతుల్లో 5 ఫోర్లు, సిక్స్‌తో 52) హాఫ్ సెంచరీలతో రాణించారు. భారత బౌలర్లలో రవీంద్ర జడేజా(2/64), కుల్దీప్ యాదవ్(2/76), మానవ్ సుతార్(2/33) రెండేసి వికెట్లు తీయగా.. మహమ్మద్ సి రాజ్, ప్రసిధ్ కృష్ణ, యువ బౌలర్ సరాన్ష్ జైన్ ఒక్క వికెట్ తీయలేకపోయారు. జస్ప్రీత్ బుమ్రా స్థానంలో జట్టులోకి వచ్చిన అకిబ్ నబీకి బౌలింగ్ చేసే అవకాశం ఇవ్వలేదు. భారత పేలవ ఫీల్డింగ్ కూడా శ్రీలంక బ్యాటర్లకు కలిసొచ్చింది. పలు క్యాచ్ డ్రాప్లతో శ్రీలంక బ్యాటర్లు ఔటయ్యే ప్రమాదం నుంచి తప్పించుకున్నారు.

**తొలి సెషన్ శ్రీలంకదే..**

ఈ మ్యాచ్‌లో టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన శ్రీలంక బ్యాటర్లను భారత బౌలర్లు ఇబ్బంది పెట్టలేకపోయారు. పూర్తిగా గ్రీనీష్ వికెట్‌పై సిరాజ్, ప్రసిధ్ కృష్ణ ప్రభావం చూపలేకపోయారు. దాంతో తొలి సెషన్‌లో శ్రీలంక బ్యాటర్లు పూర్తి ఆధిపత్యం చెలాయించారు. వన్డే తరహా బ్యాటింగ్‌తో చెలరేగిన ఓపెనర్ నిషాన్ ఫెర్నాండో హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. సెంచరీ దిశగా సాగిన అతన్ని కేఎల్ రాహుల్ రనౌట్ చేశాడు. దాంతో తొలి వికెట్‌కు నమోదైన 110 పరుగుల భాగస్వామ్యానికి తెరపడింది. తొలి సెషన్ ముగిసేసరికి శ్రీలంక ఎలెవన్ వికెట్ నష్టానికి 138 పరుగులు చేసింది.

**రెండో సెషన్‌లోనూ**

రెండో సెషన్‌లోనూ శ్రీలంక బ్యాటర్లు చెలరేగారు. రావిందు రసంతా(71) హాఫ్ సెంచరీ పూర్తి చేసుకోగా.. పాసిందు సూరియాబండార రెండో వికెట్‌కు 61 పరుగుల భాగస్వామ్యాన్ని అందించాడు. అతన్ని జడేజా క్లీన్ బౌల్ చేశాడు. సెంచరీ దిశగా సాగిన రావిందు రసంతాను మానవ్ సుతార్ క్యాచ్ ఔట్‌గా పెవిలియన్ చేర్చాడు. పవన్ రత్నాయకే(39)ను గుర్నూర్ బ్రార్ ఔట్ చేయడంతో శ్రీలంక 246/4తో రెండో సెషన్‌ను ముగించింది. ఈ సెషన్‌లో ఇరు జట్లు సమంగా నిలిచాయి.

**చెలరేగిన స్పిన్నర్లు..**

మూడో సెషన్‌లో భారత స్పిన్నర్లు చెలరేగారు. కెప్టెన్ సోనాల్ దినుషా(52) హాఫ్ సెంచరీతో రాణించినా.. మిగతా బ్యాటర్లను పెవిలియన్‌కు చేర్చారు. అహన్ విక్రమసింఘే(31), అంజాలా బండార(13)ను కుల్దీప్ యాదవ్ ఔట్ చేయగా.. రమేష్ మెండిస్(32)ను జడేజా క్యాచ్ ఔట్ చేశాడు. సోనాల్ దినుషాను మానవ్ సుతార్ ఔట్ చేయగా.. దిలుమ్ సుదీర, కేశర నువాంత మరో వికెట్ పడకుండా తొలి రోజు ఆటను ముగించారు.

# విరాట్ కోహ్లీ వల్లే స్వర్ణం గెలిచా: సాక్షి చౌదరి



స్కాట్లాండ్‌లోని గ్లాస్గోలో జరిగిన 2026 కామన్వెల్త్ క్రీడల్లో భారత బాక్సర్లు అదరగొట్టారు. బాక్సింగ్ భారత్ ఏడు స్వర్ణాలతో సహా 10 పతకాలను సాధించింది. స్వర్ణ పతక విజేతలలో సాక్షి చౌదరి కూడా ఉన్నారు. ఆమె మహిళల 51 కేజీల విభాగంలో స్వర్ణం గెలుచుకున్నారు. ఇండియాకు తిరిగి వచ్చిన తర్వాత తన ప్రయాణంలో విరాట్ కోహ్లీ పోషించిన కీలక పాత్రకు సాక్షి కృతజ్ఞతలు తెలిపారు. హర్యానాలోని భివానీలో మాట్లాడుతూ సాక్షి చౌదరి ఇలా అన్నారు. 'విజేందర్ సింగ్‌ను చూసి నేను బాక్సింగ్ ప్రారంభించాను. నా ఈ ప్రయాణంలో విరాట్ కోహ్లీ కూడా నాకు గొప్ప మద్దతుగా నిలిచారు. ఆయనే నా స్పాన్సర్. ఆయనకు కూడా నేను ధన్యవాదాలు చెప్పాలనుకుంటున్నాను.' అని సాక్షి పేర్కొన్నారు. కోహ్లీ కేవలం ఆర్థిక సహాయం మాత్రమే కాకుండా, మానసికంగా కూడా తనను ప్రోత్సహించాడని ఆమె వివరించింది. ఒత్తిడికి దూరంగా ఉండి, కేవలం తన ప్రదర్శనపైనే దృష్టి పెట్టమని విరాట్ ఎల్లప్పుడూ సలహా ఇచ్చేవాడని ఆమె తెలిపారు. గ్లాస్గోలో జరిగిన కామన్వెల్త్ గేమ్స్‌లో మహిళల 51 కేజీల విభాగం ఫైనల్‌లో సాక్షి ఇంగ్లాండ్‌కు చెందిన రూబీ వైట్‌ను 50 తేడాతో ఓడించి స్వర్ణ పతకాన్ని గెలుచుకుంది. కామన్వెల్త్ గేమ్స్‌లో ఆమెకు ఇదే మొదటి పతకం. 2022లో గాయం కారణంగా ఆమె గేమ్స్‌లో పాల్గొనలేకపోయింది. 2025లో ఆమె వరల్ బాక్సింగ్ కప్లో 54 కేజీల విభాగంలో స్వర్ణం గెలుచుకుంది . ఈ ఏడాది ప్రారంభంలో, సాక్షి 54 కేజీల విభాగం నుండి 51 కేజీల విభాగానికి మారాలని నిర్ణయించుకుంది. అది ఒక సాహసోపేతమైన నిర్ణయమే అయినా, సాక్షి స్వర్ణ పతకాన్ని గెలుచుకుంది.51 కేజీల జాతీయ ట్రయల్స్‌లో, ఆమె 2022 కామన్వెల్త్ గేమ్స్ స్వర్ణ పతక విజేత నిఖత్ జరీన్, 2025 ప్రపంచ బాక్సింగ్ ఛాంపియన్షిప్స్ స్వర్ణ పతక విజేత మీనాక్షి హూడాలను ఓడించి కామన్వెల్త్ గేమ్స్ కోసం భారత జట్టులో స్థానం సంపాదించింది. కామన్వెల్త్ గేమ్స్‌లో సాక్షి చౌదరి నాలుగు బౌట్లలో ఆడి, ఆ నాలుగింటిలోనూ 50 తేడాతో ఏకపక్ష విజయాలు సాధించింది.

## సైన్స్

### జీవం పుట్టుకపై కొత్త కోణం..




భూమిపై జీవం ఎలా ఆవిర్భవించిందనే ప్రశ్నకు ఇప్పటికీ ఖచ్చితమైన సమాధానం లభించలేదు. అయితే ఇటీవల వెలువడిన పరిశోధనలు ఈ అంశంపై శాస్త్రవేత్తల ఆలోచనలకు కొత్త దిశ చూపిస్తున్నాయి. అమెరికాలోని అరిజోనా విశ్వవిద్యాలయం నేతృత్వంలో జరిగిన అధ్యయనంతో పాటు, ఈ ఏడాది ప్రచురితమైన మరికొన్ని పరిశోధనలు, జీవం పుట్టుక ఒకే రసాయనిక ప్రక్రియ ఫలితం కాదని, అనేక సహజ రసాయనిక మార్గాలు కలిసి ఈ పరిణామానికి దోహదపడి ఉండవచ్చని సూచిస్తున్నాయి. భూమిపైని సమస్త జీవరాశులకు ఉమ్మడి పూర్వీకుడిగా భావించే 'లాస్ట్ యూనివర్సల్ కామన్ యాన్సెస్టర్' (ఎల్‌యుసిఎ)కు సంబంధించిన ప్రాచీన ప్రోటీన్లను విశ్లేషించిన శాస్త్రవేత్తలు, జీవకణాల నిర్మాణానికి అవసరమైన అమైనో ఆమ్లాలు ఇప్పటివరకు భావించిన క్రమంలో కాకుండా, వివిధ పరిణామ దశల్లో జన్యు వ్యవస్థలో చేరి ఉండవచ్చని గుర్తించారు. ఇతర అధ్యయనాలు జీవానికి అవసరమైన ప్రాథమిక రసాయనిక అణువులు సముద్ర గర్భంలోని హైడ్రోథర్మల్ వెంట్లు, ఖనిజాల ఉపరితలాలు, ఉల్కలు, గ్రహశకలాలపై జరిగే రసాయనిక చర్యల ద్వారా కూడా ఏర్పడి ఉండవచ్చని సూచిస్తున్నాయి. ఈ పరిశోధనలు జీవం ఆవిర్భావ రహస్యాన్ని పూర్తిగా ఛేదించకపోయినా, కొత్త శాస్త్రీయ ఆధారాలను అందిస్తున్నాయి. ముఖ్యంగా శని గ్రహ ఉపగ్రహం 'ఎన్‌సెలడస్' వంటి ఖగోళ వస్తువులపై జీవానికి అనుకూల పరిస్థితులను అన్వేషించే ప్రయత్నాలకు ఇవి మార్గనిర్దేశం చేయగలవని శాస్త్రవేత్తలు భావిస్తున్నారు.

# ఆకాశంలో సూర్యుడు గీసే అద్భుతం...




ప్రతిరోజూ ఒకే సమయానికి ఆకాశంలో సూర్యుడిని గమనిస్తే, అతడు ఒకే చోట కనిపిస్తాడని చాలామంది అనుకుంటారు. కానీ అది నిజం కాదు. ఒకే ప్రదేశంలో నిలబడి, ఒకే సమయానికి ఏడాది పొడవునా సూర్యుడి ఫోటో తీసి, ఆ చిత్రాలన్నింటినీ ఒకే ఫ్రేమ్‌లో కలిపితే ఆశ్చర్యకరంగా ఆకాశంలో ఇంగ్లిష్ అంకె '8' ఆకారం కనిపిస్తుంది. ఈ విశిష్ట ఖగోళ ఆకారాన్నే 'అనాలెమ్మ' అంటారు. ఇది ఫొటోగ్రఫీ విన్యాసం కాదు. భూమి కదలికల వెనుక ఉన్న ఖగోళ శాస్త్రాన్ని కళ్లకు కట్టినట్లు చూపించే సహజ చిత్రపటం. ఈ 'అనాలెమ్మ' ఏర్పడటానికి రెండు ప్రధాన కారణాలు ఉన్నాయి. మొదటిది భూమి తన అక్షంపై సుమారు 23.5 డిగ్రీల కోణంలో వంగి ఉండటం. ఇలా వంగి ఉండడమే రుతువుల మార్పులకు కారణం. ఏడాది పొడవునా సూర్యుడు ఆకాశంలో కొన్నిసార్లు ఉత్తర దిశగా, మరికొన్నిసార్లు దక్షిణ దిశగా కనిపిస్తాడు. దీంతో ఒకే సమయానికి చూసినా సూర్యుడి ఎత్తు మారుతూ ఉంటుంది. ఇక, రెండో కారణం భూమి కక్ష్య పూర్తిగా గుండ్రంగా కాకుండా 'దీర్ఘవృత్తాకారం'లో ఉండటం. దీంతో భూమి సూర్యుడి చుట్టూ తిరిగే వేగం ఏడాది అంతా ఒకేలా ఉండదు. సూర్యుడికి దగ్గరగా ఉన్నప్పుడు వేగంగా, దూరంగా ఉన్నప్పుడు కొంచెం నెమ్మదిగా ప్రయాణిస్తుంది. ఈ వేగ భేదం వల్ల సూర్యుడు గడియారం చూపించే సమయానికి ప్రతిరోజూ కచ్చితంగా అదే స్థానంలో కనిపించడు. ఈ రెండు ప్రభావాలు కలిసినప్పుడు ఆకాశంలో అందమైన 8 ఆకారం ఏర్పడుతుంది. ఈ దృశ్యం వెనుక మరో ముఖ్యమైన ఖగోళ భావన ఉంది. దానినే 'ఈక్వేషన్ ఆఫ్ టైమ్' అంటారు. మన గడియారాలు రోజును కచ్చితంగా 24 గంటలుగా విభజిస్తాయి. కానీ నిజమైన సౌర సమయం అలా ఉండదు. కొన్ని రోజుల్లో సూర్యుడు గడియారం చూపించే మధ్యాహ్నం కంటే ముందే నడినెత్తికి చేరుకుంటాడు. మరి కొన్ని రోజుల్లో కొద్దిగా ఆలస్యంగా వస్తాడు. అందుకే సూర్య ఘడియారాలు చూపించే సమయం, మన చేతి గడియారంలోని సమయం ఎప్పుడూ ఒకేలా ఉండవు. సూర్యుడికే కాదు, చంద్రుడికీ అనాలెమ్మ ఉంటుంది. అయితే చంద్రుని అనాలెమ్మ సూర్యుడి మాదిరిగా సమతుల్యమైన '8' ఆకారంలో కనిపించదు. చంద్రుడు భూమి చుట్టూ తిరుగుతుండగా, భూమి సూర్యుడి చుట్టూ తిరుగుతోంది. అంతేకాదు, చంద్రుడి కక్ష్య కూడా భూమి కక్ష్యకు సుమారు 5 డిగ్రీల కోణంలో వంగి ఉంటుంది. దీంతో చంద్రుడి స్థానం మరింత సంక్లిష్టంగా మారుతుంది. అంతరిక్ష యుగానికి ఎంతో ముందే ఖగోళ శాస్త్రవేత్తలు అంటే మన గడియారం ఒక సమయాన్ని చూపించినా, ప్రకృతి మాత్రం తన ఖగోళ నియమాల ప్రకారమే నడుస్తుంది. ఆ నియమాల అందమైన సంతకమే ఆకాశంలో కనిపించే అనాలెమ్మ.

# ప్రోటాన్ కంటే నాలుగు రెట్లు భారీ కణం!



యూరోపియన్ అణు పరిశోధనా కేంద్రం (సెర్న్)లో శాస్త్రవేత్తలు ఇటీవల గుర్తించిన కొత్త కణం శాస్త్ర ప్రపంచంలో ఆసక్తిని రేకెత్తించింది. అయితే దీనిని 'భౌతిక శాస్త్రాన్ని పూర్తిగా మార్చేసిన ఆవిష్కరణ'గా కాకుండా, విశ్వంలోని సూక్ష్మ పదార్థ నిర్మాణాన్ని మరింత లోతుగా అర్థం చేసుకునే దిశలో కీలక ముందడుగుగా చూడాలి. ఈ కణం ప్రోటాన్ కంటే సుమారు నాలుగు రెట్లు ఎక్కువ ద్రవ్యరాశి కలిగి ఉన్నప్పటికీ, ఇది కొత్త ప్రాథమిక కణం కాదని, క్వార్క్‌ల ప్రత్యేక సమ్మేళనంతో ఏర్పడిన సంక్లిష్ట హాడ్రాన్ కావచ్చని శాస్త్రవేత్తలు భావిస్తున్నారు. ప్రోటాన్ కూడా మూడు క్వార్క్‌లతో ఏర్పడిన సమ్మేళిత కణమే. అయితే తాజా పరిశోధనలో గుర్తించిన కణం టెట్రాక్వార్క్ లేదా పెంటాక్వార్క్ వంటి భిన్న నిర్మాణాన్ని కలిగి ఉండే అవకాశం ఉంది. క్వార్క్‌ల మధ్య పనిచేసే బలమైన అణు బలం కారణంగా ఇటువంటి సంక్లిష్ట కణాలు ఏర్పడతాయని భౌతిక శాస్త్ర సిద్ధాంతాలు సూచిస్తున్నప్పటికీ, వాటి లక్షణాలను పూర్తిగా వివరించడం ఇప్పటికీ సవాలుగానే ఉంది. అందువల్ల ఈ కొత్త కణం స్టాండర్డ్ మోడల్‌ను ఖండించడం కాదు. దాని పరిధిలోనే ఇంకా అర్థం చేసుకోవాల్సిన అంశాలు ఎంతగానో ఉన్నాయని తెలియజేస్తోంది. ఇలాంటి కణాలు అత్యంత స్వల్ప కాలం మాత్రమే ఉనికిలో ఉండి వెంటనే ఇతర కణాలుగా విచ్ఛిన్నమవుతాయి. అలాగే ఈ అధ్యయనం డార్క్ మ్యాటర్ రహస్యాన్ని ఛేదించిందని చెప్పడానికి వీల్లేకపోయినా, విశ్వంలోని పదార్థ నిర్మాణం, బలమైన అణు పరస్పర చర్యలు, క్వార్క్‌ల ప్రవర్తన వంటి అంశాలపై కొత్త ప్రశ్నలను ఈ పరిశోధన ముందుకు తెస్తోంది. చరిత్ర చెబుతున్నట్లే, ఇలాంటి మౌలిక పరిశోధనలే భవిష్యత్తులో ఊహించని సాంకేతిక ఆవిష్కరణలకు పునాది వేయగలవు.

# 'ది ప్యారడైజ్' ట్రైలర్ అంతా రక్తమే



ఈ మధ్య తెలుగు సినిమాలో హింస మితిమీరిపోతోంది. ప్రతి సినిమాలో కత్తులతో నరుక్కోవడాలు, తలలు తీసెయ్యడాలు, నోటి నుంచి రక్తం కారడాలు వంటి సన్నివేశాలను చాలా మంది దర్శకులు క్లోజ్ షాట్‌లో తీసి యాక్షన్ సన్నివేశాలను చాలా గొప్పగా తీశామని చెప్తుంటారు. అలాంటి దర్శకుల కోవలోనే శ్రీకాంత్ ఓదెల కూడా ప్రయాణం చేస్తున్నాడు. నాని హీరోగా నటించిన దసరా సినిమాలోనూ రక్తపాతం సృష్టించిన ఓదెల ఇప్పుడు తన రెండో చిత్రం ది ప్యారడైజ్ లోనూ మరింత ఎక్కువగా రక్తపాత సన్నివేశాలను పెట్టారని ఈ సినిమా ట్రైలర్ చూస్తుంటే అర్థమవుతోంది. అంతే కాదు ఈ ట్రైలర్‌కు ఏకంగా 'బ్లడ్ బాత్ ట్రైలర్ 'గా నామకరణం చేసి మరీ పబ్లిసిటీ చేస్తున్నారు. రెండు జాడలు వేసుకున్న హీరో నానిది ప్యారడైజ్ సినిమా పూర్తిగా యాక్షన్ నేపథ్యంలో నిర్మిస్తున్నారు . అయితే ట్రైలర్ చూస్తే ఈ మధ్య తెలుగు సినిమాల్లో వచ్చిన రక్త భరిత సినిమాల్లో ఇదే సినిమా క్రెడిట్ కొట్టేసేలా ఉంది. చిన్న పిల్లలు చూడలేనంతగా ఈ సినిమా ట్రైలర్‌ను దూపొందించారు. ఎస్ ఎల్ వి సినిమాస్ బ్యానర్‌పై సుధాకర్ చెరుకూరి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.'ఇక నుంచి ఈ జాగా ఎవరిది... ఈ దేశం ఎవరిది?' అనే నాని పవర్ఫుల్ డైలాగ్‌తో ప్రారంభమైన టీజర్ మొదటి ఫ్రేమ్ నుంచే ప్రేక్షకులను 'ది ప్యారడైజ్' ప్రపంచంలోకి తీసుకెళ్తుంది. హైవోల్టేజ్ యాక్షన్, రక్తం చిందించే బ్లడ్బాత్ సీక్వెన్స్‌లు ఇందులో చూపరులను భయపెట్టేవిధంగా ఉన్నాయి. చివర్లో 'ఇరుగు దిష్టి... పొరుగు దిష్టి...' అంటూ నాని చెప్పినడైలాగులతో టీజర్ ముగుస్తుంది. మోహన్ బాబు పవర్ఫుల్ లుక్లో కనిపిస్తూ తనదైన స్క్రీన్ ప్రెజెన్స్‌తో ఆకట్టుకున్నారు. ఆయన పలికిన డైలాగ్ టీజర్‌లోని ఇంటెన్సిటీని మరింత పెంచింది.కాయదు లోహర్, రాఘవ్ జుయాల్ పాత్రలు కూడా టీజర్‌లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. వారి లుక్స్, స్క్రీన్ ప్రెజెన్స్ కథపై మరింత ఆసక్తిని పెంచుతున్నాయి. తమిళ సంగీత దర్శకుడు అనిరుధ్ రవిచందర్ ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్నారు. 'ది ప్యారడైజ్' సెప్టెంబర్ 24న తెలుగు, హిందీ, తమిళం, కన్నడ, మలయాళం, బెంగాలీ, ఇంగ్లిష్, స్పానిష్ భాషల్లో ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల కానుంది.

## రీల్

# న్యాయం చేస్తా

## 'దండా' ఫేమ్ దొర సాయితేజ



చాయ్ షాట్స్ నుంచి వచ్చిన 'దండా' సిరీస్ లో హీరోగా దొర సాయి తేజ నటించారు. దర్శకుడు ఆదిత్య దేవులపల్లి తెరకెక్కించిన ఈ సిరీస్ యూట్యూబ్‌లో ట్రెండ్ అవుతోంది. ఈ సిరీస్ సక్సెస్ ఫుల్‌గా సాగుతున్న తరుణంలో హీరో దొరసాయి తేజ తన మీడియాతో చిట్ చాట్ చేశారు. ప్రభాస్ 'అడవి రాముడు' సినిమాలో హీరో చిన్నప్పటి చైల్ కారెకర్‌కు డబ్బింగ్ చెప్పాను. 'కొత్తబంగారులోకం', 'హైస్కూల్' అనే సిరీస్‌లు నటించాను. 'అలా మొదలైంది' సినిమాలోనూ ఓ చిన్న పాత్రను పోషించాను. 2016 నుంచి ఆర్‌జీవితో అనుబంధం ఏర్పడింది. 'శ్రీదేవీ' అనే ఓ విడుదల కాని సినిమాలో నటించాను. అక్కడే నాకు సినిమా పరిచయమైంది. అలా 2018లో యూట్యూబ్ జర్నీ సీరియస్‌గా ప్రారంభమైంది. 'బ్యాక్ బెంచర్స్' సిరీస్‌తో మంచి గుర్తింపు వచ్చింది. అలా సిరీస్‌లు చేసుకుంటూ వచ్చాను. గత ఏడాది సొంతంగా కంటెంట్ క్రియేషన్ కంపెనీ ప్రారంభించాను. రీసెంట్‌గా మళ్లీ 'దండా'తో సక్సెస్ వచ్చింది. ఒక కంటెంట్ క్రియేటర్‌గా, డైరెక్టర్‌గా, యాకర్‌గా, ప్రొడ్యూసర్‌గా ఆలోచిస్తూనే ఉంటాను. నన్ను నేను కొత్తగా పరిచయం చేసుకోడానికి ఇదొక మార్గం. అందుకే అన్ని రకాలుగా ప్రయత్నిస్తున్నాను. కంటెంట్ క్రియేషన్ అనేది నా బిజినెస్. సినిమా అనేది నా ప్యాషన్. నాకు నేనుగానే అన్నీ నేర్చుకుంటాను. పడిపోయినప్పుడు ఓ కొత్త గుణపాఠం నేర్చుకుంటాను. నేను ఎప్పుడూనా వయసు కంటే ఓ ఐదేళ్లు పెద్దవాడిలానే ఆలోచిస్తా. సోషల్ మీడియాలో అన్నీ ఉంటాయి. నటుడు అని పిలిపించుకోవాలని నాకు ఉంటుంది. నేను 'దండా'లో అరవిందా మాత్రమే కనిపిస్తాను. ఇలాంటి ఛాలెంజింగ్ పాత్రలే రావాలని ఇన్నాళ్లు కోరుకున్నాను. ఇదంతా మా దర్శకుడి వల్లే సాధ్యమైంది.నాకు మానిటర్ చూసే అలవాటు ఉండదు. దానికి ముందు, తర్వాత సీన్‌లు ఏంటన్నది కూడా చూసుకుంటాను. అందుకే దాదాపు అన్నీ కూడా సింగిల్ చేసేస్తాను. ఎక్కువ అయితే ప్రొడక్షన్ కాస్ట్ కూడా పెరుగుతుంది. సెట్లో ఉన్నంత సేపు నేను అరవింద్ పాత్రలోనే ఉండాలని నిర్ణయించుకున్నాను. అందుకే సింగిల్ చేసేశాను.ప్రతీ ఒక్క సాధారణ వ్యక్తి రిలేట్ అయ్యే కథల్ని థియేటర్‌లో చూపించాలని అనుకుంటున్నాను. హీరో అనే పాత్రలను పోషించాలని కోరుకుంటున్నాను. అందరిలోనూ స్ఫూర్తి నింపే కథలను, మంచి సందేశాన్ని ఇచ్చే ప్రాజెకులును చేయాలని అనుకుంటున్నాను. మన చుట్టూ ఉండే కథలను, పాత్రలను ఎంచుకుంటాను. ప్రేక్షకులు నా కోసం ఖర్చు పెట్టే డబ్బులకు న్యాయం చేయాలనే లక్ష్యంతో పని చేస్తాను.

# 'రామాయణ' ట్రైలర్ @ 1 బిలియన్ వ్యూస్



రణ్బీర్ కపూర్ కథానాయకుడిగా, నితేష్ తివారి దర్శకత్వంలో తెరకెక్కుతున్న ప్రతిష్టాత్మక చిత్రం 'రామాయణ: పార్ట్ 1' ట్రైలర్ ప్రపంచవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తోంది. రామాయణ' ట్రైలర్‌కు అరుదైన ఘనత సాధించింది. 1 బిలియన్ వ్యూస్ దాటిన తొలి భారతీయ సినిమా ట్రైలర్‌గా రికార్డ్ క్రియేట్ చేసింది. ట్రైలర్‌కు సినీ అభిమానులు, విమర్శకులు, సెలబ్రిటీలు అన్ని వర్గాల ప్రేక్షకుల నుంచి ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి. సినిమా భారీ స్థాయి విజువల్స్, వరల్ క్లాస్ వి ఎఫ్ ఎక్స్ , భావోద్వేగభరితమైన కథనం, అద్భుతమైన బ్యాగ్రౌండ్ స్కోర్ సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారాయి. ముఖ్యంగా అనే థీమ్ ప్రేక్షకులను బలంగా ఆకట్టుకుంది. భారతదేశపు గొప్ప ఇతిహాసాన్ని అత్యంత గౌరవంతో, ప్రామాణికంగా, భారీ స్థాయిలో తెరపై ఆవిష్కరించారని ప్రేక్షకులు ప్రశంసిస్తున్నారు. ట్రైలర్‌లో మరో ప్రధాన ఆకర్షణ స్టార్ కాస్టింగ్. శ్రీరాముడిగా రణ్బీర్ కపూర్ శక్తివంతమైన నటనతో ఆకట్టుకోగా, రావణుడిగా యష్ తన పవర్ఫుల్ స్క్రీన్ ప్రెజెన్స్‌తో అందరి దృష్టిని ఆకర్షించారు. సీతగా సాయి పల్లవి తన హుందాతనం, అమాయకత్వం, భావోద్వేగాలతో ప్రశంసలు అందుకుంటున్నారు. శూర్పణఖగా రకుల్ ప్రీత్ సింగ్ లుక్ కూడా మంచి ఆసక్తిని రేకెత్తించింది. ఈ స్టార్ కాస్టింగ్ ట్రైలర్‌కు మరో పెద్ద బలంగా మారింది. దీంతో 'రామాయణ: పార్ట్ 1'పై అంచనాలు మరింత పెరిగాయి. 1 బిలియన్ వ్యూస్ దాటిన తొలి భారతీయ సినిమా ట్రైలర్‌గా రికార్డ్ క్రియేట్ చేసిన రామాయణ సినిమాపై ఉన్న అంచనాలను మరో స్థాయికి తీసుకెళ్లింది. ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకులు ఇప్పుడు 'రామాయణ: పార్ట్ 1' విడుదల కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. సోనీ పిక్చర్స్ ప్రపంచవ్యాప్తంగా, ధర్మ ప్రొడక్షన్స్ నార్త్ ఇండియాలో ఈ చిత్రాన్ని విడుదల చేయనున్నాయి. 'రామాయణ: పార్ట్ 1' దీపావళి సందర్భంగా ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా ప్రేక్షకుల ముందుకు రానుంది.

శివ సాయి ప్రొడక్షన్స్ పతాక పై డి. నిరీక్షణ సమర్పణలో, నిఖిల్, దివి ప్రధాన పాత్రలో డి. రామకృష్ణ దర్శకత్వంలో నిర్మాతలు ప్రవీణ్ కుమార్ శ్రీనివాస్ రెడ్డి నిర్మిస్తున్న ఎమోషనల్ యాక్షన్ ఎంటటైనర్ 'స్టువర్టుపురం స్టూడెంట్స్.ఇప్పటివరకు ఎనభై షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు జరుపుకుంటుంది. కాగా ఈ చిత్ర ట్రైలర్ ను ప్రముఖ దర్శకులు వేణు ఉడుగుల లాంచ్ చేశారు. ట్రైలర్‌తో పాటు ఆయన సాంగును కూడా విడుదల చేశారు. ఈ సందర్భంగా వేణు ఉడుగుల మాట్లాడుతూ 'స్టువర్టుపురం స్టూడెంట్స్ ట్రైలర్ చూశాను .అలాగే సాంగ్స్ కూడా చూశాను. చాలా బాగున్నాయి.ఈ సాంగ్, ఈ ట్రైలర్‌నా చేతుల మీదుగా రిలీజ్ చేయటం సంతోషంగా ఉంది. ట్రైలర్ చాలా బాగుంది . ఎస్ప్రెషల్లీఈ చిత్రంలో దివి చేసిన యాక్టింగ్ కూడా చాలా ఇన్నోవేటివ్ గా ఉంది. అలాగే డైరెక్టర్ ఆర్కే గారు ఈ చిత్రాన్ని చాలా లావిష్ గా తెరకెక్కించారని అనిపిస్తుంది .ఈ సినిమా డెఫినెట్ గా హిట్ అవ్వాలని కోరుకుంటున్నాను. అని అన్నారు. చిత్ర దర్శకుడు రామకృష్ణ, బిగ్ బాస్ ఫేమ్ హీరో నిఖిల్ , హీరోయిన్ దివి పాల్గొన్నారు. ఈ చిత్రానికి పాటలు : కె .కల్పన మాణిక్ ,ఎడిటర్: అర్రం రామకృష్ణ ,డిఓపి: ఎం మురళీకృష్ణ ,మ్యూజిక్ :ఎస్.ఎస్. వెంకటేష్ ,ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: మణికుమార్ పి ,భాస్కరరాజు సి , ప్రొడ్యూసర్ :ప్రవీణ్ కుమార్, బి. శ్రీనివాసరెడ్డి కథ, స్క్రీన్ ప్లే ,దర్శకత్వం: డి .రామకృష్ణ.

# 'స్టువర్టుపురం స్టూడెంట్స్' ట్రైలర్ విడుదల



# 15న 'ఖడ్గం' రీ రిలీజ్



శ్రీకాంత్, రవితేజ, ప్రకాశ్ రాజ్ ముఖ్య పాత్రల్లో కృష్ణవంశీ దర్శకత్వంలో సుంకర మధుమురళి నిర్మాతగా వచ్చిన సూపర్ హిట్ సినిమా ఖడ్గం. ' ఖడ్గం' సినిమా 2002 లో విడుదలై భారీ విజయం సాధించిన సంగతి తెలిసిందే. లవ్, కామెడీ, దేశం ఎమోషన్,.. ఇలా అన్ని రకాల ఎమోషన్స్ కలిపి మల్టీ జానర్‌లో ఈ సినిమాని అద్భుతంగా తెరకెక్కించారు దర్శకుడు కృష్ణవంశీ . ఇప్పటికి టీవీల్లో ఇండిపెండెన్స్‌డే, రిపబ్లిక్ డేలలో ఈ సినిమాని వేస్తూనే ఉంటారు. ఈ సినిమా సాంగ్స్ కూడా ఆల్ టైం వినసొంపుగా ఉన్నాయి. దేవి శ్రీ ప్రసాద్ అద్భుతమైన సంగీతం అందించాడు. ఈ సినిమా స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా 15న ఖడ్గం మరోసారి థియేటర్స్‌లో విడుదల కానుంది, పాప్ కార్న్ ప్రొడక్షన్స్‌లో దేవరపల్లి రేవంత్ సమర్పణలో విష్ణు మొలకల నక్షత్ర నిర్మాతగా కృష్ణ వడిగేపల్లి, కాకర్లమూడి రామకృష్ణ సహ నిర్మాతగా ఖడ్గం చిత్రం మరోసారి ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. ఇందులో పోలీస్ అధికారిగా శ్రీకాంత్ నటించారు. సోనాలి బింద్రే ఓ కీలక పాత్రలో నటించింది. నటుడు షఫీ ఈ సినిమా ద్వారా విలన్‌గా పరిచయమైయ్యాడు.



## 10, 11 తేదీలలో ఆలేరులో సిపిఐ ప్రజా చైతన్య జీపు యాత్ర

### జయప్రదం చేయాలని యాదాద్రి భువనగిరి జిల్లా సిపిఐ సహాయ కార్యదర్శి బోలగాని సత్యనారాయణ పిలుపు

**ప్రజాపక్షం/మోటకొండూర్** : కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్నారని ప్రజలను చైతన్య పరిచేందుకు ఈనెల 10, 11 తేదీలలో ఆలేరు నియోజకవర్గంలో సిపిఐ ప్రజా చైతన్యం జీపు యాత్రను విజయ వంతం చేయాలని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి బోలగాని సత్యనారాయణ పిలుపునిచ్చారు. ఆయన శుక్రవారం మోటకొండూరు మండల కేంద్రంలో సిపిఐ మండల కార్యవర్గ కౌన్సిల్ సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొనిమాట్లాడుతూ సిపిఐ జాతీయ పార్టీ పిలుపుమేరకు ఆగస్టు 6 నుండి 14 తేదీ వరకు పాదయాత్రలు, జీపు యాత్రలు జిల్లాలు, రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్నాయనిఅన్నారు. ప్రజా వ్యతిరేక విధానాలను అరికట్టాలని నిరసన తెలుపుతూ సెప్టెంబర్ 1 న చలో ఢిల్లీ కార్యక్రమం కోసం ప్రజలను చైతన్య పరుస్తున్నామని తెలిపారు.ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి గాదేగాని మాణిక్యం, మండల సహాయ కార్యదర్శులు ముసుకు పెంటారెడ్డి, ఆలేటి బాలరాజు, మండల కార్యవర్గ సభ్యులు బోల శ్రీనివాస్,పల్లె వెంకన్న,మంచాల రాధమ్మ,పశువుల నరసింహ, ఎండి శంషుద్దీన్,పైల రాంరెడ్డి,రాపాక ఉమ,సుదగాని వెంకన్న,ఎర్రోజి నాగచారి,గువ్వ వెంకన్న, ఏనుగు వెంకట్ రెడ్డి, జీవికలపల్లి పాండు, పల్లె మదర్, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలకు ఇబ్బందుల్లేకుండా ట్రాఫిక్ సిగ్నల్స్

### ఎఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి



**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్** : సూర్యాపేట పట్టణంలోని కొత్త బస్ స్టాండ్ వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన ట్రాఫిక్ సిగ్నల్స్‌ను ఏఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, జిల్లా కాంగ్రెస్ నాయకులు మొరిశెట్టి లక్షాది, పట్టణ ఇన్‌స్పెక్టర్ వెంకటయ్య, ట్రాఫిక్ ఎస్ఐ యాదవేందర్ రెడ్డితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కుడకుడ, బాలాజీనగర్, శ్రీరాంనగర్ ప్రాంతాల నుంచి వచ్చే పాఠశాల విద్యార్థులు, వారి తల్లిదండ్రులు చేసిన వినతిని ఆయన పోలీసు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. అలాగే కొత్త బస్‌స్టాండ్ వద్ద ఉన్న అడ్డా కూలీలకు కూడా ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. పాఠశాల సమయాల్లో ట్రాఫిక్ రద్దీ, విద్యార్థుల భద్రత, ప్రజల రాకపోకలు, అడ్డా కూలీల ఉపాధి సమయాన్ని దృష్టిలో ఉంచుకుని ఉదయం 9 గంటల తర్వాత ట్రాఫిక్ సిగ్నల్స్‌ను పూర్తిస్థాయిలో అమలు చేయాలని పోలీసు అధికారులకు సూచించారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా ట్రాఫిక్ నియంత్రణ వ్యవస్థను నిర్వహిస్తే అందరికి సౌలభ్యం కలుగుతుందని అన్నారు. అలాగే ప్రస్తుతం కొత్త బస్‌స్టాండ్ ఎదుట ఉన్న అడ్డా కూలీల స్థలాన్ని ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా కుడకుడ రోడ్డు వైపున కొంత దూరానికి మార్చే అవకాశాన్ని పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. దీంతో ట్రాఫిక్ సమస్యలు తగ్గడంతో పాటు అడ్డా కూలీలకు కూడా ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఉంటుందని అభిప్రాయపడ్డారు.

## సమన్వయంతో అటవీ సంరక్షణ



**ప్రజాపక్షం/సూర్యాపేట** : అటవీ సంరక్షణకు పోలీసు, అటవీ శాఖలు సమన్వయంతో పనిచేయాలని జిల్లా ఎస్‌పి కె. నరసింహ పిలుపునిచ్చారు. శుక్రవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో అటవీశాఖ అధికారులతో ఆయన ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అడవులను నాశనం చేయవద్దని, అడవులు పెరిగితేనే కరువు లాంటి తీవ్ర పరిస్థితులను సమర్థవంతంగా అధిగమించవచ్చన్నారు. అటవీ భూములు అక్రమ ఆక్రమణలను గట్టిగా నిరోధించాలని ఆదేశించారు. ఎక్కడైనా అటవీ భూములు ఆక్రమణకు గురవుతున్న లేదా పోడు భూములకు సంబంధించి ఎలాంటి ధర్నాలు, ఆందోళనలు జరిగే అవకాశం ఉన్నా ఫారెస్ట్ అధికారులు వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. క్షేత్రస్థాయిలో పోలీసులు సహకారం తీసుకుంటూ ముందుకు సాగాలన్నారు. అడవుల విషయంలో తరచూ సమస్యలు సృష్టించే వారిని ముందుగానే గుర్తించి, వారికి చట్టాలపై అవగాహన కల్పించాలని చెప్పారు. ఈ సమావేశంలో జిల్లా అటవీశాఖ అధికారి దామోదర్ రెడ్డి, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ రామారావు, ఇన్‌స్పెక్టర్లు లక్ష్మి నారాయణ, ఫారెస్ట్ రేంజ్ అధికారులు ఆదిత్య, కిరణ్ కుమార్ పాల్గొన్నారు.

## చేనేతకు ప్రభుత్వం చేదోడు

### ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే వేముల వీరేశం

**ప్రజాపక్షం/నకిరేకల్:** చేనేత కార్మికుల సంక్షేమం, అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలా అండగా నిలుస్తుందని ప్రభుత్వ విప్,నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు.12వ జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం పట్టణంలో నిర్వహించిన వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై చేనేత కార్మికులను శాలువాలతో ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేనేత అనేది కేవలం వృత్తి మాత్రమే కాదని, భారతీయ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచిన వారసత్వ సంపద అని పేర్కొన్నారు.చేనేత కార్మికుల శ్రమ, నైపుణ్యంతోనే భారతీయ వస్త్రాలకు ప్రపంచవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు లభిస్తోందని కొనియాడారు. చేనేత రంగం బలోపేతానికి,కార్మికుల జీవనోపాధి మెరుగుదలకు తెలంగాణ ప్రభుత్వం పలు సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ చైర్మన్ నాగులవంచ వెంకటేశ్వరరావు.కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు లింగాల వెంకన్న,పన్నాల రాఘవరెడ్డి,మురారి శెట్టి కృష్ణమూర్తి,గోలి పద్మ , ఎం కృష్ణమూర్తి,లక్ష్మీ నరసయ్య,రావిరాల నరసయ్య,యాదగిరి,చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.



# రోడ్డున పడ్డ పబ్లిక్ క్లబ్ పంచాయితీ

### మరోమారు కాంగ్రెస్ నాయకుల మధ్య బయటపడ్డ విభేదాలు

### క్లబ్ కమిటీని రద్దు చేయాలని ఆర్‌డిఓకు వినతి

### 20న ఎన్నికలకు నోటిఫికేషన్ జారీ

### మా కార్యవర్గ పదవీకాలం మరో ఏడాదిన్నర గడువు ఉంది : ప్రధాన కార్యదర్శి కొప్పుల వేణారెడ్డి






**ప్రజాపక్షం/సూర్యాపేట** : సూర్యాపేట పబ్లిక్ క్లబ్ ఎన్నికలు అప్పటి తహశీల్దార్ శ్యాంసుందర్ రెడ్డి అధ్యక్షతన 3 ఆగష్టు 2024న ఎన్నికలు జరిగాయి. దాదాపు 700 మంది సభ్యులు ఉన్న ఈ క్లబ్ సభ్యులు కాంగ్రెస్ సీనియర్ నాయకులు కొప్పుల వేణారెడ్డిని ప్రధాన కార్యదర్శిగా ఆయనతోపాటు మరో 12 మంది సభ్యులను కలుపుకొని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వీరి పదవీకాలం ఏడాది పాటు ఉంటుందని అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఏడాది తరువాత సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేసి సభ్యుల సమక్షంలో ఆదాయ వ్యయాలను లెక్క చెప్పాల్సి ఉంటుంది. కాగా ఈలోపు గ్రామ పంచాయితీ, మున్సిపల్ ఎన్నికలు రావడంతో క్లబ్ గౌరవ అధ్యక్షులుగా కొనసాగుతున్న సూర్యాపేట ఆర్‌డిఓ వేణుమాధవ రావు పని ఒత్తిడితో 31 జూలై 2025న నిర్వహించాల్సిన సర్వసభ్య సమావేశం వాయిదా పడుతూ వచ్చింది. దీంతో 11 జనవరి 2026న సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. దాదాపు 300 మంది క్లబ్ సభ్యులు హాజరుకాగా వారి సమక్షంలో ఆదాయ వ్యయాలను కార్యవర్గం సమర్పించడం జరిగింది. అనంతరం ఇదే కమిటిని 2 సంవత్సరాల కాలం పొడగిస్తూ సభ్యులు తీర్మానం చేయడంతో క్లబ్ గౌరవ అధ్యక్షులు ఆర్‌డిఓ వేణుమాధవ రావు ఆమోదిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. మరోమారు కాంగ్రెస్ నాయకుల మధ్య బయటపడ్డ విభేదాలు

ఏఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ తాజా మాజీ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డిల మధ్య ఉన్న విభేదాలతో పబ్లిక్ క్లబ్ ప్రధాన కార్యదర్శిగా కొనసాగుతున్న కొప్పుల వేణారెడ్డిని ఆ పదవి నుండి దించేందుకు తమ అనుచరులను రంగంలోకి దింపారు. కాంగ్రెస్ సీనియర్ నాయకులు పోతు భాస్కర్, క్లబ్ సభ్యులు డాక్టర్ రామ్మూర్తి యాదవ్‌తోపాటు మరికొంత మంది కలిసి గురువారం ఆర్‌డిఓ వేణుమాధవ రావుకు వినతిపత్రం అందజేశారు. అతడి పదవీకాలం ఆగష్టు 3 తో ముగిసిందని రెండేండ్ల పదవీ కాలం ఆయన తరువాత ఎన్నికలకు పోకుండా అక్రమ మార్గంలో కార్యవర్గ పదవీ కాలం పొడగించుకోవడం జరిగిందని మీడియా ముందు ఆరోపించారు. ఈ క్లబ్‌కు ఏడాదికి దాదాపు రూ. 2 కోట్ల ఆదాయం వస్తుందని దానికి సంబంధించిన లెక్కలు చూపాలన్నారు. లోపాయికారికంగా కార్యవర్గ పదవీ కాలం పొడిగించుకోవడం సరైంది కాదని వెంటనే కార్యవర్గాన్ని రద్దు చేసి ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఈ విషయమై కాంగ్రెస్ నాయకుల మధ్య జరుగుతున్న రచ్చ ప్రజల్లో చర్చనీయాంశంగా మారింది.

ఈ వివాదంతో ఆర్‌డిఓ వేణుమాధవరావు పబ్లిక్ క్లబ్ నూతన కార్యవర్గ ఎన్నిక కోసం వెంటనే నోటిఫికేషన్‌ను జారీ చేశారు. 20వ తేదీన ఉదయం 10 గంటలకు సర్వసభ్య సమావేశం నిర్వహించి 10.30 గంటలకు క్లబ్ నూతన కార్యవర్గం ఎన్నిక నిర్వహించనున్నట్లు ప్రకటించారు. క్లబ్ ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శి, సహాయ కార్యదర్శి, కోశాధికారితోపాటు మరో 9 మంది కార్యవర్గ సభ్యుల ఎన్నిక జరగనుందని తెలుపుతూ తహశీల్దార్ కార్యాలయంతోపాటు ఆర్‌డిఓ, పబ్లిక్ క్లబ్ కార్యాలయం నోటిస్ బోర్డుల్లో సమాచారం నిమిత్తం అంటూ నోటీసును అంటించారు.

**మా కార్యవర్గ పదవీకాలం మరో ఏడాదిన్నర గడువు ఉంది : ప్రధాన కార్యదర్శి కొప్పుల వేణారెడ్డి**

దీనిపై క్లబ్ ప్రధాన కార్యదర్శి కొప్పుల వేణారెడ్డిని ప్రజాపక్షం వివరణ కోరగా తమ కార్యవర్గ పదవీ కాలానికి మరో ఏడాదిన్నర గడువు ఉందని చెప్పారు. క్లబ్ గౌరవ అధ్యక్షులుగా వ్యవహరిస్తున్న సూర్యాపేట ఆర్‌డిఓ వేణుమాధవ రావు సమక్షంలో 11 జనవరి 2026లో నిర్వహించిన సమావేశానికి దాదాపు 300 మంది సభ్యులు హాజరయ్యారని కోరం కూడా పూర్తిగా ఉండడంతో పాటు సభ్యులు ఏకగ్రీవంగా తమ కార్యవర్గాన్ని మరో రెండేండ్లు కొనసాగించాలని తీర్మానం చేయడం జరిగిందన్నారు. ఈ తీర్మానం ప్రకారమే ఆర్‌డిఓ దీనిని ఆమోదించినట్లు తెలిపారు. తమ కార్యవర్గం అధికారికంగా ఎన్నికైందని దీంట్లో ఎవరికి ఎలాంటి సందేహాలు ఉన్నా నివృత్తి చేసుకోవచ్చని చెప్పారు.

## ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ పోరుయాత్ర



### మునుగోడు మాజీ ఎమ్మెల్యే ఉజ్జిని యాదగిరిరావు

**ప్రజాపక్షం/చింతపల్లి** : కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక పాలనను నిరసిస్తూ భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ ఆధ్వర్యంలో ఈనెల 9 నుండి 12 వరకు నియోజకవర్గంలో పాదయాత్ర నిర్వహిస్తున్నట్టు మునుగోడు మాజీ ఎమ్మెల్యే ఉజ్జిని యాదగిరిరావు అన్నారు. మండల కేంద్రంలోని నారాయణరావు భవన్‌లో శుక్రవారం నిర్వహించిన మండల కౌన్సిల్ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై పాదయాత్ర పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. దేశంలో నేడు పెరుగుతున్న నిరుద్యోగం, భరించలేని ద్రవ్యోల్బణం, విస్తరిస్తున్న అసమానతలు, బలహీనపడిన గ్రామీణ ఆర్థిక వ్యవస్థ, కుంచించుకుపోతున్న ప్రజాస్వామ్యం పెరుగుతున్న సామాజిక ఉద్రిక్తతలను ఎదుర్కొంటుందని, మోదీ ప్రభుత్వం వైఫల్యాలను దాచడానికి ద్వేశాన్ని ప్రోత్సహిస్తున్నారని విమర్శించారు. సెప్టెంబర్ 1న న్యూఢిల్లీలోని రాంలీల మైదానంలో జరిగే బద్లావ్ జరూరీ హై మార్పు అవసరం ర్యాలీతో ఈనెల 9 నుండి 14 వరకు దేశవ్యాప్తంగా చేపట్టిన సిపిఐ పాదయాత్రలు ముగుస్తాయని, మార్పు కోసం చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. నల్గొండ జిల్లా సస్యశ్యామలం కొరకు చేపట్టిన ఎస్ఎల్‌బీసీ డిండి ఎత్తిపోతల పథకాన్ని తక్షణమే పూర్తి చేసి, ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల పథకము ద్వారా నిరుపేదలందరికీ ఇండ్లు ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి పోలె వెంకటయ్య, సిపిఐ మండల సహాయ కార్యదర్శి ఉజ్జిని అంజల్‌రావు, వేముల బుచ్చయ్య, వింజమూరు నరసింహ, యాచారం శ్రీశైలం, మల్లోజు శేఖరాచారి, ఇస్లావత్ పాప, కొణిదల వెంకటయ్య, కృష్ణయ్య, బాల మల్లేష్, కిష్టఫర్, ముద్దం దశరథం తదితరులు పాల్గొన్నారు.

### పేదలను విస్మరించిన మోదీ పాలన

### సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు పల్లె శేఖర్‌రెడ్డి

**ప్రజాపక్షం/చౌటుప్పల్** : కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కార్పోరేట్ శక్తులకు ఊడిగం చేస్తూ పేదల సంక్షేమాన్ని విస్మరించిందని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పల్లె శేఖర్‌రెడ్డి విమర్శించారు.చౌటుప్పల్ మునిసిపల్ కేంద్రంలో శుక్రవారం సిపిఐ ముఖ్యకార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను అవలంభిస్తుందని అన్నారు.దేశ వ్యాప్తంగా నిరుద్యోగం పెరిగిందని,యువతకు ఉపాధి చూపడంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలం చెందిందని తెలిపారు.నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగి పేదల నడ్డి విరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నెల 9వ తేదిన ఆదివారం చౌటుప్పల్ పట్టణంలో చైతన్య యాత్ర నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో సిపిఐ మునిసిపల్ కార్యదర్శి పగిళ్ళ మోహన్‌రెడ్డి,సహయ కార్యదర్శి ఉడుత రామలింగం,నాయకులు బద్దుల సుధాకర్, బోయిన యాదయ్య,టంగుటూరి రాములు,రోషనగారి అంజయ్య, కుంటి పాపయ్య,సింగపంగ బుచ్చయ్య పాల్గొన్నారు.







## దేశాభివృద్ధి అంటే కొద్దిమంది సంపద పెరగడమా?

### ఎఐవైఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎడెల్లి శ్రీకాంత్, చేపూరి కొండలు

**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్** : సెప్టెంబర్ 8, 9, 10 తేదీల్లో యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్టలో జరగనున్న ఏఐవైఎఫ్ రాష్ట్ర 3వ మహాసభలను జయప్రదం చేయాలని ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎడెల్లి శ్రీకాంత్, చేపూరి కొండలు పిలుపునిచ్చారు. మహాసభలకు సంబంధించిన గోడ పత్రికను శుక్రవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ధర్మబిక్షం భవన్‌లో విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశాభివృద్ధి అంటే కొద్ది మంది సంపద పెరగడం కాదని, ప్రజలందరికి సమాన అవకాశాలు, సామాజిక న్యాయం, లౌకికత, రాజ్యాంగ విలువలు, శాస్త్రీయ దృక్పథం బలపడటమే నిజమైన అభివృద్ధి అని వారు ఉద్ఘాటించారు. ప్రజల పన్నుల డబ్బుతో నిర్మించిన ప్రభుత్వ రంగాన్ని కాపాడడం, ఖాళీ ప్రభుత్వ ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయడం, విద్య, వైద్యాన్ని హక్కులుగా అమలు చేయడం, రైతు, కార్మిక, యువజన ప్రయోజనాలను కాపాడే ప్రజా విధానాలను అవలంభించడం ప్రభుత్వ రాజ్యాంగబద్ధమైన బాధ్యతన్నారు. ప్రజలు ప్రశ్నిస్తే వారిని అణిచివేయడం కాదని, వారి సమస్యలను పరిష్కరించడమే ప్రజాస్వామ్య పాలన లక్షణం అని వారన్నారు. కానీ నేడు దేశంలో అమలవుతున్న ఆర్థిక విధానాలు కార్పొరేట్ వ్యక్తుల సంస్థల లాభాలకు ప్రాధాన్యం ఇస్తున్నాయన్నారు. ఈ నేపథ్యంలో సెప్టెంబర్ 8, 9, 10 తేదీల్లో యాదగిరిగుట్ట, యాదాద్రి భువనగిరి జిల్లాలో జరిగే ఏఐవైఎఫ్ తెలంగాణ రాష్ట్ర 3వ మహాసభల్లో ఉపాధి, విద్య, వైద్యం, ప్రజాస్వామ్య హక్కులు, యువజన సమస్యలు వంటి కీలక అంశాలపై విస్తృతంగా చర్చించి భవిష్యత్ ఉద్యమ కార్యాచరణను రూపొందిస్తామని తెలిపారు. యువత, విద్యార్థులు, ప్రజాస్వామ్యవాదులు రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు టి. నరేష్, జిల్లా సహాయ కార్యదర్శి దేగ వీరన్న, నాయకులు ఎండి ఫయాజ్ పాల్గొన్నారు.

## కార్పొరేట్ శక్తుల చేతుల్లోకి వ్యవసాయం రంగం

### సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి లోడంగి శ్రవణ్ కుమార్



**ప్రజాపక్షం/నార్కట్‌పల్లి** : కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టేందుకు సిపిఐ జాతీయ సమితి పిలుపు మేరకు ఈనెల 11,12 తేదీల్లో నకిరికల్ నియోజకవర్గంలో జీపు యాత్ర నిర్వహించనున్నట్లు సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి లోడంగి శ్రవణ్ కుమార్‌తెలిపారు. శుక్రవారం నార్కట్‌పల్లిలో సిపిఐ ప్రచార వాల్ పోస్టర్‌ను ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా శ్రవణ్ కుమార్ మాట్లాడుతూ అమెరికాతో కుదుర్చుకున్న వాణిజ్య ఒప్పందం కారణంగా దేశంలో వ్యవసాయ రంగం కార్పొరేట్ శక్తుల చేతుల్లోకి వెళ్లిపోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. పెరుగుతున్న పెట్రోల్, డీజిల్,గ్యాస్ ధరలతో ప్రజలపై భారం మోపుతున్నారని విమర్శించారు. ఈ ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రజల్లోకి వెళ్లి అవగాహన కల్పించేందుకే జీపు యాత్ర నిర్వహిస్తున్నామని అన్నారు.ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి పెండ్యాల శంకర్,మండల నాయకులు వెంపటి శ్రీనివాస్,వంగాల నాగయ్య,సంగిశెట్టి శ్రీనివాస్,నజీర్,పి.శ్రీనివాస్ రెడ్డి, వంగాల చంద్రయ్య,ఖమ్మంపాటి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## 'పగటి' దొంగలను పోలీసులు పట్టివేత

### అంతర్రాష్ట్ర దొంగల ముఠా ఆటకట్టించిన నల్లగొండ పోలీసులు

### రూ.3.25 లక్షల నగదు, స్కూటీ, చోరీ పరికరాలు స్వాధీనం - మరో ఇద్దరు నిందితుల కోసం గాలింపు



**ప్రజాపక్షం/నల్లగొండ:** పట్టణంలో ఇటీవల వరుసగా చోటుచేసుకున్న పగటి పూట చోరీల కేసును పోలీసులు ఛేదించారు.పగటి వేళల్లో తాళం వేసి యజమానులు లేని ఇళ్లను లక్ష్యంగా చేసుకుని రెక్కీ నిర్వహించి, తాళాలు పగులగొట్టి చోరీలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర దొంగల ముఠాకు చెందిన ప్రధాన నిందితుడు మహమ్మద్ నసీమ్ (48)ను నల్లగొండ వన్‌టౌన్,టూ టౌన్ పోలీసులు సంయుక్తంగా అరెస్టు చేశారు.నిందితుడి వద్ద నుంచి రూ.3.25 లక్షల నగదు, ఒక స్కూటీ, రెండు ఇనుప రాడ్లు,మాస్క్,సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు.ఈ విషయాన్ని అదనపు ఎస్‌పి జి.రమేష్ శుక్రవారం వెల్లడించారు.జూలై 26న నల్లగొండ పట్టణంలోని వి.టి. కాలనీలోని ఓ అపార్ట్‌మెంట్‌లో ఫ్లాట్ తాళం పగులగొట్టి బంగారు ఆభరణాలు అపహరించిన ఘటనపై టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. జిల్లా ఎస్‌పి శరత్ చంద్ర పవార్ ఆదేశాల మేరకు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి సీసీటీవీ ఫుటేజీలు,సాంకేతిక ఆధారాలు,నిఘా సమాచారాన్ని విశ్లేషిస్తూ నిందితుల కోసం గాలింపు చేపట్టాయి.దర్యాప్తులో భాగంగా ఆగస్టు 6న సాయంత్రం పానగల్ బైపాస్ రోడ్డువద్ద మరోసారి చోరీలకు పాల్పడేందుకు స్కూటీపై వస్తున్న ప్రధాన నిందితుడు మహమ్మద్ నసీమ్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.విచారణలో నల్లగొండ వన్‌టౌన్,టూ టౌన్ పోలీస్ స్టేషన్‌ల పరిధితో పాటు ఆంధ్రప్రదేశ్‌లోని నెల్లూరు జిల్లా వేదాయపాలెం, తిరుపతి జిల్లా తిరుచానూరు ప్రాంతాల్లో జరిగిన పలు చోరీ కేసుల్లో తన ప్రమేయాన్ని అంగీకరించాడు.


**రెక్కీ చేసి.. తాళం బద్దలు కొట్టి.. చోరీ చేసి పరార్**

ఈముఠా ముందుగా తాళం వేసి యజమానులు లేని ఇళ్లను గుర్తించి కొంతసేపు రెక్కీ నిర్వహించేది. ఇంట్లో ఎవరూ లేరని నిర్ధారించుకున్న అనంతరం ఇనుప రాడ్లతో తాళాలు పగులగొట్టి లోపలికి ప్రవేశించి బంగారం, నగదు అపహరించి వెంటనే పరారయ్యేదని విచారణలో వెల్లడైంది.నల్లగొండలో జరిగిన చోరీల్లో మహమ్మద్ నసీమ్,ఇర్షాద్ స్కూటీపై రాగా,షరీఫ్ కారులో వచ్చి బయట కాపలా కాశాడని పోలీసులు తెలిపారు. వీరు కలిసి నల్లగొండ వన్‌టౌన్ పరిధిలో రెండు ఇళ్లలో ఐదు తులాల బంగారు ఆభరణాలు,రూ.30 వేల నగదు,టూ టౌన్ పరిధిలోని వి.టి. కాలనీలో మూడు తులాల బంగారు ఆభరణాలు అపహరించినట్లు దర్యాప్తులో తేలింది.అలాగే నెల్లూరు,తిరుపతి జిల్లాల్లో జరిగిన భారీ చోరీల కేసుల్లో కూడా ఇదే ముఠా ప్రమేయం ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. ప్రధాన నిందితుడు గతంలో ఢిల్లీ, ఇండోర్, మీరట్, హైదరాబాద్ ప్రాంతాల్లో అనేక చోరీ కేసుల్లో అరెస్టై జైలు శిక్ష అనుభవించినట్లు విచారణలో వెల్లడైంది. ప్రస్తుతం పరారీలో ఉన్న ఇర్షాద్,షరీఫ్‌ల కోసం ప్రత్యేక బృందాలు రాష్ట్రాల మధ్య సమన్వయంతో గాలింపు కొనసాగిస్తున్నాయి. ఈ కేసును డిఎస్‌పి కె. శివరాం రెడ్డి పర్యవేక్షణలో వన్‌టౌన్ సీఐ ఎ. రాజశేఖర్ రెడ్డి, టూ టౌన్ సీఐ కె.ఆది రెడ్డి ఆధ్వర్యంలో ఛేదించిన పోలీసు బృందాన్ని జిల్లా ఎస్‌పి శరత్ చంద్ర పవార్ అభినందించారు.

## ప్రజా ప్రభుత్వంలో ప్రతి పేదవాడికీ న్యాయం

### చండూరు మండల సమీక్షా సమావేశంలో ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి

**ప్రజాపక్షం/చండూరు:** అధికారులు ప్రజా ప్రతినిధులు అంకిత భావంతో పనిచేస్తూ ప్రభుత్వం అందించే అభివృద్ధి ,సంక్షేమ పథకాలు ప్రజలకు అందించే విధంగా పారదర్శంగా పని చేయాలని ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. శుక్రవారం చండూరు మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో మండల స్థాయి సమీక్షా సమావేశం మండల ప్రత్యేకాధికారి నాగమల్లేశ్వరరావు, ఎంపిడిఓ బండారు యాదగిరి అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిధిగా ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం , ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి హాజరై మాట్లాడారు. మండలంలో ఉన్న 19 గ్రామ పంచాయితీలలో జరుగుతున్న అభివృద్ధి పనుల పురోగతిపై సమీక్షించారు. చండూరు మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనులు , ఇందిరమ్మ ఇండ్ల పురోగతి, వ్యవసాయ రంగంపై రైతులు పడుతున్న ఇబ్బందులు , గ్రామాలలో పారిశుద్ధ్యం నిర్వాహణ , ఉపాధి హామీ పనులు , పంచాయితీ రాజ్ పనులపై ముఖ్యంగా చర్చించారు. గ్రామాలలో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని తెలిపారు. అర్హత ఉన్న ప్రతి పేద వాడికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని అన్నారు. రైతులు సేంద్రీయా పంటలు , ఆయిల్ ఫామ్స్ వంటి లాభాదాయమైన పంటలు సాగు చేయుటకు రైతులను ప్రోత్సహించాలని అన్నారు. ప్రతి గ్రామ పంచాయితీకి 5గురు రైతులను ఎంపిక చేసుకొని సేంద్రీయ పంటలు సాగు చేసే విధంగా ప్రణాళికలు చేయాలని అన్నారు. ప్రతి గ్రామంలో మధ్యపాన నిషేదం నిర్మూలన అమలు చేయాలని దిశానిర్దేశం చేశారు. రైతులకు




24గంటల నాణ్యమైన విద్యుత్ అంతరాయంలేకుండా అందించాలని సంబంధిత అదికారులను ఆదేశించారు. చండూరు మండల సమగ్ర అభివృద్ధి కోసం ప్రణాళిలు తయారు చేయాలని అధికారులను ఆదేశించారు.ఈ సమావేశంలో వివిధ మండల స్థాయి అధికారులు , సర్పంచ్‌లు పాల్గొన్నారు.

## స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించాలి

జిల్లా అదనపు కలెక్టర్లు వెంకటేశ్వర్లు, కిశోర్ కుమార్




**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్ అన్నారు.శుక్రవారం కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్లు సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు.స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ప్రోటోకాల్ ప్రకారం అతిథులను ఆహ్వానించాలన్నారు.వేదికను అందంగా ముస్తాబు చేయాలన్నారు. దేశభక్తి ఉట్టిపడేలా విద్యార్థులచే సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించాలని అన్నారు.కార్యక్రమం జరుగుతున్నంత సేపు నిరంతర విద్యుత్ సరఫరా ఉండాలన్నారు.టెంట్, షామియానా, తాగు నీరు ఏర్పాట్లు చేయాలని చెప్పారు. తగిన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని వివరించారు. అంబులెన్సు అందుబాటులో ఉంచడంతో పాటు వైద్య శిబిరం ఏర్పాటు చేయాలని తెలిపారు. పార్కింగ్ ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు.ఎక్కడా కూడా ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అన్ని శాఖలు సమన్వయంతో, ప్రణాళిక ప్రకారం స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను విజయవంతంగా నిర్వహించాలన్నారు.భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్,డిఆర్ఓ, రథోడ్ రమేష్, డిఎస్పీ శ్రీనివాస్,ఆర్డీఓ దేవీదాస్,ఇతర అధికారులు, సిబ్బంది,పాల్గొన్నారు.

## ఇవిఎం గోదాంను కలెక్టర్ తనిఖీ



**ప్రజాపక్షం/మెదక్ :** కలెక్టరేట్ ఆవరణలోని ఈవీఎం గోదాంను శుక్రవారం మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్, గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో నెలవారీ తనిఖీ నిర్వహించారు. వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో గోదాం సీల్ ను పరిశీలించారు. గోదాంలో ఏర్పాటు చేసిన సిసి కెమెరాల పనితీరు, అగ్ని ప్రమాదాల నివారణ కోసం ఏర్పాటు చేసిన ఫైర్ ఎక్స్టింగ్విషర్లు, ఇతర భద్రతా పరికరాలను తనిఖీ చేశారు. ఎన్నికల ప్రక్రియలో పారదర్శకతను నిర్ధారించేందుకు ప్రతి నెల గుర్తింపు పొందిన రాజకీయ పార్టీ ప్రతినిధుల సమక్షంలో ఈవీఎం గోదాం తనిఖీలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఈవీఎంల భద్రత విషయంలో ఎటువంటి రాజీ లేకుండా 24 గంటలు భద్రతా ప్రమాణాలను పకడ్బందీగా అమలు చేస్తున్నామని, గోదాంలో భద్రతా ఏర్పాట్లను నిరంతరం పర్యవేక్షిస్తున్నామని తెలిపారు. కలెక్టర్ వెంట ఎలక్షన్ సెల్ సూపరింటెండెంట్ హర్ దీప్ సింగ్, రెవెన్యూ అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు ఉన్నారు.

## గద్దర్ ఆశయాలు భావితరాలకు స్ఫూర్తి కావాలి

మెదక్ జిల్లాకు గద్దర్ పేరు పెట్టాలి

**ప్రజాపక్షం/మెదక్ :** ప్రజా యుద్ధనౌక, కవి గద్దర్ ఆశయాలు నేటి యువతకు మార్గదర్శకంగా నిలవాలని, భావితరాలకు స్ఫూర్తి కావాలని తెలంగాణ సాంస్కృతిక సారథి చైర్మన్ డాక్టర్ గుమ్మడి వెన్నెల పిలుపునిచ్చారు. శుక్రవారం గద్దర్ మూడవ వర్ధంతి సందర్భంగా మెదక్ జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేయనున్న గద్దర్ విగ్రహ స్థలంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. నూతనంగా ఏర్పడిన మెదక్ ప్రెస్ క్లబ్ అధ్యక్షులు నరసింహ చారి, ప్రధాన కార్యదర్శి సంగమేశ్వర్ లను డాక్టర్ గుమ్మడి వెన్నెల శాలువాతో సన్మానించి అభినందించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ పేద, బడుగు బలహీన వర్గాలు, అణగారిన ప్రజల హక్కుల కోసం జీవితాంతం పోరాడిన మహనీయుడు గద్దర్ అని కొనియాడారు. తన ఆట, పాటలతో దోపిడీ వ్యవస్థను ప్రశ్నించి ప్రజల్లో చైతన్యం నింపిన ప్రజా యుద్ధనౌక గా చిరస్థాయిగా నిలిచారని పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమంలో గద్దర్ పాటలు ప్రజల్లో ఉద్యమ స్ఫూర్తిని రగిలించి ఉద్యమానికి ఊపిరి పోశాయన్నారు. సామాజిక న్యాయం, సమానత్వం కోసం ఆయన చూపిన మార్గాన్ని భావితరాలు కొనసాగించాలని,యువత ఆయన ఆశయాలను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. అలాగే గద్దర్ జీవిత చరిత్రను పాఠ్యపుస్తకాల్లో చేర్చాలని, ఆయన జన్మించిన మెదక్ జిల్లాకు గద్దర్ పేరు పెట్టాలని, హైదరాబాద్ ట్యాంక్‌బండ్ పై గద్దర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ప్రెస్ క్లబ్ కోశాధికారి అశోక్, టీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షులు శంకర్ దయాళ్ చారి, సీనియర్ జర్నలిస్టులు బాలోళ్ల రావు, బొందుగుల నాగరాజు, ఫారూక్ హుస్సేన్, రమేష్, నర్సింలు, సిద్దేశం, రాహుల్, దొంతాయ్య, కృష్ణమూర్తి, కార్తీక్, శ్రీకాంత్, సిద్దిరాజు గంట సంపత్, జబేర్, నాయకులు బాల్ రాజు, బొమ్మల మైసయ్య, ఆకుల పెంటయ్య, గంగాధర్, ప్రజా సంఘాల నాయకులు, జర్నలిస్టులు పాల్గొన్నారు.

## ఆరుతడి పంటలతో మెరుగైన ఆదాయం

**ప్రజాపక్షం/జన్నారం :** నీటి కొరత ఉన్న ప్రాంతాల్లో రైతులు ఆరుతడి పంటలకు ప్రాధాన్యత ఇవ్వాలని సహాయ వ్యవసాయ సంచాలకులు కృష్ణ సూచించారు. జన్నారం మండలం కలమడుగు గ్రామంలో గురువారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పెసర పంట క్షేత్రాన్ని వ్యవసాయ అధికారి వీరన్నతో కలిసి ఆయన సందర్శించి పంట పరిస్థితిని పరిశీలించారు. తక్కువ నీటి వనరులతో సాగు చేయగల పెసర వంటి ఆరుతడి పంటలతో పాటు కూరగాయల సాగును ప్రోత్సహించాలని తెలిపారు. నీటి వనరులను సమర్థవంతంగా వినియోగించుకుంటూ పంటల వైవిధ్యాన్ని పెంచుకోవాలని సూచించారు. తక్కువ నీటితో అధిక దిగుబడి నిచ్చే పంటలను ఎంపిక చేసుకోవడం వల్ల సాగు ఖర్చులు తగ్గి రైతులకు మెరుగైన ఆదాయం లభిస్తుందని వివరించారు.వ్యవసాయ విస్తరణాధికారులు దివ్య, లవన్ కృష్ణ, రైతులు పాల్గొన్నారు.



## తప్పుడు జనన ధ్రువీకరణ పత్రం జారీ

గ్రామ పంచాయతీ కార్యదర్శి సస్పెన్షన్

**ప్రజాపక్షం/సిర్పూర్ టి :** తప్పుడు జనన ధ్రువీకరణ పత్రం జారీ చేసిన సిర్పూర్ (టి) గ్రామ పంచాయతీ కార్యదర్శి పైన్ని తిరుపతిని సస్పెండ్ చేస్తూ, కంప్యూటర్ ఆపరేటర్ నీలేష్ ను విధుల నుంచి తొలగిస్తూ జిల్లా కలెక్టర్ కె. హరిత ఆదేశాలు జారీ చేశారు. పొన్నం శ్రీనిధి అనే వ్యక్తికి సంబంధించి జనన తేదీ రిజిస్టర్‌లో నమోదు చేయకపోయినా, ఎలాంటి ఆధార పత్రాలు పరిశీలించకుండానే నేరుగా పోర్టల్లో వివరాలు నమోదు చేసి ధ్రువీకరణ పత్రం జారీ చేసినట్లు విచారణలో తేలింది. విధి నిర్వహణలో తీవ్ర నిర్లక్ష్యం, అధికార దుర్వినియోగానికి పాల్పడినందున కార్యదర్శిపై సస్పెన్షన్ వేటు వేసి, శాఖాపరమైన చర్యలకు ఆదేశించినట్లు కలెక్టర్ తెలిపారు. ప్రభుత్వ రికార్డుల నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని, పంచాయతీల్లో సేవలు పారదర్శకంగా ఉండాలని స్పష్టం చేశారు.

# ప్రజలకు మెరుగైన సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

మంత్రి దామోదర్ రాజనర్సింహ




**ప్రజాపక్షం/సంగారెడ్డి :** జిల్లాలో ప్రజలకు మెరుగైన వైద్య ఆరోగ్య సేవలతో పాటు విద్య, తాగునీరు. వ్యవసాయం, రెవెన్యూ మహిళశిశు సంక్షేమం తదితర రంగాల్లో ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను మరింత వేగవంతం చేసి వాటి ఫలాలు ప్రజలకు పూర్తిస్థాయిలో అందేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్‌రాజ నర్సింహ సూచించారు. శుక్రవారం కలెక్టరేట్ గ్రీవెన్స్ హాల్‌లో జిల్లా కలెక్టర్ ప్రతిక్ జైన్ కలిసి మంత్రి దామోదర్‌రాజనర్సింహ సమీక్ష సమావేశం నిర్వహంచారు.జోగిపేట ఏరియా ఆసుపత్రిలో విధుల నిర్వహంచాల్సిన డ్యూటీ డాక్టర్ స్థానంలో మరో నకిలి వ్యక్తి డాక్టర్‌గా విధులు నిర్వహించిన ఘటనపై మంత్రి దామోదర రాజ నర్సింహ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి ఘటనలు పునారావృత కాకుండా కఠి న చర్యలు తీసుకోవాలని ఆసుపత్రుల్లో వైద్యుల హాజరు విధుల నిర్వహణపై నిరంతరం పర్యవేక్షణ ఉండాలని డిసిహెచ్‌ఎస్ ఆసుపత్రి సూపరింటెండెంట్‌లను ఆదేశించారు. కంకోల్, సింగీతం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ప్రారంబోత్సవానికి ఏర్పాట్లు చేయాలని బర్దిపూర్ ,సుల్తాన్‌పూర్ నేరడిగుంట, పిహెచ్‌సి భవన నిర్మాణ పనులను వేగవంతం చేసి పూర్తి చేయాలని ఆదేశించారు. జిల్లాలో సిజినల్ వ్యాదుల నియంత్రణకు తీసుకుంటున్న చర్యలు డెంగ్యూ ,మలేరియా ,చికున్ గున్యా నమోదైన కేసుల వి వరాలను మంత్రి అధికారులను అడిగి తెలుసుకున్నారు. సీజనల్ వ్యాదుల నియంత్రణకు ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో అవసరమైన మందులు, వైద్య పరికరాలు, ఇతర మౌళిక వసతులు, అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులను ఆదేశించారు. సంగారెడ్డి నర్సింగ్ కళాశాల ,పటాన్‌చెరు, సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి ,జహీరాబాద్ ఎంసి హెచ్‌లను త్వరలో ప్రారంభించేందుకు అవసరమైన అవసరమైన చర్యలు తీసుకోవాలని సంబందిత అధికారులకు మంత్రి ఆదేశించారు. సంగారెడ్డి జిజిహెచ్‌ఓ అవసరమైన ఎక్వీప్మెంట్ మందులు అందుబాటులో ఉండాలని నిరంతరం పర్యవేక్షించాలని జిజిహెచ్ సూపరింటెండెంట్ కు సూచించారు. విద్య రంగంలో మౌళిక వసతులపై ప్రత్యేక దృష్టి సారించాలని మంత్రి సూచించారు. కెజిబివిలు మోడల్ స్కూళ్లపై ప్రత్యేక దృష్టి సారించి విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించాలని మంత్రి ఆదేశించారు. పిహెచ్‌సిలు ,అంన్‌వాడి కేంద్రాలు, ప్రభుత్వ పాఠశాలలు కేజిబివిలు, మోడల్ స్కూళ్లు జడ్‌పిహెచ్‌ఎస్‌లలో త్రాగునీరు. డ్రైనేజ్ మరుగుదొడ్ల సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి సారించి అవసరమైన పనులను పూర్తి చేయాలని మంత్రి కలెక్టర్ కు సూచించారు. జిల్లాలలోని ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించి విద్యార్థులు ఆహ్లాద వాతావరణంలో చదువు కునేలా అన్ని సౌకర్యాలు కల్పించాలన్నారు. హాస్టళ్లకు సంబందించి ప్రస్తుతం అద్దె భవనాల్లో కొనసాగుతున్న ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్ల వివరాలను సంబందిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. కొత్త రేషన్ కార్డుల జారీ అంశంపై మంత్రి సమీక్షిస్తు ఈ నెల 15న సిఎం రేవంత్‌రెడ్డి సంగారెడ్డి జిల్లాలో పర్యటించనున్న నేపథ్యంలో కొత్త రేషన్‌కార్డుల పంపిణీ కార్యక్రమానికి సంబదించిన పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. పరిస్థితిపై మంత్రి సమీక్షిస్తూ మ ంజీరా సింగూరు ప్రాజెక్టుల్లో ప్రస్తుత నీటి మట్టాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో ప్రస్తుత తాగునీటి సరఫరా పరిస్థితిని వాస్తవికంగా అంచనా వేసి జి ల్లాలో సరిపడ్డ వర్షాలుపడని పక్షంలో రానున్న రోజుల్లో ఎదురయ్యే పరిస్థితులను ముందుగానే అంచనా వేసి సమగ్ర యాక్షన్ ప్లాన్ రూపొందించాలని సంబందిత అధికారులను మంత్రి ఆదేశించారు. ఏలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రణాళికతో ముందస్తు చర్యలు చేపట్టాలని సంబందిత అధికారులకు మంత్రి సూచించారు.అడిషనల్ కలెక్టర్లు సంగీత,పాండు ,సబ్‌కలెక్టర్ ఉమాహారతి, అధికారులు రెవెన్యూ డివిజన్ అధికారులు పాల్గొన్నారు.

## 11న మిషన్ భగీరథ కార్యాలయం ముట్టడి



**ప్రజాపక్షం/ఆసిఫాబాద్ :** మిషన్ భగీరథ కాంట్రాక్టు కార్మికులకు నెలల తరబడి పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే విడుదల చేయాలని ఎఐటియుసి జిల్లా డిప్యూటీ కార్యదర్శి ఆత్మకూరి చిరంజీవి డిమాండ్ చేశారు. ఈ మేరకు ఎఐటియుసి ఆధ్వర్యంలో కార్మికులతో కలిసి ఆ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రాకేష్‌కు వినతిపత్రం సమర్పించారు. ఎల్ అండ్‌టీ, ఎవరెస్ట్ ఏజెన్సీలలో పనిచేస్తున్న కార్మికులకు జీతాలు చెల్లించకపోవడంతో తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పెండింగ్ వేతనాలు చెల్లించకపోతే ఈ నెల 11న మిషన్ భగీరథ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. జిల్లా అధ్యక్షుడు చాపిడి బాలేష్, పలువురు కాంట్రాక్టు కార్మికులు పాల్గొన్నారు.

## ప్రమాదమని తెలిసినా తప్పని ప్రయాణం

**ప్రజా పక్షం/పెంబి :** పెంబి మండలంలో గత కొన్ని రోజుల నుంచి కురిసిన భారీ వర్షాల కారణంగా కడెం వాగులో వరద నీరు ఇప్పటికి కూడా అలాగే కొనసాగుతుంది.కడెం వాగు అవతల పక్కను న్న గిరిజన గ్రామాలైన యాపల్ గూ డా రాంనగర్ సత్తుగూడ దొందరి వాసుపల్లి చాకిరేవు గ్రామాల ప్రజలు మండల కేంద్రం పెంబిలో జరిగే వారసంత కోసం, తమకు కావలసిన నిత్య అవసరాలను కొనుగోలు చేయడానికి ఈ ప్రమాదకరమైన కడెం వాగు దాటవలసి వస్తుంది.వాగు పైన ఎలాంటి రవాణా సౌకర్యాలు లేని కారణంగా ఇలాంటి నాటు పడవలపై తమ ప్రాణాలను అరిచేతిలో పెట్టుకొని బిక్కు బిక్కు మంటూ నాటు పడవలపై ప్రయాణం చేయవలసి ఉంటుంది.గతంలో ఇలాగే ప్రయాణం చేసి వాగులో కొట్టుకపోయిన సందర్భాలు అనేకం ఉన్నాయి. ప్రభుత్వాలు గ్రామాల అవస్థలు చూసి తక్షణమే వంతెన నిర్మాణం చేయాలని ప్రజలు వేడుకుంటున్నారు.



## వివరాల సేకరణను నిర్ణీత గడువులోగా పూర్తి చేయండి

రాష్ట్ర జనగణన సంచాలకులు భారతి హోళ్లికేరి



**ప్రజాపక్షం/నస్పూర్ :** జనగణన2027 కార్యక్రమంలో భాగంగా జిల్లా జనగణన హ్యాండ్‌బుక్ తయారీకి అవసరమైన గ్రామ, పట్టణ డైరెక్టరీ వివరాల సేకరణను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని రాష్ట్ర జనగణన సంచాలకులు భారతి హోళ్లికేరి తెలిపారు. శుక్రవారం హైదరాబాద్ నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. సమాచార సేకరణ, నమోదు ప్రక్రియలో ఖచ్చితత్వం, నాణ్యత ఉండేలా ఫీల్డ్ ఫంక్షనరీలకు ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని సంచాలకులు తెలిపారు. విద్య, ఆరోగ్యం, తాగునీరు, పారిశుద్ధ్యం, విద్యుత్, రహదారులు, బ్యాంకింగ్ వంటి సామాజిక, ఆర్థిక మౌలిక వసతుల సమాచారాన్ని సేకరించి వెబ్ పోర్టల్‌లో నమోదు చేయాలని సూచించారు. అనంతరం జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అధికారులతో మాట్లాడుతూ జనగణన హ్యాండ్ బుక్ భవిష్యత్ అభివృద్ధి ప్రణాళికలు, సంక్షేమ పథకాల రూపకల్పనకు ప్రామాణికంగా ఉపయోగపడుతుందని తెలిపారు. వ్యవహరించి వివరాల సేకరణ, పోర్టల్ నమోదు ప్రక్రియను నిర్దేశిత గడువులోగా పూర్తిచే యాలని ఆదేశించారు.జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి. రాములు, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ మొహమ్మద్ విలాయత్ అలీ, జి ల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి నరేంద్ర రాథోడ్, జి ల్లా సంక్షేమ శాఖాధికారి రౌఫ్ ఖాన్, ముఖ్య ప్రణాళికాధికారి, ఉప గణాంకాధికారి రాజేందర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## భూభారతి, సాదాబైనామా దరఖాస్తుల పరిష్కారం

కలెక్టర్ భవేష్‌మిశ్రా ఆదేశం



**ప్రజాపక్షం/నిజామాబాద్ :** భూభారతి, సాదాబైనామా, పెండింగ్ దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ భవేష్ మిశ్రా ఆదేశించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ ప్రధాన సమీక్ష మందిరంలో శుక్రవారం ఆయన అన్ని మండలాల తహసీల్దార్లతో భూభారతి, సాదాబైనామా పెండింగ్ దరఖాస్తులు, ప్రజావాణి ఫిర్యాదుల పరిష్కారం, ఇతర రెవెన్యూ అంశాలపై సమీక్ష జరిపారు. ఒక్కో మండలం వారిగా పెండింగ్‌లోని దరఖాస్తులు ఎన్ని అని ఆరా తీస్తూ, వాటి పరిష్కారంలో జాప్యానికి గల కారనాలను అడిగి తెలుసుకున్నారు. పెండింగ్ దరఖాస్తులను సమగ్రంగా పరిశీలన జరుపుతూ ఈ నెలాఖరులోగా అన్నింటిని పరిష్కరించాలని కలెక్టర్ గడువు విధించారు. అర్హులైన ప్రతిఒక్కరికి న్యాయం జరిగేలా చొరవ చూపాలన్నారు. దరఖాస్తుల ధృవీకరణ ప్రక్రియలో పారదర్శకత, జవాబుదారీతనం పాటించాలని, ప్రాధాన్యత క్రమంలో దరఖాస్తులను వేగంగా పరిష్కరించాలని ఆదేశించారు. అదేవిధంగా జిల్లా స్థాయిలో నిర్వహించే ప్రజావాణితో పాటు రాష్ట్ర స్థాయిలో నిర్వహించే సిఎం ప్రజావాణి కార్యక్రమాలతో వచ్చిన అర్జీల పరిష్కారం విషయంలోనూ ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. వెంటాదివెంట అర్జీలను పరిష్కరిస్తూ వివరాలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు.ఫ్యామిలీ రిజిస్ట్రర్ సర్టిఫికెట్ కోసం వచ్చిన దరఖాస్తులను కూడా స త్వరమే పరిశీలిస్తూ పరిష్కరించాలన్నారు. ఈనెల 17లోగా అన్ని ఎఫ్ఆర్‌సి దరఖాస్తులు పరిష్కారమయ్యేలా చూడానలి కలెక్టర్ సూచించారు. కస్టం మిల్లింగ్ కోసం లేవీ ధాన్యం కేటాయించిన రైస్‌మిల్లులను ప్రతి పక్షం రోజులకోకసారైనా తప్పనిసరిగా సందర్శిస్తూ ధాన్యం నిల్వలను పరిశీలించాలని తహసీల్దార్లను ఆదేశించారు.

**ఆలస్యంగా హాజరైన తహసీల్దార్లకు షోకాజ్ నోటీసులు జారీ**

ఇదిలా ఉండగా సమీక్షా సమావేశానికి ఆలస్యంగా హాజరైన తహసీల్దార్లకు కలెక్టర్ భవేష్ మిశ్రా షోకాజ్ నోటీసులు జారీ చేశారు. నిర్ణీత సమయానికి కలెక్టర్ సమావేశ మందిరానికి చేరుకోగా పలు మండలాల తహసీల్దార్లు గైర్హాజరు కావటాన్ని గమనించి వారి తీరు పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. నిర్ణీత సమయం మరో 15 నిమిషాల వరకు కూడా సమావేశం హాల్‌కు చేరుకోలేకపోయిన తహసీల్దార్లకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ప్రతిఒక్కరూ సమయపాలన పాటించాలని కలెక్టర్ సూచించారు. అభిగ్యాన్ మాల్వియ, జిల్లా రెవెన్యూ అధికారి గీత, తహసీల్దార్లు పాల్గొన్నారు.

## చేనేత కార్మికుల సంక్షేమానికి కృషి

అడిషనల్ కలెక్టర్ పాండు




**ప్రజాపక్షం/సంగారెడ్డి :** చేనేత రంగాన్ని ప్రోత్సహించడంతో పాటు చేనేత కార్మికుల కళానైపుణ్యానికి తగిన గుర్తింపు కల్పించి వారి సంక్షేమానికి ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకునేలా అవగాహన కల్పించాలని అడిషనల్ కలెక్టర్ పాండు అన్నారు. జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం సంగారెడ్డి ప్రభుత్వ ఐటీఐ కళాశాల నుంచి కలెక్టరేట్ వరకు నిర్వహించిన హ్యాం డ్లుమ్ వాక్ ర్యాలీని అడిషనల్‌కలెక్టర్ పాండు జెండా ఊపి ప్రారంభించారు. చేనేత రంగం మన దేశ సాంస్కృతికి వారసత్వానికి ప్రతీకంగా నిలుస్తోందన్నారు. తరతరాలుగా చేనేత వృత్తిని కొనసాగిస్తూ తమ నైపుణ్యంతో అద్భుతమైన వస్త్రాలను తయారు చేస్తున్న చేనేత కార్మికుల కృషిని ప్రతీ ఒక్కరూ గుర్తించి గౌరవించాల్సిన అవస ర ం ఉందన్నారు. ప్రజలు చేనేత వస్త్రాలు కొనుగోలు చేసి వినియోగించడం ద్వారా చేనేత కార్మికుల కు తమ వంతు సహకారం అందించాలని కోరారు. చేనేత రంగానికి ప్రభుత్వం అందిస్తున్న వివిధ సంక్షేమ ప్రోత్సాహక పథకాలపై చేనేత కార్మికులకు అవగాహన కల్పించి అర్హులైన ప్రతి ఒక్కరే వాటిని సద్వినియోగం చేసుకునేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. హ్యాండ్లుమ్ శాఖ సహాయసంచాలకులు,వెంకటరావు,అధికారులు చేనేత కార్మికులు ,యువత పాల్గొన్నారు.


## వాగ్దేరిలో ఘనంగా 'పోలీసులు మీకోసం'



**ప్రజాపక్షం/నేరడిగొండ:** నేరాల నియంత్రణ, పోలీసుప్రజల సత్సంబంధాలే లక్ష్యంగా నేరడిగొండ మండలం వాగ్దేరి గురువారం నిర్వహించిన 'పోలీసులు మీకోసం' కార్యక్రమానికి జిల్లా ఎస్పి అఖిల్ మహాజన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. 800 మందికి ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. నేరడిగొండ, తర్ణం గ్రామాల్లో ఏర్పాటు చేసిన 12 సిసిటివి కెమెరాలను ఎస్పి ప్రారంభించారు.20 మంది వాహనదారులకు హెల్మెట్లు పంపిణీ చేశారు. రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని, గంజాయి రవాణా, సేవింపులకు దూరంగా ఉండాలని హెచ్చరించారు. అసాంఘిక కార్యకలాపాలపై వాట్సాప్ నెంబర్ 8712659973, షీ టీమ్స్ 8712659953లో సమాచారం అందించాలన్నారు. వాలీబాల్ పోటీల విజేత వాగ్ధేరి జట్టుకు, పెయింటింగ్ విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. సిఐ రమేష్, ఎస్ఐ సర్పంచ్ పాల్గొన్నారు.

## కొత్త రైతులకు భరోసా ఏదీ?

- నిర్మల్ జిల్లాలో 2,000 మంది రైతులకు అందని పెట్టుబడి సాయం
- వానాకాలం సాగు వేళ అప్పుల ఊబిలో కర్షకులు



**ప్రజాపక్షం/నిర్మల్ :** నిర్మల్ జిల్లాలో నూతనంగా పట్టాదార్ పాస్‌పుస్తకాలు పొందిన అర్హులైన రైతులకు ప్రభుత్వం అందిస్తున్న రైతు భరోసా పెట్టుబడి సాయం ఇప్పటికీ అందకపోవడంతో తీవ్ర ఆందోళన నెలకొంది. జిల్లావ్యాప్తంగా మొత్తం 1,88,000 మంది రైతులు ఇప్పటికే భరోసా సాయాన్ని అందుకోగా,కొత్తగా పట్టా పాస్ బుక్‌లు వచ్చిన సుమారు 2,000 మంది రైతులు మాత్రం నిధుల కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. వానాకాలం సాగు కీలక దశకు చేరుకున్నప్పటికీ ఖాతాల్లో డబ్బులు జమ కాకపోవడంతో వ్యవసాయ పెట్టుబడుల కోసం అప్పులు చేయాల్సి వస్తోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**అప్లై చేసుకున్నా అందని సాయం :** జిల్లాలోని వివిధ మండలాల్లో ఇటీవల భూ రికార్డుల సవరణ, వారసత్వ మార్పులు, భూ విభజన, నూతన పట్టాల మంజూరు తదితర ప్రక్రియల అనంతరం పలువురు రైతులకు కొత్త పట్టాదార్ పాస్‌పుస్తకాలు జారీ అయ్యాయి. అధికారుల సూచనల మేరకు రైతులు తమ భూ వివరాలు,ఆధార్, బ్యాంకు ఖాతా వివరాలను సిసిఎల్ఏ పోర్టల్‌లో నమోదు చేసి రైతు భరోసా కోసం దరఖా స్తు చేసుకున్నారు. అయితే నెల రోజులు గడిచినా ఇప్పటివరకు వారి ఖాతాల్లో నిధులు జమ కాలేదు.భూ వివరాల నవీకరణ, బ్యాంకు ఖా తాల అనుసంధానం లేదా ఈకేవైసీ (ఇకెవైసి) ప్రక్రియలు సాంకేతిక కారణాల వల్ల పెండింగ్‌లో పడటంతోనే ఈ లబ్ధి నిలిచిపోయినట్లు తెలుస్తోంది. దీని వల్ల ఒకే గ్రామంలో కొందరికి నిధులు అందగా, నూతన పట్టాదారులు మా త్రం లబ్ధికి దూరమయ్యారు.

**అప్పుల ఊబిలో రైతాంగం :** ప్రస్తుతం జిల్లాలో పత్తి, వరి, సోయాబీన్, మొక్కజొన్న పంటల సాగు ముమ్మరంగా సాగుతోంది. విత్తనాలు, ఎరువులు, పురుగుమందుల కొనుగోలుతో పాటు కూలీల ఖర్చుల కోసం పెట్టుబడి అత్యంత అవసరమైన సమయంలో ప్రభుత్వం నుంచి భరోసా రాకపోవడంతో రైతులు అధిక వడ్డీలకు వ్యాపారుల వద్ద అప్పులు చేస్తున్నారు.

**సాంకేతిక సాకులతో నిరీక్షణ తగదు :** కొత్తగా పట్టాలు పొందిన రైతులు కూడా ఇతర అర్హుల మాదిరిగానే ప్రభుత్వ సహాయానికి పూర్తి అర్హులని, సాంకేతిక సమస్యల పేరుతో వారిని నిరీక్షించేలా చేయడం సరికాదని రైతు సంఘాల నాయకులు మండిపడుతున్నారు. పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను త్వరితగతిన పరిశీలించి అర్హులైన 2,000 మంది ఖాతాల్లో రైతు భరోసా నిధులను జమ చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

**అధికారుల వివరణ అండ్ సూచనలు :** కొత్త రైతు వివరాలను మండల వ్యవసాయ అధికారులు సేకరించి జిల్లా అధికారుల ద్వారా సిసిఎల్ఏ పరిశీలనకు పంపామని,పరిశీలన పూర్తి కాగానే నిధులు విడుదలవుతాయని వ్యవసాయ శాఖ వర్గాలు ఖడించాయి.రైతులు కూడా తమ బ్యా ంకు ఖాతాకు ఆధార్ అనుసంధానం,ఈకేవైసీ సరిగా ఉందో లేదో సరిచూసుకోవాలని, సందేహాలుంటే మండల వ్యవసాయ అధికారి లేదా తహసీల్దార్ కార్యాలయాన్ని సంప్రదించాలని అధికారులు సూచిస్తున్నారు.

## గుడుంబా, గంజాయి నిర్మూలనే లక్ష్యం

ఎక్సైజ్ తనిఖీల్లో గుడుంబా స్వాధీనం,ఆరుగురి బైండోవర్




**ప్రజాపక్షం/ఖానాపూర్ :** జిల్లా వ్యాప్తంగా గంజాయి, గుడుంబా నిర్మూలనే లక్ష్యంగా ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో విస్తృత తనిఖీలు నిర్వహిస్తున్నట్లు ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ రంగస్వామి తెలిపారు.ప్రొహిబిషన్,ఎక్సైజ్ అధికారి శ్రీనివాస్ ఆదేశాల మేరకు శుక్రవారం ఎక్సైజ్ స్టేషన్ నిర్మల్ పరిధిలోని ఖానాపూర్ మండలంలో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు.ఈ తనిఖీలలో భాగంగా తర్లపాడ–ఖానాపూర్ ప్రధాన మార్గంలో వాహన తనిఖీలు చేస్తుండగా,ఒక వ్యక్తి వద్ద నుంచి 5 లీటర్ల అక్రమ గుడుంబాను స్వాధీనం చేసుకున్నారు. రవాణాకు ఉపయోగించిన ద్విచక్ర వాహనాన్ని సీజ్ చేసి, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ చట్టం కింద కేసు నమోదు చేశారు.అలాగే ఖానాపూర్ పట్టణంలోని సుభాష్‌నగర్‌లో జరిపిన దాడిలో అల్లెపు శైలజ అనే మహిళ వద్ద 10 లీటర్ల గుడుంబాను లభ్యమవ్వడంతో ఆమెపై కూడా కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ అధికారులు తెలిపారు. దీనితో పాటు గతంలో గుడుంబా కేసుల్లో నిందితులుగా ఉన్న ఆరుగురు వ్యక్తులను ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ తహసీల్దార్ సుజాత ఎదుట హాజరుపరిచి బైండోవర్ చేసినట్లు పేర్కొన్నారు.ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ రంగస్వామి మాట్లాడుతూ మండలంలో గుడుంబా,గంజాయి,నల్లబెల్లం విక్రయాలు లేదా అక్రమ రవాణాకు సంబంధించి ఎలాంటి సమాచారం ఉన్నా వెంటనే ఎక్సైజ్ శాఖకు తెలియజేయాలని ప్రజలను కోరారు.సమాచారం ఇచ్చిన వారి వివరాలను పూర్తిగా గోప్యంగా ఉంచుతామని హామీ ఇచ్చారు.ఈ తనిఖీల్లో ఎక్సైజ్ సబ్ ఇన్‌స్పెక్టర్లు వసంతరావు, అభిషేక్ ,నిర్మల్ ఎక్సైజ్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

కేంద్రంలోని బిజెపి ప్రజా వ్యతిరేక పాలనను నిరసిస్తూ సిపిఐ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రజా పోరుయాత్ర శుక్రవారం రెండో రోజు విజయవంతంగా సాగుతుంది. పాదయాత్రలో సిపిఐ రాష్ట్ర నాయకులు పాల్గొని కేంద్రంలోని బిజెపి పాలనను ఎండగట్టారు.

# బిజెపి పాలనలో ప్రజల అవస్థలు


హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి..


మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఉప్పల్‌లో..


నల్లగొండ జిల్లా చండూరులో...

## సిపిఐ సీనియర్ నాయకుడు చాడ వెంకట్‌రెడ్డి

### హనుమకొండ జిల్లా ముల్కనూర్‌లో సిపిఐ రెండో రోజు పాదయాత్ర

**ప్రజాపక్షం/భీమదేవరపల్లి :** కేంద్రంలోని బిజెపి పాలనలో అన్నివర్గాల ప్రజలు అవస్థలు పడుతున్నారని, మోదీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలే వారి పతనానికి దారి తీస్తుందని, దేశంలో మార్పు కోసం సిపిఐ పోరాటం సాగిస్తోందని సిపిఐ సీనియర్ నాయకులు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకట్‌రెడ్డి అన్నారు. శుక్రవారం సిపిఐ ప్రచార జాత పాదయాత్ర 2వ రోజు హనుమకొండ జిల్లా ముల్కనూర్‌లో సహకార బ్యాంకు నుంచి కొత్తపల్లి వరకు ఉత్సాహపూరితంగా సాగింది. ఈయాత్రకు ముఖ్య అతిథిగా హాజరైన చాడ వెంకట్‌రెడ్డి అంబేద్కర్ విగ్రహానికి పూల మాల వేసి నివాళులర్పించారు. అంబేద్కర్ సెంటర్‌లో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు ఆదరి శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన సభలో చాడ వెంకటరెడ్డి మాట్లాడుతూ కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీలో స్థానికులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని, విద్య, ఆరోగ్యం ప్రజలకు అందుబాటులోకి తేవాలని, పంటలకు కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించాలని, ప్రతి యువకుడికి ఉద్యోగం కల్పించాలని, మహిళా రిజర్వేషన్ తక్షణం అమలు చేయాలని, కార్మికుల హక్కులను పరిరక్షిస్తూ కొత్తగా తెచ్చిన లేబర్ కోడ్ లను రద్దు చేయాలని, బ్యాలెట్ పేపర్ పద్ధతిలో ఎన్నికలను పునరుద్ధరించి ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలని, దళితులపై, మహిళలపై అకృత్యాలను, దాడులను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు నేదునూరి జ్యోతి, రాష్ట్ర సమితి సభ్యులు ఆదరి శ్రీనివాస్, మండ సదాలక్ష్మి, జిల్లా సహాయ కార్యదర్శులు తోట బిక్షపతి, మద్దెల ఎల్లేష్, నాయకులు ఉట్కూరి రాములు, ఎన్ఎ.స్టాలిన్, కర్రె లక్ష్మణ్, మునిగాల బిక్షపతి, కొట్టెపాక రవి, మాలోతు శంకర్, శనిగరపు రాజ్ కుమార్, రాసమల్ల దీనా, గుంటి రాజేందర్, బీమదేవరపల్లి మండల కార్యదర్శి అదరి రమేష్, కొంగల రామచంద్ర రెడ్డి, కంచపల్లి కిషన్, రాగుల చంద్రయ్య, చిలక శ్రీను, నిమ్మల మనోహర్, మాలోతు మంగ, మమత, కుడి స్వామి తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ఎల్‌బిసి, డిండి ప్రాజెక్టులను వెంటనే పూర్తిచేయాలి

### ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం

**చండూరు :** నల్లగొండ జిల్లాకు జీవనాడిగా భావిస్తున్న ఎస్ఎల్‌బిసి మరియు డిండి ఎత్తిపోతల ప్రాజెక్టులు దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉండటం దురదృష్టకరమని సిపిఐ నల్లగొండ జిల్లా కార్యదర్శి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం అన్నారు. ఈ ప్రాజెక్టులు పూర్తయితేనే జిల్లాలో సాగు, తాగునీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం అభిస్తుందన్నారు. సిపిఐ ఆధర్యంలో ఆగస్టు 6 నుండి 14వ రకు జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్న ప్రజా చైతన్య యాత్రను శుక్రవారం చండూరు మండలం బంగారిగడ్డ చౌరస్తాలోని తెలంగాణ రైతాంగ పోరాట యోధుడు, మాజీ ఎంపి బొమ్మగాని ధర్మ బిక్షం విగ్రహం వద్ద ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ సత్యం మాట్లాడుతూ గత ప్రభుత్వాల నిర్లక్ష్యంతో ఎస్ఎల్‌బిసి పనులు ఆలస్యమయ్యాయని, ప్రస్తుత ప్రభుత్వం తగిన నిధులు విడుదల చేసి నిర్ణీత గడువులోగా ప్రాజెక్టులను పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. ఈ సీజన్‌లో జిల్లాలో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదవడంతో భూగర్భ జలాలు గణనీయంగా తగ్గిపోయాయని, బోరు బావులపై ఆధారపడి సాగు చేస్తున్న రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఎండిపోతున్న వరి పంటలను వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి నష్టపోయిన రైతులకు తక్షణమే పంట నష్టపరిహారం అందించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. చండూరు మండలం లోని బంగారిగడ్డలో ప్రారంభమైన జీప్ యాత్రలు ఇడికూడ, పుల్లెంల, కొండాపురం, నెర్మట, దోనిపాములు, జోగిగూడెం, తుమ్మలపల్లి, చామలపల్లి, గుండ్రపల్లి, కస్తాల గ్రామం మీదుగా కొనసాగి చండూరు మండల కేంద్రంలో ముగిసింది. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు నల్పరాజు రామలింగయ్య, సిపిఐ చండూరు మండల కార్యదర్శి నల్పరాజు సతీష్ కుమార్, మాజీ జడ్పిటిసి మాదగోని విజయ లక్ష్మి, సిపిఐ జిల్లా సమితి సభ్యులు తిప్పర్తి రాములు, మండల సహాయ కార్యదర్శులు పల్లె యాదయ్య, బొడ్డు వెంకటేశ్వర్లు, కార్యవర్గ సభ్యులు బరిగెల వెంకటేష్, దోటి వెంకన్న, కర్నాటి వెంకటేశం, బండమీది వెంకన్న, జెల్ల శ్రీను, సిహెచ్ ఊషయ్య, గంట రమేష్, ఇరిగి సంజీవ, ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షులు జనంపాట జగన్, పాండురంగారావు, కస్తాల సర్పంచ్ లేదన్న సత్యం, మాజీ సర్పంచ్‌లు బోయపల్లి జంగయ్య, బోయపల్లి బిక్షమయ్య, పల్లె శంకరయ్య, ఎండి.కరీం, శివర్ల లింగస్వామి, గంట నాగేష్ , నరహరి, గడ్డం నవీన్, లెనిన్, పల్లె నర్సింహ్మా, జోగి రమేష్, కొండ్రెడ్డి సాయి, పల్లె రాజు, చరణ్, పరమేష్ తదితరులు పాల్గొన్నారు.

## కార్పొరేట్ విధానాలపై పోరుబాట

### సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు విఎస్.బోస్

**మేడ్చల్ మల్కాజిగిరి :** కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న కార్పొరేట్ విధానాలపై సిపిఐ పోరుబాట చేస్తుందని పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు విఎస్.బోస్ అన్నారు. సిపిఐ జాతీయ సమితి పిలుపులో భాగంగా ఉప్పల్ నియోజకవర్గ సమితి ఆధ్వర్యంలో రెండవ రోజు మల్లాపూర్ డివిజన్ శివ హోటల్ కూడలి నుండి మే ఫ్లవర్, జనప్రియ, భవానీ నగర్, కయెల్ రెడ్డి నగర్ ప్రాంతాల్లో కరపత్రాలను పంచుతూ పాద యాత్ర నిర్వహించారు. కార్యక్రమంలో సిపిఐ ఉప్పల్ మండల కార్యదర్శి టి.సత్యప్రసాద్, రాష్ట్ర సమితి సభ్యులు జి.దామోదర్‌రెడ్డి, ఎఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కె.ధర్మేంద్ర, నాయకులు నారా నర్సింహా, గిరి బాబు, నర్సింగ్ రావు, కృపాకర్, శోభా, చంద్రశేఖర్, సచిన్, తిరుపతి, ఎఐఎస్ఎఫ్ ఉప్పల్ మండల అధ్యక్షులు ఎండి.అజీమ్ పాషా, సమీర్, ఇర్ఫాన్, భాను, కిరణ్ పాల్గొన్నారు.


భద్రాచలం...


కరీంనగర్ జిల్లా కొత్తపల్లిలో...


జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నంలో...

## ఐదు పంచాయతీలను తెలంగాణకు అప్పగించాలి

### సిపిఐ జిల్లా కార్యదర్శి సాబీర్ పాషా

**భూర్గంపాడు/భద్రాచలం/దుమ్ముగూడెం/చర్ల :** రాష్ట్ర విభజన సమయంలో అశాస్త్రీయంగా ఆంధ్రాలో కలిపిన 5 గ్రామ పంచాయతీలను తెలంగాణకు తిరిగి ఇవ్వాలని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె.సాబీర్ పాషా డిమాండ్ చేశారు. ప్రజా చైతన్య యాత్రలో భాగంగా రెండవ రోజు యాత్ర శుక్రవారం బూర్గంపాడు మండల పరిధిలోని సారపాకలో ప్రారంభమై భద్రాచలం మీదుగా దుమ్ముగూడెం, చర్ల మండలాలను కలుపుకొని చర్ల మండల పరిధిలోని తిప్పాపురం గ్రామంలో ముగిసింది. ఈ ప్రజాచైతన్య యాత్రకు భద్రాచలం దుమ్ముగూడెం చర్ల మండలాలలో ఘన స్వాగతం లభించింది. ఈ సందర్భంగా సాబీర్ పాషా మాట్లాడుతూ భద్రాచలంలోని సీతారామ చంద్రస్వామి ఆలయం తెలంగాణలో ఉండగా, దేవస్థానానికి చెందిన భూములు, ఆస్తులు ఆంధ్ర ప్రదేశ్‌లో ఉండడం చారిత్రకంగా, పరిపాలనా పరంగా, ఆధ్యాత్మికంగా సమంజసం కాదన్నారు. సీతారామ, సీతమ్మదార ప్రాజెక్టుల ద్వారా జిల్లాకు సమృద్ధిగా సాగునీరు అందించి ఆ తర్వాత తరలించుకుపోవాలని చెప్పారు. ఎన్నో ఏళ్లుగా నిరీక్షణలో ఉన్న ప్రగల్లపల్లి ఎత్తిపోతల పథకానికి నిధులు విడుదల చేసి పనులు ప్రారంభించాలని ప్రభుత్వాన్ని కోరారు. పోలవరం ప్రాజెక్టు భద్రాద్రి జిల్లా మనుగడకే పెను ముప్పుగా మారిందని పాషా ఆందోళన వ్యక్తం చేశారు. గోదావరి వరద ముంపు నుంచి ప్రజలను రక్షించేందుకు నదీ తీరంలో శాస్త్రీయ ప్రమాణాలతో బలమైన కరకట్టలు నిర్మించి శాశ్వత వరద నియంత్రణ ప్రణాళికలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా ప్రజలకు మెరుగైన వైద్యం అందించేందుకు అన్ని స్పెషాలిటీల్లో వైద్యులను నియమించాలని కోరారు. ముప్వా వెంకటేశ్వర్లు అధ్యక్షతన ప్రారంభమైన రెండవ రోజు చైతన్య యాత్రలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ముత్యాల విశ్వనాథం, కల్లూరు వెంకటేశ్వర రావు, మేయర్ మూడు గణేష్, జిల్లా కార్యవర్గ సభ్యులు పుల్లారెడ్డి, నరాటి ప్రసాద్, మున్నా లక్ష్మీ కుమారి, చంద్రగిరి శ్రీనివాసరావు, కంచర్ల జమలయ్య, యు.రాహుల్, ఎస్‌కే.ఫహీమ్, ఎస్వీఎస్ నాయుడు, పేరాల శ్రీనివాస్, మారేడి శివాజీ, కిలిమి ఎల్లారెడ్డి, బొల్లోజు వేణు, అడ్డగర్ల తాతాజీ, నూపా పోతయ్య, నూపా తిరుపతిరావు, పాల్వంచ రామారావు, సాధనపల్లి సతీష్, కంభంమెట్టు శ్రీనివాస్, వామన రావు, కోడిరెక్కల రాజారావు, కోటి ముత్యాలరావు, తాటిపూడి రమేష్, అమరవాది శంకర్ తదితరులు పాల్గొన్నారు.

**ఇబ్రహీంపట్నం :** కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను రద్దు చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి చెన్నా విశ్వనాథం డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా సిపిఐ ఆధ్వర్యంలో ఈనెల 6 నుండి 14 వరకు జరగనున్న ప్రచార యాత్రలో భాగంగా జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలో శుక్రవారం కొత్త బస్టాండ్ నుంచి పాత బస్టాండ్ వరకు ప్రచార యాత్ర నిర్వహించారు. ప్రచార యాత్రలో సిపిఐ జిల్లా నాయకులు సుతారి రాములు, ఎండి ఉస్మాన్, రాజన్న, వంశీ, రమేష్, మహిళ నాయకులు యెన్నం రాధా, శాంతమ్మ, ఫిర్దోష్‌తో పాటు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

**మందమర్రి :** ప్రజల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడేది సిపిఐ ఒక్కటేనని సిపిఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్ స్పష్టం చేశారు. మందమర్రిలో శుక్రవారం నిర్వహించిన రెండో రోజు ప్రజా పోరు పాదయాత్రలో ఆయన పాల్గొని మాట్లాడారు. పాత బస్టాండ్ నుంచి ప్రారంభమైన పాదయాత్ర ఇందిరానగర్, విద్యానగర్, ఎస్‌సి, ఎస్‌టి కాలనీ, బురదగూడెం మీదుగా అందుకులపేట వరకు కొనసాగింది. కార్యక్రమంలో ఎఐటియుసి మందమర్రి బ్రాంచ్ కార్యదర్శి శైలేంద్ర సత్యనారాయణ, సిపిఐ జిల్లా నాయకులు ఇప్పకాయల లింగయ్య, చెన్నూరు నియోజకవర్గ కార్యదర్శి మిట్టపల్లి పౌలు, నాయకులు మనం సత్యనారాయణ, కాదండి సాంబయ్య, పట్టణ నాయకులు రాయబారపు వెంకన్న, ఎండీ రసూల్, జెట్టి మల్లయ్య, ఎగుడ మొండి, తాళ్లపెల్లి వీరయ్య, దొంతుల రాజ్యం పాల్గొన్నారు.

**కొత్తపల్లి :** కేంద్రంలో బిజెపి ప్రభుత్వం పేద, సామాన్య ప్రజలపై అన్ని రకాల వస్తువులపై ధరలు పెంచి పెను భారం మోపడం దుర్మార్గమని సిపిఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్ పేర్కొన్నారు. బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించేందుకు సిపిఐ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రచార జాతా శుక్రవారం కరీంనగర్ రూరల్ మండలం బొమ్మకల్, గుంటూర్‌పల్లి, మొగ్దుంపూర్ గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో సిపిఐ కరీంనగర్ రూరల్ ఇంచార్జ్ కసిరెడ్డి సురేందర్ రెడ్డి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పొనగంటి కేదారి, జిల్లా కార్యవర్గ సభ్యులు సృజన్ కుమార్, బోయిని అశోక్, గూడెం లక్ష్మి, జిల్లా కౌన్సిల్ సభ్యులు నలువాల సదానందం, సాయివేణి రాయమల్లు, పైడిపల్లి రాజు, ఎన్ఎఫ్ఐడబ్ల్యు, ఎఐవైఎఫ్ జిల్లా అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు బీర్ల పద్మ, కొట్టె అంజలి, పోలోజు రంజిత్, బామండ్లపల్లి యుగేందర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కసిబోజుల సంతోష్ చారి, కార్యదర్శులు బాకం ఆంజనేయులు, తంగెళ్ల సంపత్, చిందం మల్లయ్య, కాల్వ కొమురయ్య, నాయకులు బీర్ల స్వాతి, మేకల రమ్య, నునావత్, కసిరెడ్డి సందీప్ రెడ్డి పాల్గొన్నారు.

**నస్పూర్ :** కేంద్రంలోని బిజెపి ప్రజా వ్యతిరేక పాలనను నిరసిస్తూ నిర్వహిస్తున్న ప్రజాపోరు యాత్ర జయప్రదం చేయాలని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య పిలుపునిచ్చారు. కృష్ణ కాలనీలోని ఎఐటియుసి కార్యాలయం వద్ద జెండా ఊపి యాత్ర రెండవరోజు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి జోగుల మల్లయ్య, జిల్లా కార్యవర్గ సభ్యులు ఝుఝుజకే.వీరభద్రయ్య, రేగుంట చంద్రశేఖర్, లింగం రవి, ఎస్‌కే.బాజీ సైదా, మిర్యాల రాజేశ్వరరావు, కొత్తపల్లి మహేష్, మొగిలి లక్ష్మణ్, దేవి పోచన్న, బాలసాని లక్ష్మణ్, దుర్గయ్య, కొమ్ము రవి, గడప రవి పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులో రాజకీయ జోక్యం తగదు


### సిపిఐ జిల్లా కార్యదర్శి ఫయాజ్

**నాగర్‌కర్నూల్ :** ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులో రాజకీయ జోక్యం తగదని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ఎండి ఫయాజ్ అన్నారు. శుక్రవారం సిపిఐ ప్రజా పాదయాత్ర రెండో రోజు చంద్రకల్, ముష్టిపల్లి, పెరుమాళ్లపల్లి, మరికల్, పెద్దకార్పాముల మీదుగా దేదినేనిపల్లి వరకు కొనసాగింది. ఈ సందర్భంగా ఫయాజ్ మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులో రాజకీయ జోక్యానికి తావు లేకుండా అర్హులైన నిరుపేదలను గుర్తించి ఇళ్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. పాదయాత్రలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు తన్నీరు నరసింహ, ఇందిరమ్మ, జిల్లా కౌన్సిల్ సభ్యులు తుమ్మల శివుడు, బండి లక్ష్మి పతి , బిజ్జా శ్రీనివాసులు, కిరణ్ కుమార్, లక్ష్మి నారాయణ, పుట్టకుర్మయ్య, గాలెన్న, పటేల్ రాముడు, సలేశ్వరం, రామకృష్ణ, బాలపీరు తదితరులు పాల్గొన్నారు.

**తాండూరు :** ప్రజావ్యతిరేక పాలన కొనసాగిస్తున్న కేంద్రంలోని బిజెపి ప్రభుత్వాన్ని గద్దెదించాలని సిపిఐ వికారాబాద్ జిల్లా కార్యదర్శి విజయలక్ష్మి పండిత్ పిలుపునిచ్చారు. సిపిఐ బదలావ్ జరూరిహై పాదయాత్రలో భాగం గా శుక్రవారం వికారాబాద్ జిల్లా తాండూరు పట్టణం పరిధి పాత తాండూరులోని నిజాంషాహిదర్గా చౌక్ నుంచి విజయలక్ష్మి పండిత్ పాదయాత్రను ప్రారంభించారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి ఫీర్ మహామ్మద్, రైతు సంఘం జిల్లా కార్యదర్శి సురేష్‌కుమార్, వెంకటేష్, అబ్దుల్లా, రవిందర్, మునీర్, ఆహ్మద్, రాజు, రాజేందర్, గోరెప్ప, ఎల్లప్ప, బైండ్ల రాజు, నరసమ్మ, బాలమ్మ, లక్ష్మి , మాణెమ్మ పాల్గొన్నారు.


మంచిర్యాల జిల్లా నస్పూర్‌లో...


నాగర్‌కర్నూల్


మందమర్రి..

## యాది మరిస్తే పతనమే..

(మొదటి పేజీ తరువాయి)

చేసేందుకు పాలకులు చిత్తశుద్ధితో పని చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రజా చైతన్య యాత్రలో భాగంగా శుక్రవారం ముదిగొండ, నేలకొండపల్లి, కూసుమంచి, తిరుమలాయపాలెం మండలాల్లో పాదయాత్ర సాగింది. ఈ సందర్భంగా గ్రామ గ్రామాన చైతన్య యాత్రకు ప్రజలు ఎదురేగి స్వాగతం పలికారు. డప్పు దళాలు, కోలాట దళాలతో పాదయాత్ర ఆకట్టుకుంది. ఈ సందర్భంగా పలు గ్రామాల్లో జరిగిన సభల్లో హేమంతరావు మాట్లాడుతూ 12 ఏళ్ల క్రితం మోడీ రైతును మరింత బలోపేతం చేస్తూ వ్యవసాయాన్ని లాభసాటిగా మారుస్తానని, యేటా రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తానని, పేదరిక నిర్మూలన చేపట్టడంతో పాటు ప్రతి ఒక్కరి ఖాతాలో రూ.15 లక్షలు జమ చేస్తానని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చారని ఇప్పుడు నల్లధనం ఊసెత్తకపోగా ఇచ్చిన ఏ హామీని ఆయన నెరవేర్చే దిశలో లేరన్నారు. దేశంలో నిరుద్యోగం పెరిగిపోతుందని దేశ ఆర్థిక వ్యవస్థకు ఆయువు పట్టువుగా నిలిచిన ప్రభుత్వ రంగ సంస్థలను మోడీ అనుయాయులైన అంబానీ, అదానీలకు కట్టబెట్టారని హేమంతరావు ఆరోపించారు. రాష్ట్రంలోని రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ఘోరంగా వైఫల్యం చెందిందని ఉచిత బస్సు, సన్న బియ్యంతోనే సరిపెట్టే ప్రయత్నం చేస్తుందని హేమంతరావు ఆరోపించారు. ఇచ్చిన హామీలను యాది మరిస్తే ప్రజలు సహించరని అధికారంలో ఉన్నాం కదా అని ఏమి చేసినా చెల్లుబాటు అవుతుందనుకుంటే పొరపాటే అన్నారు. ఎన్నికలు ఉన్నాయని సిపిఐ జనంలోకి రాలేదని ప్రజా చైతన్యం ద్వారా ప్రభుత్వాలపై ఒత్తిడి పెంచి హామీలను అమలు చేసేందుకే ఈ యాత్రను కొనసాగిస్తున్నామని ఆయన తెలిపారు. సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ వివిధ సభల్లో మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను అమలు చేసేందుకు తీవ్ర జాప్యం చేస్తుందన్నారు. పూర్తి స్థాయిలో రుణమాఫీ జరగలేదన్నారు. గ్రామీణ పేదలకు ఇస్తానన్న ఇందిరమ్మ భరోసా, ఆర్థిక సాయం అందలేదని ఆయన తెలిపారు. రైతు బీమా, పంటల బీమా, మహిళలకు ఇస్తానన్న నెలకు రూ.2,500, తులం బంగారం పథకాలను అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సభల్లో సిపిఐ జిల్లా సహయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి, రాష్ట్ర సమితి సభ్యులు యర్రాబాబు, ఏపూరి లతాదేవి, సిద్దినేని కర్ణకుమార్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సింగు నర్సింహారావు, పోటు కళావతి, తాటి వెంకటేశ్వరరావు, సీతామహాలక్ష్మి , మిడికంటి చిన్న వెంకటరెడ్డి, ఏనుగు గాంధీ, యంగల ఆనందరావు, కూచిపూడి రవి, వివిధ ప్రజా సంఘాల నాయకులు బత్తినేని నీరజ, తాటి నిర్మల, రాంకోటి, పగిడిపల్లి ఏసు, నానాబాల రామకృష్ణ, ఇటికాల రామకృష్ణ, మడుపల్లి లక్ష్మణ్, శ్రావణ్, మామిడి రామకృష్ణ, సృజన, మాడిశెట్టి వెంకటేశ్వర్లు, ఉపేందర్, శ్రీనివాసరావు, నర్సింహ పాల్గొన్నారు.

**బిజెపి పతనం ప్రారంభం: ఎం.బాల నరసింహ**

బిజెపి పతనం ప్రారంభమైందని ప్రజలు మార్పు కోరుకుంటున్నారని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.బాల నరసింహ అన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా బిజినపల్లి మండలం వెలుగొండ గ్రామంలో నిర్వహించిన ర్యాలీలో ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. సెప్టెంబర్ 1న నిర్వహించే బదలావ్ జరూరీ హై ఛలో ఢిల్లీ ర్యాలీకి వేలాదిగా తరలిరావాలని పిలుపునిచ్చారు. రైతులు, యువత, విద్యార్థులు కేంద్ర ప్రభుత్వ విధానాలను వ్యతిరేకంగా నిరసనలు వ్యక్తం చేస్తున్నారని, బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ, ములుగు గిరిజన విశ్వవిద్యాలయం వంటి హామీలు ఇంకా అమలు కాలేదని విమర్శించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా ప్రజలకు ఇచ్చిన హామీల అమలులో విఫలమైందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఈర్ల చంద్రమౌళి, బిజినపల్లి మండల కార్యదర్శి పి.కృష్ణాజీ, సహాయ కార్యదర్శులు ఈర్ల భూపేష్, మధుగౌడ్, కౌన్సిల్ సభ్యులు తన్నీరు మల్లయ్య, మారేడు శివశంకర్, ప్రేమ్ కుమార్, శివకృష్ణ, పి.రవి, పర్వతాలు, నరసింహ, మధు,నిరంజన్ తదితరులు పాల్గొన్నారు.


బద్లావ్ జరూరీ హై పాదయాత్ర సందర్భంగా పాండిచ్చేరిలో జరిగిన సభలో మాట్లాడుతున్న సిపిఐ జాతీయ కార్యదర్శి అన్ని రాజా, పాల్గొన్న సిపిఐ పాండిచ్చేరి రాష్ట్ర కార్యదర్శి ఎఎం సలీం తదితరులు

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Plot No 302, Venkata Sai Towers, Nehrunagar, KHAMMAM 507 002 Telangana State. RNI TELTEL /2018/76759, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com